సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 204

మంగళవారం 15-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



రిలయన్స్‌కు జియో దన్ను

క్యూ2 లాభం రూ. 16,563 కోట్లు.. ఆదాయం రూ.2.4 లక్షల కోట్లు -15లో



కివీస్ సెమీస్‌కు.. భారత్ ఇంటికి

టి20 వరల్డ్‌కప్ నుంచి లీగ్ దశలోనే వెనుదిరిగిన టీమిండియా - 14లో



దుర్గాపూజ సందర్భంగా ఘర్షణలు

యూపీలోని బహ్రెయిచ్‌లో దుర్గామాత విగ్రహం ఊరేగింపు సందర్భంగా ఇరు వర్గాల మధ్య సోమవారం కూడా ఘర్షణలు కొనసాగాయి.

- వివరాలు 6లో▶



ప్రధానితో ఢిల్లీ సీఎం అతిశి భేటీ

ప్రధాని మోదీతో ఢిల్లీ సీఎం అతిశి భేటీ అయ్యారు. తమకు కేంద్రం సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

- వివరాలు 6లో▶



సిద్దిఖీ హత్యకు పుణెలో కుట్ర

మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీని కాల్చిచంపడానికి పుణెలో కుట్ర జరిగిందని పోలీసులు వెల్లడించారు.

- వివరాలు 6లో▶



'వక్ఫ్'పై విపక్షాల వాకౌట్

వక్ఫ్ (సవరణ) బిల్లును సమీక్షిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ భేటీ నుంచి విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

కేడర్ వివాదం మళ్లీ క్యాట్‌కు..



ఉమ్మడి ఏపీ విభజన సమయంలో తలెత్తిన ఆలిండియా సర్వీస్ అధికారుల కేటాయింపు వివాదం మళ్లీ కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)కు చేరింది. కేడర్ కేటాయింపుల మేరకు ఎక్కడి వారక్కడ విధుల్లో చేరాలని కేంద్రం ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ ఐదుగురు ఐఏఎస్ అధికారులు పిటిషన్లు వేశారు.

- వివరాలు 12లో▶

గ్రామీణ రోడ్లకు మహర్దశ



గ్రామీణ రోడ్లకు మంచిరోజులు వచ్చాయి. రాష్ట్రంలోని వివిధ గ్రామీణ ప్రాంతాల్లో 1323.86 కిలోమీటర్ల మేర చేపట్టనున్న కొత్త రోడ్ల నిర్మాణానికి రూ.1377.66 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 5లో▶

టెస్టులయ్యాకే తుది నివేదిక!



కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు వరద తగ్గాక వివిధ పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాలని.. ఆ తర్వాతే బరాజ్‌ల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన శాశ్వత చర్యలను సిఫారసు చేస్తూ తుది నివేదిక అందిస్తామని నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్డీఎస్ఏ) స్పష్టం చేసింది.

- వివరాలు 2లో▶

నల్లగొండ టౌన్ బైపాస్‌కు రూ.516 కోట్లు మంజూరు



నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ సెక్షన్ వరకు ఉన్న జాతీయ రహదారి 565లో నల్లగొండ టౌన్ కోసం 14 కి.మీ. పొడవైన 4-లేన్ బైపాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 516 కోట్లు మంజూరు చేసింది.

- వివరాలు 2లో▶

పత్తి రేటుకు విపత్తు!

మార్కెట్లో పడిపోయిన ధరలు.. తక్కువ రేటుకు కొంటున్న వ్యాపారులు, దళారులు

మద్దతు ధర రూ.7,521.. రాష్ట్రంలో కొనుగోలు చేస్తున్నది రూ. 5 వేల నుంచి రూ.7 వేలలోపే..

పత్తి పంట రాక పెరిగితే ధరలు ఇంకెంత తగ్గిస్తారోనని రైతుల ఆందోళన

- రాష్ట్రంలో ఇంకా కొనుగోళ్లు ప్రారంభించని సీసీఐ.. కేంద్రాల ఏర్పాటు సన్నాహాలే లేని దుస్థితి..
- సర్కారు స్పందించకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారంటున్న నిపుణులు
- బంగ్లాదేశ్, పశ్చిమాసియాలలో అశాంతితో ఎగుమతులు తగ్గడమూ రేట్ల పతనానికి కారణమంటున్న అధికారులు!
- గుజరాత్‌లో మాత్రం మద్దతు ధరకు మించి రూ.8,257 రేటుతో కొనుగోళ్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తికి ధరల విపత్తు వచ్చింది. సీజన్ మొదట్లోనే, మార్కెట్లోకి పత్తి రావడం మొదలవుతుండగానే రేటు తగ్గిపోయింది. వ్యాపారులు, దళారులు ధరలు బాగా తగ్గించేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 అయితే.. సోమవారం వరంగల్ మార్కెట్‌లో కనిష్ఠంగా రూ.5 వేల నుంచి గరిష్ఠంగా రూ. 6,950 వరకు మాత్రమే పలికింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లోనూ రూ.5,500 నుంచి గరిష్ఠంగా రూ.7,000కు మించి చెల్లించలేదు. దీనితో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు వారాల క్రితం క్వింటాల్‌కు రూ. 8,250 వరకు ధర చెల్లించినా.. ఇప్పుడు ఒక్కసారిగా తగ్గించేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మార్కెట్లోకి పత్తి రాక పెరిగితే.. ధరలను ఇంకెంత తగ్గిస్తారోనని వాపోతున్నారు. మార్కెట్‌కు పత్తి రాక ప్రారంభమైనా 'కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)' కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో.. వ్యాపారులు, దళారులు రేటు తగ్గించేస్తున్నారని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే.. రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రెండేళ్ల క్రితం పత్తి ధరలు రూ. 10-15 వేల వరకు పలికాయని.. ఇప్పుడు దారుణంగా పడిపోయాయని అంటున్నాయి.

పత్తి విస్తీర్ణంలో రాష్ట్రం మూడో స్థానం

వానాకాలం సీజన్‌లో దేశవ్యాప్తంగా 2.74 కోట్ల ఎకరాల్లో పత్తి సాగైంది. మొదటి స్థానంలో ఉన్న మహారాష్ట్రలో అత్యధికంగా 98.47 లక్షల ఎకరాల్లో.. రెండో స్థానంలో ఉన్న గుజరాత్‌లో 56.56 లక్షల ఎకరాల్లో సాగవగా.. తెలంగాణ 43.76 లక్షల ఎకరాల సాగుతో మూడో స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా 1.60 కోట్ల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేయగా.. అందులో తెలంగాణలో 25.33 లక్షల మెట్రిక్ టన్నుల మేర వస్తుందని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ వర్గాలు అంచనా వేశాయి. నిజానికి ఖరీఫ్ సీజన్ మొదట్లో పత్తి విత్తనాలు వేసేందుకు అనువైన వర్షాలు పడలేదు. విత్తనాలు వేసినా, వర్షాల్లేక రెండు, మూడు సార్లు వేయాల్సి వచ్చింది. పత్తి పూత దశకు వచ్చిన సమయంలో భారీ వర్షాలు పడ్డాయి. చేన్లు నీట మునిగి..

మిగతా 2వ పేజీలో ▶

ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో పట్నం మహేందర్‌రెడ్డి, జగ్గారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, జయేశ్ రంజన్



ఫాక్స్‌కాన్‌ను మరింత విస్తరించండి

సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- ఫోర్త్‌సిటీలో భాగం కావాలని పిలుపు
- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఫ్యాక్టరీ సందర్శన

వివరాలు 2లో

డరేన్ ఎసిమోగ్లూ



సైమన్ జాన్సన్



రాబిన్సన్



అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

6లో

డరేన్ ఎసిమోగ్లూ, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్సన్‌ను వరించిన ప్రతిష్టాత్మక పురస్కారం

వ్యవస్థలు, సంస్థల అసమర్థత దేశానికి ఎలా చేటు చేస్తుందన్న అంశంపై పరిశోధనలు

మీరే కదా బాబూ.. లిక్కర్ మాఫియా సూత్రధారి, పాత్రధారి

'ఎక్స్' వేదికగా ఏపీ సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్



- ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి మీవారికి అప్పగింత అవినీతి స్కెచ్ కాదా?
- మీ మనుషులతో సిండికేట్ ఏర్పాటు చేసి షాపులను కొట్టేయడం నిజం కాదా?..మీరు అనుమతి ఇచ్చిన డిస్టిలరీల ద్వారా అమ్మకాలు భారీగా పెంచేసి రూ.వేల కోట్ల అక్రమ రాబడికి ద్వారాలు తెరవడం వాస్తవమే కదా?
- 'నీకింత.. నాకింత' అని కమీషన్ల వాటాలు వేసుకున్న మాట వాస్తవం కాదా?.. ఎమ్మార్పీపై రేట్లు పెంచి వసూలు చేయడం ప్రజల నడ్డి విరగ్గొట్టడం కాదా?

వివరాలు 12లో



భారత్, కెనడా మధ్య 'నిజ్జర్ నిప్పు'

భగ్గుమన్న దౌత్య బంధం

నిజ్జర్ హత్య కేసులో అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ పేరు చేర్చిన కెనడా

- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్
- నిరసనగా ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించిన భారత్.. ఈ నెల 19 అర్ధరాత్రిలోగా తమ దేశాన్ని విడిచి వెళ్లాలని ఆదేశం
- కెనడా నుంచి భారత దౌత్యవేత్త, దౌత్యాధికారులను వెనక్కి రప్పిస్తున్నట్లు వెల్లడి

ట్రూడో సర్కారు ఓటుబ్యాంకు రాజకీయాల కోసం సిక్కు వేర్పాటువాదానికి మద్దతు పలుకుతోందని ధ్వజం

ఈ దుందుడుకు చర్యలకు దీటుగా ప్రతిస్పందించే హక్కు తమకు ఉందని భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ

ఇరు దేశాల దౌత్య సంబంధాలు దెబ్బతినడంతో కెనడాలోని లక్షలాది మంది భారతీయ పౌరులు, విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం!

6లో



భద్రతా సిబ్బందికి సూచనలు చేస్తున్న నేవీ ఉన్నతాధికారులు

నేవీ రాడార్‌కు నేడే భూమిపూజ

హాజరుకానున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, నేవీ అధికారులు
- దామగుండం వద్ద కట్టుదిట్టమైన భద్రత

వికారాబాద్: దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్‌కు మంగళవారం ఉదయం 11 గంటలకు భూమి పూజ జరుగనుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ, నేవీ అధికారులు సోమవారం పరిశీలించారు. దామగుండం పరిసరాల్లో భద్రత ఏర్పాటు చేశారు.

రూ.3,200 కోట్లతో ప్రాజెక్టు..

దేశ రక్షణ చర్యల్లో భాగంగా వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలో 'నేవీ లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్'ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. 2012లోనే

మిగతా 12వ పేజీలో ▶

ఓవైపు మరణ శాసనం.. మరోవైపు సుందరీకరణా?



వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌తో మూసీ నది అంతర్ధానం: కేటీఆర్

- పదేళ్లు ఒత్తిడి తెచ్చినా మేము నిర్మాణానికి అంగీకరించలేదు
- ద్వీపాల్లో ఉండాల్సిన రాడార్ స్టేషన్ తెలంగాణలోనా?
- ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారు?

12లో

ఇదండీ సంగతి



ఖైదీలను వెతకడానికి వెళ్తారట సార్!



గ్రూప్-1 హాల్ టికెట్లు రెడీ

- పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్లో అందుబాటులోకి.. ఈ నెల 21వ తేదీన ఉదయం వరకు డౌన్‌లోడ్ చేసుకునే చాన్స్
- ఆ రోజు నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహణ
- మధ్యాహ్నం 12:30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతి.. 1:30 గంటలకు పరీక్షా కేంద్రాల మూసివేత
- ఆ తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ అభ్యర్థులను ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించబోమన్న అధికారులు

16లో

ఈసారి వణికించే చలి!

శీతాకాలంలో గణనీయంగా తగ్గనున్న ఉష్ణోగ్రతలు

భారత వాతావరణ విభాగం ప్రాథమిక అంచనా

లానినొ పరిస్థితులతో చలి తీవ్రత ఎక్కువగా ఉండే చాన్స్

రానున్న రెండ్రోజులు పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత శీతాకాలంలో చలితీవ్రత విపరీతంగా ఉంటుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. డిసెంబర్, జనవరి నెలల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా తక్కువగా నమోదవుతాయని సూచించింది. లానినొ పరిస్థితుల కారణంగా వాతావరణంలో భారీగా మార్పులు చోటుచేసుకుంటున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రాథమిక అంచనాలను భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తాజాగా విడుదల చేసింది. సాధారణంగా వర్షాకాలం ముగిసిన తర్వాత అక్టోబర్ నెలలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. అలాగే గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే తక్కువ స్థాయిలో నమోదవుతుంటాయి. కానీ ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం రాష్ట్రంలో ఏర్పడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు చాలాచోట్ల

మిగతా 2వ పేజీలో ▶

పలు జిల్లాలకు వర్ష సూచన

రాష్ట్రంలో రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. దక్షిణ, మధ్య బంగాళాఖాతం సమీపంలోని ఏపీ తీర ప్రాంతంలో చక్రవాతపు ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావం ఏపీలో అధికంగా ఉన్నప్పటికీ, తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తాయని సూచించింది. పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు నమోదు కావొచ్చని వివరించింది.



ఇక నెలకు ఒకసారే ఇంటికి!

మారుతున్న టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్ల లీవ్ మాన్యువల్

నవంబర్ 1 నుంచి అమలుకు డిపార్ట్‌మెంట్ ఆదేశాలు

- ఇప్పటివరకు 15 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లిన కానిస్టేబుళ్లు
- ఇదే కష్టంగా ఉందనుకుంటే మళ్లీ అమల్లోకి పాత పద్ధతి!
- మరోసారి ఆందోళనలకు సిద్ధమవుతున్న కానిస్టేబుళ్ల భార్యలు

3లో

క్లుప్తంగా...

నేడు, రేపు గాంధీభవన్‌లో జిల్లాల సమీక్షలు

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో 15, 16 తేదీలలో వివిధ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశాలు జరగనున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, సీనియర్ నాయకులు హాజరవుతారు. 15వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా పార్టీ సమావేశం జరుగనుంది. 16వ తేదీన ఉదయం హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, చైర్మన్ల సమావేశం జరుగుతుంది.

నేడు గాంధీభవన్‌కు మంత్రి సీతక్క...

గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి మంగళవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరు కానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మంత్రి అందుబాటులో ఉంటారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకురావచ్చని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కేసు



సిటీ కోర్టులు (హైదరాబాద్): తిరుపతి లడ్డూ పై వ్యాఖ్యలు చేసిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కేసు నమోదైంది. ఈ మేరకు హైదరా బాద్ సిటీ సివిల్ కోర్టులో సోమవారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం కింద రామారావు ఇమ్మ నేని, సాయికుమార్ న్యాయవాదులు కేసు దాఖలు చేశారు. తిరుపతి లడ్డూ విషయంలో పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఇంటర్‌నెట్ (పలు టీవీ చానెళ్లలో ప్రసారమైన వీడియోలు, షార్ట్స్) నుండి వెంటనే తొలగించాలని వారు పిటిషన్‌లో కోరారు. ఈ మేరకు పవన్ కల్యాణ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హోం మంత్రిత్వ శాఖను ప్రతివాదులుగా చేర్చారు. ముందస్తు విచారణ నేపథ్యంలో మంగళవారం మరో పిటిషన్ దాఖలు చేస్తామని.. ఆ పిటిషన్ కూడా మంగళవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని పిటిషనర్లు, న్యాయవాదులు రామారావు ఇమ్మనేని, సాయికుమార్ తెలిపారు.

బస్సు చార్జీల పెంపు అవాస్తవం: సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో టీజీఎస్‌ఆర్టీసీ టికెట్ ధరలు పెంచిందని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఆర్టీసీ ఎండి సజ్జనార్ స్పష్టం చేశారు. స్పెషల్ బస్సుల చార్జీలను మాత్రమే సంస్థ సవరించిందని, రెగ్యులర్ సర్వీసుల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు లేదని ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సమయాల్లో సొంతూళ్లకు వెళ్లేప్పుడు బస్సుల్లో ప్రయాణికులు అధికంగా ఉంటారని, వారిని దింపి బస్సులు ఖాళీగా నగరానికి రావలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో డీజిల్ ఖర్చుకు సరిపడా ఆదాయం కూడా ఉండదని తెలిపారు. అందుకోసం స్పెషల్ బస్సుల్లో చార్జీలను స్వల్పంగా సవరించే వెసులుబాటు ఉందని వెల్లడించారు.

గుర్రంపోడు ఎస్‌ఐ సస్పెన్షన్



ఎస్‌ఐ వేమిరెడ్డి నారాయణ రెడ్డి

గుర్రంపోడు/హైదరాబాద్: హత్య కేసులో నిందితులతో కుమ్మక్కైన గుర్రంపోడు ఎస్‌ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఐజీపీ వి.సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. వివరాలివి. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం ముల్కలపల్లి గ్రామంలో ఆగస్టు 29న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన జాల రజిత (32) కేసును తొలుత ఆత్మహత్యగా నమోదు చేయడంతో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్.. ఏఎస్పీ రాములునాయక్ నేతృత్వంలో ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ప్రధాన నిందితుడు రాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినప్పటికీ.. మిగతా నిందితులను కేసు నుంచి తప్పించేందుకు ఎస్‌ఐ.. కానిస్టేబుల్ (నంబర్ 3524) ద్వారా రూ.లక్ష లంచం తీసుకున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. హత్య కేసు నమోదు చేయడంతోపాటు సహ నిందితులైన రాములు భార్య జాల పార్వతమ్మ, అన్న కుమారుడు జాల వెంకటయ్యను పోలీసు ఉన్నతస్థాయి విచారణ బృందం అదుపులోకి తీసుకుని విచారించగా హత్యలో ముగ్గురు పాల్గొన్నట్లు తేలింది. ఏ2, ఏ3 నిందితులను రక్షించే ప్రయత్నం జరిగినట్లు తేలడంతో ఎస్‌ఐపై చర్య తీసుకున్నారు. గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వెళ్లిన అనంతరం ఎస్‌ఐ నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఐజీపీ ఉత్తర్వులు వెలువడ్డాయి.

టెస్టులయ్యాకే తుది నివేదిక!

కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణపై ఎన్డీఎస్‌ఏ స్పష్టీకరణ

- గతంలో నిర్దేశించిన పరీక్షలన్నీ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సూచన
- గోదావరిలో నిరంతర వరద ప్రవాహం... నవంబర్‌లోనే పరీక్షలు పూర్తిచేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు వరద తగ్గిపోయాక జియోఫిజికల్, జియోటెక్నికల్, ఎలక్ట్రోరెసిస్టివిటీ టోమోగ్రఫీ, సాయిల్ (భూసార) పరీక్షలను నిర్వహించి నివేదిక సమర్పించాలని, ఆ తర్వాతే ఈ మూడు బరాజ్‌ల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన శాశ్వత చర్యలను సిఫారసు చేస్తూ తుది నివేదిక అందిస్తామని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) స్పష్టం చేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం ఈ నెల 11న ఢిల్లీలో ఎన్డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్‌తో సమావేశమైంది. బరాజ్‌ల పునరుద్ధరణకు శాశ్వత చర్యలను సాధ్యమైనంత త్వరగా అందించాలని కోరింది. అయితే మధ్యంతర నివేదికలో తాము సిఫారసు చేసిన అన్ని పరీక్షలను పూర్తి స్థాయిలో నిర్వహించి నివేదికలు అందిస్తేనే తుది నివేదిక ఇవ్వగలమని ఎన్డీఎస్‌ఏ స్పష్టం చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం మూడు బరాజ్‌లకు నిరంతరం వరద కొనసాగుతుండడంతో పరీక్షలు ముందుకు సాగడం లేదు. దీంతో నవంబర్‌లో వరదలు తగ్గుముఖం పట్టాక పరీక్షలు పునరుద్ధరించాలని నీటిపారుదల శాఖ యోచిస్తోంది. అయితే మేడిగడ్డ బరాజ్‌కు ప్రాణహిత నది నుంచి ఫిబ్రవరి వరకు వరద కొనసాగనుంది. దీంతో అక్కడ పరీక్షలు పూర్తి చేసేందుకు సమయం పట్టే అవకాశం ఉంది.

రబీకి సాగునీటిపై నీలినీడలు

ప్రస్తుత రబీలో లోయర్, మిడ్, అప్పర్ మానేరుతో పాటు శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల కింద 20 లక్షల ఎకరాల వరి సాగు జరగనుంది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లను నిల్వ చేసి ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తేనే ఈ మేరకు ఆయకట్టుకు సాగునీరుతో పాటు వేసవిలో తాగునీటి సరఫరాకు వీలు కలగనుంది. దీంతో కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్‌కి దిగువన గోదావరిపై జియోట్యూబ్‌లతో మట్టికట్ట కట్టి నిల్వ చేసిన నీళ్లను అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఎత్తిపోసి అక్కడి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తరలించాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ బరాజ్‌లలో నీళ్ల నిల్వ చేసేందుకు ఎన్డీఎస్‌ఏ అనుమతి ఇవ్వడం లేదు. తాము తుది నివేదిక ఇచ్చేవరకు ఆగాలని స్పష్టం చేస్తుండడంతో రబీలో శ్రీరాంసాగర్, లోయర్, మిడ్, అప్పర్ మానేరు, కడెం ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై సందిగ్ధత నెలకొంది. కాగా నవంబర్‌లో బరాజ్‌లకి పరీక్షలన్నీ పూర్తి చేసి నివేదిక సమర్పిస్తే, డిసెంబర్‌లో ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.



షీట్‌పైల్స్‌తో బరాజ్‌లకు రక్షణ

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ర్యాఫ్ట్ (పునాది)కి రక్షణగా దాని కింద భూగర్భంలో వేసిన సికెంట్ పైల్స్ విఫలం కావడంతోనే బరాజ్‌లు విఫలమైనట్టు నీటిపారుదల శాఖలోని నిపుణులు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారు. దీంతో సికెంట్ పైల్స్‌కు ప్రత్యామ్నాయంగా బరాజ్‌ల పునాదికి రెండు వైపులా భూగర్భంలో 8–9 మీటర్ల వరకు షీట్‌పైల్స్‌తో కటాఫ్ వాల్ నిర్మిస్తే బరాజ్‌లలోని లోపాలను సరిదిద్దినట్టు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత అన్నారం, సుందిళ్లలో నీళ్లను నిల్వ చేసినా సీపేజీ సమస్యలు రావని అంటున్నారు. అయితే బరాజ్‌ల పునరుద్ధరణ చర్యలను సిఫారసు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఎస్‌ఏకు అప్పగించిన నేపథ్యంలో ఆ సంస్థ సిఫారసులు చేసేవరకు వేచిచూడక తప్పని పరిస్థితి నెలకొంది. ఇక మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్ కుంగిన నేపథ్యంలో బరాజ్ పునరుద్ధరణ సాధ్యమేనా? కుంగిపోయిన భాగాన్ని తొలగించి మళ్లీ 7వ బ్లాక్‌ను పునర్నిర్మించాలా? బరాజ్ పునరుద్ధరణ సాధ్యంకాని పక్షంలో ఇతర ప్రత్యామ్నాయ చర్యలు ఏమిటి? అనే అంశంపై ఎన్డీఎస్‌ఏ తన తుది నివేదికలో తేల్చి చెప్పే అవకాశాలున్నాయి.

పత్తి రేటుకు విపత్తు!

▶ మొదటి పేజీ తరువాయి

పూత, కాయ నేలరాలాయి. కొమ్మలు నీటిలో నాని, తెగుళ్ల సోకి దెబ్బతిన్నాయి. అంతేకాదు.. ఈసారి పత్తి విత్తనాల ధరలు, ఎరువులు, డీజిల్, ఇతర ఖర్చులు పెరిగి.. పెట్టుబడి తడిసిమోపెడైంది. ఇలాంటి సమయంలో పత్తి ధరలు తగ్గించేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా తేమ 8 శాతం, ఆలోపు ఉంటే పూర్తి మద్దతు ధర లభిస్తుంది. 9 శాతం నుంచి 12 శాతం మధ్యలో ఉంటే.. శాతాన్ని బట్టి అదే తరహాలో ధర తగ్గుతూ వస్తుంది. కానీ నాణ్యత బాగున్నా వ్యాపారులు, దళారులు తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రంగు మారిన పత్తికి కూడా కనీస మద్దతు ధర దక్కేలా చూడాలని కోరుతున్నారు.

ఇప్పటికీ తెరుచుకోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు...

ఈ నెలాఖరు నుంచి మార్కెట్లోకి పెద్ద ఎత్తున పత్తి రానుంది. ఈ ఏడాది 351 పత్తి కొనుగోలు కేంద్రాలు పెట్టాలని నిర్ణయించారు. కానీ 'కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)' ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలేవీ ప్రారంభించలేదు. జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా పెట్టి సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుంది. మిల్లులు ఆ పత్తిని జిన్నింగ్ చేసి సీసీఐకు అప్పగించాల్సి ఉంటుంది. టెండర్ల ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈసారి టెండర్లు ఇటీవలే పూర్తయినా.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రారంభం కాలేదు. పైగా ఏటా వ్యాపారులు, దళారులు తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేశాక.. సీసీఐ వచ్చి ప్రైవేట్ వ్యాపారుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయడం ఆనవాయితీగా మారిందని.. అందులో భారీగా సొమ్ము చేతులు మారుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

రైతుల అవసరం.. వ్యాపారుల సాకులు..

రైతులు చేన్లలో మూడు దశల్లో పత్తిని తీస్తారు. అందులో మొదటి, రెండోసారి ఎక్కువ పత్తి వస్తుంది. రైతులు ఇందులో మొదట ఏరే పత్తిని నిల్వ చేయకుండా మొత్తంగా విక్రయిస్తారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చేందుకు, ఇతర ఖర్చులకు వినియోగిస్తుంటారు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న వ్యాపారులు, దళారులు పత్తిని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం తేమ శాతం అధికంగా ఉందని, ఇటీవలి భారీ వర్షాలు, వరదలకు పంట నాణ్యత కోల్పోయిందని సాకులు చెప్తున్నారు. పలు దేశాల్లో సంక్షోభ పరిస్థితులతో పత్తికి మార్కెట్ తగ్గిందని.. టెక్స్‌టైల్ మిల్లులు మూతపడ్డాయని చెబుతూ తక్కువ రేటు చెల్లిస్తున్నారు. చాలాచోట్ల వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బంగ్లాదేశ్ సంక్షోభమూ కారణమే!

మన దేశంలో పండే పత్తి అధికంగా బంగ్లాదేశ్, చైనా, వియత్నాం, టర్కీ, పాకిస్తాన్ దేశాలకు ఎగుమతి అవుతుంది. కొన్నాళ్లుగా బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం, పశ్చిమాసియా దేశాల్లో అల్లకల్లోలంతో ఎగుమతులు తగ్గుతున్నాయి. దీనితో పత్తికి డిమాండ్ తగ్గి, ధరలు పడిపోతున్నాయని మార్కెటింగ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రంలో మాత్రం మద్దతు ధర కంటే అధిక రేట్లకు పత్తి కొనుగోళ్లు జరుగుతుండటం, తెలంగాణలో తగ్గిపోవడం ఏమిటన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెటింగ్ శాఖ వర్గాలు చెప్తున్న మేరకు.. గుజరాత్‌లో ప్రస్తుతం పత్తి క్వింటాల్‌కు రూ.8,257 పలుకుతోంది. వచ్చే నెలలో రూ.8,321 వరకు, డిసెంబర్ నెలలో రూ.8,260 వరకు ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. గుజరాత్‌లో వస్త్ర పరిశ్రమలు, మిల్లులు, వ్యాపారులు ఎక్కువగా ఉండటం వల్ల.. కొనుగోళ్లు ఎక్కువగా ఉండి, పత్తి ఎక్కువ రేటు పలుకుతోందనే వాదనలూ ఉన్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌పై ఫోకస్ పెట్టి.. ఇతర రాష్ట్రాల రైతులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా వస్తున్నాయి.

పత్తికి మద్దతు ధరల తీరు ఇదీ.. (క్వింటాల్‌కు.. రూపాయల్లో)

ఏడాది	మద్దతు ధర
2018–29	5,450
2019–20	5,550
2020–21	5,825
2021–22	6,025
2022–23	6,380
2023–24	7,020
2024–25	7,521

కనీస ధర కూడా ఇవ్వడం లేదు

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. కానీ మార్కెట్లో ఆ ధర దక్కడం లేదు. వ్యాపారులు రూ.6,500 నుంచి రూ.7,000కు మించి ధర పెట్టడం లేదు. అంతేకాదు నాణ్యత పేరిట మరింతగా తగ్గిస్తున్నారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే మద్దతు ధర లభిస్తుంది. అందుకోసమే ఎదురుచూస్తున్నాం.

– బానోత్ రామా, బీసురాజుపల్లి తండా, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మంజిల్లా



గద్దర్ సినీ అవార్డుల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో దిల్‌రాజు, సురేశ్‌బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, తనికెళ్ల భరణి తదితరులు

సినీ పరిశ్రమకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తాం

- ఈ విషయాన్ని సీఎం మీ అందరితో చెప్పమన్నారు..
- గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సినీ పరిశ్రమ దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే శాసించే స్థాయికి ఎదగాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. సోమవారం సచివాలయంలో జరిగిన గద్దర్ సినీ అవార్డుల కమిటీ మొదటి సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సినీ పరిశ్రమకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, సీఎం రేవంత్‌రెడ్డి మీ అందరితో చెప్పాలని కోరినట్టు వివరించారు. 'గతంలో నంది అవార్డులను ఒక పండుగలా నిర్వహించేవారు. రాష్ట్ర విభజన తర్వాత గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అంటూ సమాజాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకు సమాయత్తం చేసి నడిపించిన ప్రజా యుద్ధనౌక గద్దర్. ఆయన ఒక లెజెండ్. ఒక శతాబ్ద కాలంలో ఆయనలాంటి వ్యక్తి మరొకరు పుడతారని నేను అనుకోవడం లేదు. ప్రపంచంలోని అన్ని సమస్యలపై ఆయన ప్రజలను పాటలతో కదిలించారు' అని భట్టి చెప్పారు. అన్ని అంశాలు పరిశీలించే రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరిట సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిందని కమిటీ సభ్యులకు వివరించారు. గద్దర్ అవార్డుల కార్యక్రమం గొప్ప పండుగలా జరగాలి.. ఏ తేదీన జరపాలనేది కమిటీ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గద్దర్‌ను అత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. కొద్దిరోజుల్లోనే కమిటీ మరోమారు సమావేశమై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం కమిటీ సభ్యులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాన్సెప్ట్ అద్భుతమైనదని ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేశ్ సమావేశంలో డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్స్ వర్సిటీలో యాక్టింగ్, కల్చర్‌కు సంబంధించిన అంశాలకు చోటు కల్పించడంపై నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమిటీ సభ్యులు నర్సింగరావు, తనికెళ్ల, సురేశ్‌బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, దిల్ రాజు, హరీశ్‌శంకర్, వందేమాతరం శ్రీనివాస్, అల్లాని శ్రీధర్, గుమ్మడి విమల, హనుమంతరావు పాల్గొన్నారు.

ఈసారి వణికించే చలి!

▶ మొదటి పేజీ తరువాయి

సాధారణం కంటే అధికంగా నమోదు కావడంతో పాటు కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇలా ఉష్ణోగ్రతలు పెరగడం, ఆ తర్వాత ఒక్కసారిగా పతనం కావడంలాంటి పరిస్థితులు ఈ సీజన్‌లో కనిపించే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తూర్పు, మధ్య పసిఫిక్ ప్రాంతంలో సాధారణ ఉష్ణోగ్రతల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు (లానినా) నమోదవుతుండడమే ఇందుకు కారణమని వివరిస్తున్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయని, ఉదయం వేళల్లో తీవ్రమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది. గతంలో, తాజాగా 2022లో కూడా రాష్ట్రంలో ఈ తరహా లానినా వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్ నగర శివారుల్లోని కొన్ని ప్రాంతాల్లో 8 డిగ్రీ సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు తగ్గాయని, ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత ఏకంగా 4 డిగ్రీలకు పడిపోయిందని గుర్తుచేస్తున్నారు.

సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు

సోమవారం రాష్ట్రంలోని పలు ప్రధాన కేంద్రాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. నిజామాబాద్‌లో 35.6 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్టంగా దుండిగల్‌లో 20.7 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది.

సంజీవన్‌రావుపేట ఘటనపై సర్కార్ సీరియస్

ఇద్దరు ఇంజనీర్లు, కార్యదర్శి సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట సంఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కలుషిత తాగునీటి సరఫరాతో ఇటీవల ఇద్దరు మృతి చెందడం.. మరో 50 మంది అస్వస్థతకు గురవడం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన మూడు శాఖల అధికారులపై ప్రభుత్వం వేటు వేసింది. బాధ్యులైన మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, గ్రిడ్ అసిస్టెంట్ ఇంజనీర్ రవికుమార్‌లను సస్పెండ్ చేశారు. మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజనీర్ రఘువీర్‌కు కూడా మెమో జారీ అయినట్లు సమాచారం. తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్వ నాగలక్ష్మిని కూడా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణఖేడ్ మండలం స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న వయోజన విద్యాశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డిపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నమోదు చేశారు. నారాయణఖేడ్ మండలం ఎంపీవో ఇందిరమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సీఎంఆర్‌లో 'ది బిగ్గెస్ట్ ఫెస్టివ్ ధమాకా'

సాక్షి, హైదరాబాద్: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సీఎంఆర్ షాపింగ్ మాల్ సెప్టెంబర్ 19 నుంచి 'ది బిగ్గెస్ట్ ఫెస్టివ్ ధమాకా' నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, మిర్యాలగూడ, ఉప్పల్, హనుమకొండ, షాద్‌నగర్, హయత్‌నగర్, బీహెచ్‌ఈఎల్, కరీంనగర్ సీఎంఆర్ షాపింగ్ మాల్స్‌లో ప్రతి రూ.500 కొనుగోలుపై ఒక లక్కీ డ్రా కూపన్ అందిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 2000 మందికి పైగా కొనుగోలుదారులు ది బిగ్గెస్ట్ ఫెస్టివ్ ధమాకాలో విజేతలుగా నిలిచి బహుమతులు గెలుపొందారని సీఎంఆర్ షాపింగ్ మాల్ జనరల్ మేనేజర్ నూలు లింగమూర్తి తెలిపారు.

27 నుంచి విజయవాడ-విశాఖకు నూతన సర్వీస్‌లు

విమానాశ్రయం (గన్నవరం): ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి విశాఖ-విజయవాడ మధ్య విమాన సర్వీస్‌లను ప్రారంభించనుంది. ఈ విమానం ప్రతిరోజు ఉదయం 9.35కు విశాఖ నుంచి బయలుదేరి 10.35 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. తిరిగి ఇక్కడి నుంచి రాత్రి 7.55కు బయలుదేరి 9 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

- ఈ నెల 27 నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ కూడా విజయవాడ-విశాఖ మధ్య రెండో విమాన సర్వీస్ ను ప్రారంభించనుంది. ఈ విమానం సాయంత్రం 7.15కు ఇక్కడి నుంచి బయలుదేరి రాత్రి 8.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. తిరిగి రాత్రి 8.45కు విశాఖ నుంచి బయలుదేరి 9.50 గంటలకు ఇక్కడికి చేరుకుంటుంది.

ఫాక్స్‌కాన్‌ను మరింత విస్తరించండి

ఫోర్త్‌సిటీలో భాగస్వాములు కండి

- సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఫ్యాక్టరీ సందర్శన




ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధితో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడం ద్వారా వ్యాపార విస్తరణ చేపట్టాలని ప్రముఖ సెల్‌ఫోన్‌ల తయారీ కంపెనీ ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలు, లిథియం బ్యాటరీల తయారీకి సైతం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. హైటెక్నాలజీ ఉత్పత్తుల తయారీ, ఆవిష్కరణలకు రాష్ట్రంలో అత్యంత అనుకూల వాతావరణం ఉందని వివరించారు. ప్రభుత్వం కొత్తగా నిర్మించ తలపెట్టిన ఫోర్త్ సిటీలో భాగస్వాములు కావాలని కోరారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి సోమవారం కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ పరిశ్రమను ఆయన సందర్శించారు. గంటకు పైగా అక్కడ గడిపిన ఆయన ఫ్యాక్టరీ ఏర్పాటులో పురోగతిని పరిశీలించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కంపెనీ ఉత్పత్తులు, నిరుద్యోగ యువతకు కల్పించనున్న ఉపాధి అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కంపెనీ ప్రస్తుత, భవిష్యత్తు కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తోడ్పాటునందిస్తుందన్నారు. ఫాక్స్‌కాన్ కంపెనీ సీఈఓ, చైర్మన్ సిడ్నీ లూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాజెక్టు పురోగతిని సీఎంకు వివరించారు. కంపెనీ నిర్వహణకు సంబంధించిన కొన్ని సమస్యలను ఆయన ప్రస్తావించగా, వాటి సత్వర పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. గ్లోబల్ టెక్నాలజీ రంగంలో పెట్టుబడులకు సరైన గమ్యస్థానంగా రాష్ట్రాన్ని బలోపేతం చేయడంలో భాగంగా సీఎం రేవంత్ ఈ పర్యటనను చేపట్టారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నల్లగొండ బైపాస్ నిర్మాణానికి రూ.516 కోట్లు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ సెక్షన్ వరకు ఉన్న జాతీయ రహదారి 565లో 14 కి.మీ పొడవైన నాలుగు లేన్ల నల్లగొండ పట్టణ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.516 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం 'ఎక్స్'వేదికగా ఈ విషయం వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వల్ల నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ తగ్గడమే కాకుండా నకిరేకల్ – నాగార్జునసాగర్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడుతుందని, రహదారి భద్రత కూడా పెరుగుతుందని ఆయన తెలిపారు. దీనితో పాటు ఆంధ్రప్రదేశ్‌లో 200.06 కి.మీ మేర విస్తరించి ఉన్న 13 రాష్ట్ర రహదారుల అభివృద్ధికి సీఆర్‌ఐఎఫ్ పథకం కింద రూ.400 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సీఆర్‌ఐఎఫ్ సేతు బంధన్ పథకంలో భాగంగా, గుంటూరు జిల్లాలోని గుంటూరు–నల్లపాడు రైల్వే సెక్షన్‌లో నాలుగు లేన్ల శంకర్ విలాస్ రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి గాను రూ.98 కోట్ల విడుదలకు కూడా ఆమోదం తెలిపినట్లు గడ్కరీ వివరించారు.

కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలు చేపట్టండి

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌కు ఈటల విజ్ఞప్తి



కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన ఈటల రాజేందర్

సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కరోనా మహమ్మారి వేళ కంటోన్మెంట్‌లో పనిచేసిన మున్సిపల్ కార్మికులు సుమారు వంద మందికి పైగా మృతి చెందారు. ఐదు శాతం కంటే ఎక్కువ మందికి కారుణ్య నియామకాలు చేపట్టవద్దని రక్షణ శాఖ నిబంధన ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో ఉదారంగా వ్యవహరించి కరోనా సమయంలో మృతి చెందిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఈటల రాజేందర్ తెలిపారు.

జేసీఓపీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం

18వ లోక్‌సభ 'జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్' చైర్మన్‌గా సోమవారం ఢిల్లీలోని కార్యాలయంలో ఎంపీ ఈటల రాజేందర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా.. ఆయనకు బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కమిటీకి ఈటల చైర్మన్ కాగా.. తొమ్మిదిమంది లోక్‌సభ ఎంపీలు, ఐదుగురు రాజ్యసభ ఎంపీలు సభ్యులుగా ఉంటారు.

మూసీ ప్రక్షాళనకు సరైన ప్రణాళిక లేదు

- డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయకుండా సుందరీకరణ ఎలా సాధ్యం
- పార్టీ ఫిరాయింపుల విషయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు నైతిక విలువలు లేవు
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

గీసుకొండ: 'రాష్ట్రంలో తలాతోక లేని పాలన కొనసాగుతోంది.. మూసీ నది సుందరీకరణ పేరుతో ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా.. స్పష్టమైన ప్రణాళిక, డీపీఆర్ లేదు.. ముందుగా డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయకుండా ఇది ఎలా సాధ్యం అవుతుంది' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పార్టీ సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ సర్కారు మాదిరిగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని, ఎమ్మెల్యేలు, ఎంపీల పార్టీల ఫిరాయింపు విషయంలో రెండు పార్టీలు ప్రజాస్వామ్య విధానానికి తూట్లు పొడిచాయన్నారు. వచ్చే నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ప్రజా సమస్యలపై ఉద్యమ బాట పడుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి ఏ ఒక్క కాలనీకి శంకుస్థాపన చేయని సర్కారు.. హైదరాబాద్‌లో పేదల ఇళ్లను కూలగొడుతోందని ఆరోపించారు. అతి తక్కువ సమయంలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని పేర్కొన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల పాలు చేశారని, అదే బాటలో రేవంత్‌రెడ్డి సర్కారు నడుస్తోందని ఎద్దేవా చేశారు. యువకులు, మహిళలు, పేదలు, రైతుల కోసం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను ప్రధాని మోదీ నాయకత్వంలో తీసుకొస్తామని చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణంలో ప్రపంచంలోనే దేశం ప్రథమస్థానంలో ఉందని చెప్పారు. సింగరేణి గనులను ప్రైవేట్‌పరం చేసే యోచన కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు


మహేందర్ రెడ్డి


శ్రీపాల్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న రెండు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాలకు పీఆర్టీయూటీఎస్ అభ్యర్థులను ఖరారు చేసింది. వరంగల్‌-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గానికి పింగిలి శ్రీపాల్ రెడ్డిని, కరీంనగర్‌-మెదక్‌- నిజామాబాద్‌-ఆదిలాబాద్ నియోజకవర్గానికి వంగ మహేందర్ రెడ్డిని ప్రకటించింది. పింగిలి శ్రీపాల్ రెడ్డి వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట హవేలీ పాఠశాలలో పనిచేస్తూ ప్రస్తుతం పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన వంగ మహేందర్ రెడ్డి పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా పనిచేస్తూ ఎమ్మెల్సీ బరిలో నిలిచేందుకు.. ఏడాదిన్నర క్రితమే ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేశారు.

లోక్‌సభ అధికారులకు శిక్షణ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ సెక్రటేరియట్‌లోని ప్రైవేట్ సెక్రటరీలు, స్టెనోగ్రాఫిక్ సర్వీస్ ఆఫీసర్ల కోసం డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం 'కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్' ప్రారంభమైంది. ఈ కార్యక్రమం అక్టోబర్ 14 నుండి 18 వరకు జరగనుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఇన్‌స్టిట్యూట్ డీజీ డాక్టర్ శశాంక్ గోయెల్ మాట్లాడుతూ లోక్‌సభ సెక్రటేరియట్ అధికారులు, ప్రైవేట్ సెక్రటరీలు, స్టెనోగ్రాఫిక్ సర్వీస్ ఆఫీసర్లు కీలక సమాచారం అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. మెరుగైన భాషా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుందని స్పష్టం చేశారు. గౌరవ అతిథి, ఫ్రైడ్ డైరెక్టర్ డాక్టర్ కేపీ మాలిక్ మాట్లాడుతూ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌లో లోక్‌సభ సెక్రటేరియట్‌లోని మహిళా అధికారుల శాతం దాదాపు 45 శాతం ఉందన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

'అగ్రి' కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం

సాక్షి,హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన యూజీ (అండర్ గ్రాడ్యుయేట్) కోర్సులలో ప్రవేశాలకు సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఈ కౌన్సెలింగ్‌ను రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి ప్రారంభించారు. వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన కోర్సులలో చేరడం వల్ల విద్యార్థులకు లభించే ఉపాధి, ఉన్నత విద్య అవకాశాల గురించి ఆయా విశ్వవిద్యాలయాల అధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ గోపాల్‌రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జయశ్రీ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ విజయలక్ష్మి, ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెలకు ఒకసారే ఇంటికి..

మారుతున్న టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్ల లీవ్ మాన్యువల్

నవంబర్ 1 నుంచి అమలుకు డిపార్ట్‌మెంట్ ఆదేశాలు

ఇప్పటివరకు 15 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లిన కానిస్టేబుళ్లు.. ఇదే కష్టంగా ఉందనుకుంటే మళ్లీ అమల్లోకి పాత పద్ధతి!

మరోసారి ఆందోళనలకు సిద్ధమవుతున్న కానిస్టేబుళ్ల భార్యలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ)లో లీవ్ (సెలవు) మాన్యువల్ మరోసారి చర్చనీయాంశం కానుంది. గతంలో 15 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లిన కానిస్టేబుళ్లు.. ఇకపై 26 రోజుల నుంచి నెల రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లేలా కొత్త లీవ్ మాన్యువల్ అమలు కానుండటమే ఇందుకు కారణం. వచ్చే నవంబర్ 1 నుంచి కొత్త మాన్యువల్ అమలు కానుండగా, తాజా నిబంధనలపై కానిస్టేబుళ్లలో ఇప్పటికే తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. వారి కుటుంబాలు ప్రభుత్వం, అధికార వర్గాలపై మండిపడుతున్నాయి. ఇది ముమ్మాటికీ శ్రమ దోపిడీయేనని, బ్రిటిష్ కాలంనాటి చట్టాలను సవరించాల్సింది పోయి, ఒత్తిడి మరింత పెంచేలా కొత్త విధానాలకు శ్రీకారం చుట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మళ్లీ పాత విధానం!

హైదరాబాద్‌తో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 13 టీఎస్ఎస్పీ బెటాలియన్లు ఉన్నాయి. దాదాపు 8 వేల మంది పోలీసులు వివిధ ర్యాంకుల్లో పనిచేస్తున్నారు. బెటాలియన్లలోని ప్రతి 12 మందిని ఒక ప్లటూన్ లేదా సెక్షన్ అని పిలుస్తారు. వీరిలో నలుగురు హెడ్‌క్వార్టర్‌కు అందుబాటులో ఉంటారు. మిగిలిన 8 మందికి ఈ లీవ్ మాన్యువల్ వర్తిస్తుంది. ఒకరు సెలవు తీసుకుంటే ఏడుగురు కచ్చితంగా విధుల్లో ఉండాలి. ఈ ఏడుగురు ఒకరి తర్వాత మరొకరు నాలుగు రోజుల చొప్పున సెలవు తీసుకోవాల్సి ఉంటుంది. అంటే 1 నుంచి 7వ కానిస్టేబుల్ వరకు నాలుగు రోజుల చొప్పున లీవు తీసుకున్నాక 8వ కానిస్టేబుల్‌కు అవకాశం వస్తుందన్నమాట. అంటే 28 రోజుల డ్యూటీ తర్వాత 4 రోజుల సెలవు దొరుకుతుందన్నమాట. అంటే ప్రతి కానిస్టేబుల్ 28 రోజులకు ఒకసారి ఇంటికి వెళతారన్నమాట. ఒక వేళ ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో సెలవు పెడితే ఈ క్రమం దెబ్బతిని తదుపరి వ్యక్తి తీసుకోవాల్సిన సెలవు మరింత ఆలస్యం అవుతుంది. 2012 వరకు ఇలాంటి నిబంధనలే ఉండేవి. అయితే 2012 ఆగస్టు 5వ తేదీన తమ భర్తలు ఇంటికి రావడం లేదంటూ కొండాపూర్ బెటాలియన్ ఎదుట కానిస్టేబుళ్ల భార్యాపిల్లలు భారీయెత్తున ధర్నా నిర్వహించారు. ఇది దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది. ఈ నేపథ్యంలో కానిస్టేబుళ్లకు లీవుల విషయంలో కాస్త వెసులుబాటు కల్పించారు. తెలంగాణ వచ్చిన తర్వాత మాన్యువల్‌లో మార్పులు చేసి ఒకసారి ఒక్కరిని కాకుండా ముగ్గురికి అవకాశం ఇవ్వడం ప్రారంభించారు. ఫలితంగా ప్రతి నెలా రెండుసార్లు అంటే 15 రోజులకు ఒకసారి ఇంట్లో వారిని చూసే అవకాశం కానిస్టేబుళ్లకు దక్కేది.

అగచాట్లు తప్పవా?

➤ దాదాపుగా పాత పద్ధతి తరహాలోనే ఇకపై 26 రోజుల నుంచి నెల రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లేలా కొత్త లీవ్ మాన్యువల్ అమలు కానుండటంతో కానిస్టేబుళ్లతో పాటు వారి కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వారాలకు వారాలు భర్తలు తమకు, పిల్లలకు దూరంగా ఉండేలా చేస్తున్న నిబంధనలపై భార్యలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కాపురాల్లో కలహాలకు కారణమై విడాకుల వరకు వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. మరోవైపు ఇప్పటికే కుటుంబసభ్యులు అనారోగ్యంతో బాధ పడుతున్నా ఇంటికి వెళ్లలేని స్థితిలో ఉంటున్నామని కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజా ఆదేశాలు అమలైతే తమ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అంటున్నారు. ఇంకోవైపు వీరికి స్థిరంగా విధులు ఎక్కడా ఉండక పోవడం కూడా వారిలో అసంతృప్తికి కారణమవుతోంది. ప్రతి వారానికి లేదా 15 రోజులకు అప్పుడప్పుడూ ప్రతి రోజూ మారతాయి. ఇక సాధారణ ఎన్నికలు, విపత్తులు, అల్లర్లు చెలరేగినపుడు వీరంతా సెలవులు రద్దు చేసుకుని మరీ బందోబస్తు విధుల్లో కొనసాగాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే కొత్త మాన్యువల్‌పై కానిస్టేబుళ్ల కుటుంబాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. బ్రిటిష్ కాలంలో రూపొందించిన చట్టాలను మార్చాలంటూ మరోసారి కానిస్టేబుళ్ల భార్యలు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.



ముఖ్యమంత్రి పెద్ద మనసు చేసుకోవాలి

➤ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమ బాధల్ని అసెంబ్లీ వేదికంగా లోకానికి చాటిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎం, హోంమంత్రిగా ఉన్నారని, ఆయన గతాన్ని గుర్తుచేసుకుని తమ విషయంలో పెద్దమనసు చేసుకోవాలని వారు కోరుతున్నారు. 26 రోజులకు ఒకసారి లీవు విధానం అమలు చేయకుండా ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని, టీఎస్ఎస్పీ, సివిల్, ఏఆర్ బెటాలియన్లను కలిపి తమిళనాడు, కర్ణాటక తరహాలో 'ఏక్ పోలీసింగ్' విధానాన్ని అమలు చేయాలని, కుటుంబాలతో ఒకేచోట 3 నుంచి ఐదేళ్లపాటు కలిసి ఉండే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

కులగణనను అడ్డుకుంటే సహించం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


జీవో కాపీని చూపిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట(హైదరాబాద్): కులగణన బీసీల ఆత్మగౌరవానికి ప్రతీక అని..దానిని అడ్డుకునేందుకు చూస్తే ఎంతటివాడినైనా బొందపెడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర కులగణన 60 రోజుల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకురావడం ..తాము గత కొన్ని నెలలుగా చేస్తున్న పోరాటాలకు ఫలితమని చెప్పారు. కులగణన చేసేందుకు ప్రభుత్వం జీవో 18 తీసుకురావడాన్ని స్వాగతిస్తూ ఈ నెల 16వ తేదీన జిల్లా, మండల, నియోజకవర్గాల వారీగా పూలే విగ్రహాలకు పూలాభిషేకం చేయాలని జాజుల పిలుపునిచ్చారు. 20వ తేదీన కులగణనపై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తామని, 22వ తేదీన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మేధావులు, కుల సంఘాల నాయకులు, కవులు, కళాకారులతో సమాలోచన సభ నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రతి జిల్లాలో పాలియేటివ్ కేర్ సెంటర్లు

ఈ సెంటర్ల ఏర్పాటుకు కంపెనీలు, ఎన్జీవోలు ముందుకురావాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రాయదుర్గం (హైదరాబాద్): పాలియేటివ్ కేర్ సెంటర్లు ప్రతి జిల్లాకు విస్తరించేలా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. వరల్డ్ హోస్పైస్ అండ్ పాలియేటివ్ కేర్ డేను పురస్కరించుకొని శేరిలింగంపల్లిలోని ఖాజాగూడలో కొనసాగుతున్న స్పర్శ్ హోస్పైస్ సెంటర్ ఫర్ పాలియేటివ్ కేర్ ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాలి యేటివ్ కేర్ సెంటర్ల విస్తరణకు పలు కంపెనీలు, ఎన్జీవో సంస్థలు సీఎస్ఆర్ నిధులను కేటాయించి సేవలను విస్తృతం చేయడానికి చేయూత అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 33 జిల్లాలలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో పాలియేటివ్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కుటుంబసభ్యులే అవసాన దశలో సేవలను అందించేందుకు అనాసక్తి చూపుతున్న తరుణంలో పాలియేటివ్ కేర్ సెంటర్లు తమ సేవలను అందించి వారిలో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించేందుకు కృషి చేస్తున్నాయని ప్రశంసించారు. పాలియేటివ్ కేర్ సెంటర్లకు ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో సేవలు అందించేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని చెప్పారు. స్పర్శ్ హోస్పైస్ అందిస్తున్న సేవలను పరిశీలించిన మంత్రి వైద్య బృందాన్ని అభినందించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులతో ముచ్చటించారు.

దివ్యాంగులకోసం ప్రత్యేక జాబ్‌పోర్టల్

ఆవిష్కరించిన మంత్రి సీతక్క

ప్రైవేటు రంగంలో ఉపాధికి ఊతం

ప్రైవేటు ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలి


దివ్యాంగురాలికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులకు ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇందులో భాగంగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా జాబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్క దివ్యాంగుల జాబ్‌పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు తక్కువగా ఉంటాయని, వాటిని వెతికి పట్టుకోవడంలో ఇతరుల సహకారం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు జాబ్‌పోర్టల్ ఊతమిస్తుందన్నారు. ప్రైవేటు ఉద్యోగాల కల్పనలోనూ దివ్యాంగుల రిజర్వేషన్లు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జాబ్‌పోర్టల్ ద్వారా వారికి అర్హతను బట్టి ఉద్యోగాలు లభించే అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగంపై ఖర్చు చేస్తున్న నిధుల్లో దివ్యాంగులకు 5% వాటా ఇస్తున్నామన్నారు. ప్రైవేటు రంగంలోనూ వారికి 4శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలోనూ రిజర్వేషన్లు పాటిస్తామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ గా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ ఆన్‌లైన్ జాబ్‌పోర్టల్ దివ్యాంగుల ఉద్యోగాలకు దిక్సూచి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరేట్ హెల్ప్‌లైన్ విభాగంలో పదిమందికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కాచిగూడ(హైదరాబాద్): ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముజీబ్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్ తదితరులు సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీకి సంబంధించిన సమస్యలపై చర్చించారు. సొసైటీ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని, త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి సభ్యులందరికీ న్యాయం చేస్తామని భట్టి విక్రమార్క వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు సి.నరసింహారెడ్డి, హౌసింగ్ సొసైటీ ప్రధానకార్యదర్శి జి.మల్లారెడ్డి, ప్రతినిధులు రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు చిత్రపటం అందజేస్తున్న టీఎన్జీవోస్ నేతలు

ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్ ప్రారంభం

నిలిచిపోయిన పీజీ ప్రవేశాలు


ఖమ్మంలోని ఓ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న యాజమాన్య ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ /ఖమ్మం సహకార నగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్ ప్రారంభించాయి. దీంతో పీజీ రెండో విడత ప్రవేశాలు నిలిచిపోయాయి. అయితే పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. కాగా, ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్‌కు తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ రమేశ్ మద్దతు ప్రకటించారు. కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లాలో విద్యాసంస్థల బంద్: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ పిలుపుమేరకు ఖమ్మం జిల్లాలో విద్యాసంస్థలను బంద్ చేసినట్టు అసోసియేషన్ ఖమ్మం జిల్లా బాధ్యులు పి.ఉపేందర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, వేణుమాధవ్ తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇప్పటికే గ్రామీణ ప్రాంతంలో కళాశాలలు మూతపడ్డాయని చెప్పారు. బకాయిలు విడుదల చేసే వరకు బంద్ పాటిస్తామని వారు వెల్లడించారు.

గురుకులాల సంఖ్యను కుదించే ప్రయత్నం: వినోద్

సాక్షి, హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి గురుకుల విద్యా సంస్థల సంఖ్యను కుదించే ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ అనుమానాలు వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 1,023 గురుకులాల సంఖ్యను 119కి కుదించేలా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు ప్రస్తుతమున్న గురుకులాలను విలీనం చేస్తూ ప్రతీ నియోజకవర్గంలో 2,500 మంది విద్యార్థులతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త గురుకులాలు ఏర్పాటు చేస్తోందా లేక పాత వాటిని విలీనం చేస్తోందా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



రుషిని గుర్తించగలిగేవాడు కూడా రుషి అయ్యుండాలి.
– జెనోఫనీజ్

సాక్షి

మంగళవారం, 15 అక్టోబర్ 2024

దిగ్భ్రాంతికర హత్యాకాండ

మాజీ మంత్రి, మహారాష్ట్రలోని అధికార జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నేత బాబా సిద్దిఖీని ముంబయ్‌లో మాఫియా శైలిలో హత్య చేసిన తీరు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. సినీ నటుడు సల్మాన్ ఖాన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తదుపరి లక్ష్యాలంటూ వినిపిస్తూ ఉండడం ఆందోళన రేపుతోంది. మరికొద్ది రోజుల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న ఆ రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితిపై సందేహాలు కలిగిస్తోంది. సల్మాన్‌తో సన్నిహిత సంబంధాల రీత్యా సిద్దిఖీ లక్ష్యంగా మారారని కథనం. కుమారుడి నియోజకవర్గంలోని మురికివాడల పునరభివృద్ధి వ్యవహారంలో కుంభకోణం ఆయన మెడకు చుట్టుకుందని మరో వాదన. ఇంకా అనేక రకాల కుట్ర కోణాలూ వినవస్తున్నాయి. సిద్దిఖీ దారుణ హత్యకు కారణాలు ఏమైనప్పటికీ, రానున్న ఎన్నికల్లో ఈ ఘటన తాలూకు రాజకీయ పర్యవసానాలు కచ్చితంగా ఉండే అవకాశం మాత్రం కనిపిస్తోంది. ఇప్పటికే మహారాష్ట్రలో అస్తుబిస్తుగా ఉన్న పాలక కూటమిని ఎన్నికల వేళ ఇది ఇరుకునపెట్టే అంశం కానుంది.

విద్యార్థి నేత నుంచి గ్యాంగ్‌స్టర్‌గా మారిన లారెన్స్ బిష్ణోయ్ జైలులో ఉన్నా, అనేక నెలలుగా ఈ హత్యకు పథకం వేసినట్లు కథనం. జైలులో ఉన్నా సెల్‌ఫోన్ సహా సమస్త సౌకర్యాలతో బిష్ణోయ్ లాంటి కొందరు ఖైదీలు రాజభోగాలు అనుభవిస్తూ ఉండడం మన వ్యవస్థకు పట్టిన తెగులు. ముంబయ్‌లో రద్దీగా ఉండే బాంద్రా ప్రాంతంలో శనివారం, విజయదశమి నాటి రాత్రి సిద్దిఖీపై దాడి చేసిన ముగ్గురు దుండగులు ముందుగా ఆయన రక్షకుడిపై పెప్పర్‌స్ప్రే జల్లి, ఆపైన సూటిగా 6 బుల్లెట్లు కాల్పులు జరిపి ఊరేగింపులో కలిసిపోయారట. హాస్పిటల్‌కు హుటాహుటిన తరలించి, దాదాపు రెండు గంటల పాటు వైద్యులు శ్రమించినా సిద్దిఖీ ప్రాణాలను కాపాడలేకపోయారు. ఇద్దరు నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ, కాల్పులు జరిపిన మూడో వ్యక్తి ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. బిష్ణోయ్ పక్షాన ముగ్గురు సుపారీ ఇచ్చి పథక రచన చేయగా, మరో ముగ్గురు కాల్పులు జరిపారనీ, నిందితులు యూపీ, పంజాబ్, హర్యానా – ఇలా వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చి రెక్కీ జరిపినట్లూ, దొరకకుండా వాట్సప్, సిగ్నల్ యాప్‌ల ద్వారా కథ నడిపినట్లూ సమాచారం.

సరిగ్గా వారం పైచిలుకు క్రితమే ముంబయ్‌లోని బైకులా ప్రాంతంలో మరో ఎన్సీపీ నేత కత్తిపోట్లకు గురయ్యారు. ఆ ఘటనను మర్చిపోకముందే ఇప్పుడీ దారుణహత్య జరగడం విషాదం. దాదాపు 48 ఏళ్ళ పాటు కాంగ్రెస్‌లో ఉండి, పాపులర్ రాజకీయ నేతగా ఎదిగిన చరిత్ర సిద్దిఖీది. ఏటేటా ఆయన ఆర్భాటంగా నిర్వహించే ఇఫ్తార్ విందులు, వాటికి హాజరయ్యే నగర ప్రముఖులు, మరీ ముఖ్యంగా హిందీ సినీ అగ్ర తారలు జగత్ప్రసిద్ధం. అంత పేరు, పలుకుబడి, ప్రజాక్షేత్రంలో సుదీర్ఘ అనుభవం ఉన్న బాబా సిద్దిఖీని స్వయంగా ఎమ్మెల్యే అయిన ఆయన కుమారుడు జీషన్ కార్యాలయం ఎదుటే హత్య చేయడం దిగ్భ్రాంతికరం. 'వై ప్లస్' కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ ఇలా ఓ పాపులర్ నాయకుడు దారుణహత్యకు గురికావడం వ్యవస్థల వైఫల్యానికి ఉదాహరణ. అదీ పోలీసు బందోబస్తు ఎక్కువగా ఉన్న దసరా ఉత్సవాల హంగామా సమయంలోనే జరగడం పరాకాష్ఠ. దేశ వాణిజ్య రాజధానిలో ఇలాంటి ఘటన జరిగిందంటే, పాలకులకు ఇది మరీ మాయని మచ్చ.

గ్లామర్ నిండిన హిందీ చిత్రసీమ, ఖరీదైన ముంబయ్ రియల్ ఎస్టేట్, ఈ రెంటితోనూ ముడి పడ్డ మాఫియా ముఠా నేతల ముక్కోణపు వ్యవహారం ముంబయ్‌లో ఎప్పుడూ ఒక డెడ్లీ కాంబినేషన్. కొన్ని నియోజకవర్గాలు అచ్చంగా మాఫియా నేతల కనుసన్నల్లోనే నడుస్తూ వచ్చాయి. 1980, '90లలో ముంబయ్‌లో దావూద్ ఇబ్రహీమ్, ఛోటా రాజన్ లాంటి మాఫియా నేతల గ్యాంగ్ వార్ తెలిసినదే. గతంలో చాలా ఏళ్ళ క్రితం ప్రముఖ సినీ నిర్మాత, ఆడియో కంపెనీ అధినేత గుల్షన్ కుమార్ హత్య ఇలాగే జరిగిందీ ప్రజలకు గుర్తే. కానీ, ఇప్పుడు కటకటాల వెనుక ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ ఇలాంటి చర్యలకు దిగడమే దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ప్రముఖులపై హింసాత్మక దాడులు, హత్యలు ఈ ఏడాది వరుసగా జరుగుతూ ఉండడం ఆందోళనకరమైనది. ఇదే ఏడాది ఫిబ్రవరిలో ఫేస్‌బుక్ లైవ్‌లో ఉండగా శివసేన (యూబీటీ) నేత ఒకరు దారుణంగా హత్యకు గురయ్యారు. ఆ ఘటనపై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో లోపాలతో ఆగ్రహించిన హైకోర్ట్ చివరకు ఆ కేసును గత నెలలో సీబీఐకి బదలాయించాల్సి వచ్చింది. ఇవన్నీ పోలీసులకూ, పాలకపక్షానికీ చెంపపెట్టు.

మహారాష్ట్రలో శివసేన, బీజేపీ, ఎన్సీపీలతో కూడిన మహాయుతి సర్కార్‌కు ఇప్పటికే బోలెడన్ని చిక్కులున్నాయి. అధికారం కోసం ఈ పార్టీలన్నీ అనైతిక కూటమి కట్టాయనే భావన ఉంది. కూటమి పాలనపై అసంతృప్తి సహా ఇంకా అనేకం ఉండనే ఉన్నాయి. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ బలం పుంజుకుంటూ ఉండడంతో, ఎన్నికల వేళ... ముంబయ్‌లో టోల్‌ఫ్రీ ప్రయాణం సహా రకరకాల జిమ్మిక్కులకు సర్కారు సిద్ధమవుతున్న పరిస్థితి. ఇలాంటప్పుడు సిద్దిఖీ హత్య జరిగింది. రాష్ట్రంలో శాంతి భద్రతలకు బాధ్యత వహించాల్సిన హోమ్ శాఖకు బీజేపీ నేత, సాక్షాత్తూ డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సారథి. అదీ కాషాయపార్టీకి ఇబ్బందికరమే. సిద్దిఖీ మీద గతంలో అనేక అవినీతి ఆరోపణలున్నా ఈ హత్య ఊహించనిది. ముంబయ్‌లో మళ్ళీ ఒకప్పటి గ్యాంగ్‌వార్ పరిస్థితులు రాకుండా ఉండాలంటే, సర్కారు ఉక్కుపాదం మోపాలి. అన్ని పక్షాలూ రాజకీయాల కన్నా రాష్ట్రంలో భయరహిత వాతావరణం నెలకొనేందుకు కృషి చేయాలి. గతంలో ఎంతో పేరున్న ముంబయ్ పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకోవాలి. దోషులకు శిక్ష పడేలా చూడాలి. పోయిన ప్రతిష్ఠను తెచ్చుకోవాలి. చట్టం మీద ప్రజలకు మళ్ళీ నమ్మకం నెలకొనేలా చూడడం పాలకుల తక్షణ కర్తవ్యం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.10.11 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.8.59 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.34 నుండి 11.22 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.37
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

లౌకికవాదానికి గొడ్డలిపెట్టు రాజకీయం

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో కుల రాజకీయాలు మరింత ఊపు అందుకుంటున్నాయి. హరియాణా, జమ్మూ–కశ్మీర్ ఎన్నికల్లోని సామాజిక సమీకరణలను పరిశీలిస్తే – అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా చెప్పిన కులం పునాదుల మీదే ఎన్నికలు జరుగుతున్నాయని స్పష్టమవుతుంది. హరియాణాలో కాంగ్రెస్ కుల ఓట్లను సమీకరించింది. కాంగ్రెస్‌కు ప్రతిగా బీజేపీ కూడా ఎంబీసీ కులాలను సమీకరించడం మొదలుపెట్టింది. జాట్లంతా హస్తం పార్టీ వైపు ఉన్నారన్న ప్రచారం పూర్తిస్థాయిలో నిజం కాదు. అయినా జాట్లకు వ్యతిరేకంగా ఉన్న కులాల్లో అత్యధికులు తమ పార్టీ వైపు మొగ్గు చూపేలా కమలం పార్టీ చేసుకోగలిగింది. అయితే, బీసీల్లోని మతపరమైన నమ్మకాలను రాజకీయం చేయాలనే ఆలోచన బీజేపీకి ఉందని మనం గమనించాలి.

కాంగ్రెస్ మొదటి నుండీ ఆయా రాష్ట్రాలలో భూస్వామ్య కులాల మీద ఆధారపడి తన రాజకీయాలు నెరపుతున్నదని భాషా రాష్ట్రాల రూపకల్పన నాడే అంబేడ్కర్ స్పష్టం చేశారు. రామ్ మనోహర్ లోహియా తన 'కులాల సమస్య'లో భారతదేశంలో అగ్రవర్ణాల పెత్తనం కొనసాగుతుందనీ, జాతీయ స్థాయిలో వాళ్ళ పెత్తనాన్ని హిందూ బ్రాహ్మణ రాజకీయ వ్యవస్థ నడిపిస్తుందనీ అన్నారు. శూద్ర కులాలు వారికి సామంతులుగా ఆ యా రాష్ట్రాలను పాలించుకుంటున్నాయనీ, బ్రాహ్మణాధిపత్యంలో ఏ దోపిడీ అయితే ఉందో శూద్ర భూస్వామ్య కులాల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాలలో కూడా అదే ఆధిపత్యం కొనసాగుతుందనీ చెప్పారు.



ఇవాళ హరియాణాలో కాంగ్రెస్ కుల ఓట్లను సమీకరించింది. కాంగ్రెస్‌కు ప్రతిగా బీజేపీ ఎంబీసీ కులాలను సమీకరించడం మొదలుపెట్టింది. కాంగ్రెస్ తాము గెలుస్తున్నామనే భావనలో పూర్తి ఫలితాలు వచ్చాక చేసుకునే ఉత్సవాలను అత్యుత్సాహంతో ముందే చేసుకోవటం, జాట్ల వల్ల అణగదొక్కబడుతున్న బీసీ కులాలు సమీకృతమై బీజేపీకి ఓట్లు వేయడం జరిగింది. ఈ విషయంలో కాంగ్రెస్ పునరాలోచించుకోవలసిన అవసరం వుంది. బీజేపీ తన హిందూవాద సిద్ధాంతాన్ని ఆచరించడంలో వెనుకంజ వేయడం లేదు. కానీ ప్రత్యర్థులు ఎన్నికల్లో ఏ కులాల్ని ఆశ్రయిస్తున్నారో చూసి వాటికి భిన్నమైన కులాల సమీకరణకు పూనుకుంటోంది. కాంగ్రెస్ ఉదార బ్రాహ్మణ వాదంలో బీజేపీని ఎదురించలేదు. ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థా నిర్మాణంతోనే దానిని ఎదురించగలుగుతుంది.

నిజానికి మండల్ కమిషన్ రిపోర్టును బీసీలకు అనుసరింపచేసే విషయంలోనే జనతా పార్టీ నుండి జనసంఘ్ బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీగా ముందుకు వచ్చింది. బిందేశ్వరి ప్రసాద్ మండల్ ఛైర్మన్‌గా, ఆర్.ఆర్.భోలే, దివాన్ మోహన్ లాల్, కె. సుబ్రహ్మణ్యం, దీనబంధు సాహు సభ్యులుగా 1978 డిసెంబర్ 20న బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు నాటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ పార్లమెంటులో ప్రకటించారు. దీనబంధు సాహు ఆరోగ్య కారణాల రీత్యా 1979 నవంబర్ 5న తన పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఆర్.ఎల్.నాయక్‌ను నియమించడం జరిగింది. మండల్ కమిషన్ తన రిపోర్టును 1980 డిసెంబర్ 31న రాష్ట్రపతికి సమర్పించింది.

ఓబీసీ సంక్షేమ పథకాలకు ప్రస్తుతం కేంద్రం నుంచి ఎటువంటి సహాయం అందటం లేదు; నిధుల కొరత కారణంగా మరిన్ని పథకాలు చేపట్టలేకపోతున్నామని పలు రాష్ట్రాలు మండల్ కమిషన్ దృష్టికి తెచ్చాయి; అందువల్ల ప్రత్యేకంగా బీసీల కోసం ఉద్దేశించిన పథకాలకు ఎస్సీ, ఎస్టీ పథకాల వలెనే కేంద్రం సహాయం అందజేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మండల్ సిఫారసులను పక్కకు పెట్టాయి. జనతాదళ్ అధికారంలోకి వచ్చాక మండల్ కమిషన్ సిఫారసుల అమలు కోసం వి.పి.సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో తీసుకున్న నిర్ణయాలను అనుసరించి కేంద్ర సంయుక్త కార్యదర్శి కృష్ణాసింగ్ 1990 ఆగస్ట్ 13న మెమొరాండం జారీ చేశారు.

'అనేక తారతమ్యాలు గల మన వంటి సమాజంలో, రాజ్యాంగంలో పొందు పరచిన విధంగా సామాజిక న్యాయ సాధన త్వరగా జరగటం తప్పనిసరి. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుంటూ అప్పటి ప్రభుత్వం రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్‌ను నియమించింది. దానినే మండల్ కమిషన్ అని పిలుస్తున్నారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు కమిషన్ అభిప్రాయ పడిన విధంగా తగు ప్రయోజనాలను ప్రస్తుత సందర్భంలో ఏ విధంగా సమకూర్చాలన్న ప్రశ్నను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించింది. ఆ ప్రకారం ఆ యా తరగతులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో, ప్రభుత్వ సంస్థలలో ముందుగా కొన్ని అదనపు అవకాశాలు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చింది'. భారత ప్రభుత్వ పరిధిలో గల సివిల్ ఉద్యోగాలు, సర్వీసులలో 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన బీసీలకు 27 శాతం ఖాళీలు రిజర్వ్ అవుతాయి; ఈ రిజర్వేషన్లు నేరుగా రిక్రూట్ చేసే ఖాళీలకు వర్తిస్తాయి; ఓపెన్ పోటీలో తమ ప్రతిభ ద్వారా ఎంపికయే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన బీసీ అభ్యర్థులు 27 శాతం రిజర్వేషన్ కోటా కిందకు రారు' అని అందులో పేర్కొన్నారు.

మండల్ కమిషన్ రిపోర్టును అమలు జరుపుతామని కాంగ్రెస్ స్పష్టంగా చెప్పలేకపోతోంది. కులగణన వరకే కాంగ్రెస్ పరిమితం అయితే, ఆ రోజు తమ హక్కులను కాలరాయడానికే కొత్త పార్టీ పెట్టిన బీజేపీ వైపే బీసీలు మళ్ళీ వెళ్తారు. కానీ వారిలోని మతపరమైన నమ్మకాలను రాజకీయం చేయాలనే ఆలోచన బీజేపీకి ఉందని మనం గమనించవలసిన అవసరం వుంది. బీజేపీ పాలనా పద్ధతిని బీసీలు గుర్తించలేకపోతున్నారు. ఈ విషయాన్ని తెలియ జెప్పటంలో కూడా కాంగ్రెస్, దళిత బహుజన పార్టీలు వెనుకబడి ఉన్నాయి.

మండల్ కమిషన్ సిఫారసులను, వాటి అమలును వ్యతిరేకిస్తూ అనేక కేసులు దాఖలైనాయి. 1993లో సుప్రీంకోర్టు మండల్ ప్రతిపాదించిన బీసీ రిజర్వేషన్లను సమర్థిస్తూ బీసీ కులాలను గుర్తించడానికి శాశ్వతంగా జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో కమిషన్‌లను ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. అప్పటికి పి.వి. నరసింహారావు ప్రధానమంత్రి. అందువల్ల పి.వి. హయాంలో మండల్ కమిషన్ సిఫారసుల్లో ఒకటైన ఉద్యోగ రంగంలో 27 శాతం రిజర్వేషన్ అమలు కోసం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. రాజకీయ, సామాజిక, పారిశ్రామిక తదితర సమస్త రంగాల్లో బీసీ రిజర్వేషన్లను అమలు జరపాల్సే ఉంది.

హరియాణాలో జాట్లంతా హస్తం పార్టీ వైపు ఉన్నారన్న ప్రచారం పూర్తిస్థాయిలో నిజం కాదు. అయినా జాట్లకు వ్యతిరేకంగా ఉన్న కులాల్లో అత్యధికులు తమ పార్టీ వైపు మొగ్గు చూపేలా కమలం పార్టీ చేసుకోగలిగింది. కాంగ్రెస్ అగ్రనేతలు హుడా, సెల్జా మధ్య విభేదాలు బహిరంగంగానే బయట పడటం, సెల్జాను పక్కన పెట్టడం కొన్ని తరగతుల ప్రతినిధులను దూరం చేశాయి. కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడంతో 'ఆప్' ఒంటరిగా పోటీ చేయడం; స్థానికంగా ఉంటున్న జేజేపీ, దళితుల మద్దతున్న భీమ్ ఆర్మీ పార్టీతోనూ; ఐఎన్‌ఎల్‌డీ బీఎస్పీతోనూ పొత్తు పెట్టుకోవడం కూడా ఓట్ల చీలికకు దారి తీసింది.

నిజానికి కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తున్న ఉచితాలు కూడా బడ్జెట్లకు అతీతంగా ఉంటున్నాయి. ప్రజలను సోమరులను చేసే పథకాల కంటే కూడా ప్రజలను ఉత్పత్తిలో భాగం చేసి శ్రమ ద్వారా ధనం సంపాదించే ప్రణాళికలు ముఖ్యం. మాయావతి ఉత్తరప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ అభివృద్ధికి, దళిత బహుజనుల ఆర్థిక సామాజికాభివృద్ధికి, మైనారిటీ సంక్షేమానికి, లా అండ్ ఆర్డర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. నిజానికి కాన్షీరాం బీసీలను, దళితులను ఐక్యం చేసే రాజకీయ వ్యూహాలు రచించారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా బహుజనుల రాజ్యాధికారమే రావాల్సి ఉంది.

ఇకపోతే జమ్ము కశ్మీర్‌లో ఇండియా కూటమి విజయపతాకం ఎగురవేయడం ఒక చారిత్రక అంశం. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఆర్టికల్ 370ని బీజేపీ రద్దు చేసిన దానికి ఫలితంగా ప్రజలు ప్రతీకారం తీర్చుకున్నారు. నిజానికి హిందూ రాజకీయాలు లౌకికవాదానికి గొడ్డలిపెట్టు. ఉత్పత్తిని, ఉపాధిని, శ్రమ సంస్కృతిని, మానవ జీవన వ్యవస్థల ప్రజ్వలనాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్ళే రాజకీయ ప్రణాళిక ఇప్పుడు అవసరం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మూక వెర్రి



నీషే జయంతి (1844, అక్టోబర్ 15) సందర్భంగా ఎన్నటికీ నిలిచే, నేటికీ వర్తించే ఆయన మాటల్ని గుర్తు చేసుకుందాం: 'వ్యక్తుల్లో వెర్రి అనేది అరుదు; కానీ గుంపులు, పార్టీలు, దేశాలు, కాలాల్లో అదొక నియమం'.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

కెనడాలో పాములు



పాకిస్తాన్‌కు అమెరికా విదేశాంగ మాజీ మంత్రి హిల్లరీ క్లింటన్ (తీవ్ర వాదుల విషయంలో) చెప్పింది కెనడాకు కూడా వర్తిస్తుంది: 'మీ పెరట్లో పాములను ఉంచి, అవి కేవలం మీ పొరుగును మాత్రమే కాటేస్తాయనుకోవద్దు. ఆ పాములు మిమ్మల్ని కూడా కాటేస్తాయి.'

– అమీష్ త్రిపాఠి, రచయిత

యుద్ధం ఆగాలి!



నేను యుద్ధ విరమణను కోరుకుంటున్నాను. ఎందుకంటే – హమాస్, ఇజ్రాయెల్ ప్రభుత్వం, హెజ్బొల్లా ఇంకా శక్తిమంతంగా ఉండి నియంత్రించగలుగుతున్నందుకు కాదు; రక్తపాతం అనేది వాటిని మరింత బలోపేతం చేస్తుందే తప్ప బలహీనం చేయదు కాబట్టి!

– హమ్జే అవవ్దే, పాలస్తీనా యాక్టివిస్ట్

ఆంక్షలకు స్వాగతం



ఉక్రెయిన్‌ను దురాక్రమిస్తున్న రష్యాకు ఇరాన్ ప్రభుత్వ మద్దతు ఆమోదయోగ్యం కాదు, వెంటనే ఆగాలి. రష్యాకు ఇరాన్ డ్రోన్లు, క్షిపణుల బట్వాడాకు స్పందనగా వ్యక్తులు, సంస్థలకు వ్యతిరేకంగా ఆంక్షల తీర్మానాన్ని నేను స్వాగతిస్తున్నాను. మరింత చేయాల్సి ఉంది.

– ఉర్సులా వాన్ డెర్ లెయెన్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు


సాధనకు అతీతంగా...



మీరు నియంత్రించనప్పుడు ఏది నియంత్రిస్తున్నదో అర్థం చేసుకోవడానికి శ్వాస అనేది ముఖ్యమైన లింక్. మీరు దానిమీద శ్రద్ధ పెట్టినప్పుడు, నెమ్మదిగా ఆ శ్వాసను ఏది కదిలిస్తున్నదో దానిమీదికి మళ్లుతుంది. అది మీరు కనుక్కుంటే, ఇంక మీరు ఏ సాధనా చేయనవసరం లేదు.

– శ్రీ ఎం., ఆధ్యాత్మిక గురువు

నిర్మాణ కౌశలం



ఇటీవల నాకు యూరప్, ఆసియా ఖండాలను కలిపే ఇస్తాంబుల్ నగరాన్ని దర్శించే అవకాశం వచ్చింది. అక్కడి చారిత్రక ప్రదేశాలైన హయియా సోఫియా, తాప్‌కాపీ రాజభవనం, డోల్మాబాచీ రాజభవనాలను చూడటం సుసంపన్నమైన అనుభవం. ఒట్టొమాన్ సామ్రాజ్యపు ఆలోచన, నిర్మాణ దక్షతను ఇవి ప్రతిఫలిస్తాయి.

– హర్ష్ మరీవాలా, పారిశ్రామికవేత్త

నవ యుగానికి నాంది



ఇది దాదాపుగా ఎంత అసాధ్యమైనదో వర్ణించడానికి సరిపోయే శక్తిమంతమైన మాటలు లేవు. బహుశా మొదటిసారి విద్యుచ్ఛక్తిని ఉపయోగంలోకి తేవడంతో సమానమైనది. ఇది మానవాళి నూతన ప్రారంభం. మనం మానవాళి నూతన ప్రారంభపు కాలరేఖ మీద నిలబడివున్నాం. (పడిపోతున్న రాకెట్ బూస్టర్‌ను 'స్పేస్ ఎక్స్' కంపెనీ విజయవంతంగా పట్టుకున్న ఘనతపై! దాన్ని మళ్లీ వినియోగించవచ్చు.)

– విలియమ్ పన్‌టనో, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

నవతరానికి ప్రేరణ

ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్. ఆయన జీవితం నేటి నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. భారత రక్షణ వ్యవస్థ తన కాళ్లపై తాను నిలబడడానికి ఆయన చేసిన కృషి అమూల్యం. ముఖ్యంగా క్షిపణులను తయారు చేయడంలో సొంత టెక్నాలజీని అభివృద్ధి చేసి 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఆయన పేరుగాంచారు.

ఆయన పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలామ్. తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం దగ్గర ఉన్న ధనుష్కోటిలో పుట్టారు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన పట్టుదల, క్రమశిక్షణ, జ్ఞాన జిజ్ఞాసతో ఇంజనీరుగా, శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా తన సేవలను ఈ జాతికి అందించారు. శాస్త్ర రంగంలో విశేష కృషి చేసినందుకు గాను పద్మభూషణ్, పద్మ విభూషణ్‌తో పాటు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్ననూ పొందారు. 1950లో ఇంటర్మీడియట్ పరీక్షకు చదవడానికి తిరుచినాపల్లిలోని సెంట్ జోసెఫ్ కాలేజీలో చేరారు. అబ్దుల్ కలాం అన్నయ్య ముస్తఫాకు ఒక కిరాణా దుకాణం ఉండేది. ఆ దుకాణంలో ఉండి చదువుకుంటూ దుకాణాన్ని చూస్తుండేవారు కలాం. ఇంటర్మీడియట్ పూర్తి అయిన తర్వాత దక్షిణ భారత దేశంలో సాంకేతిక విద్యకు తల మానికం లాంటి మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రవేశానికి దరఖాస్తు చేశారు. ప్రవేశానికి ఎంపిక అయితే అయ్యారు. కానీ చదవడానికి డబ్బే ఆయన తండ్రి దగ్గర లేదు. అప్పుడు ఆయన సోదరి జోహార తనకు తోడుగా నిలబడ్డారు. తన బంగారు గాజులు, గొలుసు కుదువ పెట్టి ఆమె ఆయనకు సహాయం చేసింది. 'నేను చదువుకోవాలన్న ఆమె ఆకాంక్ష, నా సామర్థ్యంపై ఆమె నమ్మకం గాఢంగా నన్ను చలింప చేశాయి' అని ఆయన ఆ తర్వాత చెబుతూ ఉండేవారు. కలాం రామేశ్వరం నుండి భారత రాష్ట్రపతిగా ఎదిగిన తీరును ప్రతి యువతా తెలుసుకుని స్ఫూర్తి పొందాలి.



డా॥ ఏపీజే అబ్దుల్ కలామ్

– దేవులపల్లి రమేశ్, సిద్దిపేట
(నేడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి)

నానాటికీ నీరసిస్తున్న ఐక్యరాజ్యసమితి

అభిప్రాయం



వి.వి. రమణ

ఇటీవల పరిణామాలను చూస్తే ఎవరికైనా ఐక్యరాజ్యసమితి ఉత్సవ విగ్రహంగా మారుతోందనే అభిప్రాయం కలుగక మానదు. యుద్ధ జ్వాలల నుంచి తమను తాము కాపాడుకోవడానికి, శాంతి యుత ప్రపంచ స్థాపనకు మానవులలో ఉన్న అకుంఠిత ఆశయాలే ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థ స్థాపనకు దారి తీశాయి.

మొదటి ప్రపంచ యుద్ధం ముగియడంతో 'నానాజాతి సమితి'ని ఏర్పాటు చేసి ప్రపంచ శాంతిని పరిరక్షించే బాధ్యతను దానికి కట్టబెట్టాయి పెద్ద రాజ్యాలు. ఈ సమితి ఎన్నో రకాల శాంతి మార్గాలను సూచిస్తూ అందులో ముఖ్యమైనదిగా... నిరాయుధీకరణను సూచించింది. దానిని పెడచెవిన పెట్టిన ప్రపంచ దేశాలు ఆయుధాలను సమీకరించుకొని ఆధిపత్య పోరు మొదలు పెట్టి, రెండవ ప్రపంచ యుద్ధం ముంగిట మానవాళి మరోసారి నిలబడేలా చేశాయి.

యుద్ధం ముగిసిన వెంటనే నానాజాతి వైఫల్యం వల్లనే రెండో ప్రపంచ యుద్ధం జరిగిందని భావించి... దాని స్థానంలో ఐక్యరాజ్య సమితిని ఏర్పాటు చేశాయి ప్రపంచ దేశాలు. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే... మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల ముందు ఆ యా దేశాలు యుద్ధం రాబోతుందని గ్రహించి శాంతి సభలు నిర్వహించడం, చర్చలు జరపటం జరిపాయి. సంధులు చేసుకున్నాయి. అయినా ప్రపంచ యుద్ధాలు ఆగలేదు. ఇప్పుడు ఐరాసలో సభ్యులుగా 193 దేశాలు ఉన్నాయి. ఇందులో వీటో అధికారం ఉన్న 5 అగ్ర రాజ్యాలు ఉన్నాయి. 25 రకాలుగా పనిచేసే వివిధ రకాల సంస్థలు, అంతర్జాతీయ న్యాయస్థానం ఐరాస కింద పని చేస్తున్నాయి. అయినా కూడా రగిలిపోతున్న యుద్ధాలను ఆపలేకపోవడం బాధాకరం.

అలా అని ఐరాస సాధించిన విజయాలు లేవని కాదు. రష్యా–ఇరాన్ , ఫ్రాన్స్– సిరియా–లెబనాన్, ఇండోనేషియా సమస్య, ఈజిప్ట్ అంశం, చెకోస్లావేకియా అంశం... ఇలా ఐరాస మధ్యవర్తిత్వంలో శాంతి ఒప్పందాల ద్వారా సమస్యలను పరిష్కరించుకున్న ఉదంతాలు చాలానే ఉన్నాయి. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు వివిధ రకాల సాయం అందడానికీ ఐరాస ఎంతగానో కృషి చేస్తోంది.



ఎన్ని విజయాలు సాధించినప్పటికీ ఐక్యరాజ్య సమితి అగ్రరాజ్యాల జోలికి రానంతవరకే సంస్థకు గౌరవం దక్కుతోంది. ఆ మేరకే దానికి ఆర్థిక వనరులు అందుతున్నాయి. అంతర్జాతీయ శాంతికి అడ్డంకిగా మారిన అణ్వాయుధాల తయారీ, వినియోగానికి అగ్ర రాజ్యాలు స్వస్తి పలకవలసిందిగా యూఎన్‌ఓ విజ్ఞప్తి చేసినప్పటికీ అవి పెడచెవిన పెడుతున్నాయి. పైగా ప్రస్తుత తరుణంలో అగ్ర రాజ్యాల షాడో దేశాల మధ్య యుద్ధం మొదలై ఆయుధ గోడౌన్ల తలుపులు తెరుచుకుంటున్నాయి. అగ్ర రాజ్యాల ప్రోద్బలంతోనే ఇవి బరిలో దిగినప్పుడు ఇంకా ఐరాస మాట వినే పరిస్థితి లేదనిపించక మానదు.

ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ అయిన ఆంటోనియో గుటెరస్‌ను తమ దేశంలోకి రాకుండా బహిష్కరిస్తున్నాం అంటున్న ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యమైన అమెరికా, బ్రిటన్లు మద్దతుగా ఉన్న విషయం తెలిసిందే. గాజాను పూర్తిగా నేలమట్టం చేసి, లెబనాన్‌ను పావు వంతు ఆక్రమించి, ఇరాన్‌పై పూర్తిస్థాయిలో యుద్ధానికి సిద్ధం అవుతున్న ఇజ్రాయిల్‌ను అగ్రరాజ్యాలు నిలువరించలేకపోతున్నాయి. ఓ పక్క ఇజ్రాయెల్‌పై దాడి చేస్తూనే అరబ్ దేశాలను ఏకం చేయడానికి ఇరాన్ ముమ్మర ప్రయత్నాలు చేస్తుంటే ఐరాస ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సి వస్తోంది. అంతేకాకుండా ఉక్రెయిన్ విషయంలో కూడా అగ్రరాజ్యాలు గ్రూపులుగా సంఘటితమవుతూ ఉంటే ఐరాస ఏమి చేయలేక చూస్తూ ఉండిపోతోంది. ఈ పరిస్థితులను చూస్తుంటే ఏ ఆశయాలతో అయితే ఐక్యరాజ్య సమితిని స్థాపించారో... వాటిని సాధించలేని స్థితికి ఐరాస చేరుకుందని చెప్పక తప్పదు.

వ్యాసకర్త ఉపాధ్యాయులు | 89198 62019

తపస్సు

మన పురాణ గాథలలో ఎందరో ఋషులు, మునులు తపస్సు చేసి దైవ దర్శనం పొందిన వారున్నారు. ఇంకా ఎందరో దేవతలు, రాక్షసులు, రాజులు తాము అనుకున్నవి సాధించటానికి వేల సంవత్సరాలు తపస్సు చేసి దైవాన్ని దర్శించి, కోరుకున్న వరాలు పొందారు. తపస్సు అంటే చంచలమైన మనస్సును నియంత్రిస్తూ, దైవం మీద లగ్నం చేస్తూ ఏకాగ్రతతో ఆధ్యాత్మికంగా చేసే ధ్యానం. ఒక కార్య సాధన కోసం కాని, దైవ దర్శనం కోసం కాని అనుక్షణం తపిస్తూ అందులోనే లీనమవటం తపస్సు. తపనే తపస్సు. ఇది అపవిత్రమైన మనసుని శుద్ధి చేస్తుంది. రాగ ద్వేషాలను పోగొట్టి వైరాగ్యాన్ని పెంపొందిస్తుంది. తపస్సు కంత శక్తి ఉంది. తపస్సు గురించి శ్రీకృష్ణుడు భగవద్గీతలో విశదంగా చెప్పాడు.



తపస్సు మూడు విధాలు. అవి శారీరక, వాచిక, మానసిక తపస్సులు. దేవతలను, గురువులను, పండితులను పూజించటం; శుచిత్వం, కపటం లేని ప్రవర్తన అహింసలను ఆచరించటం శారీరక తపస్సు. అయితే, శరీరంతో శ్రమ చేసి ప్రజలకు సేవ చేయటం కూడా శారీరక తపస్సే. పేరు కోసమో, కీర్తి కోసమో కాక భగవంతుని మీద పరిపూర్ణ విశ్వాసంతో ప్రతిఫలాపేక్ష లేకుండా సత్య సంధతతో, నిర్మలమైన మనస్సుతో భగవదంకితంగా చేసే మానవ సేవ శారీరక తపస్సే అవుతుంది.

ఇతరులను బాధించకుండా సత్యం, ప్రియం, హితం అయిన మాటలు మాట్లాడుతూ వేదాధ్యయనం చేయటం వాచికమైన తపస్సు. దీనికి ఫలితం లోకమంతా స్నేహితులే! ప్రసన్నమైన మనస్సు, మంచితనం, మౌనం, మనోనిగ్రహం కలిగి వుండటం మానసిక తపస్సు. జీవితంలోని అన్ని పరిస్థితుల్లోను ప్రశాంతమైన మనసుతో సమతుల్యంగా వ్యవహరించటం, మంచిగా ఉంటూ మంచిని పెంచటం, మనసుని ఎప్పుడూ నిర్మలంగా ఉంచుకోవటం మానసిక తపస్సు. ఈ మూడు రకాల తపస్సులను శ్రద్ధతో, ఏ ప్రతిఫలమూ ఆశించకుండా చేస్తే అదే సాత్వికమైన తపస్సు అవుతుందని శ్రీకృష్ణుడు చెప్పాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...



సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులను కలిసి తమ కుమార్తె వివాహానికి ఆహ్వానిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్ కుమార్ దంపతులు

కేటీఆర్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ

- ఈనెల 18న వాంగ్మూలం ఇవ్వనున్న కేటీఆర్

సిటీ కోర్టులు (హైదరాబాద్): మంత్రి కొండా సురేఖపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ సోమవారం నాంపల్లి కోర్టులో జరిగింది. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉండి ఆమె స్థాయిని మరిచి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని, తన ప్రతిష్ఠ దెబ్బతినేలా మాట్లాడారని కేటీఆర్ నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి ఆధారాలు లేకుండా దురుద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేసిన మంత్రిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై సోమవారం మేజిస్ట్రేట్ ఎస్.శ్రీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ కేటీఆర్‌తోపాటు సాక్షులు (తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్) ఈనెల 18న కోర్టుకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలంటూ విచారణను వాయిదా వేశారు. కోర్టు ఆదేశాల మేరకు కేటీఆర్‌తోపాటు సాక్షులు కోర్టుకి వచ్చి తమ వాంగ్మూలాలను ఇస్తారని వారి తరపు న్యాయవాది తెలిపారు.

అభిషేక్ బోయినపల్లికి బెయిల్ మంజూరు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులో అభిషేక్ బోయినపల్లికి ఊరట లభించింది. సోమవారం అభిషేక్‌కు సుప్రీంకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ఈ ఏడాది మార్చి 6న మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు అప్పటినుంచి మధ్యంతర బెయిల్‌ను పొడిగిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. 2023 జూలై 3న అభిషేక్ బోయినపల్లి బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో.. ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. ఈ వ్యవహారంలో తాను ధర్మాసనం ముందు ఉంచాల్సిన విషయం ఏదీ లేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. దీంతో ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో సహ నిందితులందరికీ బెయిల్ మంజూరు చేసినందున అభిషేక్ బోయినపల్లికి కూడా బెయిల్ మంజూరు చేసేందుకు తాము మొగ్గు చూపుతున్నామని ధర్మాసనం పేర్కొంది. బోయిన్‌పల్లి తరపున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి, న్యాయవాదులు సుమేర్‌సింగ్ బొపరాయ్, సిద్ధార్థ్ సరస్వత్, రూబీ సింగ్ అహూజా, ఇషాన్ గౌర్, ఆకృతి వోహ్రా బృందం వాదనలు వినిపించింది.

జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

రంగారెడ్డి కోర్టులు: నృత్య దర్శకుడు జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌ను రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీశ తిరస్కరించారు. లైంగిక వేధింపులకు సంబంధించిన అభియోగాలపై గత నెల రోజులుగా చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీగా ఉన్న జానీ మాస్టర్, కోర్టులో సాధారణ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా ఇరువైపుల వాదనలు విన్న కోర్టు సోమవారం పోలీసుల వాదనలతో ఏకీభవిస్తూ జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

పిడుగు పడి యువతి మృతి

- మరో మహిళకు తీవ్ర గాయాలు



నడిగూడెం: చేనులో పత్తి తీసేందుకు వెళ్లిన యువతి పిడుగు పడి మృతిచెందింది. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం బృందావనపురం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బృందావనపురం గ్రామానికి చెందిన మామిడి రమణ (24) సోమవారం గ్రామ సమీపంలోని తన చిన్నత్త పద్మకు చెందిన చేనులో పత్తి తీసేందుకు వెళ్లింది. మధ్యాహ్నం రమణతో పాటు ఆమె చిన్నత్త పద్మ కలిసి భోజనం తినేందుకు పక్కనే ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో చెట్టుపై పిడుగు పడింది. దీంతో రమణ అక్కడికక్కడే మృతి చెందగా, పద్మకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల రైతులు గమనించి 108 వాహనంలో వారిని నడిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పద్మకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు కన్నీటి వీడ్కోలు

- నివాళులు అర్పించిన వివిధ రంగాల ప్రముఖులు
- అమరవీరుల స్తూపం వద్దకు ప్రొఫెసర్ మృతదేహం
- అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు.. గన్‌పార్కు వద్ద ఉద్రిక్తత
- సాయిబాబా మరణం ప్రభుత్వ హత్యేనని పలువురు ప్రముఖుల ఆరోపణ
- పరిశోధనల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి మృతదేహం అప్పగింత







సాయిబాబా భౌతికకాయం వద్ద రోదిస్తున్న భార్య, కుమార్తె • నివాళులర్పిస్తున్న కేటీఆర్ • ప్రొఫెసర్ సాయిబాబా భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న దృశ్యం

మల్కాజిగిరి/ నాంపల్లి/ గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): పౌర హక్కుల నేత, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా(56)కు కుటుంబ సభ్యులు, అభిమానులు, పౌర హక్కుల నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని మౌలాలి జవహర్‌నగర్‌లో ఉన్న నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో నేతలు, అభిమానులు చేరుకుని సాయిబాబాకు నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ మెడికల్ కాలేజీ వరకు ఆయన అంతిమయాత్ర నిర్వహించారు.

అమరవీరుల స్తూపం వద్ద ఉద్రిక్తత

అంతిమయాత్రలో భాగంగా ప్రొఫెసర్ సాయిబాబా (56) భౌతికకాయాన్ని అసెంబ్లీ ఎదుట గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు తీసుకువచ్చారు. అంబులెన్స్ నుంచి బాడీ ఫ్రీజర్‌ను కిందికి దింపి, స్తూపం వద్దకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. స్తూపం వద్ద ఐదు నిమిషాల పాటు ఉంచి సంతాపం తెలియజేస్తామని పౌర హక్కుల నేతలు కోరినా పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. అభిమానులు, పౌర హక్కుల నేతలు 'కామ్రేడ్ సాయిబాబా అమర్‌రహే.. లాల్ సలాం.. ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. బాడీ ఫ్రీజర్ మూతను తెరిచి స్తూపానికి చూపించారు. అనంతరం తిరిగి ర్యాలీగా గాంధీ మెడికల్ కాలేజీకి భౌతికకాయాన్ని తరలించారు.

వైద్య పరిశోధనల కోసం అందజేసి..

సాయిబాబా చివరికోరిక మేరకు ఆయన కుటుంబ సభ్యులు భౌతికకాయాన్ని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. వైద్య విద్యార్థుల పరిశోధన, ప్రయోగాల కోసం భౌతికకాయాన్ని అనాటమీ విభాగంలో భద్రపర్చినట్లు గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు.

నివాళులు అర్పించిన ప్రముఖులు

మౌలాలిలోని నివాసంలో సాయిబాబా భౌతికకాయం వద్ద మాజీ ఎంపీలు కేశవరావు, మధుయాష్కీ, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు కోదండరాం, దేశపతి శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ప్రొఫెసర్లు హరగోపాల్, కాశీం, విజయన్, విమలక్క, పీవోడబ్ల్యూ సంధ్య, మాజీ సంపాదకుడు రామచంద్రమూర్తి, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ నేతలు, మానవ హక్కులు, పౌర హక్కుల సంఘాల నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులు అర్పించారు. కాగా.. సాయిబాబా భౌతికకాయం వద్ద నివాళులు అర్పించడానికి మాజీ మంత్రి కేటీఆర్ వచ్చిన సమయంలో.. సాయిబాబా సానుభూతిపరులు నిరసన వ్యక్తం చేశారు. గత పదేళ్ల పాలనలో ఏనాడూ సాయిబాబా అక్రమ అరెస్ట్‌పై మాట్లాడనివారు ఆయనకు నివాళులు అర్పించడానికి రావడం విడ్డూరమని విమర్శించారు.

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే..

సాయిబాబా మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని పలువురు ప్రముఖులు, పౌర హక్కుల నేతలు ఆరోపించారు. నాగ్‌పూర్ అండా జైల్లో పదేళ్లు ఉంచి చిత్రహింసలు పెట్టారని మండిపడ్డారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఆపరేషన్ కగార్ వ్యతిరేక పోరాటం పాలకులకు నచ్చలేదని.. రాజ్యాంగాన్ని రక్షించి, ప్రజలకు న్యాయం అందించాల్సిన కోర్టులు సైతం సాయిబాబా విషయంలో భిన్నంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఏకతాటిపై ఉండి సాయిబాబా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని.. ఆయనకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు.

సాయిబాబాను సర్కారే హత్య చేసింది

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ విశ్వవిద్యాలయ మాజీ ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా మరణించలేదని, ఆయన్ను సర్కారే హత్య చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. సాయిబాబా నిర్దోషి అని తేల్చిన న్యాయస్థానం.. ఆయన్ను అకారణంగా పదేళ్ల పాటు జైలులో మగ్గేలా చేసిన దోషులు ఎవరో కూడా తేల్చాలని కోరారు. సోమవారం ఆయన సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. సాయిబాబాకు జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సీపీఐ తరపున రాసిన లేఖను మీడియా సమావేశంలో విడుదల చేశారు. దాదాపు 90 శాతం అంగవైకల్యంతో ఉన్న సాయిబాబాను పదేళ్లపాటు అక్రమంగా నిర్బంధించి అతిక్రూరంగా హింసించిన కేంద్ర ప్రభుత్వంతోపాటు, కనీసం బెయిల్ కూడా ఇవ్వకుండా పూర్తి పక్షపాత ధోరణితో వ్యవహరించిన న్యాయవ్యవస్థ రెండూ ముద్దాయిలేనని నారాయణ అన్నారు. హోంమంత్రి అమిత్‌షా 2026 నాటికి అర్బన్ నక్సలైట్లను ఏరివేయాలని అన్ని రాష్ట్రాల సీఎంల సమావేశంలో సూచించడాన్ని నారాయణ ఖండించారు. కమ్యూనిజాన్ని అంతం చేయడం నాడు హిట్లర్ వల్లే కాలేదన్నారు.

భూమి రికార్డులు తారుమారు చేశారు

- కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న రైతు పరశురాముడిని వారిస్తున్న పోలీసులు

గద్వాల: తన సొంత భూమిని కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా రికార్డులు తారుమారు చేసి వారిపేర్లపై మార్చుకున్నారని దీనిపై పలుమార్లు కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం చేయడం లేదంటూ ఓ రైతు కలెక్టరేట్ వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత రైతు కథనం మేరకు.. అయిజ మండలం యాపదిన్నెకు చెందిన రైతు పరశురాముడు తండ్రికి గతంలో ప్రభుత్వం 5 ఎకరాల భూమిని ఇచ్చింది. తన తండ్రి నుంచి తనకు వారసత్వంగా సంక్రమించాల్సిన భూమిని తమ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా రికార్డులు తారుమారు చేసి వాళ్ల పేర్లపై మార్పు చేసు కున్నారని, దీనిపై గతంలో కలెక్టర్, అయిజ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానని, అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకుని పురుగుల మందు డబ్బాను లాగేసుకున్నారు. అధికారులు తనకు న్యాయం చేయకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని పరశురాముడు వాపోయారు.

తేలని సన్నాల 'ఔటర్న్' లెక్క!

- త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు
- క్వింటాలు సన్న ధాన్యానికి బియ్యం 67 కిలోలు కాదు 60 కిలోలే అని మిల్లర్ల మెలిక

సాక్షి, హైదరాబాద్: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించేందుకు ఒకవైపు పౌరసరఫరాల సంస్థ ఏర్పాట్లు చేస్తుండగా... సన్న ధాన్యాన్ని సీఎంఆర్ చేస్తే వచ్చే బియ్యం (ఔటర్న్)పై స్పష్టత ఇవ్వాలని మిల్లర్లు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. వచ్చే జనవరి నుంచి రేషన్ దుకాణాలకు సన్న బియ్యం సరఫరా చేసి కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉంది. సన్నాలు పండించే రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో రాష్ట్రంలో ఖరీఫ్‌లో సన్నాల సాగు పెద్దఎత్తున సాగినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 60.80 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, అందులో 60 శాతానికిపైగా సన్నాలనే సాగుచేశారు. మొత్తం ఖరీఫ్ దిగుబడి 146 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్ఎంటీ)గా భావిస్తున్నప్పటికీ, కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం మాత్రం 91 ఎల్ఎంటీలే ఉంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేస్తోంది. ఇందులో సన్న ధాన్యమే 47-50 ఎల్ఎంటీలు ఉండొచ్చని భావిస్తోంది. ఇక్కడే అసలు సమస్య ఎదురవుతోంది. 50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లింగ్ చేసి ఇవ్వడం తమకు తలకు మించిన భారమని మిల్లర్ల అసోసియేషన్ ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో తేల్చి చెప్పింది. ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు క్వింటాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 67 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, రాష్ట్రంలో పండే సన్నాలను మి ల్లింగ్ చేస్తే 67 కేజీ బియ్యం రావని, టెస్ట్ మిల్లింగ్ చేసి ఔట ర్న్‌ను 60 కిలోలకు తగ్గించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తోంది.

చక్రం తిప్పుతున్న నాయకుడు

రబీ పంటను ముడి బియ్యంగా మిల్లింగ్ చేస్తే బియ్యం కొనలు విరిగి, నూకలు వస్తాయని ఇప్పటి వరకు చెబుతూ వచ్చిన మిల్లర్లు.. తాజాగా ఖరీఫ్ ధాన్యానికి వంకలు పెట్టడంపై చర్చ జరుగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎఫ్‌సీఐ నిబంధనలు మార్పించి లబ్ధిపొందే యోచనలో ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో సన్నధాన్యాన్ని భారీస్థాయిలో పండించడం వల్ల నేరుగా రైతుల నుంచి అడ్డగోలు ధరలకు కొనుగోలు చేసే అవకాశం లేకుండా ప్రభుత్వమే రూ.500 బోనస్‌గా ఇస్తుండటంతో సూపర్ ఫైన్ రకాలు మినహా సన్న ధాన్యం 80 శాతం వరకు కొనుగోలు కేంద్రాలకే వచ్చే అవకాశం ఉంది. ఈ ధాన్యాన్ని వెంటనే మిల్లింగ్ చేసి, రెండు నెలల్లోగా ప్రభుత్వానికి అప్పగిస్తే జనవరి నుంచి ఇచ్చే సన్నబియ్యం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగదు. ఈ నేపథ్యంలో మిల్లర్లు తమ ప్రయోజనాల కోసమే ఔటర్న్‌పై ఒత్తిడి పెంచుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రైస్‌మిల్లర్ల సంఘం నాయకుడొకరు ఈమేరకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. బ్యాంక్ గ్యారంటీల నుంచి మిన హాయింపు, ధాన్యం తేమ శాతాన్ని 17 నుంచి 14 శాతానికి తగ్గించడం వంటి అంశాలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టి తాము చెప్పిందే నడిచేలా చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. కాగా, ఖరీఫ్ సీజన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన 7,185 కొనుగోలు కేంద్రాలకుగాను సన్న, దొడ్డు రకం ధాన్యాల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్ణయించిన కేంద్రాల్లో విడివిడిగా ఏర్పాట్లు ఉంటాయి.

మంత్రాల నెపంతో ఒకరిపై దాడి

- నలుగురిపై కేసు నమోదు



దాడిలో గాయపడిన సాయిలు

కామారెడ్డి క్రైం: పాత కక్షలతో పాటు మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన గడ్డమీది సాయిలు బల్దియాలోని శానిటేషన్ విభాగంలో కార్మికునిగా పని చేస్తున్నాడు. మంత్రాలు చేస్తున్నాడని పలుసార్లు గ్రామంలోని కొందరితో గతంలో గొడవలు జరిగాయి. దీంతో సాయిలు తన కుటుంబంతో కలిసి ఇటీవల కామారెడ్డిలో నివాసం ఉంటున్నాడు. గ్రామంలోని తన ఇంట్లో ఉన్న డ్రమ్మును తెచ్చుకునేందుకు ఆదివారం అడ్లూర్‌కు వెళ్లాడు. మళ్లీ మంత్రాలు చేస్తున్నాడని అనుమానిస్తూ ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సాయిలు ఇంటిపై కొందరు దాడికి దిగారు. కర్రలతో కొట్టడంతో సాయిలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. గాయపడిన సాయిలును జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన గడ్డమీది శేఖర్, స్వామి, లక్ష్మణ్ కర్రలతో దాడి చేశారని బాధితుడు వాపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

'జర్నలిస్టులపై ట్రోలింగ్‌కు ఆధారాలు లేవు'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో జర్నలిస్టు లపై ఆన్‌లైన్‌లో ట్రోలింగ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) స్పష్టం చేసింది. తెలంగాణలో జర్నలిస్టులను అవమానించేలా ట్రోలింగ్‌కు, బెదిరింపులకు పాల్పడు తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షు డు ఎం.పద్మనాభరెడ్డి డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జర్నలిస్టులపై, ప్రత్యేకించి మహిళా జర్నలిస్టులపై ఆన్‌లైన్ ట్రోలింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ఒక కమిటీ వేసి దర్యాప్తు చేయించాలని కోరారు. దీనిపై స్పందించిన టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. పిటిషనర్ తగిన ఆధారాలు సమర్పించలేదని, అనుమానితుల వివరాలు ఇస్తే బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వేములవాడ రాజన్నకు నివేదన ఆలస్యం!

- మంత్రి సురేఖ ఆలయ సందర్శనలో వివాదం
- అధికారుల అత్యుత్సాహమే కారణమని భక్తుల ఆగ్రహం
- ఎలాంటి జాప్యం లేదంటున్న అధికారులు



స్వామి వారికి నైవేద్యం తీసుకెళ్తున్న అర్చకులు

వేములవాడ అర్బన్: రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వేములవాడ పర్యటన నేపథ్యంలో అధికారుల అత్యుత్సాహం వల్ల రాజన్నకు సమర్పించే మహానివేదన అరగంట జాప్యమైందంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఎలాంటి జాప్యం లేకుండానే నివేదన సమర్పించామని చెబుతున్నారు. వివరాలు.. దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్నకు ప్రతీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నివేదన నిర్వహిస్తుంటారు. ఏకాదశి రోజున ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు పండ్ల పూజ, మిగతా రోజుల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు అన్నపూజ, నివేదన సమర్పిస్తుంటారు. సోమవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మంత్రి కొండా సురేఖ కుటుంబ సమేతంగా వచ్చారు. ఆలయ అతిథి గృహంలో మనవడి పుట్టు వెంట్రుకల కార్యక్రమాన్ని పూర్తిచేసుకున్న అనంతరం ఆమె స్వామివారి దర్శనానికి ఆలయానికి చేరుకున్నారు. సోమవారం స్వామివారికి మధ్యాహ్నం 3 గంటలకే నైవేద్యం, అన్నపూజ నిర్వహించాల్సి ఉంటుంది. ఆలయ అధికారులు అత్యుత్సాహంతో నైవేద్యాన్ని ఆపి మంత్రి కొండా సురేఖ దంపతులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో స్వామివారికి నివేదన అరగంట ఆలస్యంగా అంటే.. 3 గంటలకు చేయాల్సిన నివేదన 3.30 గంటలకు సమర్పించారు. ఈ విషయంపై రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా ప్రతీ సోమవారం 3 నుంచి 3.15 గంటల మధ్యలో స్వామివారికి మహానివేదన, నైవేద్యం సమర్పిస్తామని.. ఈరోజు కూడా ఎలాంటి జాప్యం జరగలేదన్నారు. సమయానికి స్వామి వారికి మహానివేదన సమర్పించినట్లు తెలిపారు.

రాజన్న ఆలయానికి బంగారు తాపడం

వేములవాడ రాజన్న ఆలయానికి బంగారం తాపడం, వెండితో పల్లకీలు, ఉత్సవ మూర్తుల తయారీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తదితరులు మంత్రితో పాటు ఉన్నారు.


సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణను ప్రశ్నించిన ఈడీ

- ఈనెల 18 వరకు ఈడీ కస్టడీకి అనుమతించిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా వెంచర్స్ ఎండీ లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు సోమవారం తొలిరోజు కస్టడీలోకి తీసుకున్నారు. సాహితీ ఇన్‌ఫ్రా వెంచర్స్ పేరుతో ప్రీలాంచ్ ఆఫర్ల అంటూ చేసిన మోసాలపై ఈడీ అధికారులు లక్ష్మీనారాయణను గత నెల 29న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు తమ కస్టడీకి ఇవ్వాలన్న ఈడీ అభ్యర్థన మేరకు లక్ష్మీనారాయణను సోమవారం నుంచి ఈనెల 18 వరకు ఈడీ కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. దీంతో ఈడీ అధికారులు ఉదయం 11 గంటలకు చంచల్‌గూడ జైలుకు వెళ్లి లక్ష్మీనారాయణను తమ కస్టడీలోకి తీసుకున్నారు. తొలి రోజు విచారణలో సాహితీ ఇన్‌ఫ్రాకు చెందిన ఫర్మ్, ఇతర డాక్యుమెంట్లు, సంస్థ ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ప్రీలాంచ్ ఆఫర్ల ద్వారా సేకరించిన డిపాజిట్స్ నుంచి దారిమళ్లిన రూ.360 కోట్లు ఎక్కడికి తరలించారు? ఎక్కడెక్కడ ఆస్తులు కొనుగోలు చేశారన్న అంశాలపై ఈడీ అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా లక్ష్మీనారాయణతో పాటు ఆయన సన్నిహితులు, బంధువులు, ఓ రాజకీయ పార్టీ నాయకుడు, ఆయన భార్యాపిల్లలు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన పలు కంపెనీల వివరాలను కూడా రాబట్టే దిశగా ఈడీ కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- 92 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 641 పనులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా
- 1323.86 కిలోమీటర్ల కొత్త రోడ్ల నిర్మాణం.. రూ.1377.66 కోట్లు మంజూరు



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ రోడ్లకు మంచిరోజులు వచ్చాయి. రాష్ట్రంలోని వివిధ గ్రామీణ ప్రాంతాల్లో 1323.86 కిలోమీటర్ల మేర చేపట్టనున్న కొత్త రోడ్ల నిర్మాణానికి రూ.1377.66 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తంగా 92 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 641 పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అవసరానికి తగ్గట్టుగా మరిన్ని పనులు చేపట్టేందుకు త్వరలోనే కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్ఆర్) కింద రూ.400 కోట్ల మేర నిధులు మంజూరుకు కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉంది. భారీవర్షాలు, వరదల కారణంగా పలుచోట్ల రోడ్లు దెబ్బతినడం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు మరమ్మతులు, ఇతర సమస్యలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా, గ్రామీణ రోడ్లకు మంత్రి సీతక్క పట్టుబట్టి నిధులు సాధించారు. నిధులు మంజూరు చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ 92 నియోజకవర్గాల్లో ఎన్ని కి.మీ చొప్పున నూతన రహదారుల నిర్మాణం, వాటికి నిధుల మంజూరుకు సంబంధించి (ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గం వేర్వేరుగా) 92 జీవోలను జారీ చేశారు. మొదటి విడతగా 92 నియోజకవర్గాల్లో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టనుండగా, సీఆర్ఆర్ కింద మిగిలిన నియోజకవర్గాలకు కూడా నూతన రహదారుల నిర్మాణం నిమిత్తం త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్టు ప్రభుత్వవర్గాల సమాచారం.

కేటాయింపులు ఇలా...

మహబూబాబాద్ నియోజకవర్గానికి అత్యధికంగా 34.30 కి.మీ పొడవున్న రోడ్ల నిర్మాణానికి రూ.35 కోట్లు, ఆందోల్‌లో 34.32 కి.మీకు రూ.25.08 కోట్లు కేటాయించారు. హుజూర్‌నగర్, ఖమ్మం, కొల్లాపూర్, మధిర, మంథని, నల్లగొండ, పాలేరు, వికారాబాద్ నియోజకవర్గాలకు రూ. 25 కోట్ల చొప్పున కేటాయించారు. 8 నియోజకవర్గాలకు రూ. 20 కోట్ల చొప్పున, ఇక మిగతా నియోజకవర్గాల్లో కొన్నింటికి రూ.15 కోట్లు, 10 కోట్లు, 5 కోట్లు కేటాయింపులు చేశారు.

భగ్గుమన్న దౌత్య బంధం

భారత్, కెనడా మధ్య 'నిజ్జర్ నిప్పు'

- నిజ్జర్ హత్య కేసులో అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ పేరు చేర్చిన కెనడా
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్
- నిరసనగా ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించిన భారత్
- కెనడా నుంచి దౌత్యాధికారులను వెనక్కి రప్పిస్తున్న భారత్



న్యూఢిల్లీ: సిక్కు వేర్పాటువాది, ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యోదంతం ఒక్కసారిగా భారత్, కెనడా దౌత్యసంబంధాల్లో మంటలు రాజేసింది. నిజ్జర్ హత్య కేసులో అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును కెనడా ప్రభుత్వం చేర్చింది. వర్మను విచారించాల్సి ఉందంటూ ఆదివారం భారత విదేశాంగ శాఖకు కెనడా సందేశం పంపింది. దీంతో భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఖలిస్తాన్ వేర్పాటువాది హత్య కేసులో తమ దౌత్యాధికారులను ఇరికించడంపై భారత సర్కార్ తీవ్రంగా స్పందించింది. కెనడా తాత్కాలిక హైకమిషనర్ స్టీవార్ట్ వీలర్‌సహా ఆరుగురు దౌత్యవేత్తలను భారత్ బహిష్కరించింది. బహిష్కరణకు గురైన వారిలో డెప్యూటీ హై కమిషనర్ ప్యాట్రిక్ హేబర్ట్, ఫస్ట్ సెక్రటరీలు మేరీ కేథరీన్ జోలీ, అయాన్ రోస్ డేవిడ్ ట్రైస్, ఆడమ్ జేమ్స్ చుప్కా, పౌలా ఓర్జులాలు ఉన్నారు. అక్టోబర్ 19వ తేదీన రాత్రి 11.59 గంటల్లోపు భారత్‌ను వీడాలని ఆదేశాలు జారీచేసింది. కెనడాలో విధులు నిర్వర్తిస్తున్న భారత దౌత్యవేత్త, దౌత్యాధికారులు, సిబ్బందిని స్వదేశానికి రప్పిస్తామని సోమవారం భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. అంతకుముందు తన నిరసన తెలిపేందుకు కెనడా దౌత్యవేత్త స్టీవర్ట్ రోస్ వీలర్‌కు భారత విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. దీంతో ఆయన సోమవారం సాయంత్రం ఢిల్లీలోని విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చి ఆ శాఖ కార్యదర్శి(తూర్పు) జైదీప్ మజుందార్‌ను కలిశారు. అనుమానితుల జాబితాలో భారత దౌత్యవేత్త పేరును చేర్చడంపై ఆయన ఎదుట భారత్ తన నిరసనను వ్యక్తంచేసింది. ఇది జరిగిన కొద్దిసేపటికే దౌత్యాధికారులను రప్పించడంపై విదేశాంగశాఖ నిర్ణయం వెలువడింది. '' కెనడాలో తీవ్రవాదం, హింసాత్మక ఘటనలు, ట్రూడో ప్రభుత్వ చర్యలు అక్కడి భారతీయ దౌత్యాధికారులను ప్రమాదంలోకి నెట్టేశాయి. ప్రస్తుత కెనడా ప్రభుత్వం వీళ్ల భద్రతకు భరోసా కల్పిస్తుందన్న నమ్మకం పోయింది. అందుకే వీళ్లందరినీ వెనక్కి రప్పించుకోవాలని భారత సర్కార్ నిర్ణయించుకుంది. సిక్కు వేర్పాటువాదానికి మద్దతు పలుకుతూ భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ట్రూడో సర్కార్ దుందుడుకు చర్యలకు దీటుగా ప్రతిస్పందించే హక్కు భారత్‌కు ఉంది'' అని విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. భారత్, కెనడా దౌత్యసంబంధాలు దారుణస్థాయికి క్షీణించడంతో కెనడాలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ పౌరులు, విద్యనభ్యసిస్తున్న లక్షలాది మంది భారతీయ విద్యార్థులపై దీని ప్రభావం పడే అవకాశం ఉంది.



భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ

ట్రూడో ఓటు బ్యాంక్ రాజకీయాలు

ఓటు బ్యాంక్ రాజకీయ లబ్ధిపొందేందుకు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రభుత్వం ఇలా తమ దౌత్యవేత్తలను అప్రతిష్టపాలు చేస్తోందని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. మీ ప్రభుత్వం నిందారోపణలు చేయడం మానుకోవాలని కెనడా దౌత్యవేత్త ఎదుట భారత్ తన నిరసన వ్యక్తంచేసింది. '' కెనడాలోని భారతీయ హై కమిషనర్, ఇతర దౌత్యవేత్తలు, అధికారులపై ఇలా నిరాధారపూరితంగా వేధించడం ఏమాత్రం ఆమోదనీయం కాదు'' అని స్పష్టంచేసింది.

ఆరోపణలకు తగ్గ ఆధారాలు ఇవ్వలేదు

'' 2023 సెప్టెంబర్‌లో ఈ ఉదంతంలో భారత ప్రమేయం ఉందంటూ ట్రూడో ఆరోపణలు చేశారు. కానీ ఆ మేరకు సాక్ష్యాధారాలను భారత ప్రభుత్వానికి అందజేయలేదు. ట్రూడో కెనడా ఓటు బ్యాంక్ రాజకీయాల్లో లబ్ధి పొందేందుకే కేసు దర్యాప్తు సమగ్రంగా జరక్కముందే వాస్తవాలు లేకుండా భారత హైకమిషనర్ వర్మకు వ్యతిరేకంగా కెనడా వ్యవహరిస్తోందన్నది సుస్పష్టం. 2018లో భారతలో పర్యటించినప్పటి నుంచే ట్రూడో భారత్‌తో ఘర్షణాత్మక వైఖరిని అవలంబిస్తున్నారు. భారత్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్న, తీవ్రవాదులతో సత్సంబంధాలున్న వ్యక్తులకు ట్రూడో మంత్రివర్గంలో చోటుదక్కింది. 2020 డిసెంబర్‌లో భారత ఎన్నికల ప్రక్రియలోనూ ట్రూడో జోక్యం చేసుకునేందుకు యత్నించారు. ట్రూడో ప్రభుత్వం పూర్తిగా ఒకే రాజకీయ పార్టీపై ఆధారపడింది. ఆ పార్టీ కేవలం భారత్‌లో సిక్కు వేర్పాటువాదాన్ని ఎగదోయడమే పనిగా పెట్టుకుంది'' అని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

విశ్వసనీయ సమాచారం ఇచ్చాం: వీలర్



భారత విదేశాంగ శాఖ కార్యాలయం నుంచి బయటికొచ్చాక కెనడా దౌత్యవేత్త స్టీవర్ట్ వీలర్ మీడియాతో మాట్లాడారు. '' భారత్ ఏవైతే ఆధారాలను అడిగిందో వాటిని కెనడా ప్రభుత్వం ఇచ్చింది. కెనడా సొంత గడ్డపై కెనడా పౌరుడి హత్యోదంతంలో భారత సర్కార్‌కు చెందిన ఏజెంట్ల పాత్రపై విశ్వసనీయ, ఖచ్చితమైన సమగ్ర ఆధారాలను భారత్‌కు కెనడా ప్రభుత్వం అందజేసింది. ఇక నిర్ణయం భారత్‌కే వదిలేస్తున్నాం. ఇరు దేశాల స్వప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భారత్ తన తదుపరి చర్యలు చేపట్టాలని ఆశిస్తున్నాం. ఈ విషయంలో సహకరించేందుకు కెనడా సిద్ధంగా ఉంది''అని వీలర్ వ్యాఖ్యానించారు.

ఏమిటీ నిజ్జర్ వివాదం?

నిజ్జర్ కెనడా కేంద్రంగా భారత వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడని గతంలోనే భారత్ కెనడా సర్కార్‌కు తెలియజేసినా ఎలాంటి స్పందనా రాలేదు. 2023 ఏడాది జూన్ 18న బ్రిటిష్ కొలంబియాలోని సర్రే నగరంలో గురుద్వారా సాహెబ్ పార్కింగ్ ప్రదేశంలో నిజ్జర్‌ను గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు కాల్చి చంపారు. అయితే ఈ కాల్పుల ఘటన వెనుక భారత నిఘా ఏజెంట్ల ప్రమేయం ఉందని కెనడా ప్రధాని ట్రూడో గత ఏడాది సెప్టెంబర్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. ట్రూడో ఆరోపణలను భారత్ ఖండించింది. ఆధారాల్లేకుండా నిందలు వేయడం తగదని గట్టిగా హెచ్చరించింది. హత్యకు సంబంధించి ఆధారాలు సమర్పిస్తే పరిశీలించి దర్యాప్తునకు సహకరించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని భారత్ స్పష్టంగా చెప్పింది. అయితే నిజ్జర్‌ను పాక్ ఐఎస్ఐ ఏజెంట్లు చంపేసి ఆ నేరం భారత్‌పై మోపాలని కుట్ర జరిగిందని గతంలో అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. నిజ్జర్ హత్యకు గురై ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది జూన్‌లో అక్కడి పార్లమెంట్ దిగువసభలో కెనడా ఎంపీలు నిజ్జర్‌కు నివాళులర్పించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. '' భారత్ ఉగ్రవాదిగా ప్రకటించిన, ఇంటర్‌పోల్ వాంటెడ్ జాబితాలో ఉన్న వ్యక్తికి ఏకంగా పార్లమెంటులో నివాళులర్పించడం దారుణం'' అంటూ విమర్శలు వెల్లువెత్తాయి.



హర్దీప్‌సింగ్ నిజ్జర్

ఎవరీ నిజ్జర్?

నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్, 'గురునానక్ సిక్ గురుద్వారా సాహిబ్' అధిపతి అయిన నిజ్జర్ సిక్కు వేర్పాటువాదిగా పేరొందాడు. భారత్‌లోని జలంధర్ ప్రాంతంలోని బార్సింగ్‌పూర్‌లో జన్మించాడు. 1997లో తప్పుడు పాస్‌పోర్ట్‌తో కెనడాకు వెళ్లి స్థిరపడ్డాడు. అయితే అక్కడి నుంచే భారత్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించాడు. అమెరికాలో నెలకొల్పిన జస్టిస్ ఫర్ సిఖ్స్ సంస్థలో క్రియాశీలకంగా పనిచేశాడు. పంజాబ్‌లో హత్యలకు కుట్రపన్నాడన్న కేసులో చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద భారత్ ఇతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. ఇతని తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌లోని ఇతని ఆస్తులను స్వాధీనం చేసుకుంది.





జేమ్స్ ఏ రాబిన్సన్ డరేన్ ఎసిమోగ్లూ సైమన్ జాన్సన్

అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

వ్యవస్థలు, సంస్థల అసమర్థత దేశానికి ఎలా చేటు చేస్తుందన్న అంశంపై పరిశోధనలు చేసిన డరేన్ ఎసిమోగ్లూ, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్సన్

స్టాక్‌హోమ్: దేశంలోని సంస్థలు, వ్యవస్థల అసమర్థత కారణంగా ఆ దేశం ఎలా పేదరికంలోనే మగ్గిపోతుందనే అంశాలపై విస్తృత పరిశోధనలు చేసిన ముగ్గురు ఆర్థికవేత్తలకు అర్థశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ పురస్కారం దక్కింది. ఆయా సమాజాల్లో నిబంధనలను తుంగలో తొక్కడం, సంస్థలు, వ్యవస్థల్లో లోపాలు ఆ దేశాభివృద్ధికి ఎలా పెనుశాపాలుగా మారతాయనే అంశాలను డరేన్ ఎసిమోగ్లూ, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్సన్‌లు చక్కగా విడమర్చి చెప్పారని రాయల్ స్వీడిష్ అకాడమీ సైన్స్ విభాగ నోబెల్ కమిటీ కొనియాడింది. ఈ మేరకు ముగ్గురికీ నోబెల్‌ను ప్రకటిస్తూ సోమవారం కమిటీ ఒక ప్రకటన విడుదలచేసింది. ఎసిమోగ్లూ, జాన్సన్‌లు అమెరికాలోని ప్రతిష్టాత్మక మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సేవలందిస్తుండగా షికాగో విశ్వవిద్యాలయంలో రాబిన్సన్ పనిచేస్తున్నారు. '' దేశాల మధ్య ఆర్థిక అసమానతలను తగ్గించడం అనేది శతాబ్దాలుగా ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. ఆదాయ, ఆర్థికాభివృద్ధి అసమానతలను రూపుమాపడంలో అక్కడి వ్యవస్థల కీలకపాత్రను ఆర్థికవేత్తలు స్పష్టంగా పేర్కొన్నారు'' అని ఆర్థికశాస్త్ర కమిటీ చైర్మన్ జాకబ్ సెవెన్‌సన్ వ్యాఖ్యానించారు. తనకు నోబెల్ రావడంపై 57 ఏళ్ల ఎసిమోగ్లూ ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

దేశాలు ఎందుకు సక్సెస్ కాలేవు?

అవార్డ్ విషయం తెలిశాక తుర్కియే దేశస్థుడైన ఎసిమోగ్లూ మాట్లాడారు. ''ప్రజాస్వామ్యయుత వ్యవస్థల గొప్పతనాన్ని ఈ అవార్డ్ గుర్తించింది. అభివృద్ధిలో దేశాలు ఎందుకు వెనుకబడతాయని రాబిన్సన్, నేను కలిసి పరిశోధించాం. ప్రజాస్వామ్యం అనేది సర్వరోగ నివారిణి కాదు. ఒక్కోసారి ఎన్నికలు వచ్చినప్పుడే సంక్షోభాలు ముంచుకొస్తాయి'' అని అన్నారు. ఒకే పార్టీ ఏలుబడిలో ఉన్న చైనా ఎలా అభివృద్ధి పథంలో దూసుకుపోగల్గుతోందని విలేఖరులు ప్రశ్నించగా.. '' శక్తివంతమైన అధికారయంత్రాంగం ఉన్న చైనా లాంటి దేశాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, వినూత్న ఆవిష్కరణల కోసం ఎన్నో అవరోధాలను దాటుతున్నారు'' అని అన్నారు. 12 ఏళ్ల క్రితం ఎసిమోగ్లూ, రాబిన్సన్ రాసిన ' వై నేషన్స్ ఫెయిల్: ది ఆరిజన్స్ ఆఫ్ పవర్, ప్రాస్పారిటీ, పూర్' పుస్తకం అత్యధిక కాపీలు అమ్ముడుపోయింది. వ్యక్తుల తప్పిదాలే ఆయా దేశాలను పేదదేశాలుగా మిగిలిపోవడానికి కారణమని రచయితలు ఆ పుస్తకంలో వివరించారు. సరిగ్గా అమెరికా–మెక్సికో సరిహద్దులో ఉన్న ఆరిజోనా రాష్ట్ర నోగేల్స్ సిటీ భిన్న పరిస్థితులను ఆర్థికవేత్తలు చక్కటి ఉదాహరణగా తీసుకున్నారు. అమెరికా వైపు ఉన్న నోగేల్స్ సిటీ ఉత్తరప్రాంత వాసులు ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఆయుర్దాయం ఎక్కువ. ఎక్కువ మంది విద్యార్థులు హైస్కూల్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేస్తున్నారు. అదే దక్షిణవైపు ప్రాంత ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు. అక్కడ వ్యవస్థీకృత నేరాలు ఎక్కువ. ఆ ప్రాంతంలో వ్యాపారాలు చేయడం కూడా రిస్క్‌తో కూడిన వ్యవహారం. అవినీతి రాజకీయనేతలను అధికారం నుంచి కిందకు దింపడం కూడా చాలా కష్టం. అమెరికాలో అయితే పౌరుల ఆస్తిహక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. ఇలాంటి విధానాలే ఒకరకంగా దేశం బాగుపడటానికి బాటలువేస్తాయి '' అని ఎసిమోగ్లూ వివరించారు.

వ్యవస్థలకు తగ్గుతున్న ఆదరణ

దురదృష్టవశాత్తు ఇటీవలి కాలంలో అమెరికా, యూరప్‌లలో ప్రజాస్వామ్యయుత వ్యవస్థలకు ఆదరణ తగ్గుతోంది. తమకు అన్యాయం జరిగిందని ప్రజలు భావించిన సందర్భాల్లో ప్రజాస్వామ్యదేశాలు ఓడిపోయినట్లే లెక్క. ఇలాంటి ఉదంతాలు ప్రజాస్వామ్యదేశాలు మేల్కొనాల్సిన తరుణం వచ్చిందని గుర్తుచేస్తాయి. సుపరిపాలన అందించేందుకు దేశాలు మళ్లీ ప్రయత్నించాలి'' అని ఎసిమోగ్లూ అన్నారు.

ప్రధాని మోదీతో ఢిల్లీ సీఎం అతిశి భేటీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి సోమవారం భేటీ అయ్యారు. తమ ప్రభుత్వానికి కేంద్రం నుంచి సహకారం లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ రోజు గౌరవ ప్రధాని నరేంద్రమోదీ గారిని కలిశాను. మన రాజధాని సంక్షేమం, అభివృద్ధి గురించి ఢిల్లీ ప్రభుత్వానికి కేంద్రం నుంచి పూర్తి సహకారం కోసం ఎదురు చూస్తున్నాను'' అని ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. గత నెలలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆమె మొదటిసారి ప్రధానిని కలిశారు. ఈ సమావేశం గురించి ప్రధాన మంత్రి కార్యాలయం కూడా ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

మహాయుతిలో 225-230 సీట్లపై ఏకాభిప్రాయం: ప్రఫుల్



ముంబై: అధికార మహాయుతి కూటమిలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 225–230 సీట్లపై ఏకాభిప్రాయం వచ్చిందని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్ సోమవారం వెల్లడించారు. ఈ స్థానాల్లో ఎవరెక్కడ పోటీచేయాలనే దానిపై అంగీకారానికి వచ్చామని తెలిపారు. మరో రెండు లేదా నాలుగు రోజుల్లో మిగతా సీట్ల పంపకంపై నిర్ణయానికి వచ్చాక వివరాలను వెల్లడిస్తామన్నారు. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న మహాయుతి కూటమిలో శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్సీపీ (అజిత్‌పవార్), బీజేపీలు భాగస్వాములుగా ఉన్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 స్థానాలున్నాయి. ఈ ఏడాది నవంబరు 26తో అసెంబ్లీ గడువు ముగియనుంది. ఎన్సీపీతో కలిపి ఎన్నికలకు వెళితే నష్టపోతామని బీజేపీ, శివసేన నాయకులు భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

చిరాగ్ పాశ్వాన్‌కు జెడ్- కేటగిరీ భద్రత



న్యూఢిల్లీ/పాట్నా: ఎన్డీయే కీలక భాగస్వామి, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ భద్రతను కేంద్ర ప్రభుత్వం పెంచింది. అయనకు జెడ్- కేటగిరీ భద్రత కల్పించింది. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు ఇప్పటిదాకా శశస్త్ర సీమాబల్‌కు చెందిన చిన్న బృందం రక్షణ కల్పించేది. 41 ఏళ్ల చిరాగ్ పాశ్వాన్.. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు కూడా. లోక్ జనశక్తి బిహార్‌లో బీజేపీ, జేడీయూలతో పొత్తుపెట్టుకొని పోటీచేసిన ఐదు లోక్‌సభ స్థానాలను నెగ్గిన సంగతి తెలిసిందే.

ఆర్జీ కర్ డాక్టర్లతో చర్చలు విఫలం



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్, 12 డాక్టర్ల సంఘాలకు మధ్య సోమవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ.. తమ డిమాండ్ల సాధనం కోసం జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరాహార దీక్ష పదోరోజుకు చేరింది. జూడాల డిమాండ్ మేరకు కోల్‌కతా పోలీసు కమిషనర్‌పై వేటువేసి.. మరికొందరు వైద్యశాఖ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకున్న బెంగాల్ ప్రభుత్వం.. జూడాల మిగతా డిమాండ్లను తీర్చడానికి గడువు పెట్టడాన్ని అంగీకరించడం లేదు. 'సీఎస్‌తో సమావేశం ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. నిరాహారదీక్ష చేస్తున్న యువ డాక్టర్లతో చర్చలకు ఉన్నతాధికారులను పంపాలని ప్రభుత్వాన్ని కోరాం. అయితే ఎప్పటిలోగా జూడాల సమస్య పరిష్కరిస్తామనేది నిర్దిష్టంగా చెప్పలేమని ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ సూచనప్రాయంగా తెలిపారు' అని పశ్చిమబెంగాల్ డాక్టర్స్ ఫోరమ్ అధ్యక్షుడు డాక్టర్ కౌశిక్ చకి తెలిపారు.

దుర్గాపూజ సందర్భంగా ఘర్షణలు

ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు ● బహ్రాయిచ్‌లో ఉద్రిక్తతలు ● సరిహద్దులు మూసివేత, ఇంటర్నెట్ బంద్

బహ్రాయిచ్: ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్‌లో ఆదివారం దుర్గామాత విగ్రహం ఊరేగింపు సందర్భంగా రెండు వర్గాల మధ్య మొదలైన ఘర్షణలు సోమవారం కూడా కొనసాగాయి. మహారాజ్‌గంజ్ ప్రాంతంలోని మన్సూర్ గ్రామంలో విగ్రహం ఊరేగింపులో డీజే భారీ శబ్దం విషయమై వివాదం మొదలైంది. ఈ సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పులు, రాళ్లు రువ్విన ఘటనల్లో 22 ఏళ్ల వ్యక్తి చనిపోగా, ఆరుగురు గాయపడ్డారు. సోమవారం కొన్ని చోట్ల అల్లరి మూకలు కర్రలు, రాడ్‌లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ వీధుల్లో గుంపులుగా తిరుగుతూ లక్నో సేవా ఆస్పత్రికి, ఆ సమీపంలోని మెడికల్ స్టోరుకు నిప్పుపెట్టారు. ఆస్పత్రిలోని ఎక్స్‌రే యంత్రాన్ని ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. మరో చోట బైక్ షోరూంను అగ్నికి ఆహుతి చేయడంతో పలు వాహనాలు బూడిదయ్యాయి. పలువురి ఇళ్లకు, దుకాణాలకు నిప్పుపెట్టారు. 'పరిస్థితిని అదుపులోకి తెచ్చాం. అసాంఘిక శక్తులను గుర్తించాం'అని బహ్రాయిచ్ ఎస్పీ వృందా శుక్లా చెప్పారు. ఓ వ్యక్తికి చెందిన దుకాణం /ఇంటి నుంచే ఊరేగింపు పైకి కాల్పులు జరిపినట్లు తేలడంతో అతడిని అరెస్ట్ చేశామన్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు మొత్తం 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. హర్ది పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో సురేశ్ కుమార్ వర్మను, మరో పోలీస్ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జిని అధికారులు సస్పెండ్ చేశారు. మహ్సి ప్రాంతంలో రాష్ట్ర పోలీసులతోపాటు కేంద్ర బలగాలను మోహరించారు. ముందు జాగ్రత్తగా బహ్రాయిచ్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపి వేయడంతోపాటు బహ్రాయిచ్ జిల్లా సరిహద్దులను అధికారులు మూసివేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు డ్రోన్లను రంగంలోకి దించారు. ఘటన నేపథ్యంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ సీనియర్ అధికారులతో సమావేశ మయ్యారు. 'మహ్సిలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించిన వారిని వదిలిపెట్టం. అల్లరి మూకలను గుర్తిస్తాం. నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా కఠిన చర్యలుంటాయి'అని సీఎం చెప్పారు. అదేవిధంగా, విగ్రహాల నిమజ్జన కార్యక్రమం సజావుగా కొనసాగేలా మత సంస్థల పెద్దలతో మాట్లాడాలని అధికారులను ఆదేశించామన్నారు.

అంత్యక్రియల సమయంలో ఉద్రిక్తత

ఆదివారం ఘర్షణల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తికి సోమవారం అంత్య క్రియ లు జరిగాయి. శ్మశాన వాటికకు వెళ్లే క్రమంలో మహ్సి తహశీల్ కార్యాలయం ఎదుట రోడ్డుపైనే మృతదేహాన్ని ఉంచి నిరసనకు దిగారు. అతడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు చేపట్టేది లేదని భీష్మించారు. అతడి మరణానికి కారణమైన వారిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని, వారి ఇళ్లను కూల్చి వేయాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో జనం అక్కడికి చేరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో, రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి సంజీవ్ , అదనపు డీజీపీ అమితాబ్ యాశ్ అక్కడికి చేరుకున్నారు. అమితాబ్ యాశ్ పిస్టల్ చేతబట్టుకుని పరిస్థితిని నియంత్రించేందుకు ప్రయత్నించడం కనిపించింది. అనంతరం, బాధితుడి అంత్యక్రియలు ముగిశాయి.



అల్లరి మూకలు నిప్పపెట్టడంతో బైక్ షోరూం నుంచి వస్తున్న పొగలు



మహ్సిలో తగులబడుతున్న మోటారు సైకిళ్లు

ప్రభుత్వంపై మండిపడ్డ ప్రతిపక్షాలు

బహ్రాయిచ్‌లో ఘటనలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందించారు. ప్రభుత్వ యంత్రాంగం చేతకానితనమే ఘర్షణలకు కారణమని ఆరోపించారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని యూపీ సీఎం ఆదిత్యనాథ్‌ను ఆమె కోరారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే మహ్సిలో గొడవలు జరిగాయని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సిద్దిఖీ హత్యకు పుణెలో కుట్ర

షూటర్లకు ఫొటో, ఫ్లెక్సీ అందజేత

ముంబై: మహారాష్ట్ర మాజీ మంత్రి, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నేత బాబా సిద్దిఖీని కాల్చిచంపడానికి పుణెలో కుట్ర జరిగిందని పోలీసులు సోమవారం వెల్లడించారు. సిద్దిఖీని గుర్తించడానికి వీలుగా ఆయన ఫొటో, చిత్రం ముద్రించిన ఫ్లెక్సీని షూటర్లకు అందజేశారు. ఈ హత్యలో పుణెకు చెందిన సోదరులు ప్రవీణ్ లోంకర్, శుభమ్ లోంకర్‌ల పాత్ర ఉందని ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు గుర్తించారు. నిందితులు దొరకితే హత్యకు కారణాలు తెలుస్తాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. లోంకర్ సోదరులే హత్యకు పాల్పడిన షూటర్లకు రూ.50 వేల చొప్పున అడ్వాన్సు అందించారని, నిందితుల మధ్య సమావేశాలను ఏర్పాటు చేశారని, హత్యకు కావాల్సిన ఏర్పాట్లను చూశారని చెప్పారు. శుభమ్‌కు చెందిన డైరీలో ప్రవీణ్ పనిచేస్తున్నాడని.. అక్కడే షూటర్లు శివకుమార్ గౌతమ్, ధర్మరాజ్ కశ్యప్‌లను హత్య కోసం నియమించుకున్నారని తెలిపారు. అడ్వాన్సుగా అందిన మొత్తం నుంచి నిందితులు ఒక మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేసి.. దాని పైనే సిద్దిఖీ నివాసం, ఆఫీసుల వద్ద, ఆయన దినచర్య పైనా రెక్కీ నిర్వహించారని వివరించారు. గుర్మైల్ బల్జీత్‌సింగ్ (హరియాణా), ధర్మరాజ్ కశ్యప్ (ఉత్తరప్రదేశ్), ప్రవీణ్ లోంకర్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. నిందితులకు దిశానిర్దేశం చేసిన మొహమ్మద్ యాసిన్ అక్తర్ కోసం. సిద్దిఖీని కాల్చిచంపిన గౌతమ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



న్యాయం మరింత బలోపేతం: చంద్రచూడ్

సుప్రీంకోర్టు భవన సముదాయాన్ని విస్తరించడమంటే.. న్యాయాన్ని మరింత బలోపేతం చేయడమేనని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. భవిష్యత్తు న్యాయవ్యవస్థకు పునాదిరాయి వేయడమేనని పేర్కొన్నారు. సోమవారం రూ.800 కోట్లతో సుప్రీంకోర్టు విస్తరణ పనులకు సీజేఐ చంద్రచూడ్ భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, జస్టిస్ బి.వి.నాగరత్న పాల్గొన్నారు.

మూడు విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: ముంబై నుంచి బయలుదేరిన మూడు అంతర్జాతీయ విమానాలకు సోమవారం బాంబు బెదిరింపులు రావడంతో భద్ర తా సంస్థలు ఉలిక్కిపడ్డాయి. ముంబై నుంచి న్యూయార్క్ వెళ్తున్న ఎయిరిండియా విమా నంతో పాటు మస్కట్ (ఒమన్), జెడ్డా (సౌదీ అరేబియా)కు వెళ్తున్న రెండు ఇండిగో విమానాలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చా యి. న్యూయార్క్ బయలుదేరని విమానాన్ని ఢిల్లీకి దారి మళ్లించారు. ఇండిగో విమానాలకు టేకాఫ్‌కు ముందే బెదిరింపులు రావడంతో భద్రతా తనిఖీల కోసం ఐసోలేషన్ బేలకు తరలించారు. ఢిల్లీకి దారి మళ్లించిన ఎయిర్ ఇండియా విమానంలో 239 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బంది ఉన్నారు. ప్రయాణికులను దింపేసి.. క్షుణ్ణంగా తనిఖీ చేశామని, విమానం లోపల ఎటువంటి అనుమానాస్పద వస్తువు కనిపించలేదని పోలీసులు తెలిపారు. అక్టోబర్ 14న ముంబై నుంచి జేఎఫ్ కెనడీ విమానాశ్రమయానికి వెళ్తున్న ఏఐ 119 విమానానికి నిర్దిష్ట భద్రతా హెచ్చరికలు అందాయని, ప్రభుత్వ భద్రతా నియంత్రణ కమిటీ సూచనల మేరకు ఢిల్లీకి మళ్లించామని ఎయి రిండియా ఒక ప్రకటనలో తెలిపింది.

వక్ఫ్ కమిటీ భేటీ నుంచి విపక్షాల వాకౌట్

పరస్పర దూషణకు దిగిన అధికార, విపక్షాల ఎంపీలు

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ)బిల్లును సమీక్షిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశం వాడీవేడీ చర్చలకు వేదికగా మారింది. అధికార బీజేపీ, విపక్ష పార్టీల ఎంపీలు వాగ్వాదానికి దిగారు. చివరకు విపక్ష ఎంపీలు సమావేశాన్ని బహిష్కరిస్తూ బయటకు వెళ్లిపోయారు. నియమనిబంధనలకు విరుద్ధంగా కమిటీ సమావేశం జరుగుతోందని ఆరోపించారు. పార్లమెంట్ సంయుక్త కమిటీలో చర్చ సజావుగా సాగట్లేదని, నియమాలను పాటించడం లేదని శివసేన ఎంపీ సావంత్ మీడియాతో చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి సీనియర్ విపక్ష నేతలపై కొందరు తీవ్రమైన వ్యక్తిగత దూషణలకు దిగారని విపక్షసభ్యులు ఆరోపించారు. తమ తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు విపక్షాల సభ్యులు విడిగా సమావేశమయ్యారు. పార్లమెంట్ సంయుక్త కమిటీ సమావేశంలో జరిగిన వాగ్వాదంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఫిర్యాదు చేయాలని కొందరు విపక్షసభ్యులు తమ అభిప్రాయం వ్యక్తంచేశారు. విపక్ష ఎంపీలు బయటకు వెళ్లిపోయాక బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ సారథ్యంలో కమిటీ సమావేశం యథావిధిగా కొనసాగింది.

ఖర్గేపై విమర్శలు

వక్ఫ్ భూముల కుంభకోణంతో కర్ణాటకకు చెందిన ఖర్గే, రెహ్మాన్ ఖాన్‌లకు ప్రమేయం ఉందని కర్ణాటక బీజేపీ నేత అన్వర్ మణిప్పాడి ఆరోపణలు గుప్పించారు. దీంతో విపక్షసభ్యులు వాగ్వాదానికి దిగారు. సభలో లేని వ్యక్తిపై నిబంధనలకు విరుద్ధంగా పార్లమెంటరీ కమిటీలో ఆరోపణలు ఎలా చేస్తారని వాదించారు. ముస్లింలకు సంబంధించిన చట్టంపై హిందూ వర్గాల అభిప్రాయాలను ఎందుకు ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటున్నారు?. ముస్లింల అభిప్రాయాలు పట్టవా? అని విపక్ష సభ్యులు నిలదీశారు.

కమిటీ చీఫ్‌కి ఒవైసీ లేఖ

కమిటీ చీఫ్ జగదాంబికాపాల్‌కు ఒవైసీ ఒక లేఖ రాసినట్లు తెలుస్తోంది. ''సనాతన్ సంస్థ, హిందూ జనజాగృతి సమితి వంటి సంస్థలు హిందూ అతివాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి. భారత్‌ను హిందూదేశంగా మార్చడమే వారి లక్ష్యం. భారత సర్కార్‌కు వ్యతిరేకంగా ఆయా సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి'' అని లేఖలో ఒవైసీ పేర్కొన్నారు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం ၊ 15 ၊ అక్టోబర్ ၊ 2024



సీవరేజ్ స్పెషల్ డ్రైవ్‌పై డ్యాష్ బోర్డు
సీవరేజ్ ఓవర్ ఫ్లోపై స్పెషల్ డ్రైవ్ తీరును డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్ పనితీరుపై ఆయన సమీక్షించారు. -8లో



హలో..ప్లీజ్ హియర్..
హెడ్‌ఫోన్స్, ఇయర్ బడ్స్ అతిగా వినియోగించడం వల్ల వినికిడి సమస్యలు తీవ్రమవుతున్నాయని ఇటీవలి అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి తస్మాత్ జాగ్రత్త అంటున్నారు నిపుణులు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/24.0
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం వెనక్కేనా..?



పార్కింగ్‌కు కేటాయించిన స్థలం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్టాత్మక కేబీఆర్ నేషనల్ పార్కు వద్ద నిర్మించ తలపెట్టిన మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులతో పాటు సమీప వ్యాపార సంస్థలకు వచ్చే వారు తమ కార్లు పార్కింగ్ చేసుకోవడానికి అనువుగా కేబీఆర్ పార్కు మొదటి పార్కింగ్ స్థలంలో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మించేందుకు ప్రతిపాదించారు. రూ.10 కోట్ల వ్యయంతో 70 కార్లు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా నిర్మిత డిజైన్‌ను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం కూడా తెలిపింది. అయితే మల్టీలెవల్ పార్కింగ్ నిర్మించిన స్థలంలో గత 20 రోజుల నుంచి జీహెచ్‌ఎంసీ అర్బన్ ఫారెస్ట్ విభాగం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సిమెంట్ దిమ్మెలతో సెంట్రల్ మీడియన్స్‌ను నిర్మిస్తుంది. మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణం చేపడితే ఈ మొక్కలు నాటుతున్న ప్రాంతాన్ని కూల్చివేయాల్సి ఉంటుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటేందుకు నిర్మిస్తున్న మీడియన్లు ప్రణాళికబద్ధంగా నిర్మిస్తున్నారా? లేదా అన్నది తెలియడం లేదు. ఇంతకీ ఇక్కడ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం చేపడుతున్నారా? లేదా అన్నది కూడా సందేహం కూడా ఉంది. ఒకవేళ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం చేపడితే కొత్తగా ఇదే స్థలంలో మొక్కలు నాటేందుకు సిమెంట్ దిమ్మెలతో గోడలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పార్కింగ్ నిర్మాణంపై సందిగ్ధత నెలకొంది. అసలు ఈ పార్కింగ్ నిర్మాణం ఉంటుందా? లేదా అన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నైపుణ్యం సాధిస్తేనే విద్యార్థులకు గుర్తింపు

– రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, మెడల్స్ అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాయదుర్గం: నేటి తరం గ్రాడ్యుయేట్లు అంకితభావంతో చదువుతూ ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) క్యాంపస్‌లో సోమవారం స్నాతకోత్సవాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకతకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఒక ఎదుగుదలకు కలలు కనాలని, వాటిని సార్థకం చేసుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నర్సింహుగారి తేజ్ లోహిత్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం వివిధ కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు, ప్రతిభ చాటిన వారికి మెడల్స్‌ను అందించారు.

డిస్కంలో 1126 మంది ఇంజినీర్ల బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 1126 మంది ఇంజినీర్లకు స్థానచలనం కల్పించారు. రెండేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వారిని ఇతర స్థానాల్లోకి బదిలీ చేశారు. వీరిలో 111 మంది డీఈలు, 263 మంది ఏడీఈలు, 521 మంది ఏఈలు, 231 మంది ఇతర ఉద్యోగులు ఉన్నారు. ఆన్‌లైన్ వెబ్ బేస్డ్‌గా ఈ బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఆర్డర్ కాపీలను నేరుగా ఆయా ఇంజినీర్లకు ఆన్‌లైన్ పోర్టల్‌లోనే పంపారు. ఇదిలా ఉంటే డిస్కం ముందే జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ బదిలీలు జరిగాయి. కొంత మంది ఇంజినీర్లు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కీలక పోస్టులను చేజిక్కించుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకోసం వారు భారీగా ఖర్చు చేసినట్లు తెలిసింది. నిజానికి గతంలో ఫోకల్ పోస్టుల్లో పనిచేసిన వారికి..తాజా బదిలీల్లో నాన్ ఫోకల్ ఇవ్వాల్సి ఉంది. కానీ ఆర్సీపురం ఏడీఈగా పని చేసిన ఇంజినీరుకు..కీలకమైన ఇస్నాపూర్‌ను కట్టబెట్టారు. అదే విధంగా పటాన్‌చెరు ఏడీఈని అదే సర్కిల్ పరిధిలోని గుమ్మడిదలకు బదిలీ చేశారు. ఇబ్రహీంపట్నం డీఈకి డిస్కంలోనే అత్యధిక డిమాండ్ ఉన్న గచ్చిబౌలి డివిజన్‌ను కట్టబెట్టారు. కమర్షియల్ డీఈగా పని చేసిన వ్యక్తికి మేడ్చల్ ఆపరేషన్ డీగా పోస్టు కట్టబెట్టారు. పటాన్‌చెరు ఏఈని నార్సింగి ఏఈగా నియమించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఫోకల్ పోస్టులు ఇవ్వబోమని ముందే స్పష్టం చేశారు. కానీ ఇందుకు విరుద్ధంగా ఇంజినీర్స్ అసోసియేషన్‌లో కీలకంగా వ్యవహరించే వ్యక్తికి కూకట్‌పల్లి ఆపరేషన్స్ డీఈ పోస్టులను కట్టబెట్టడం అనేక విమర్శలకు కారణమైంది. బైరామల్‌గూడ ఏడీఈకి ఘట్‌కేసర్ ఏడీఈగా బదిలీ చేశారు. ఇబ్రహీంబాగ్ ఏఈకి ప్రగతినగర్ ఏఈ పోస్టు దక్కింది.





కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీ

కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. కంపెనీ ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఒప్పందాలకు తూట్లు..
ప్రజలకు చీకట్లు!

- కొత్త కాలనీల్లో వీధి లైట్లు అమర్చక ప్రజలకు ఇబ్బందులు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

వీధి దీపాలపై జీహెచ్‌ఎంసీ, ఈఈఎస్‌ఎల్‌ల పంచాయితీ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాట్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ–కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఈఈఎస్‌ఎల్(ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)ల మధ్య ఒప్పంద ఉల్లంఘనలతో నగరంలో అంధకారం రాజ్యమేలుతోంది. ఒప్పందం మేరకు ఆటోమేటిక్‌గా వీధిలైట్ల ఆన్‌అండ్ ఆఫ్, డ్యాష్‌బోర్డు నిర్వహణ, సీసీఎంఎస్ బాక్స్‌ల ఏర్పాటు, నిర్వహణలో ఈఈఎస్‌ఎల్ వైఫల్యం చెందడంతో గత కొంతకాలంగా జీహెచ్‌ఎంసీ యాన్యుటీ చెల్లింపులు చేయడం లేదు. జీహెచ్‌ఎంసీ చెల్లింపులు లేనందున అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా వీధిదీపాలు అమర్చలేమని ఈఈఎస్‌ఎల్ చేతులెత్తేసింది. దీంతో ప్రజల సదుపాయార్థం జీహెచ్‌ఎంసీ ఖర్చుతోనే వాటిని ఏర్పాటు చేయాలని స్టాండింగ్‌కమిటీ నిర్ణయించడంతో జీహెచ్‌ఎంసీ అందుకు సిద్ధమైంది. ఎంతోకాలంగా రెండింటి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచినప్పటికీ, వీధిదీపాలు మాత్రం వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

2018 నుంచి నగరంలో ఎల్‌ఈడీ వీధి దీపాలు వెలుగుతున్నప్పటికీ, సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం జరగక చీకట్లు అలముకుంటున్నాయి. డా.బి.జనార్దన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఉన్నప్పుడు ఒప్పందం కుదరగా, లోకేశ్‌కుమార్, రొనాల్డ్ రాస్‌ల హయాంలో ఉల్లంఘనలు వెలుగుచూశాయి. వారు హెచ్చరించినప్పటికీ, ఈఈఎస్‌ఎల్ పనితీరు మారలేదు. మరోవైపు, అనుబంధ ఒప్పందం మేరకు కొత్తగా వెలసిన కాలనీలు, ప్రమాదకర ప్రాంతాల్లో కొత్తగా 10 వేల వీధి దీపాలు, 2 వేల సీసీఎంఎస్ బాక్సుల్ని ఈఈఎస్‌ఎల్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, దాదాపు 3560 వీధి దీపాల్ని మాత్రం ఏర్పాటు చేసింది. తమకు యాన్యుటీ చెల్లింపులు నిలిచిపోయినందున వాటిని ఏర్పాటు చేయలేమని ఈఈఎస్‌ఎల్ జీహెచ్‌ఎంసీకి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో ప్రజల ఫిర్యాదుల దృష్ట్యా వీటితోసహా మొత్తం 15 వేల వీధిదీపాల ఏర్పాట్లకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ప్రజా ఫిర్యాదులు సకాలం పరిష్కారం కాకపోవడం ..చాలా ప్రాంతాలు చీకట్లలోనే మగ్గుతుండటంతో గత కొంతకాలంగా జీహెచ్‌ఎంసీ ఈఈఎస్‌ఎల్‌కు చెల్లింపులు నిలిపివేసినట్లు తెలిసింది. ఒప్పందం, అమలు తీరును అవలోకిస్తే..

- ఒప్పందం మేరకు ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి 5 శాతం బల్బుల (దాదాపు 27వేలు) బఫర్‌స్టాక్ ఉండాలి. కానీ అందులో దాదాపు పదిశాతం కూడా ఈఈఎస్‌ఎల్ మెయింటైన్ చేయడం లేదని విశ్వసనీయ సమాచారం. దీంతో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి. గత ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు పేరుకుపోయిన ఫిర్యాదుల 8 వేలకు పైగా ఉన్నాయి.
- సాయంత్రం చీకటి పడగానే ఆటోమేటిక్‌గా ఆన్ అయి, ఉదయం సూర్యుడు రాగానే ఆఫ్ అయ్యేలా పనిచేయాల్సిన సీసీఎంఎస్ బాక్స్‌లు చాలా వరకు పనిచేయడం లేవు. దీంతో కొన్ని ప్రాంతాల్లో మాత్రం మాన్యువల్‌గా ఆన్, ఆఫ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆటోమేటిక్‌గా ఆఫ్ కానందున జీహెచ్‌ఎంసీకి నెలనెలా ఎక్కువ మొత్తంలో సీసీచార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ఎల్‌ఈడీల వల్ల విద్యుత్ పొదుపు 55 శాతానికి పైగా ఉంటే పొదుపయ్యే నిధుల్లో 25 శాతం ఈఈఎస్‌ఎల్‌కు చెల్లించాల్సి ఉండగా, సేవింగ్స్ సంగతటుంచి సీసీచార్జీలు 5 శాతానికి పైగా పెరిగినట్లు సమాచారం.
- ఈఈఎస్‌ఎల్ థర్డ్ పార్టీలుగా నియమించుకున్న ఏజెన్సీలకు దాదాపు ఏడాదిగా చెల్లింపులు చేయకపోవడంతో అవి పనిచేయడం లేదు. జీహెచ్‌ఎంసీ నుంచైనా తమకు చెల్లించి, వాటిని ఈఈఎఎస్‌ఎల్ నుంచి రికవరీ చేసుకోవాలని లేఖ రాసిన నేపథ్యంలో దసరా పండుగకు ముందు ఈఈఎస్‌ఎల్ వాటికి చెల్లింపులు చేసినట్లు సమాచారం.
- నగరవ్యాప్తంగా 30 వేలకు పైగా సీసీఎంఎస్ లుండగా, వాటిల్లో ఒక ఏజెన్సీ ఏర్పాటు చేసినవి 7 వేలకు పైగా ఉన్నాయి. వాటిల్లో 60 శాతం పనిచేయడం లేదు.

ఇదిలా ఉండగా, జీహెచ్‌ఎంసీ నుంచి తమకు రూ.144 కోట్ల బకాయి లున్నట్లు ఈఈఎస్‌ఎల్ ఒక పత్రికాప్రకటన విడుదల చేసింది. ఒప్పందానికనుగుణంగా పనులు చేయనందున ఏప్రిల్ నుంచి జీహెచ్‌ఎంసీ ఈఈఎస్‌ఎల్‌కు యాన్యుటీ చెల్లింపులు నిలిపివేసినట్లు తెలిసింది. యాన్యుటీ, ఇతరత్రా పనులకు సంబంధించిన చెల్లింపులు వెరసి దాదాపు రూ.82 కోట్లు ఈఈఎస్‌ఎల్‌కు జీహెచ్‌ఎంసీ బకాయిలున్నట్లు సమాచారం. చెల్లింపుల జాప్యానికి సర్‌ఛార్జిని సైతం విధించి ఈఈఎస్‌ఎల్ బకాయిల లెక్క విడుదల చేసినట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీ, ఈఈఎస్‌ల ఒప్పందాలు, ఉల్లంఘనలు తదితరమైన వాటి గురించి సంబంధం లేని ప్రజలు మాత్రం అవి ఏమైనా చేసుకోనీ కానీ..తమకు మాత్రం చీకటి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

గత ఫిబ్రవరి నుంచి పరిష్కారానికి నోచుకోని ఫిర్యాదులు.. జీహెచ్‌ఎంసీ జోన్ల వారీగా..

జోన్	ఫిర్యాదులు
ఎల్‌బీనగర్	724
చార్మినార్	1080
ఖైరతాబాద్	2666
శేరిలింగంపల్లి	710
కూకట్‌పల్లి	1354
సికింద్రాబాద్	1702
మొత్తం	8236



టార్గెట్ టాస్క్‌ఫోర్స్!

ఈ విభాగానికి లభించని స్థానిక పోలీసుల సహకారం

- చిన్న బందోబస్తులు, పికెట్ డ్యూటీలకు సైతం వినియోగం
- కీలక సమాచారం అందకుండా చేస్తున్న ఉన్నతాధికారులు
- సంస్కరణలు చేపట్టకుంటే నగరవాసులకు తీవ్ర నష్టమే

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌గా పిలిచే కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ నగర పోలీసు విభాగానికి గుండెకాయ వంటిది. వ్యవస్థీకృత నేరాలకు చెక్ చెప్పడంతో పాటు కీలక కేసుల్ని కొలిక్కి తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తుంటుంది. మాఫియా, ఉగ్రవాద, మావోయిస్టు సంబంధిత కేసుల్నీ డీల్ చేసిన చరిత్ర ఈ ప్రత్యేక విభాగానికి ఉంది. ఇంతటి కీలకమైన టాస్క్‌ఫోర్స్ ప్రస్తుతం అనేక 'సవాళ్లు' ఎదుర్కొంటోంది. పాతబస్తీ కేంద్రంగా ఉన్న విభాగాలు తమ ఆపరేషన్స్‌లో బిజీగా ఉంటుండగా...కొత్త సిటీ కేంద్రంగా పని చేసేవి మాత్రం ఆ 'పరేషాన్ల'తో కొట్టుమిట్టాడుతున్నాయి.

ప్రధానంగా రెండు రకాలైన డ్యూటీలు...

నేరుగా నగర కొత్వాల్ ఆధీనంలో పనిచేసే టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రధానంగా రెండు రకాలైన విధులు నిర్వర్తిస్తుంటాయి. తమకు అందే సమాచారం ఆధారంగా మోసగాళ్లు, నేరగాళ్లు, రౌడీషీటర్లతో పాటు అసాంఘిక శక్తులకు చెక్ చెబుతుంటుంది. నకిలీ సర్టిఫికెట్లు, నాసిరకం ఉత్పత్తులు, కల్తీ ఆహార పదార్థాలపై నిఘా ఉంచుతుంది. రౌడీషీటర్ల కదలికలు ఎప్పటికప్పుడు పసిగట్టడం, వారి కుట్రలు ఛేదించడంతో పాటు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఇస్తుంటుంది. మరోపక్క నగరంలో భారీ నేరాలు జరిగినప్పుడు తక్షణం రంగంలోకి దిగి గంటలు, రోజుల వ్యవధిలో నేరగాళ్లను పట్టుకోవడానికి కృషి చేస్తుంటుంది. ఈ కోణంలో టాస్క్‌ఫోర్స్ సాధించిన విజయాలు ఎన్నో ఉన్నాయి.

వారు సమర్థులే కానీ...

ఆయా భారీ నేరాలకు సంబంధించిన కేసులు శాంతిభద్రతల విభాగం ఠాణాల్లో నమోదవుతాయి. ఆ పోలీసులతో పాటు క్రైమ్ వింగ్‌ల్లో పనిచేసే వారిలోనూ అనేక మంది సమర్థులైన అధికారులు ఉంటాయి. అయితే వీరికి దర్యాప్తు, బందోబస్తు, కోర్టు సహా అనేక ఇతర డ్యూటీలు తప్పనిసరి. రోజువారీ విధులతో పాటు కేసుల దర్యాప్తునకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, వీటి పర్యవేక్షణ తదితర పనులతో నిత్యం బిజీగా ఉంటాయి. టాస్క్‌ఫోర్స్ అనేది కేవలం ఆపరేషనల్ విభాగం కావడంతో వీరి స్పందన తీరు భిన్నంగా ఉంటుంది. ఈ కారణంగానే భారీ నేరాలు జరిగినప్పుడు ఉన్నతాధికారులు కూడా టాస్క్‌ఫోర్స్‌నే రంగంలోకి దింపుతుంటారు.

ఉన్నతాధికారుల నుంచి సహాయ నిరాకరణ..

గడిచిన కొన్నాళ్లుగా టాస్క్‌ఫోర్స్ విభాగానికి స్థానిక ఉన్నతాధికారుల నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. ఏదైనా ఉదంతం జరిగినప్పుడు ఎంత వేగంగా సమాచారం అందుకుని, స్పందిస్తే ఫలితాలు అంత మెరుగ్గా ఉంటాయి. అయితే ఇటీవల కాలంలో కొందరు ఉన్నతాధికారులు కొన్ని నేరాలు జరిగినప్పుడు వెంటనే టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఇవ్వద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో విషయం మరుసటి రోజు వరకు వీరి దృష్టికి రావట్లేదు. ఈలోపు నేరగాళ్లు పారిపోవడమే, సొత్తు, సొమ్ము చేతులు మారిపోవడమే జరిగిపోతోంది. నేరగాడు దొరకడం ఎంత ఆలస్యమైతే రికవరీలు అంత తగ్గిపోతాయి. చివరకు నష్టపోయేది మాత్రం సామాన్యుడే. టాస్క్‌ఫోర్స్ పోలీసుల దర్యాప్తునకు సహకరించవద్దనీ ఠాణాల అధికారులకు కొందరు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నారు.

తీరు మారకుంటే తీవ్ర నష్టమే...

ఈ ఉన్నతాధికారుల తీరు మారకుంటే భవిష్యత్తులో తీవ్ర నష్టం తప్పదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్‌ను చిన్న చిన్న బందోబస్తులు, పికెట్ డ్యూటీలకు వాడటం వద్ద వారి ఆపరేషన్లు దెబ్బతింటాయని, ఒకసారి జరగాల్సిన ఆపరేషన్‌ను వాయిదా వేస్తే మళ్లీ ప్రారంభం కావడానికి రోజులు పట్టచ్చని స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక విభాగానికి నేతృత్వం వహించే అధికారికి నగరంపై పట్టు, ఇక్కడ పని చేసిన అనుభవంతో పాటు స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన అవసరం అని చెప్తున్నారు. ఈ కారణంగానే పాతబస్తీ కేంద్రంగా పనిచేసే బృందాల పనితీరు కంటే కొత్త నగరం నుంచి పనిచేసే బృందాల పనితీరు తక్కువగా ఉందని వివరిస్తున్నారు. సీనియర్ అదనపు లేదా నాన్–క్యాడర్ ఎస్పీ..నగరంలో పనిచేసిన, టాస్క్‌ఫోర్స్‌పై పట్టున్న వారికి ఈ వింగ్ బాధ్యతలు అప్పగిస్తేనే పరిస్థితులు మారతాయని స్పష్టం చేస్తున్నారు.

వర్ష సూచన నేపథ్యంలో...

హైడ్రా అలర్ట్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అప్రమత్తమైంది. ముంపు, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని డీఆర్‌ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. రాజ్‌భవన్ రోడ్డుతో పాటు వరద ముప్పు ఉన్న బేగంపేట, ప్రకాష్‌నగర్‌ల్లో పర్యటించాయి.

20న కేబీఆర్ పార్కు వద్ద 'ప్రజా సంబరాలు'

ప్రవేశం ఉచితం..

బంజారాహిల్స్: ప్రజాపాలనలో ప్రజా సంబరాలు కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన కేబీఆర్ నేచర్ కల్చర్ అండ్ ఫ్యామిలీ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతితో పాటు కార్యక్రమ నిర్వాహకులు పరిశీలించారు. హాబీస్ కార్నర్, షాపింగ్ స్టాల్స్, ఆర్ట్స్ కార్నర్, గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫోటో బూత్, లైవ్ మ్యూజిక్ తదితర కార్యక్రమాలను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. ఒకవైపు కళలకు ప్రాధాన్యతనిస్తూ వారసత్వ సంపదను కాపాడుకునే దిశలో ఈ కార్యక్రమాలను ఏర్పాటుకు ముందుకువచ్చారు. నేచర్, కల్చర్ అండ్ ఫ్యామిలీ థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వాకర్లు, సందర్శకులు, ప్రజలు ఈ సంబరాల్లో ఆనందోత్సాహాలతో గడపాలనే ఉద్దేశ్యంతో పలు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఆనందాన్ని పంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఏర్పాట్లను సంబంధిత అధికారులు పరిశీలించారు. ఎన్నో షాపింగ్ స్టాల్స్‌ను, ఫుడ్‌కోర్టులను ఇందులో ఏర్పాటు చేయనున్నారు. పెయింటింగ్ పోటీలు కూడా నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా ఈ ఈవెంట్‌కు ప్రవేశం ఉచితమని ఖైరతాబాద్ జెడ్సీ అనురాగ్‌జయంతి వెల్లడించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కేబీఆర్ పార్కు ప్రధాన గేటు పక్కనే ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



కేబీఆర్ జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎంసీ ప్రశాంతి



కేబీఆర్ పార్కు ముందు ఏర్పాటు చేసిన భారీ బెలూన్

ఆ పథకం 'గ్యాసే'నా!

- అర్హులకూ రూ.500 గ్యాస్ సిలిండర్' అందని వైనం
- 'ఉచిత విద్యుత్' వర్తిస్తున్నా... గ్యాస్ సబ్సిడీ మాత్రం నిల్
- కలెక్టరేట్, ప్రజాపాలన కౌంటర్ల చుట్టూ లబ్ధిదారుల చక్కర్లు
- స్పష్టత ఇవ్వని సివిల్ సప్లై విభాగం, గ్యాస్ ఏజెన్సీలు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పథకం అర్హులైన నిరుపేద కుటుంబాలకు సైతం అందని ద్రాక్షగానే తయారైంది. ఒక కుటుంబం రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు అర్హత సాధించినా..వంట గ్యాస్ సబ్సిడీ మాత్రం వర్తించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. లబ్ధిదారులు కలెక్టరేట్ ప్రజాపాలన కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేసి దరఖాస్తులు సవరించుకున్నప్పటికీ ఫలితం మాత్రం దక్కడం లేదు. ఇటు పౌరసరఫరాల శాఖ కానీ, అటు ఆయిల్ కంపెనీల గ్యాస్ ఏజెన్సీలు కూడా దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. ఫలితంగా నిరుపేదలు నిరాశకు గురవుతూ.. ఎప్పటి మాదిరిగానే బహిరంగ మార్కెట్ ధర చెల్లించి వంట గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజాపాలనలో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల వర్తింపు కోసం సరిగ్గా తొమ్మిది నెలల క్రితం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించి బీపీఎల్ కుటుంబాలను గుర్తించింది. అన్ని పథకాలకు తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. అర్హత సాధించిన కుటుంబాలకు రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ వర్తింపజేశారు. కానీ, సగానికి పైగా కుటుంబాలు కేవలం ఉచిత విద్యుత్ వర్తింపునకు పరిమితమయ్యాయి. సబ్సిడీ గ్యాస్ మాత్రం అందడం లేదు.

పరిష్కారమేదీ?

గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల ఫలాలు వర్తించని కుటుంబాల కోసం దరఖాస్తు సవరణ (ఎడిట్) కోసం కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలు సమస్యకు పరిష్కారం చూపడం లేదు. ఈ కేంద్రాల్లో పథకాలు వర్తించని దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు గ్యాస్‌కనెక్షన్ నెంబర్, ఎల్పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నెంబర్లను సవరించుకునే వెసులుబాటు ఉంది. దీంతో సేవా కేంద్రాలకు క్యూ కట్టి దరఖాస్తులను సవరించుకుంటున్నా..సమస్యకు పరిష్కారం లభించడం లేదని నిరుపేదలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి గ్యాస్ సబ్సిడీ వర్తింపజేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

గ్రేటర్ హైదరాబాద్ అర్బన్ పరిధిలో అధికారికంగా గృహోపయోగ వంటగ్యాస్ కనెక్షన్ కలిగిన కుటుంబాలు 30.18 లక్షలకు పైనే ఉన్నాయి. అందులో 20 శాతం మినహా మిగతా 80 శాతం కుటుంబాలు మహాలక్ష్మి పథకం కింద రూ. 500కు వంట గ్యాస్ సిలిండర్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో కనీసం పది శాతం దరఖాస్తుదారులకు కూడా గ్యాస్ సబ్సిడీ వర్తించలేదు.

తెలంగాణ ఫుడ్స్‌లో మంత్రి సీతక్క తనిఖీలు

అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం

మల్లాపూర్: నాచారంలోని తెలంగాణ ఫుడ్స్ కార్యాలయం, కర్మాగారాన్ని సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ, (సీతక్క) ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బాలామృతంతో పాటు స్నాక్స్, ఆహార పదార్థాల సరఫరాను అడిగి తెలుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. శుద్ధి ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీలో కార్మికులు, సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. అనంతరం బాలామృతం ఫౌడర్ నాణ్యతను చెక్ చేశారు. ఆహార పదార్థాలు, స్టోరేజ్ పాత్రలపై మెష్‌లు ఏర్పాటు చేయాలని, సిబ్బంది గ్లౌస్ వాడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాల నాణ్యతపై ల్యాబ్ నివేదికను తనకు అందజేయాలన్నారు.

మరమ్మతుల్లో జాప్యంపై మంత్రి ఆగ్రహం

సాంకేతిక లోపంతో నెల రోజులుగా పనిచేయని స్నాక్స్ ఫుడ్ యూనిట్ మరమ్మతుల్లో జాప్యంపై అధికారులు సిబ్బందిపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న కొత్త యూనిట్ పనులు పదేళ్లుగా పూర్తి కాకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. యంత్రాలను తక్షణమే ఇన్‌స్టాల్ చేయాలని ఆదేశించారు. బడ్జెట్ వివరాలు, ఖర్చులు వ్యయాలు, ఇబ్బందులు. సమస్యలు, ఉన్నత స్థాయి సిబ్బంది అర్హత, అనుభవం, ఎంతకాలంగా టీజీ ఫుడ్స్‌లో ఏ స్థాయిలో పని చేస్తున్నారని సమగ్ర వివరాలను సిద్ధం చేయాలన్నారు. త్వరలోనే టీజీ ఫుడ్స్ పనితీరుపై సమీక్ష చేస్తానన్నారు. మంత్రి వెంట తెలంగాణ రాష్ట్ర ఫుడ్స్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ పాయిం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీస్తున్న మంత్రి సీతక్క

స్పందించారు.. రక్షించారు..

మహిళా ప్యాసింజర్‌ను కాపాడిన ఆర్పీఎఫ్ పోలీసులు



అడ్డగుట్ట: కదులుతున్న రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడబోతున్న మహిళా ప్యాసింజర్‌ను ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు కాపాడారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చిన పుర్న ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగి వెళ్తున్న క్రమంలో ఓ మహిళా ప్యాసింజర్ రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి అదుపు తప్పింది. ఆమె రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడబోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రాజ శేఖర్, కానిస్టేబుల్ విశ్వజిత్‌కుమార్ హుటాహుటిన అక్కడికి వెళ్లి వెనక్కి లాగి ఆమె ప్రాణాలను కాపాడారు. ఈ ఘటనలో ఆర్పీఎఫ్ పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్యాసింజర్ ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లను ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ అభినందించారు. ఆపరేషన్ జీవన్ రక్ష కార్యక్రమంలో భాగంగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడుతున్న ఆర్పీఎఫ్ పోలీసులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా, వీగం గ్రామానికి చెందిన గట్టు సాయి ఇంద్రనీల్‌గౌడ్ (31) అవుషాపూర్ తీన్మార్ హోటల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం తెలవారుజామున అతను అవుషాపూర్‌కు బైక్‌పై వెళుతుండగా ఎన్ఎఫ్‌సీనగర్ ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఇంద్రనీల్‌గౌడ్ మృతదేహం

సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై డ్యాష్ బోర్డు

ఆన్‌లైన్‌లో మ్యాన్‌హోళ్ల డీ సిల్టింగ్ వివరాలు

- జీపీఎస్ ఆధారంగా క్యాన్ నెంబర్ల నమోదు
- ఎంసీసీ ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం

సాక్షి,సిటీబ్యూరో: సీవరేజ్ ఓవర్ ఫ్లో స్పెషల్ డ్రైవ్ తీరును డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు జల మండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మ్యాన్ హోళ్ల డీసిల్టింగ్ వివరాల్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. తీసిన వ్యర్థాలను (సిల్ట్) డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. డంపింగ్ యార్డులు అవసరమైతే వాటి ఏర్పాటుకు అనువైన స్థలాలు పరిశీలించాలని సూచించారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర అంశాలపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్ లో నమోదు చేస్తున్నామన్నారు. ఈ నమోదు ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, ఎన్నిసార్లు పరిష్కరించిన వివరాలను ఆ మ్యాప్‌లో ఒక బబుల్ (బుడగ) లా కనిపించేలా ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ఆ బబుల్ పరిమాణం మారుతుందన్నారు. ఈ ఏర్పాటు వల్ల సమస్య తీవ్రతను బట్టి అధికారులు దానిని పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.


సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై సమీక్ష నిర్వహిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం

ఎంసీసీలో వచ్చే ఫిర్యాదులపై తాత్కాలికంగా కాకుండా.. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం చూపించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్‌పై నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. క్షేత్ర స్థాయిలో మంచి పనితీరు కనబరుస్తుందన్నందుకు సిబ్బందిని, అధికారులను ఆయన అభినందించారు. రాబోయే రోజుల్లోనూ ఇదే చిత్త శుద్ధి, అంకితభావంతో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు.

డ్రైబోర్ వెల్స్ సర్వే వేగవంతం

డ్రై బోర్ వెల్స్‌పై కొనసాగుతున్న సర్వేను వేగవంతం చేయాలని ఎండీ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినియోగదారులు తమ ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్నవారికి నోటీసులు జారీ చేయాలన్నారు. వచ్చే జనవరి నుంచి ట్యాంకర్ బుక్ చేస్తే అదనపు ఛార్జి వసూలు చేస్తామని స్పష్టంగా చెప్పాలన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారుల ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో పంపించడంతో పాటు నేరుగా వారికి కరపత్రాలు అందజేయాలని సూచించారు.

ఓటీఎస్‌పై ప్రత్యేక దృష్టి

నల్లా నీటి వినియోగదారుల బకాయిలకు సంబంధించి వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా పంపించాలని ఎండీ సూచించారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీం సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అందులో బిల్లు చెల్లింపునకు చెందిన లింకును కూడా పంపించాలని.. తద్వారా వారికి సులభంగా ఉంటుందన్నారు. సమావేశంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు..

ఇంటిపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్: మద్యం తాగి వచ్చినందుకు భార్య గొడవపడటంతో మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ డీ పోచంపల్లి సారెగూడెం ప్రాంతానికి చెందిన శ్రీశైలం ముదిరాజ్(36), సౌజన్య దంపతులకు ఇద్దరు సంతానం. శ్రీశైలం ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతను రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి అతను మద్యం మత్తులో ఇంటికి రావడంతో అతడి భార్య గొడవపడింది. దీంతో మనస్తాపానికిలోనైన శ్రీశైలం తన ఇంటి మూడో అంతస్తు నుంచి కిందికి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సూరారం లోని ప్రైవేట్ ఆసుపత్రికి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ హౌస్ అరెస్ట్

అబిడ్స్: ఎమ్మెల్యే రాజాసింగ్‌ను మంగళ్‌హాట్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని ఓ ఆలయంలో జరిగిన సంఘటనపై సమాచారం అందడంతో రాజాసింగ్ అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించగా మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయనను బయటికి రాకుండా ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రాంతంలోని ఒక ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. తనను అక్కడికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఫోర్త్ సిటీలో ఏటీసీ సెంటర్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కందుకూరు: నెట్ జీరో సిటీ (ఫోర్త్‌సిటీ)లో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన భూమి, నిధులు, పరిపాలన అనుమతులను ప్రభుత్వం జారీ చేసింది. కందుకూరు, యాచారం మండలాల్లో ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం భూములు సేకరించింది. ఆ భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఫోర్త్‌సిటీ ఏర్పాటుకు పనులు ప్రారంభించింది. అందులో భాగంగా కందుకూరు మండలంలో రైతులకు కేటాయిస్తున్న లేఅవుట్ సమీపంలో పంజగూడ రెవెన్యూ సర్వే నంబర్ 90లో రెండు ఎకరాలను ఏటీసీ కోసం కేటాయించింది. ఆగస్టు 1న సీఎం రేవంత్‌రెడ్డి ఏటీసీ సెంటర్‌కు శంకుస్థాపన సైతం చేశారు. కాగా ఆ భూమిలో నిర్మాణాలతో పాటు అవసరమైన మిషనరీ, ఇతర పరికరాలు, శిక్షణకు అయ్యే వ్యయం కోసం టాటా టెక్నాలజీ లిమిటెడ్ భాగస్వామ్యంతో ప్రభుత్వం కలిసి పని చేస్తోంది. మొత్తం వ్యయం రూ.42.64 కోట్లుగా నిర్ధారించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 13.25 శాతం కాగా మిగతా వ్యయాన్ని టాటా టెక్నాలజీ లిమిటెడ్ సంస్థ భరించనుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఐటీఐలను అప్‌గ్రేడ్ మాత్రమే చేశారు. మొదటిసారి ఏటీసీ కేంద్రాన్ని ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్నారు. అందులో అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్ శిక్షణకు 48 సీట్లు, ఆర్టీజియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ కోర్సుకు 20 సీట్లు, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్) కోర్సుకు 48 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సుకు 40 సీట్లు, మెకానిక్, ఎలక్ట్రానిక్ వెహికిల్ శిక్షణ కోర్సుకు 48 సీట్లు, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ కోర్సుకు 40 సీట్లు కేటాయించారు. మొత్తం కోర్సుల సమయం రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. ఈ మేరకు కార్మిక, ఉపాధికల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం మత్తులోనే..

- నదీమ్ పాషా హత్య కేసులో వీడిన మిస్టరీ
- నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ ఏసీపీ హన్మంత్‌రావు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్న నదీమ్ పాషా హత్య కేసును ఛేదించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాలానగర్ ఏసీపీ హన్మంత్ రావు, సీఐ నర్సింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి కట్టా ప్రసాద్ అనే వ్యక్తి తన స్నేహితులు మహ్మద్ ఖలీల్‌తో కలిసి వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ప్రాంతంలో పుట్టినరోజు వేడుకలు చేసుకున్నాడు. అనంతరం వారు దీనబంధు కాలనీకి వెళ్లారు. అదే సమయంలో కాలనీలో రోడ్డుపై వెళుతున్న నదీమ్ పాషాతో వారికి గొడవ జరిగింది. దీంతో మద్యం మత్తులో ఉన్న కట్టా ప్రసాద్, మహ్మద్ ఖలీల్ నదీమ్ పాషాపై ఇనుప పైపులతో దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు కట్టా ప్రసాద్, మహ్మద్ ఖలీల్‌ను సోమవారం అరెస్టు చేశారు. వారి నుండి మొబైల్ ఫోన్లు, ఇనుప పైపులు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని గంటల్లోనే నిందితులను అరెస్టు చేసిన ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

కుమ్మరిగూడలో టెన్షన్..టెన్షన్

- ఆలయంలో విగ్రహం ధ్వంసం
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు
- భారీ బందోబస్తు ఏర్పాటు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయ సమీపంలోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో ఓ యువకుడు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. సోమవారం తెల్లవారు జామున ఆలయం వద్దకు వచ్చిన ఓ గుర్తు తెలియని యువకుడు గుడి తాళం పగులగొట్టి లోపలికి వెళ్లాడు. గర్భగుడిలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. అనంతరం ఆలయం పైకి ఎక్కి అక్కడ ఉన్న విగ్రహాలను ధ్వంసం చేసేందుకు యత్నించాడు. దీనిని గుర్తించిన ఓ వ్యక్తి అతడిని పట్టుకున్నాడు. అంతలోపు అక్కడికి చేరుకున్న స్థానికులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడిని మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా గుర్తించిన పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు.

పోలీసు బలగాల మోహరింపు..

అమ్మవారి విగ్రహం ధ్వంసమైనట్లు సమాచారం అందడంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్ద సంఖ్యలో ఉన్నతాధికారులు, పోలీసు బలగాలు అక్కడికి చేరుకున్నాయి. ఈ విషయం తెలియడంతో స్థానికులు, పలు సంఘాల నాయకులు ఆలయం వద్దకు చేరుకోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఆందోళన నెలకొంది. పలువురు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు ఆలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర, శ్రీనివాసులు పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.


ఆందోళన చేస్తున్న స్థానికులు

నిందితుడికి నిమ్స్‌లో వైద్య సేవలు

కుమ్మరిగూడ ఘటనలో తీవ్రగా గాయపడిన నిందితుడిని నిమ్స్‌కు తరిలించిన పోలీసులు ఆత్యవసర వైద్య విభాగంలో అతడికి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి వచ్చే వారిని తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. ఆస్పత్రి రోగులకు మంజూరు చేసిన గేట్ పాస్ లేనిదే లోపలికి అనుమతించడం లేదు. మీడియా ప్రతినిధుల ప్రవేశంపై ఆంక్షలు విధించారు.

అది ఉన్మాది దుశ్చర్య!

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయంపై దాడి చేసిన నిందితుడిని పోలీసులు మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడు మానసిక వ్యాధితో బాధపడుతూ ఉన్మాదిగా మారి ఓ వర్గం ప్రార్థన స్థలాలపై విద్వేషం పెంచుకున్నట్లు తేల్చారు. ఇతనిపై మహారాష్ట్రలో ఈ తరహాకు చెందిన రెండు కేసులు ఉన్నాయని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. అన్ని కోణాల్లోనూ లోతైన దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశామన్నారు. మహారాష్ట్రలోని ముంబ్రాకు చెందిన నిందితుడు కొన్నాళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నాడు. ఓ వర్గం ప్రార్థన స్థలాలపై విద్వేషం పెంచుకున్న ఈ ఉన్మాది 2022లో, ఈ ఏడాది ఆగస్టులో మహారాష్ట్రలోని గోరేగావ్, థానేల్లో వాటిపై దాడులు చేశాడు. కేసులు నమోదు కావడంతోపాటు జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

కుమ్మరిగూడ ఘటనపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోతే అది ప్రభుత్వ కుట్రగానే భావించాల్సి వస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సాయంత్రం దేవాలయానికి వచ్చిన ఆయన సంఘటనపై పోలీసులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయాలపై దాడి జరిగిన ప్రతిసారీ పిచ్చోడు చేశాడని చెప్పడం పోలీసులకు ఆనవాయితీగా మారిందన్నారు. – కేంద్ర మంత్రి బండి సంజయ్

మాయని మచ్చ

సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిపై జరిగిన దాడి దృశ్యాలు మనసును కలిచివేసేలా ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఇలాంటి మతిలేని పనులు హైదరాబాద్ సహనశీలతపై మాయని మచ్చలాంటివి. ఈ ఘటనకు పాల్పడిన దుండగులపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలి. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో దిగజారుతున్న శాంతిభద్రతలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి' అని డిమాండ్ చేశారు. – బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు

దాడుల వెనక కుట్రకోణం

హిందూ దేవాలయాలపై వరుస దాడుల వెనుక కుట్రకోణం ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ఇలాంటి మతవిద్వేష కార్యకలాపాలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఈ ఘటనకు పాల్పడిన వారు ఎంతటి వారైనా అరెస్టు చేయాలని, దీని వెనుక ఎవరెవరున్నారో వెంటనే తేల్చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పనితీరు వల్లే హిందూ ఆలయాలు, విగ్రహాల ధ్వంసం వంటివి చోటు చేసుకుంటున్నాయన్నారు. – బీజేపీ ఎంపీ డీకే అరుణ

కఠిన చర్యలు తీసుకోవాలి

హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ముత్యాలమ్మ విగ్రహంపై దాడిచేసిన వారిపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తదనంతర పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. – బీజేపీ ఎంపీ ఈటల

కోడలిపై అత్త, ఆడపడుచు దాడి

వేడి నీళ్లు పోయడంతో తీవ్ర గాయాలు

సంతోష్‌నగర్: కోడలిపై అత్త, ఆడపడుచు వేడి నీళ్లు పోవడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన నజియా బేగంకు సంతోష్‌నగర్ ఓవైసీ కాలనీకి చెందిన షేక్ షబ్బీర్‌తో వివాహం జరిగింది. షేక్ షబ్బీర్ ప్రస్తుతం ఉద్యోగం నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. నజియా బేగంకు నలుగురు సంతానం. అత్త మహ్మదియా బేగంతో తరుచూ గొడవలు జరుగుతుండటంతో నజియాబేగం కొద్ది రోజుల క్రితం అదే ప్రాంతంలో పిల్లలతో కలిసి వేరుగా నివాసముంటోంది. ఆదివారం పిల్లలు నానమ్మ ఇంటికి వెళ్లడంతో వారిని తీసుకొచ్చేందుకు నజియా బేగం అత్తగారింటికి వెళ్లింది. ఈ సందర్భంగా అత్త, ఆడపడుచుల మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి లోనైన అత్త మహ్మదియా బేగం, ఆమె కుమార్తె కలిసి నజియా బేగంపై వేడి నీళ్లు పోయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం బాధితురాలు నజియా బేగం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఆస్తి గొడవ

- వ్యక్తి దారుణ హత్య
- సమీప బంధువులే హత్య చేసినట్లు పోలీసుల నిర్ధారణ?
- పరారీలో నిందితులు

అబిడ్స్: ఆస్తి వివాదం కారణంగా ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టక్కరివాడి ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. టక్కర్‌వాడీ ప్రాంతానికి చెందిన దుర్గేష్ సింగ్ ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన అతని సమీప బంధువులు భజరంగ్ సింగ్, సత్యనారాయణ సింగ్, తుల్జారామ్ సింగ్ మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి వివాదం కొనసాగుతుంది. ఆదివారం రాత్రి దుర్గేష్ నిద్రిస్తుండగా భజరంగ్ సింగ్, సత్యనారాయణ, తుల్జారామ్ సింగ్ అతని ఇంటి వద్దకు వచ్చారు. దుర్గేష్ సింగ్‌కు ఫోన్ చేసి ఇంటి బయటికి రప్పించిన వారు ఒక్కసారిగా అతడిపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన దుర్గేష్ సింగ్ స్పృహతప్పి కింద పడిపోవడంతో నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. కుటుంబ సభ్యులు అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సీఎంను కలిసిన నవీన్‌యాదవ్


సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న నవీన్

వెంగళరావునగర్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వి.నవీన్ యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత ఆయనకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఎంకు పూలమొక్కను అందజేశారు.

సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ


రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న జి.మహాలక్ష్మి

కాచిగూడ: అవంతినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను సోమవారం హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు వాటర్ క్యూరింగ్ చేపట్టాలని, మ్యాన్‌హోల్స్ లెవెల్ చూసుకోవాలని అన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, కాలనీ ప్రతినిధులు జేపీ.రెడ్డి, శ్రీనాథ్, కాంగ్రెస్ నేతలు మహేష్ కుమార్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలి

లిబర్టీ: కులగణన చేయకుండా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. పదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం చేసిన బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మోసపూరిత పరిపాలన చేస్తుందని ధ్వజమెత్తారు. సోమవారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేయాలని నిర్ణయించిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహాలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇప్పటికైనా బీసీల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడి కులగణన చేస్తామని అధికారికంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలున్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా టెంట్ల ఏర్పాటు..!

ఇది వరకు తొలగించినా మళ్లీ అదే అంతు


ఏసీబీ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వ స్థలంలో టెంట్లు వేసిన దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ చర్చి రోడ్డులో ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్లతో పాటు టెంట్లు వేశారని ఇటీవల కొంత మంది హైదరాబాద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు మూడు వారాల క్రితం ఇక్కడ ప్రభుత్వ స్థలంలో షెడ్లను తొలగించారు. ఈ స్థలం ప్రస్తుతం రెవెన్యూ కస్టడీలో ఉందని అధికారులు ప్రకటించారు. అయితే వీటిని తొలగించి రెండు రోజులు గడవకముందే ఆక్రమణదారులు మళ్లీ యథా ప్రకారం అదే స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి రెవెన్యూ అధికారులకు సవాల్ విసిరారు. సుమారుగా రూ.500 కోట్ల విలువైన ఈ స్థలంలో కబ్జాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రాగా స్పందించిన అధికారులు ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ టెంట్లు వేసుకోవడం చర్చనీయాంశమైంది. అధికారులు స్పందించి వీటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎంపీకి దసరా శుభాకాంక్షలు


ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న భవాని శంకర్

రహమత్‌నగర్: రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్‌లను రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు సోమవారం వారి నివాసంలో కలిసి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు గ్యారనాగరాజు, మేఘన పద్మ, సాయి, యాదయ్య, బెన్నార్, సువర్ణ, పర్వీన్‌బేగం, దేవేందర్, మార్టిన్, విజయ్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం


తాగుబోతులు విధ్వంసంలో పగిలిన కారు అద్దాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో తాగుబోతులు, ఆవారా యువకుల ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కొంతమంది తాగుబోతులు బస్తీలో మద్యం సేవించి ఒకరిని ఒకరు కొట్టుకుంటూ రామారావు ఆస్పత్రి వద్ద పార్కింగ్ చేసిన ఓ కారుతో పాటు మినీ డీసీఎం వ్యాన్ అద్దాలను పగలగొట్టారు. గతంలో కూడా ఇక్కడ పలుమార్లు ఆవారా యువకులు గంజాయి సేవిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా ఆవారా యువకులపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భూగర్భ జలాలు తరిగిపోకుండా..

జనవరిలోగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాల్సిందే
- 90 రోజుల కార్యాచరణలో ఇంటింటి సర్వే
- లేకపోతే ట్యాంకర్‌కు రెట్టింపు డబ్బులు వసూలు
- ఇప్పటి వరకు ఇంకుడుగుంతలు లేని ఇళ్లు 5184
- అవగాహన కలిగిస్తున్న అధికారులు


ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తున్న జలమండలి అధికారులు


కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ నీటి మట్టాలు పడిపోకుండా జలమండలి ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. వచ్చే వేసవిలోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది. ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ నెల 2వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు 90 రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపడుతుంది. దీనిలో భాగంగా అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఇంకుడు గుంతల ప్రయోజనాలను తెలియజేయడమే కాకుండా లేకపోతే నిర్మించుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు ఇంకుడు గుంతలు లేని ఇళ్ల లెక్క తీసుకోవడానికి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సర్వే చేపడుతున్నారు. జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజీగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఇప్పటికే వాటర్‌బోర్డు పరిధిలోని రెయిన్‌వాటర్ హార్వేస్టింగ్ సెల్ ద్వారా ఎన్‌జీఓలు ఈ సర్వే పూర్తి చేశారు. డివిజన్-6 పరిధిలో 300 గజాలకు పైగా నిర్మించిన నివాసాలు, అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతలు ఉన్నాయో లేవో ఈ సర్వే ద్వారా నిర్ధారించారు.

- డివిజన్-6 పరిధిలో 300 గజాల పైన నివాసాలు, అపార్ట్‌మెంట్లు 7092 ఉన్నట్లుగా తేలింది. ఇందులో సోమవారం నాటికి 6937 నివాసాల సర్వే పూర్తయ్యింది.
- 5184 నివాసాలకు ఇంకుడుగుంతలు లేవని సర్వేలో తేలింది.
- మిగతా 1753 నివాసాలకు మాత్రమే ఇంకుడుగుంతలు ఉన్నట్లుగా గుర్తించారు.
- ఇంకుడుగుంతలు లేని 5184 మందికి నోటీసులు ఇచ్చి అవగాహన కల్పిస్తున్నారు.
- వీరంతా జనవరి లోగా తమ ఇళ్లల్లో లేదా అపార్ట్‌మెంట్లలో తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి. అప్పటికి కూడా ఇంకుడు గుంతలు నిర్మించుకోకపోతే వచ్చే వేసవిలో వీళ్లు ట్యాంకర్ బుక్ చేసుకుంటే రెట్టింపు డబ్బులు వసూలు చేస్తారు. ఈ విషయాలపై ఒకవైపు అవగాహన కలిగిస్తూనే ఇంకోవైపు నోటీసులు ఇచ్చే ప్రక్రియ మొదలైంది.
- గత ఏడాది నీటి ఎద్దడితో బోర్‌వెల్స్ నిండిపోయి చాలా మంది వాటర్ ట్యాంకర్లు బుక్ చేసుకున్నారు. ఈ సర్వేలో ఆ జాబితాను సిద్ధం చేసి అందులో ఇంకుడు గుంతలు లేని నివాసాలు తీసుకుని వారు వచ్చే వేసవిలో ట్యాంకర్ బుక్ చేసుకుంటే రెట్టింపు డబ్బులు వసూలు చేస్తారు.
- గత వేసవిలో ఏయే ప్రాంతాల నుంచి ట్యాంకర్లు సప్లై చేయాలని అధిక మొత్తంలో ఆర్డర్లు వచ్చాయన్నది అధికారుల దగ్గర లెక్కలు సిద్ధంగా ఉన్నాయి.
- ఆయా ప్రాంతాలతో పాటు డివిజన్ పరిధిలో రాబోయే రోజుల్లో వాటర్ ట్యాంకర్ల డిమాండ్ తగ్గించేందుకు, భూగర్భ జలాలు పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.
- ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
- అధికారులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి ఇంకుడుగుంతల అవసరాన్ని అందులో వివరిస్తున్నారు.
- తాజాగా 300 గజాల స్థలంలో నిర్మించిన ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఉండాలనే నిబంధనను తప్పకుండా అమలు చేసే దిశలో అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఉచితంగా సాంకేతిక సిబ్బందిని పంపిస్తాం

- హరిశంకర్, జలమండలి జీఎం, డివిజన్-6

సీవరేజీ పైప్‌లైన్ల వ్యర్థాల తొలగింపు, ఇంటింటా ఇంకుడుగుంత నిర్మాణం థీమ్‌తో సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ, భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90 రోజుల ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాం. గాంధీ జయంతి రోజు నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ఈ ప్రణాళిక కొనసాగిస్తాం. ఇప్పటికే మా పరిధిలో 300 గజాల పైన నివాసాల్లో ఇంకుడుగుంతలు లేని వాటిని గుర్తించడం జరిగింది. వారందరికీ అవగాహన కల్పించడంతో పాటు నోటీసులు ఇస్తున్నాం. సాంకేతిక సిబ్బందిని కూడా ఇంకుడుగుంతల మార్గదర్శకాల కోసం ఉచితంగా పంపిస్తాం. ఎవరైనా తమ ఇళ్లల్లో ఇంకుడుగుంత నిర్మించాలనుకుంటే జలమండలి గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించవచ్చు. 155313కి కూడా ఫోన్ చేసి సమాచారం తీసుకోవడమే కాకుండా తమ ఇళ్లల్లో ఇంకుడుగుంతలు నిర్మించాలనుకుంటే సంప్రదించవచ్చు. భూగర్భ జలాలు తరిగిపోకుండా ఉండాలంటే ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరి.

వ్యభిచార గృహంపై దాడి

- నిర్వాహకులతో పాటు మహిళ అరెస్ట్

వెంగళరావునగర్: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకులతో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లోని ఓ గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్టుగా మధురానగర్ పీఎస్‌కు సమాచారం వచ్చింది. దీంతో ఎస్‌ఐ అవినాష్ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. అక్కడ నిర్వాహకులు వంశీ, అతని భార్య ఉన్నారు. వారితో పాటుగా వైజాగ్‌కు చెందిన మహిళ కూడా ఉంది. నిర్వాహకులను పోలీసులు ప్రశ్నించగా వైజాగ్‌కు చెందిన మహిళతో వ్యభిచారం చేయిస్తున్నట్టుగా అంగీకరించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న కండోమ్స్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ లాక్కుని పరారీ

వెంగళరావునగర్: రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతున్న యువకుడి ఫోన్ లాక్కుని వెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లికి చెందిన సాయికృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన కారును మైత్రీవనం సమీపంలో ఆపి కూకట్‌పల్లి వెళ్ళడానికి బస్సు కోసం రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని యువకుడు ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చి సాయికృష్ణ చేతిలోని ఫోన్ లాక్కుని పారిపోయాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ సేవా అవార్డు

గోల్కొండ: సేవా కార్యక్రమాలు చేసే వారిని సమాజం తప్పకుండా గుర్తిస్తుందని ఎఫ్‌టీపీసీ అధ్యక్షులు జంగ చైతన్య అన్నారు. గత 15 సంవత్సరాలుగా నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు ఉత్తమ సేవా అవార్డు అందించి అభినందించారు.

సరికొత్త రుచులకు వేదికగా నగరం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయారెడ్డి

ఖైరతాబాద్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్రాండ్లు తమ బ్రాంచీలను నగరంలో ఏర్పాటు చేసుకునేందుకు ముందుకురావడం అభినందనీయమని ఇది నగర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గుజరాత్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన హెల్లి అండ్ చిల్లీ రెస్టారెంట్‌ను ఆయన ఖైరతాబాద్‌లో కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫుడ్‌రంగంలో నగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతుందని ఏ దేశానికి చెందిన వారు వచ్చినా వారివారి ఆహారపు అలవాట్లకు తగినట్లుగా ఆహారం దొరుకుతుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు షుజావుద్దీన్ మాట్లాడుతూ హెల్లి అండ్ చిల్లీ రెస్టారెంట్ ఫుడ్ రంగంలో ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం నమోదై ఉన్నదని నాణ్యమైన సేవలకు ఇది పేరుగాంచిందని అన్నారు. ఈ రెస్టారెంట్‌లో వినియోగదారులు సరికొత్త అనుభూతికి లోనయ్యేలా బర్గర్, కాఫీలలో వారి పేర్లతో అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు జమీర్, మహబూబ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీవోస్ యూనియన్


మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేన్‌లను సత్కరిస్తున్న కేఆర్. రాజ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తామని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్ రాజ్‌కుమార్, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఆర్‌ఆర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి బుచ్చిరెడ్డిలతోపాటు యూనియన్‌కు చెందిన పలువురు నాయకులు వారిని ఘనంగా సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనీ మట్లాడుతూ రౌండ్ ది క్లాక్ పద్ధతిలో రేయింబవళ్లు ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, ముఖీద్, ఖాదర్, రాజు, అహ్మద్, ముజాయిద్, ప్రియాసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనాలు


ఇందిరానగర్ ఫేజ్2లో వేముల యాదయ్య


బోరబండలో బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న అమ్మవారికి ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నిమజ్జనాలకు తరలించారు. బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లోని మండపాల వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన పూజల్లో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయ వల్ల తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు, బస్తీ అధ్యక్షులు, భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా రహమత్‌నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్‌ఫేజ్-2 అమ్మవారి ఆలయం నుంచి నిమజ్జనానికి బయలుదేరిన అమ్మవారికి బస్తీ అధ్యక్షుడు, ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య, ఉపాధ్యక్షుడు చెన్నయ్య బస్తీ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు బస్తీల్లో డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ అమ్మవార్లను నిమజ్జనానికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

వెంగళరావునగర్ : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సనత్‌నగర్‌కు చెందిన ఎం. సుభాష్ ఆదివారం మాదాపూర్ నుంచి సనత్‌నగర్ ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతున్నాడు. మధురావైన్స్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సాయిదుర్గ ప్రసాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా మధురానగర్ పోలీసులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఇద్దరికి..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన చైతన్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పార్ట్ టైం ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం దేవి అనే మహిళను కల్వరి టెంపుల్ నుంచి మధురానగర్ తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో మైత్రీవనం సమీపంలోకి రాగానే సంతోష్‌కుమార్ వేగంగా తన ద్విచక్ర వాహనంపై వచ్చి ర్యాపిడోను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో మహిళతో పాటు, చైతన్యకు గాయాలయ్యాయి. బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీలు తీసుకుంటూ.. సందడి చేస్తూ..

గోల్కొండ కోటలో పర్యాటకుల కిటకిట

గోల్కొండ: గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి నెలకొంది. సోమవారం వేలసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో జాతరను తలపించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉదయం 7 గంటలకే కోటకు చేరుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టికెట్ కౌంటర్ ముందు భారీ క్యూ ఏర్పడింది. పిల్లలు, పెద్దలు కోటలోకి ప్రవేశించి ప్రహరీలు, ఫౌంటేన్, ఫిరంగుల వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. అక్కడ ఉన్న హిస్టరీ గైడ్స్ వారికి ప్రవేశ ద్వారం పైభాగాన ఉన్న క్లాపింగ్ పోర్టికో విశేషాలను వివరించారు. ఇక్కడ చప్పట్లు కొడితే కోటపై భాగంలో కొలువుదీరిన రాజుకు వినపడేదని వారు వివరించగా పర్యాటకులు ఆనాటి సాంకేతిక పరిజ్ఞానానికి ఆశ్చర్యచకితులయ్యారు. కుతుబ్‌షాహీ రాజుల కాలంనాటి ఆయుధాలు భద్రపరిచిన శిలాఖానా సందర్శనకు పోటీపడ్డారు. అక్కడ భద్రపరచబడిన సుమారు 500 సంవత్సరాల నాటి వివిధ రకాల ఆయుధాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. రాణిమహల్, అక్కడ ఉన్న ఫౌంటేన్ చూస్తూ పర్యాటకులు మెట్ల మార్గాన గోల్కొండ పైభాగానికి వెళ్లి అక్కడ కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. మార్గమధ్యలో శ్రీరాముడి పరమభక్తుడైన భక్త రామదాసును కుతుబ్ షాహీ రాజు బంధించిన చెరసాలను కూడా పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.


కోట బుక్కింగ్ కౌంటర్ వద్ద బారులు తీరిన పర్యాటకులు


గోల్కొండ కోటలో పర్యాటకులు

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు


నడిరోడ్డుపై కుంగిపోయిన మ్యాన్‌హోల్ మూత

- ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువు

పంజగుట్ట: వెంకటరమణ కాలనీ నుంచి పద్మావతి నగర్ వెళ్లే ప్రధాన మార్గంలో ఓ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత మ్యాన్‌హోల్‌లోకి కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. గత వారం రోజుల నుంచి ఈ విధంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇటీవల ఒక స్టాండ్‌ను తీసుకువచ్చి మ్యాన్‌హోల్‌కు అడ్డంగా పెట్టి చేతులు దులుపుకున్నారని పేర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఎక్కువగా స్కూల్ బస్సులు, ఆటోలు వెళ్తాయని ఏదైనా ప్రమాదం జరిగే ముందే ఈ మ్యాన్‌హోల్‌ను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


జవహర్ కాలనీ కమ్యూనిటీ హాల్ ముందు ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

ఫిలింనగర్‌లో...

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని జవహర్‌కాలనీ బస్తీలో గడిచిన 15 రోజులుగా మ్యాన్‌హోల్ మూత దెబ్బతిని ప్రమాదకరంగా ఉండటంతో స్థానికులు ఫిర్యాదు చేసినా జీహెచ్‌ఎంసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. ఈ ఇరుకైన సందులో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇటుగా వెళ్లిన వాహనదారులకు ఈ మ్యాన్‌హోల్ వల్ల చిన్నచిన్న గాయాలు కూడా అయ్యాయి. అంతేకాకుండా రాత్రి వేళల్లో ఈ సందుదారిన వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా దెబ్బతిన్న మ్యాన్‌హోల్ మూతను సరిచేయాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

సాక్షి
మంగళవారం। 15। అక్టోబర్। 2024

సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు పరామర్శ



కేపీహెచ్‌బీకాలనీ: సినీనటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేష్‌లు సోమవారం రాజేంద్రప్రసాద్ నివాసానికి విచ్చేసి ఆయన కుమార్తె గాయత్రి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించారు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎలక్ట్రిక్ బస్సుయాత్ర

సిటీలో దక్షిణ దశను ప్రారంభించిన గోపాలకృష్ణ



సాక్షి, సిటీబ్యూరో: న్యూగో ఆధ్వర్యంలో గ్రీన్ మొబిలిటీ ఎలక్ట్రిక్ బస్సు యాత్రలో భాగంగా దక్షిణ దశను నగరం వేదికగా తెలంగాణ ప్రభుత్వ ఆటోమోటివ్, ఈవీ డైరెక్టర్ గోపాలకృష్ణ ప్రారంభించారు. దేశంలోని మొట్టమొదటి ఎలక్ట్రిక్ ఇంటర్‌సిటీ బ్రాండ్ న్యూగో ఆధ్వర్యంలో గ్రీన్ మొబిలిటీని ప్రోత్సహించడానికి చేపట్టిన ఎలక్ట్రిక్ బస్సు యాత్ర కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కొనసాగనుంది. కశ్మీర్ నుంచి ప్రారంభమైన ఈ ఆల్–ఎలక్ట్రిక్ బస్సు, అత్యాధునిక సాంకేతికతతో ఎలాంటి కాలుష్య కారకాలను విడుదల చేయదు. 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మీదుగా 4 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించే ఈ యాత్ర దేశంలోని విభిన్న భూభాగాల్లో ఇంటర్ సిటీ ప్రయాణానికి ఈవీ బస్సుల సాధ్యాసాధ్యాలను ప్రదర్శిస్తుంది. ఈ హరిత ప్రయాణం దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల గురించి అవగాహన పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను ప్రదర్శిస్తుంది.

కిన్నెర మొగులయ్య భూమి పరిరక్షణ బాధ్యత తీసుకుంటాం

- రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు



పద్మశ్రీ మొగులయ్యకు సన్మానం చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

నాగోలు: పద్మశ్రీ కిన్నెర మొగులయ్యకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భూమిలోని గోడలను గుర్తు తెలియని దుండగులు కూల్చివేయడంతో రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబును ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో మొగులయ్య సోమవారం కలిసి సమస్యను వివరించారు. భూమి పరిరక్షణకు పూర్తి బాధ్యత తీసుకుంటామని సీపీ సుధీర్‌బాబు హామీ ఇచ్చారు. అనంతరం మొగులయ్యను సత్కరించారు. వివరాలు.. పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ మండలం, బాగ్‌హయత్ నగర్ సర్వే నెం.159లో 600 గజాల భూమిని మంజూరు చేసింది. సదరు ప్లాట్ చుట్టూ ఆయన ప్రీకాస్ట్ గోడ నిర్మించుకున్నారు. ఈ నెల 11వ తేదీన ఉదయం మొగులయ్య తన ప్లాట్ వద్దకు వెళ్లి చూసేసరికి ఉత్తరం వైపు ఉన్న ప్రీకాస్ట్ గోడను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చారు. అదేరోజు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విషయంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబును ఎల్‌బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన కలిశారు. ఆ భూమి పరిరక్షణకు పూర్తి బాధ్యత తీసుకుంటామని, వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మనోహర్, హయత్‌నగర్ సీఐ నాగరాజు, ఎస్‌ఐ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆటోమొబైల్‌పై ‘రియల్’ ప్రభావం



దసరా సీజన్‌లో వాహనాల అమ్మకాలు తగ్గుముఖం

- పెరిగిన ద్విచక్రవాహనాలు.. తగ్గిన కార్ల అమ్మకాలు
- వాహనాల అమ్మకాలు పెంచుకొనేందుకు ఎన్నో ఆఫర్లు
- తీవ్ర నిరాశలో ఆటోమొబైల్ డీలర్స్

సాక్షి, సిటీబ్యూరో: దసరా పండుగ ఈ ఏడాది ఆటోమొబైల్ రంగాన్ని కొంతమేర నిరాశకు గురిచేసింది. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. ద్విచక్ర వాహన విక్రయాలు ఆశాజనకంగానే ఉన్నా కార్ల అమ్మకాలు తగ్గాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం అమ్మకాలు పెరగాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఉన్నట్లు రవాణాశాఖ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాటు అమ్మకాలు ఉన్నా, లేకున్నా అక్టోబర్‌పైనే ఆశలు పెంచుకొనే డీలర్లు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా మార్కెట్ కార్యకపాలు నెమ్మదించడం, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైపోవడం వల్ల కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాల విక్రయాలు తగ్గినట్లు చెబుతున్నారు. గతేడాది కంటే ఈసారి 15 నుంచి 20 శాతం తగ్గుదల ఉన్నట్లు చెప్పారు. మరోవైపు ద్విచక్ర వాహనాల అమ్మకాలు బాగానే ఉన్నప్పటికీ గతేడాదితో పోలిస్తే పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదని పేర్కొంటున్నారు.

ఆదాయంలో బైక్‌లపైనే ఎక్కువ..

మొత్తంగా వాహనాల అమ్మకాలు తగ్గుముఖం పట్టినప్పటికీ జీవితకాలపన్ను రూపంలో ఆర్టీఏకు వచ్చే ఆదాయంలో బైక్‌లపైనే ఎక్కువగా వచ్చింది. కార్లపై దాదాపు స్థిరంగానే ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతీయ రవాణా కార్యాలయాల పరిధిలో సుమారు 150 ఆటోమొబైల్ షోరూమ్‌లు ఉన్నాయి. వాటితో పాటు మరో 50కి పైగా అనుబంధ షోరూమ్‌లు ఉన్నాయి. సాధారణంగా గ్రేటర్ పరిధిలోని 10 ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ప్రతిరోజు 1500 నుంచి 2,000 వరకు కొత్త వాహనాలు నమోదవుతాయి. దసరా, దీపావళి వంటి పండుగ రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు ఉంటుంది. కొత్త వాహనం కొనుగోలు చేయాలని భావించే ప్రతిఒక్కరూ దసరా రోజులను శుభప్రదంగా భావిస్తారు. మరోవైపు దసరా సందర్భంగా ప్రకటించే ఆఫర్లు కూడా వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటాయి. కానీ ఈసారి కార్లపైన గరిష్టంగా రూ.లక్ష వరకు తగ్గింపు ఇచ్చినా ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేవని పలువురు డీలర్లు అన్నారు.

బైక్ ఓకే..

బైక్‌ల అమ్మకాలు మాత్రం గతేడాది కంటే పెరిగాయి. గత సంవత్సరం అక్టోబర్ 15వ తేదీ నుంచి 24 వరకు 32,306 ద్విచక్ర వాహనాలను విక్రయించగా, ఈ అక్టోబర్ 3వ తేదీ నుంచి 13 వరకు 35,475 బైక్‌లు అమ్ముడయ్యాయి. సుమారు 3,169 ద్విచక్రవాహనాలను అదనంగా విక్రయించారు. ‘ఆటోమొబైల్ రంగానికి దసరా లైఫ్ వంటిది. అలాంటి దసరా ఈ సారి తీవ్రంగా నిరాశపర్చింది.’ అని తెలంగాణ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్ కోటేశ్వర్‌రావు చెప్పారు.

ఆటోమొబైల్‌పై ప్రభావం

ఆటోమొబైల్‌పై కూడా ఈ ప్రభావం ఈసారి స్పష్టంగా ఉంది. గత సంవత్సరం దసరా సందర్భంగా 10 రోజుల్లో 10,878 కార్ల అమ్మకాలు జరిగాయి. ఈ సంవత్సరం అదే కాలానికి 10,139 కార్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఏటేటా రెట్టింపు చొప్పున పెరగాల్సిన అమ్మకాలు ఈసారి తగ్గుముఖం పట్టాయి. పైగా ఒకేసారి స్టాక్ తెచ్చి పెట్టుకోవడం వల్ల నష్టంగానే భావిస్తున్నాం..’ అని సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ షోరూమ్ డీలర్ ఒకరు అభిప్రాయపడ్డారు. ఈ వాహనాల్లోనూ చాలా వరకు రూ.20 లక్షలలోపు వాహనాలే ఎక్కువ. హైఎండ్ కేటగిరికి చెందినవి తక్కువే. వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన కార్ల పైన రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు ప్రోత్సాహకాలను ఇచ్చారు. గరిష్టంగా కొన్నింటిపైన రూ.లక్ష వరకు రాయితీ లభించింది. అలాగే రెండేళ్ల బీమా డబ్బులను కూడా డీలర్లే భరించారు. అయినప్పటికీ అమ్మకాలు పెరగలేదు.

నగరంలో నేడు

- గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ రచయితల వర్క్‌షాపు ఉదయం 11 గంటలకు జరుగుతుంది. ఉర్దూలో ఉన్నత విద్య కోసం పాఠ్య పుస్తకాలను అభివృద్ధి చేయడానికి అకడమిక్ రైటింగ్‌పై ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు.
- ప్రో కబడ్డీ ప్లేయర్ మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్ పరిమ్యాచ్ సంబంధించి బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు జరుగుతుంది.
- బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

నేడు కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ–2024 ద్వారా ఎంపికై కొత్త టీచర్లుగా నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం పోస్టింగ్ లభించనుంది. హైదరాబాద్ జిల్లా నుంచి సుమారు సుమారు 616 మంది ఉపాధ్యాయులుగా ఎంపికై నియామక పత్రాలు అందుకున్నారు. హైదరాబాద్ పరిధిలోని అభ్యర్థులకు అబిడ్స్‌లోని చాపల్ రోడ్డులోని ఎస్సెస్సీ బోర్డు ఎదురుగా గల స్టాన్లీ బాలికల హైస్కూల్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పోస్టింగ్స్ కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమతో పాటు నియామక పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, హాల్ టికెట్లు తీసుకొని రావాలని అధికారులు సూచించారు.

అరుణోదయ నాగన్నకు సుద్దాల జాతీయ పురస్కారం



మాట్లాడుతున్న డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజాఉద్యమాలతో ముడిపడి ఉండి పాటను ప్రాణంగా నిలబెట్టిన అరుణోదయ నాగన్నకు సుద్దాల హనుమంతు, జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేయనున్నట్లు సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుద్దాల హనుమంతు జానకమ్మల పురస్కారక ప్రదానోత్సవానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19న సాయంత్రం 6గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డును ప్రదానోత్సవం చేస్తున్నామని, దీంతో పాటు రూ.25 వేల పారితోషికాన్ని చెక్కురూపంలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. అంతేగాకుండా బాల్య స్నేహితులు అండెం వెంకట్‌రెడ్డి, బీసు భిక్షపతులకు ప్రత్యేక సన్మానం ఉంటుందని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, ఉపాధ్యక్షులు కె.సుజావతి తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీకి

ఈడీఏ మంజూరు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి ఎలక్ట్రానిక్ డిజైన్ అండ్ ఆటోమేషన్ (ఈడీఏ) మంజూరైనట్లు ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఇంజినీరింగ్‌తో పాటు ఫిజిక్స్, మ్యాథ్స్ పరిశోధన విద్యార్థులు ఈడీఏను ఉచితంగా ఉపయోగించుకుని ప్రాజెక్టులు, పరిశోధనలు చేసుకోవచ్చని అన్నారు. ప్రైవేటు కాలేజీ విద్యార్థులు ఆయా కాలేజీ ప్రిన్సిపల్స్‌తో లేఖ రాయించి ఓయూలో అనుమతి తీసుకొని ఈడీఏను వాడుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు ఫోన్: 92471 84538.

18న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవం



మాట్లాడుతున్న కల్లుగీత సంఘం ప్రధాన కార్యదర్శి మేకపోతుల వెంకటరమణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవాన్ని బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మేకపోతుల వెంకటరమణ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత సంఘం వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 10ఏళ్ల ప్రయాణం, కల్లుగీత వృత్తిలో ఉపాధి అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వృత్తిలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, గీత కార్మికులకు బీమా పథకాన్ని అమలు చేయాలని, ఏజెన్సీ ఏరియాల్లో కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాటూరి బాలరాజుగౌడ్, వివిధ జిల్లాల అధ్యక్షులు సుధాకర్, లింగం గౌడ్, యాదయ్య, ప్రభాకర్, కృష్ణస్వామి, రామస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా మీ సేవ దరఖాస్తులకు పరిష్కారం

- మీ సేవ ఆపరేటర్లతో ప్రతినెలా సమావేశం
- ఎప్పటికప్పుడు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం
- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: మీ సేవ ద్వారా వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటన్నింటినీ వారంలోగా పరిష్కరించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్‌లను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ప్రజావాణి, సీఎం ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మీ సేవ ద్వారా వివిధ సర్టిఫికెట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను ఏ మాత్రం పెండింగ్‌లో ఉంచకుండా వచ్చే సోమవారంలోగా అన్నింటినీ పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవ ఆపరేటర్లతో ప్రతినెలా తహసీల్దార్లు సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేయాలన్నారు. ప్రజావాణిలో 156 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణశాఖకు 121, పెన్షన్లు 08, భూసమస్యలకు సంబంధించి 04, ఇతర 23 వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్, ఈ.వెంకటాచారి, ఆర్డీఓ మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు జి.ఆశన్న, పెరిక యాదయ్య, ఆర్.కోటాజీ, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్, ఆర్.రోహిణి, ఇలియాజ్ అహ్మద్, షఫీమియా తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీకి ఒడిశా ట్రైనీ ఐఏఎస్‌ల బృందం


లక్డీకాపూల్: ఒడిశా 2023 బ్యాచ్‌కు చెందిన ప్రొబెషనరీ ఐఏఎస్ అధికారుల బృందం జీహెచ్‌ఎంసీలో అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేసేందుకు సోమవారం నగరానికి విచ్చేసింది. ఈ సందర్భంగా వారు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి ట్యాక్స్, ఫైనాన్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి కీలక విభాగాల్లో జీహెచ్‌ఎంసీ తీసుకుంటున్న చర్యలు, ప్రజలకు అందిస్తున్న ఆధునిక సేవలు, సాంకేతికతపై తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఐఏఎస్‌ల బృందంతో ఆయా విభాగాల ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, జీహెచ్‌ఎంసీ ఆదాయ వనరులు సమకూర్చుకుంటున్న తీరు, పర్యావరణ సుస్థిరత కోసం తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను చెల్లింపుల కోసం ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. జీహెచ్‌ఎంసీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డివి మాటలే..

మాజీ మంత్రి రవీంద్రనాయక్

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయే తప్ప చేతలు మాత్రం శూన్యమని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రవీంద్రనాయక్ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. సహాయ మంత్రిగా ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్, దేశ రక్షణ డాక్యుమెంట్ల తస్కరణ వంటి ఘటనలు హైదరాబాద్‌లో జరుగుతుంటే కేంద్ర నిఘా సంస్థలు, సెంట్రల్ ఇంటెలిజెన్స్, ఐబీలు ఏంచేస్తున్నట్లు? దీనికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పాలనా, కేసీఆర్ కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేశారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

నేడు గాంధీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నూతన వసతి గృహాల నిర్మాణ పనులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ప్రారంభిస్తారని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర తెలిపారు. గాంధీలో వైద్య విద్యార్థుల కోసం హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.79.50 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. పీజీలు, రెసిడెంట్ వైద్యులకు లేడీస్, బాయ్స్ హాస్టల్స్ వేర్వేరుగా నిర్మించనున్నారు. గత దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్ భవన నిర్మాణాలకు మోక్షం లభించడంపై వైద్యులు, వైద్యవిద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి ఐవీఎఫ్ సెంటర్..

గాంధీ ఆస్పత్రి ఎంసీహెచ్ భవనంలోని ఐవీఎఫ్ సెంటర్‌ను మంగళవారం నుంచి అందుబాటులోకి తేనున్నారు. ఏడాది క్రితం అత్యాధునిక వైద్య యంత్రాలతో ఐవీఎఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ నిష్ణాతులైన టెక్నీషియన్లు, రీఏజెంట్స్(ద్రావకాలు) లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. వైద్యమంత్రి ఆదేశాల మేరకు కీలక యాంబ్రియాలజీ టెక్నీషియన్ నియామకం, రూ.10 లక్షల వ్యయంతో రీఏజెంట్స్ కొనుగోలు చేయడంతో ఐవీఎఫ్ సెంటర్ అందుబాటులోకి రానుంది. గాంధీ ఆస్పత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవానికి మంగళవారం రానున్న వైద్యమంత్రి దామోదర రాజ నర్సింహ సమక్షంలో ఐవీఎఫ్ సెంటర్‌ను అందుబాటులోకి తేనున్నారు.

డిగ్రీ కళాశాలల బంద్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధు, నాగరాజు

ముషీరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల మధ్యలో విద్యార్థులను బలి చేయడం సరైన పద్ధతి కాదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పోడపగి నాగరాజు పేర్కొన్నారు. విద్యానగర్‌లో సీపీ భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఓయూ, కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిరవధికంగా కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయని, ఈ బంద్ వలన మధ్యతరగతి విద్యార్థుల చదువు ఆగమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ఒక పక్క డిగ్రీ సెమినార్ ఎగ్జామ్ ఫీజులు కట్టి ప్రిపేర్ అవుతున్న సమయంలో డిగ్రీ కళాశాలలు బంద్ చేయడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మంద నవీన్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గుర్రం అజయ్, నర్సింహారెడ్డి, రాష్ట్ర కోశాధికారి మామిడాల మహేష్, కార్యవర్గ సభ్యులు తీగల శ్యామ్, మాదారపు నాగరాజు, మామిడాల ప్రవీణ్, సందీప్ తదితరులున్నారు.

మూసీ బాధితులకు ఆర్థిక సహకారానికి శ్రీకారం

- ఇళ్లు కోల్పోయి డబుల్ ఇళ్లలో ఉంటున్న బాధితులకు..
- 11 స్వయం సహాయక గ్రూపుల ఏర్పాటు
- ఒక్కో గ్రూప్‌నకు రూ.20 లక్షల సహాయం
- శంకర్‌నగర్ మూసీ బాధితులకు రూ.2.2 కోట్లు
- సీఎం చేతులమీదుగా రుణాలు అందజేసేందుకు సన్నాహాలు



డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ఎస్‌హెచ్‌జీ మహిళల సందడి



దరఖాస్తులను పరిశీలిస్తున్న బ్యాంక్ అధికారులు

చార్మినార్: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని పిల్లి గుడిసెలు డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని మూసీ పరివాహక బాధితులకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్(ఎస్‌హెచ్‌జీ)ల ద్వారా ఆర్థిక సహాయం అందజేయడానికి జీహెచ్‌ఎంసీ ముందుకువచ్చింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాలను అందజేయడానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లి గుడిసెలు డబుల్‌బెడ్ రూం కాలనీ వద్ద సందడి కనిపించింది. జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 ప్రాజెక్ట్ అధికారి యుగంధర్‌రెడ్డి పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయగా, వాటన్నింటినీ స్థానిక యుబీఐ మేనేజర్‌తో పాటు ఇతర బ్యాంక్ అధికారులు పరిశీలించారు. 10 మంది చొప్పున 10 గ్రూపులను ఏర్పాటు చేసి ఒక్కో గ్రూప్‌కు దాదాపు రూ.20 లక్షల సహాయం అందజేయడానికి జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో ఒక్కో గ్రూప్ సభ్యురాలికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం లభించనుందని యుగంధర్‌రెడ్డి తెలిపారు.

మూసీ బాధితులకు మాత్రమే..

మూసీ సుందరీకరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన శంకర్‌నగర్‌బస్తీ మూసీనది బాధితులు పిల్లి గుడిసెలు డబుల్ బెడ్ రూం కాలనీలో పునరావాసం పొందారు. సర్వం కోల్పోయిన బాధితులకు ఆర్థికంగా అండగా ఉండటం కోసం ఎస్‌హెచ్‌జీలో జాతీయ బ్యాంకు ద్వారా రుణాలను అందజేయడానికి సిద్ధమయ్యారు. మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశాల మేరకు వీరిని ఆదుకోవడం కోసం జీహెచ్‌ఎంసీ ముందుకు వచ్చింది. ప్రస్తుతం మూసీ బాధితులకు మాత్రమే ఈ ఆర్థిక సహకారం అందనుంది. రుణాల రూపంలో దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందజేయనుండటంతో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించడానికి సంబంధిత అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 16న నిర్వహించడానికి సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారులను ఆహ్వానించేందుకు జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రేషన్ బియ్యం నిల్వలపై దాడులు

- 8.5 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

ఫిలింనగర్: తక్కువ ధరకు రేషన్ బియ్యం తీసుకుని ఎక్కువ ధరకు విక్రయించేందుకు కొంతమంది ముఠాగా ఏర్పడి రేషన్ బియ్యాన్ని తరలించేందుకు యత్నిస్తుండగా ఫిలింనగర్ పోలీసులు స్థావరాలపై దాడులు చేసి పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. షేక్‌పేట లైబ్రరీ సమీపంలోని సీతానగర్‌లో ముగ్గురు వ్యక్తులు రేషన్ బియ్యం సేకరించి బ్యాగ్‌ల్లో నింపుకుని గదుల్లో భద్రపరిచి వాటిని లారీల్లో తరలించేందుకు యత్నించగా రేషనింగ్ సర్కిల్–5 మెహిదీపట్నం సహాయ సర్కిల్ అధికారి కార్యాలయం జూనియర్ తనిఖీ అధికారి ప్రసాదరాజు, ఫిలింనగర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మహ్మద్ అబ్దుల్లా, మహ్మద్ ఇమ్రాన్, ఠాకూర్ ఉమాశంకర్‌సింగ్ తదితరులు ఎనిమిదిన్నర క్వింటాళ్ల బియ్యాన్ని వ్యాన్‌లోకి ఎక్కించి తరలిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్రం, ఖదిర్, జి.వెంకటరావు అనే మరో ముగ్గురు పరారయ్యారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 15, అక్టోబర్, 2024

ఇంట్లో, ఆఫీసుల్లో ల్యాప్‌టాప్స్ పట్టుకుని చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని పనిచేయడం, రోడ్డు మీద డ్రైవింగ్ చేసేటప్పుడు ఇయర్ బడ్స్ పెట్టుకుని సంగీతాన్ని ఆస్వాదించడం.. ఇవి సరిపోవన్నట్టు వీకెండ్స్‌లో పబ్స్, క్లబ్స్‌లో చెవులు చిల్లులు పడే మ్యూజిక్ హోరులో మునిగి తేలడం.. ఇవన్నీ నగరంలో టీనేజర్లు, యువత జీవనశైలిలో రొటీన్ పనులు. అయితే నేడు వీరు అనుసరిస్తున్న ఈ రకమైన పద్ధతులు రేపటి వారి వినికిడి లోపానికి కారణం కానున్నాయా? అంటే.. అవుననే సమాధానం ఇస్తున్నాయి అధ్యయనాలు. ఈ నేపథ్యంలో దీనిపై మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీబ్యూరో



- ఇయర్ బడ్స్, హెడ్‌ఫోన్స్.. మితిమీరి వినియోగంతో ప్రమాదం
- చిన్న వయసులోనే వినికిడి లోపాలు వస్తున్నాయన్న వైద్యులు
- నిర్ధారిస్తున్న అంతర్జాతీయ వైద్య పరిశోధనలు
- ఆందోళనకరంగా పరిశోధన ఫలితాలు
- బిఎమ్‌జె గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితం



హల్లో.. ప్లీజ్ హియర్..

వినికిడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్న ఆధునిక పరికరాలు



సురక్షితం కాని శ్రవణ పద్ధతులు అవలంబిస్తుండడం వల్ల ఒక బిలియన్ కంటే ఎక్కువ మందికి వినికిడి లోపం వచ్చే ప్రమాదం ఉందని తాజా పరిశోధనలో తేలింది. వీరిలో కూడా అత్యధికులు యువత, టీనేజర్లే కానుండడం ఆందోళనకరం. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఈ పరిశోధన ఫలితాలు బిఎమ్‌జె గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురించారు. దీని ప్రకారం, పరిమితికి మించి స్మార్ట్ ఫోన్‌లు, హెడ్‌ఫోన్‌లు ఇయర్‌బడ్‌లు వంటి వ్యక్తిగత శ్రవణ పరికరాలు (పర్సనల్ లిజనింగ్ డివైజెస్/పిఎల్‌డిలు) ఉపయోగించడం, పెద్దగా ధ్వనించే సంగీత వేదికలు యువత వినికిడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 24 శాతం టీనేజర్లు, 48 శాతం మంది యుక్తవయస్కులు పరిమితికి మించి చెవులుకు పనిపెడుతున్నారని పరిశోధనలో తేలింది. ఈ సంఖ్యల ఆధారంగా, పరిశోధకులు ప్రపంచవ్యాప్తంగా 0.67, 1.35 బిలియన్ల మంది మధ్య, యుక్తవయస్కులు వినికిడి లోపానికి గురయ్యే ప్రమాదం ఉందని కూడా పరిశోధకులు లెక్కగట్టారు.

పరిమితి మీరుతున్నారు..

గతంలో వెలువడిన ఓ పరిశోధన ఫలితాల ప్రకారం పీఎల్‌డీ వినియోగదారులు తరచూ 105 డెసిబుల్స్ కంటే ఎక్కువ వాల్యూమ్‌లను ఎంచుకుంటారు. వినోద వేదికలలో సగటు ధ్వని స్థాయిలు 104 నుండి 112 డెసిబుల్స్‌మించి ఉంటాయి.. అయితే వైద్యులు అనుమతించిన స్థాయి పెద్దలకు 80 డెసిబుల్స్. పిల్లలకు 75 డెసిబుల్స్ మాత్రమే కావడం గమనార్హం. 'ప్రభుత్వాలు, స్వచ్ఛందసంస్థలు సురక్షితమైన వినికిడి మార్గాలను ప్రోత్సహించడం ద్వారా నష్ట నివారణకు ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం' అని ఈ సందర్భంగా పరిశోధకులు అభిప్రాయపడ్డారు.



టిన్నిటస్ సమస్యే ఎక్కువ..

నన్ను కలిసిన నగరవాసుల్లో కొందరికి చిన్న వయసులోనే వినికిడిలోపాలతో పాటు టిన్నిటస్ అనే ఒక సమస్య పెరుగుతోందని కూడా గుర్తించాం. టిన్నిటస్ అంటే ఫోన్ రింగింగ్, ఇతర శబ్దాలు పదే పదే తలలో, చెవుల్లో గింగురుమనే ఫాంటమ్ సెన్సేషన్స్. కొంత మంది దీని వల్ల తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే మరి కొందరు దీర్ఘకాలిక చెవినొప్పి అనుభవిస్తున్నారు. తీవ్రమైన శబ్దాలు, తద్వారా కలిగే అసౌకర్యాన్ని నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వినికిడి లోపానికి దారి తీస్తాయి. అంతేకాదు వినికిడి సమస్యలు డిప్రెషన్, డిమెన్షియా, మతిమరుపు వ్యాధుల తీవ్రత పెరగడానికి కూడా కారణం అవుతాయి. - డా.ఎమ్.ప్రవీణ్‌కుమార్, ఇఎన్‌టీ వైద్యులు





ఆల్విన్ ఎక్స్‌రోడ్‌లో 'కేజీఎఫ్'

కృష్ణ గోదావరి ఫ్లేవర్స్‌ను ప్రారంభించిన హీరో నిఖిల్ సిద్ధార్థ్

లక్డీకాపూల్ : సినిమా తర్వాత ఎక్కువ కిక్కిచ్చే విషయం ఏదైనా ఉందంటే, అది ఫుడ్ మాత్రమేనని, తనకు గోదావరి జిల్లాల రుచులంటే ఎంతో ఇష్టమని హీరో నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. మియాపూర్ ఆల్విన్ ఎక్స్‌రోడ్‌లో కేజీఎఫ్ (కృష్ణ గోదావరి ఫ్లేవర్స్) పేరుతో ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేజీఎఫ్ అనగానే ఎవరికైనా సినిమా గుర్తొస్తుందని, కానీ ఈ పేరు నుంచి లోకల్ క్రియేటివిటీతో కృష్ణ, గోదావరి అంటూ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడం బాగుందన్నారు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ మనం బతకడంతో పాటు నలుగురినీ బతికించాలని, రెస్టారెంట్‌తో నలుగురికీ ఉపాధి కల్పించడం మంచి విషయమన్నారు. నగరంలో తమది ఇదే తొలి బ్రాంచ్ అని, త్వరలోనే మరిన్ని శాఖలు తెరిచేందుకు ప్రయత్నిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత్ పెద్ది, సాగర్ సజ్జ, భరత్ చెమికల, సందీప్ తుమటి, ఫణి జెట్టి, విఠల్ పాల్గొన్నారు.

పిజ్జా హట్‌లో.. మోమోస్–చీజీ పిజ్జా..



సాక్షి, సిటీబ్యూరో: విభిన్న ఆహార రుచులకు పేరు గాంచిన హైదరాబాద్ నగరంలో ఇక నుంచి జ్యూసి మోమోస్, చీజీ పిజ్జాల వినూత్న కలయికతో మోమో మియా పిజ్జా లభించనుంది. స్పైసీ షెజ్వాన్ సాస్, జ్యూసి స్ట్రీట్–స్టైల్ మోమోస్‌ల క్రస్ట్‌తో ఈ చీజీ పాన్ పిజ్జా నగరంలోని ఆహార ప్రియులను అలరించనుంది. ఈ సమ్మిళిత రుచుల శ్రేణిలో మొట్టమొదటిదిగా దీనిని పిజ్జా హట్ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పిజ్జా హట్ ఇండియన్ సబ్ కాంటినెంట్ మేనేజింగ్ డైరెక్టర్ రోహన్ పేవేకర్ మాట్లాడుతూ.. 'అధునాతన నగర ఫుడ్ కల్చర్‌లో భాగంగా వినూత్నత్వాన్ని కొనసాగిస్తూ, ఈ మోమో మియా పిజ్జాను ఆవిష్కరించామని అన్నారు. నగరంతో పాటు దేశవ్యాప్తంగా అత్యంత ఇష్టపడే ఆహారాలైన మోమోస్, పిజ్జాల విన్నూత్న కలయికను నగరవాసులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త రుచులు ఇంకా ఆసక్తికరమైన ఆహారం కోరుకునే వారికి మోమో మియా పిజ్జా అమితానందాన్ని ఇస్తుందన్నారు.

వారానికి ఒక్కరోజు!

వ్యాయామంపై నగరవాసుల ఆసక్తి

- కనీసం ఒక్కరోజైనా కసరత్తులపై దృష్టి
- వారాంతాల్లో బిజీ.. బిజీగా జిమ్ములు
- స్లాట్స్ కోసం నగర యువత ఎదురుచూపులు
- సమాన ప్రయోజనాలు పొందుతున్నారని నివేదికలు

నిత్యం పని ఒత్తిడితో సతమతమవుతున్న నగర యువత వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారానికి ఒక్కరోజైనా కసరత్తులు చేయడానికి సమయం కేటాయిస్తున్నారు. దీంతో ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ ఒత్తిడుల నుంచి ఉపశమనం పొందుతున్నారని నగర వాసులపై నిర్వహించిన అధ్యయనాల్లో తేలింది. అంతేకాదు రెగ్యులర్‌గా జిమ్ చేసే వారితో సమానంగా ఫలితాలను పొందుతున్నారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

సెలవు రోజుల్లో అవకాశాన్ని బట్టి జిమ్‌కు వెళ్లడం, క్రీడల పట్ల నగర యువత ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా మానసిక ప్రశాంతతో పాటు, శారీరకంగానూ ఆరోగ్యంగా ఉంటున్నామంటున్నారు. పనిదినాల్లో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ, రాత్రి 7 గంటల తరువాత జిమ్ టైమింగ్స్ కావాలని కోరుకుంటున్నారు. దీంతో ఆ సమయంలో బిజీబిజీగా మారుతున్నాయి. దీంతో స్లాట్స్ దొరకడం కష్టంగా ఉందని చెబుతున్నారు. సెలవు రోజుల్లో జిమ్‌కు వచ్చే వారి తాకిడి కూడా ఎక్కువగా ఉంటుందని, ఎక్కువ సమయం జిమ్ చేయడానికి మొగ్గుచూపుతున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.





సర్వేలు చెప్పేదేంటి!..

ఇటీవల ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం వారంలో ఒక్క రోజైనా వ్యాయామం చేసే వారి చేతికి యాక్సిలరో మీటర్ అమర్చి సుమారు 90 వేల మంది ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించింది. ఈ నివేదికల ప్రకారం దాదాపు నిత్యం వ్యాయామం చేసిన వారితో సమానంగా వారంలో ఒక్క రోజైనా కనీసం రెండున్నర గంటల నుంచి 3 గంటల పాటు వ్యాయామం చేసేవారు సమాన ప్రయోజనాలు పొందుతున్నారని తేలింది. వారంలో గంటన్నర కంటే తక్కువ వ్యాయామం చేసిన వారిలో జీర్ణకోశ, నాడీ వ్యవస్థ, మానసిక రోగాలు వంటివి మొత్తం 678 రోగాలను గుర్తించారు. అదే సమయంలో నిత్యం వ్యాయామం చేసేవారు, వారంలో వీలు చూసుకుని ఒక్క రోజైనా రెండున్నర గంటలకుపైగా వ్యాయామం చేసే వారిలో సుమారు 200 రకాల రోగాలు తక్కువగా ఉన్నాయని తేలింది. వ్యాయామం చేసిన వారిలో అధిక రక్తపోటు సమస్య 23 శాతం నుంచి 28 శాతం తక్కువగా ఉంటే, మధుమేహం మాత్రం 43 శాతం నుంచి 48 శాతం తక్కువగా వస్తుందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

షిఫ్ట్ డ్యూటీలతో ఇబ్బంది..

డ్యూటీలో షిఫ్టల సిస్టం ఉంటుంది. నైట్ షిఫ్ట్ ఉంటే పగలంతా నిద్రపోవడం వల్ల జిమ్‌కు వెళ్లడం కుదరడం లేదు. ఇటువంటి సందర్భంలో సెలవు రోజుల్లో స్లాట్ బుక్ చేసుకుంటాను. కనీసం రెండు నుంచి మూడు గంటల పాటు వర్కౌట్ చేస్తాను. సాధారణ షిఫ్టలు ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం సమయంలో రోజుకు ఒక గంట సమయం జిమ్ కోసం కేటాయిస్తాను. - శిరీష, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



సెలవు రోజుల్లో స్లాట్స్‌కు డిమాండ్..

సెలవు రోజుల్లో ఎక్కువ మంది జిమ్‌కు వస్తుంటారు. ఉదయం, సాయంత్రం స్లాట్స్ బిజీగా ఉంటాయి. అటువంటి సమయంలో జిమ్ ట్రైనర్‌గా ఎక్కువ మందిని డీల్ చేయాల్సి ఉంటుంది. సాధారణ రోజుల్లో అంతగా ఫ్లోటింగ్ ఉండదు. అటువంటి సమయంలో సహచర సిబ్బంది జిమ్‌ను మేనేజ్ చేసుకోగలుగుతారు. నేను రెండు గంటలకు తగ్గకుండా జిమ్ చేస్తాను. జిమ్ చేయడంపై మక్కువతో విడిచిపెట్ట లేకపోతున్నా. ఉద్యోగం, జిమ్ రెండింటినీ మేనేజ్ చేస్తున్నాను.
- రాహుల్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, జిమ్ ట్రైనర్



శ్రేయ ఆరోగ్య బీమా

- రెండు భక్తి గీతాలతో పాటు, హెల్త్ ఇన్సూరెన్స్ ఆవిష్కరణ
- రూ.2 నుంచి 10 లక్షల వరకూ కవరేజీ

సాక్షి, సిటీబ్యూరో: నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శ్రేయ మ్యూజిక్, ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో రూపొందించిన రెండు భక్తి గీతాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'మైయా కా గుంగాన్ కరో', 'తేరే దార్ కా పూజారి జగదాంబే' భక్తి గీతాలతో పాటు వినూత్నంగా ఉద్యోగులు, వినియోగదారుల కోసం 'శ్రేయ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్' పేరుతో ప్రత్యేక ఆరోగ్య బీమా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని సంస్థ క్రియేటివ్ హెడ్ హేమంత్ కుమార్ రాయ్ తెలిపారు. సమాజానికి సేవ చేయడానికి అంకితభావంతో రూపొందించిన ఈ పథకంలో భాగంగా శ్రేయ గ్రూప్ ఉద్యోగులు రూ.3 లక్షల వరకూ ఆరోగ్య బీమా కవరేజీని అందుకుంటారని, లీడర్స్ రూ.2 నుంచి 10 లక్షల వరకూ కవరేజీకి అర్హులని పేర్కొన్నారు. శ్రేయ గ్రూప్ వినియోగదారులు సైతం ఆరోగ్య బీమా కవరేజీ ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇరవై వేలకు పైగా ఆస్పత్రుల్లో చికిత్సను అందించే భాగస్వామ్య బీమా కంపెనీ ద్వారా ఈ బీమా కవర్ చేయబడుతుందని వివరించారు.



రీసైకిల్

- పాతవాటికి ఉచితంగా మరమ్మతులు
- ఆపై అవసరమున్న వారికి పంపిణీ
- ఫ్రీమేసన్స్ 30వ వార్షికోత్సవ ప్రత్యేక ఆఫర్

సాక్షి, సిటీబ్యూరో: నిరుపయోగంగా ఉన్న పాత సైకిళ్లను తమకు అందిస్తే వాటికి మరమ్మతులు చేసి అవసరమున్న నిరుపేద విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని హైదరాబాద్‌కు చెందిన ఫ్రీమేసన్స్ సంస్థ లాడ్జ్ కీస్ ఒక ప్రకటనలో పేర్కొంది. సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఇప్పటి వరకూ వినియోగంలో లేని 50 సైకిళ్లకు రిపేర్లు చేసి నట్లు తెలిపారు. వీటిని అవసరమున్న నిరుపేద పిల్లలకు అందించాలని అనుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం మరికొన్ని పాత సైకిళ్లను సేకరిస్తున్నాం. తమ వద్ద పాత సైకిళ్లు, నిరుపయోగంగా ఉన్న సైకిళ్లు ఉన్న వారు ఎవరైనా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు మేమే సంబంధిత వ్యక్తి వద్దకు వెళ్లి వాటిని సేకరిస్తాం. వాటికి అవసరమైన మరమ్మతు చేసి, కావాలంటే వారికే తిరిగి ఇస్తాం. అలా కాకుండా వేరెవరికైనా ఇవ్వదలచినవారు (డొనేట్) వారు సైతం ఫోన్ చేయవచ్చని వివరించారు. నేరుగా గోషామహల్ మెసానిక్ బిల్డింగ్‌లో కూడా అందించవచ్చని తెలిపారు. సైకిల్ అవసరమున్న వారు కూడా తమను సంప్రదించాలని కోరారు. వివరాలకు 98480 50502, 92461 56496, 70971 60634, 98491 75197, 97012 33468, 98851 18378 98484 02129 నెంబర్లకు ఫోన్ చేయడం, సోషల్ మీడియాలో సమాచారం అందించినా వెంటనే స్పందిస్తామని పేర్కొన్నారు.



ఏపీలో ఎడతెరిపిలేని వానలు

- సోమవారం వేకువజాము నుంచే మొదలు
- నీటి ముంపులో లోతట్టు ప్రాంతాలు
- పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలకు అత్యవసర సెలవు



నెల్లూరు సండే మార్కెట్ ఏరియాలోని రోడ్డు చెరువులా మారిన దృశ్యం

సాక్షి, నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో సోమవారం తెల్లవారు జామునుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో విద్యాసంస్థలకు అత్యవసరంగా సెలవు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా సగటున 54.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రానికి జిల్లాలో 967.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒంగోలు బస్టాండ్ సెంటర్ సహా నగరంలోని కాలనీ లన్నీ జలమయం అయ్యాయి. జల వనరుల శాఖ ఎస్ఈ కార్యాలయ భవనంలోకి వర్షం నీరు చేరింది. వైఎస్సార్ జిల్లాలో చిరుజల్లులు కురిశాయి. సిద్ధవటంలో అత్యధికంగా 29.6 మి.మీ. వర్షం కురవగా.. ఆట్లూరులో 20.2, గోపవరంలో 12.2, ఒంటిమిట్టలో 10.8, బి.మఠంలో 10.2, బి కోడూరులో 7.4, కాశినాయనలో 6, కలసపాడులో 5.4, పోరుమామిళ్లలో 5.2 మి.మీ. వర్షం కురిసింది. తిరుపతి జిల్లా చిల్లకూరు, వాకాడు, తడ మండలాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి భీకర శబ్దాలు వెలువడుతున్నాయి. సముద్రాన్ని చూసేందుకు వెళ్లే వారిని స్థానికులు అడ్డుకుని వెనక్కి పంపేస్తున్నారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తిరుమలలో హై అలర్ట్ ప్రకటించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ఈనెల 16న బుధవారం శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ దృష్ట్యా 15న మంగళవారం తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

భారీ వర్షాల కారణంగా చెన్నై–విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. వర్షాలకు పొన్నూరు–బాపట్ల స్టేషన్ల మధ్య డౌన్ లైన్ (చెన్నై నుంచి విజయవాడ వచ్చే రైల్వే లైన్) వద్ద భూమి కుంగుతోంది. దీని కారణంగా పట్టాలు దెబ్బతిని రైళ్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉండడంతో ఈ డౌన్ లైన్‌లో మాచవరం స్టేషన్ వద్ద నుంచి రైళ్ల రాకపోకలను నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నారు.

మీరే కదా బాబూ.. లిక్కర్ మాఫియా సూత్రధారి, పాత్రధారి

'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ''లిక్కర్ మాఫియా, సిండికేట్లకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిపోయిందని.. ఈ మాఫియాకు సూత్రధారి, పాత్రధారి మీరు కాదా?'' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును 'ఎక్స్' వేదికగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. ''అత్యంత పారదర్శకంగా నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి వాటిని ప్రైవేట్‌కు, మీ వారికి అప్పగించాలన్న నిర్ణయం అవినీతి కోసం వేసిన స్కెచ్ కాదా?'' అని సూటిగా చంద్రబాబును ప్రశ్నించారు. 'మీ మనుషులతో సిండికేట్ ఏర్పాటు చేసి షాపులను కొట్టేయడం నిజం కాదంటారా? రానున్న ఐదేళ్లలో పెద్దమొత్తంలో ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు విక్రయించి, గతంలో మీరు అనుమతిచ్చిన డిస్టిలరీల ద్వారా అమ్మకాలు భారీ స్థాయిలో పెంచేసి రూ.వేల కోట్ల అక్రమ రాబడికి ద్వారాలు తెరిచిన మాట వాస్తవమే కదా?' అని ధ్వజమెత్తారు. ''మీ అక్రమార్జన కోసం... మీకు, మీ వారికి అవినీతి డబ్బు సంపాదించడంకోసం మీరు అమలు చేస్తున్న లిక్కర్ పాలసీ రాష్ట్రానికి, ప్రజల భవిష్యత్తుకు ప్రమాదకరం. అక్కచెల్లెమ్మల ఉసురు, యువత ఉసురు, ఆరోగ్యం రూపేణా ప్రజల ఉసురు మీరు పోసుకున్నట్లే. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను ఇప్పటికే తిరోగమన బాట పట్టించారు. అవినీతే ధ్యేయంగా తెచ్చిన లిక్కర్ పాలసీతో రాష్ట్రాన్ని మరింత వెనక్కి లాగుతున్నారు. మీ చర్యలను వెంటనే సరిదిద్దుకోండి. లేకుంటే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం' అని వైఎస్ జగన్ హెచ్చరించారు. ఈమేరకు చంద్రబాబు ప్రభుత్వం తెచ్చిన లిక్కర్ పాలసీని తీవ్రంగా తూర్పారబడుతూ సోమవారం తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ పోస్ట్ చేశారు. అందులో వైఎస్ జగన్ ఏమన్నారంటే...

లిక్కర్ పాలసీతో కాసులు ఏరుకున్నారు..

ప్రభుత్వ దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తే అమ్మకాలపై నియంత్రణ ఉంటుంది. అమ్మకం వేళలు కూడా నియంత్రణలో ఉంటాయి. దీనివల్ల మద్య నియంత్రణ అనే ప్రాథమిక బాధ్యత దిశగా ప్రభుత్వాలు కాస్తైనా పని చేసినట్లు అవుతుంది. ఇప్పుడు మీ విధానం ద్వారా సొంత ఆదాయం కోసం ఆ లక్ష్యానికి తూట్లు పొడిచినట్లే కదా చంద్రబాబూ? ఒక పక్కా లిక్కర్ వ్యాపారిలా ఆలోచిస్తున్నారే కానీ రాష్ట్రానికి తండ్రి స్థానంలో ఉన్న ముఖ్యమంత్రిలా ఎందుకు ఆలోచన చేయడం లేదు? దీనికి కారణం.. కొత్త పాలసీలో మీ సొంత లాభం ఉండబట్టే కదా బాబూ? 2014–19 మధ్య ఇదే మాదిరిగా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు. ప్రజల ఆరోగ్యాలను, కుటుంబాల పరిస్థితులను పణంగా పెట్టేలా లిక్కర్ పాలసీ తెచ్చి దాని మీద కాసులు ఏరుకున్నారు. అప్పట్లో మీ సిండికేట్లు బడి పక్కన, గుడి పక్కన బెల్టు షాపులు పెట్టి మరీ ప్రతి ఇంటికీ మద్యాన్ని డోర్ డెలివరీ స్థాయికి పరిస్థితిని తెచ్చారు.

వాటాలు వాస్తవం కాదా?

చంద్రబాబూ.. మీరు తెచ్చిన లిక్కర్ పాలసీ నిజంగానే గొప్పదే అయితే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు మీ కనుసన్నల్లో బెదిరింపులకు ఎందుకు దిగారు? నిష్పక్షపాతంగా వ్యవహరించి ఉంటే అరాచకాలకు పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చింది? 'నీకింత.. నాకింత' అని కమీషన్ల వాటాలు వేసుకున్న మాట వాస్తవం కాదా? మీరు ఇవన్నీ చేసిన తర్వాత నిర్ణయించిన ధరకే మద్యాన్ని అమ్ముతారా? ఇది ఓ ఫార్స్ కాదా? లైసెన్స్ ఫీజులతోపాటు కింది స్థాయి నుంచి మీదాకా కమీషన్ల కోసం, మీవారికి షాపులు ఇవ్వని పక్షంలో బదులుగా వాటాలు సమర్పించడం కోసం లిక్కర్ కొనుక్కున్నవారి జేబులు గుల్ల చేయడానికి మీరంతా సిద్ధం అయినట్టే కదా? మీకింత.. వారికింత చొప్పున నచ్చిన రేట్లకు అమ్ముకోవడానికి సిండికేట్లకు ఓకే చెప్పినట్టే కదా? తద్వారా తమ కుటుంబాల్లో చదువుల కోసం, ఇతర బాగోగుల కోసం ఖర్చు చేయాల్సిన ప్రజల ఆదాయాలను మీ జేబుల్లో వేసుకునేందుకు పన్నిన అవినీతి పథకం కాదంటారా?

20 డిస్టిలరీల్లో 14 మీ హయాంలో వచ్చినవే

మద్యంపై కొత్త పాలసీ వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రానివ్వకుండా మీరు గండి కొట్టారు. ప్రజలను మభ్యపెట్టేందుకు చీప్ లిక్కర్ రేట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించి.. దీనికోసం క్వాలిటీని తగ్గిస్తూ, ఇంకోవైపు అమ్మకాలు విపరీతంగా పెంచేసి తద్వారా డిస్టిలరీల నుంచి లంచాల ఆదాయం పెంచుకునే కార్యక్రమం చేస్తున్నారు. ఎందుకంటే రాష్ట్రంలో ఉన్న 20 డిస్టిలరీల్లో 14 మీ హయాంలో వచ్చినవే. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు. ఇంకోవైపు ఎమ్మార్పీ మీద నియంత్రణ తీసివేసి మీ వారికి, మీ మాఫియాకు షాపులు అప్పగించి అక్కడ కూడా మీకు ఇంత.. నాకు ఇంత అని ఎమ్మార్పీపై రేట్లు పెంచి వసూలు చేయడం ప్రజల నడ్డి విరగ్గొట్టడం కాదా చంద్రబాబూ?

కాగితాల మీద కనిపించే దుకాణాలే కాకుండా వాటికి అదనంగా పర్మిట్ రూమ్స్, దీనికి తోడు 43 వేల బెల్టు షాపుల ఏర్పాటుతో లిక్కర్ ఏరులై పారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అలాంటి దారుణ పరిస్థితులను కూకటి వేళ్లతో పెకిలించింది. మద్యం దళారులకు, రాజకీయ వ్యాపారులకు చెక్ పెట్టింది. దుకాణాల సంఖ్యను 4,380 నుంచి 2,934కు తగ్గించి మద్యం అమ్మకాలను నియంత్రించింది. అమ్మకాలు కేవలం ప్రభుత్వం ఆధ్వర్యంలోనే జరిగేలా చర్యలు తీసుకుంది. లాభాపేక్ష లేనందున పర్మిట్ రూమ్స్, బెల్టు షాపులు.. రద్దు అయ్యాయి. ఈ పద్ధతిని ఇప్పుడు ఎత్తివేసి దుకాణాల సంఖ్యను మళ్లీ పెంచి మొత్తం అన్నింటినీ మీ మనుషులకు అప్పగించారు. ఇక వీళ్ల ఏర్పాటు చేసే పర్మిట్ రూమ్స్, బెల్టు షాపులకు లెక్కే లేదు. మళ్లీ రాష్ట్రాన్ని పూర్వపు దారుణ పరిస్థితులకు తీసుకెళ్తున్న మాట వాస్తవం కాదా చంద్రబాబూ?

లక్షల ఉద్యోగాలంటూ 15 వేల మందిని రోడ్డున పడేస్తారా?

లక్షల సంఖ్యలో ఉద్యోగాలంటూ అబద్ధాల మీద అబద్ధాలు చెప్పి రోజూ మీ మీడియాలో ఊదరగొట్టే మీరు.. మీ స్వార్థం కారణంగా ప్రభుత్వ లిక్కర్ షాపుల్లో పనిచేస్తున్న 15 వేల మందిని ఒక్కసారిగా నిరుద్యోగులుగా మార్చి రోడ్డు పాలు చేశారు. మరి వీరి బాగోగుల సంగతేంటి చంద్రబాబూ?

నేవీ రాడార్‌కు నేడే భూమిపూజ

▶ మొదటి పేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలవగా.. ప్రస్తుతం అన్ని అనుమతులు పొంది, పనుల ప్రారంభానికి సిద్ధమైంది. దీని నిర్మాణం కోసం రిజర్వ్ ఫారెస్టులోని 2,900 ఎకరాల భూమిని నేవీకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

అనువైన ప్రాంతం కావడంతో..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 65 కిలోమీటర్ల దూరంలో ఉండటం, సముద్ర మట్టానికి 350 మీటర్లకుపైగా ఎత్తులో, అడవి మధ్యలో ఉండటంతో.. రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం దామగుండం ప్రాంతాన్ని నేవీ ఎంచుకుంది. ఈ రాడార్ స్టేషన్ ద్వారా దేశ తూర్పు నావికాదళం సబ్‌మెరైన్స్‌కు సంకేతాలు అందించనున్నారు. రూ.3,200 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్టు అధికారులు చెప్తున్నారు. పనుల శంకుస్థాపన ఏర్పాట్లను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బలగాలను మోహరించారు.

ఎన్నో ఆందోళనల మధ్య..

దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు వల్ల అటవీ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాడార్ స్టేషన్ నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. వేల ఎకరాల భూమిని చదును చేసే పనుల్లో అనేక రకాల వృక్షాలు, ఔషధ మొక్కలు ధ్వంసమవుతాయంటూ కొందరు ఆందోళన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయంగా అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాడార్ స్టేషన్ ఏర్పాటుపై ముందుకు వెళ్లాయి.

రాడార్ స్టేషన్‌ను అడ్డుకుందాం..

ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం

పంజగుట్ట (హైదరాబాద్): వికారాబాద్ జిల్లా, పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న రాడార్ స్టేషన్ ప్రాజెక్టు కారణంగా దీర్ఘకాలిక పర్యావరణ సమస్యలతో పాటు హైదరాబాద్‌లోని వరదలను మరింత తీవ్రతరం చేస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుకోసం 2,900 ఎకరాల అటవీ భూమిని ధ్వంసం చేస్తున్నారని, సుమారు 12 లక్షల జీవవైవిధ్యం ఉన్న చెట్లను నరికేందుకు చూస్తున్నారని, యావత్ తెలంగాణ సమాజం దీన్ని అడ్డుకోవాలని వారు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'దామగుండం విధ్వంసంపై పౌరసమాజం స్పందన' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు సంపత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పీవోడబ్ల్యూ సంధ్య, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్, పర్యావరణవేత్త బాబూరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గోవర్ధన్, జర్నలిస్టులు విఠల్, తులసీచంద్, బక్క జడ్సన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సేవ్ దామగుండం పేరుతో దేశవ్యాప్తంగా 18 ప్రధాన పట్టణాల్లో ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ఓ వైపు మరణ శాసనం..! మరోవైపు సుందరీకరణా?

- వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌తో మూసీ నది అంతర్ధానం: కేటీఆర్
- పదేళ్లు ఒత్తిడి తెచ్చినా మేము నిర్మాణానికి అంగీకరించలేదు
- ద్వీపాల్లో ఉండాల్సిన రాడార్ స్టేషన్ తెలంగాణలోనా?
- ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారు?
- పర్యావరణవేత్తలతో కలిసి ఉద్యమిస్తాం



సాక్షి, హైదరాబాద్: నౌకాదళానికి చెందిన రాడార్ స్టేషన్ ఏర్పాటు పేరిట ఓ వైపు మూసీ నదికి మరణం శాసనం రాస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోవైపు సుందరీకరణ పేరిట హడావుడి చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నది అంతర్ధానమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లు తమ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా రాడార్ స్టేషన్ నిర్మాణానికి అంగీకరించలేదన్నారు. పర్యావరణానికి హాని కలిగించే రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలతో కలిసి పోరాటం చేస్తామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ప్రకటించారు.

ప్రమాదంలో మూసీ నది

'వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నౌకాదళానికి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నది ప్రమాదంలో పడుతుంది. ఓ వైపు మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడతామంటూనే.. మరోవైపు రాడార్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం రేవంత్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఏం ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో సీఎం చెప్పాలి. ఈ నెల 15న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయడంపై బీఆర్ఎస్ నిరసన తెలుపుతుంది. దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటుతో 2,900 ఎకరాల అటవీ భూమి, 12 లక్షల చెట్లను నష్టపోతాం. జనావాసాలు లేని ద్వీపాల్లో ఏర్పాటు చేయాల్సిన రాడార్ స్టేషన్‌ను తెలంగాణలో ఎందుకు నిర్మిస్తున్నారో చెప్పాలి' అని కేటీఆర్ అన్నారు.

మూసీ నది ఎకో–సెన్సిటివ్ జోన్ కాదా?

'గంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించింది. దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానం ఉంది. అలాంటప్పుడు మూసీ నది జన్మస్థానాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించాలి. గంగా నదికి ఒక న్యాయం.. మూసీకి మరో న్యాయమా? రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పర్యావరణ సమతుల్యతకు ప్రమాదం పొంచి ఉంది. మూసీ పేరిట రూ.వేల కోట్ల దోపిడీ చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందు వరుసలో ఉంటుంది. కానీ జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ స్టేషన్‌ను దామగుండంలో ఏర్పాటు చేయడాన్ని అంగీకరించం. పర్యావరణ వేత్తలతో కలిసి పోరాటం చేస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

అప్పుడు ఆమోదం.. ఇప్పుడు రాజకీయమా?

దామగుండం ప్రాజెక్ట్‌ను కేటీఆర్ వ్యతిరేకించడంపై ప్రభుత్వవర్గాల మండిపాటు

సాక్షి, హైదరాబాద్: అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే రంగారెడ్డి జిల్లా పూడూరులో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన విషయాన్ని ప్రభుత్వ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లో 1174 హెక్టార్ల భూమిని ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు బదిలీ చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 డిసెంబర్ 12న జీవో నెం.44 జారీ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి. అయితే ఇప్పుడు మాజీమంత్రి కేటీఆర్ వ్యతిరేకించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టును వ్యతిరేకించడం, ముందుగా ఆమోదించి ఇప్పుడు రాజకీయం చేయటం కేటీఆర్ నిజస్వరూపాన్ని తెలియజేస్తోందని మండిపడుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశ భద్రత ప్రాధాన్యం దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు మద్దతునిచ్చారని పునరుద్ఘాటించాయి. 2017 మార్చి 2న నేవీ విభాగం రాష్ట్ర అటవీశాఖకు పంపిన డిమాండ్ నోటీసు ప్రకారం రూ.133.54 కోట్లు ఖాతాలో జమ చేసిందని, 2017 డిసెంబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం అటవీ భూములను నేవీకి బదిలీ చేస్తూ జీవో నెం.44 జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశాయి. 2017 డిసెంబర్ 22న తుది అనుమతులకు సంబంధించిన జీవో సంబంధిత జిల్లా అటవీ అధికారికి చేరిందని తెలిపాయి.

కేడర్ వివాదం మళ్లీ క్యాట్‌కు..

ఐఏఎస్‌లు ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, జి.సృజన పిటిషన్లు

కేంద్రం నిర్ణయం హైకోర్టు తీర్పుకు విరుద్ధమని వెల్లడి ● నేడు విచారణ చేపట్టనున్న క్యాట్ ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తలెత్తిన ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారుల కేటాయింపు వివాదం మళ్లీ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)కు చేరింది. కేడర్ కేటాయింపుల మేరకు ఎక్కడి వారక్కడ విధుల్లో చేరా లని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల విభాగం (డీవోపీటీ) ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, జి.సృజన క్యాట్‌లో సోమవారం వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఐదు పిటిషన్లపై మంగళవారం లతా బస్వరాజ్ పట్నే (జ్యుడీషియల్), షాలినీ మిశ్రా(అడ్మినిస్ట్రేషన్) ధర్మాసనం విచారణ చేపట్టనుంది. తమను ఏపీ కేడర్‌కు బదులుగా తెలంగాణ కేడర్‌కు కేటాయించాలన్న ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులను తిరస్కరిస్తూ కేంద్రం గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా తమను తెలంగాణ కేడర్‌కు బదులు ఏపీ కేడర్‌కు కేటాయించాలన్న మరో ముగ్గురు ఐఏఎస్ అధికారుల విజ్ఞప్తులనూ తిరస్కరించింది. తక్షణమే ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ కావాలని, ఈనెల 16లోగా కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయాలని వారిని ఆదేశించింది. అయితే, కేంద్రం నిర్ణయం హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందంటూ అధికారులు మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. తమను తెలంగాణలోనే కొనసాగించాలని ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్ కోరుతుండగా, తనను ఏపీలోనే విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని సృజన కోరుతున్న విషయం విదితమే.

పదేళ్లుగా వివాదం

2014లో ఉమ్మడి ఏపీ విభజన సమయంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో ఏపీకి కేటాయించిన అధికారుల్లో కొందరు క్యాట్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ తెలంగాణలో విధులు నిర్వహించేలా ఆదేశాలిచ్చింది. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో తెలంగాణ సీఎస్‌గా పని చేస్తున్న సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ ఇదే హైకోర్టు సీజే ధర్మాసనం 2023, జనవరిలో తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారించాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం.. ఈ వివాదంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకి అప్పగిస్తూ 2024, జనవరి 3న కీలక తీర్పు వెలువరించింది. అయితే అధికారుల అభ్యంతరాలను పరిశీలించాలని, స్థానికత, 10 ఏళ్ల సర్వీస్, ఇంకా మిగిలి ఉన్న సర్వీస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. దీంతో కేంద్రం ఏర్పాటు చేసిన దీపక్ ఖండేకర్‌కమిటీ అధికారుల విజ్ఞప్తులను పరిశీలించి.. వాటిని తోసిపుచ్చుతూ ఎక్కడి వారు అక్కడికే వెళ్లాలని నివేదిక ఇచ్చింది. కేంద్రం ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీన్ని అధికారులు తాజాగా క్యాట్‌లో సవాల్ చేశారు.

సీఎస్ శాంతికుమారితో భేటీ

మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్.. సోమవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిశారు. కేంద్ర ఉత్తర్వులు, క్యాట్‌లో పిటిషన్ల నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

- 'ముఖ్య'నేత మాటే ఫైనల్..

మాఫియాదే రాజ్యం

ఎల్లో సిండికేట్‌కే మద్యం దుకాణాల కేటాయింపు

లాటరీ ప్రక్రియను హైజాక్ చేసిన పచ్చ ముఠాలు

ఏకపక్షంగా 80 శాతం మద్యం షాపుల లైసెన్సులు హస్తగతం

బెదిరింపులతో మిగతా 20 శాతం లైసెన్సులు కబ్జా

ఈ అక్రమాలకు వత్తాసు పలికిన అధికార యంత్రాంగం

మహిళల పేరుతో 345 మద్యం షాపుల లైసెన్సులు

మొత్తం 3,396 దుకాణాలు టీడీపీ సిండికేట్ గుప్పిట్లోనే

డిస్టిలరీలకు లాభాల పంట..

'ముఖ్య'నేతకు కమీషన్ రూపంలో కప్పం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఒళ్లు గగుర్పొడిచే.. 'అండా సెల్'

అండా సెల్.. ఆ పేరు వింటే కరుడుకట్టిన ఖైదీలు కూడా హడలెత్తిపోతారు. అటు వైపు చూడటానికి కూడా గజగజ వణికిపోతారు. అందులో అడుగు పెట్టడమంటే.. భూలోక నరకంలోకి ప్రవేశించడమే. సెంట్రల్ జైళ్లలో అత్యంత ఒంటరిగా ఉండే సెల్.. ఈ అండా సెల్. ఇది గుడ్డు ఆకారంలో ఉంటుంది. చుట్టూ చీకటి.. ఎత్తయిన గోడలే తప్ప కిటికీలు ఉండవు. ఇతర ఖైదీలను చూడలేరు.. మాట్లాడలేరు. ఒక్క మాటలో చెప్పాలంటే గాలి కూడా చొరబడలేని విధంగా నిర్మితమై ఉంటుంది. దీని నుంచి తప్పించుకోవడం అసాధ్యం.

- సాక్షి, సెంట్రల్ డెస్క్

దేశ స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో అండమాన్‌లోని 'కాలాపానీ', బర్మా (ప్రస్తుతం మయన్మార్)లో 'మాండలే' జైళ్లు చరిత్ర ప్రసిద్ధికెక్కాయి. లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌కు నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆరేళ్ల కఠిన కారాగార శిక్ష విధించి బర్మాలోని మాండలే జైలుకు పంపింది. ఒక్కసారి 'కాలాపానీ', 'మాండలే' జైలులో ప్రవేశిస్తే ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. అత్యంత దారుణమైన చావుని మూటగట్టుకోవాల్సిందే. ఎందుకంటే అక్కడ ఖైదీలకు విధించే శిక్షలు దారుణంగా ఉంటాయి.

కాలాపానీ, మాండలే జైళ్ల తరహాలోనే ఇప్పుడు అండా సెల్స్‌కూడా చాలా పాపులర్. మానవ హక్కుల కార్యకర్త, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అక్టోబర్ 13న కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన నాగపూర్ సెంట్రల్ జైలులో తొమ్మిదేళ్లపాటు జైలుశిక్ష అనుభవించారు. అందులోనూ 'అండా సెల్'లో అత్యంత కఠినమైన కారాగార శిక్షను ఎదుర్కొన్నారు. ఈయనకు ముందు నకిలీ స్టాంప్ పేపర్ల కుంభకోణంలో అబ్దుల్ కరీం తెల్గీ, 1993 ముంబై బాంబు పేలుళ్ల కేసుకు సంబంధించి నిషేధిత ఆయుధాలను అక్రమంగా కలిగి ఉన్నందుకు బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌ను కూడా అండా సెల్‌లో ఉంచారు. రోజులో ఉన్న 24 గంటల్లో 22.5 గంటలు అత్యంత కఠిన ఏకాంత నిర్బంధం తప్పని అండా సెల్ గురించి తెలుసుకుంటే ఒళ్లు గగుర్పొడచక మానదు. ఈ నేపథ్యంలో ఈ అండా సెల్ ఏంటి? ఇది ఎక్కడ ఉంది? ఎలాంటి వారిని ఇందులో ఉంచుతారు? ఇప్పటివరకు ఇందులో ఎవరెవరు శిక్షను అనుభవించారు? అనే అంశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో అండా సెల్ గురించిన విశేషాలు.

గుడ్డు ఆకారంలో..

- అండా సెల్ అంటే గుడ్డు ఆకారంలో ఉండే నిర్మాణం.
- ఇందులో రెండు విభాగాలు ఉంటాయి. 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 50 x 50 అడుగుల కంపార్ట్‌మెంట్లుగా విభజితమై ఉంటుంది.
- మహారాష్ట్రలోని ఎరవాడ (పుణే), నవీ ముంబైలోని తలోజా నాగపూర్ సెంట్రల్ జైళ్లలో ఈ అండా సెల్స్ ఉన్నాయి. ఇక్కడే కాకుండా మనదేశంలోని పలు సెంట్రల్ జైళ్లలోనూ ఈ అండా సెల్స్ ఉన్నాయని తెలుస్తోంది. వీటిని ఆయా రాష్ట్రాల ప్రజా పనుల విభాగాలు నిర్మించాయి.
- 1990లో పుణేలోని ఎరవాడలో అండా సెల్‌ను నిర్మించారు.
- అత్యంత కరడు గట్టిన నేరస్తులను, మోస్ట్ వాండెట్ ఉగ్రవాదులను, తీవ్రవాదులను, గ్యాంగ్‌స్టర్‌లను, వ్యవస్థీకృత నేరాలు చేసినవారిని ఈ అండా సెల్స్‌లో ఉంచుతారు.
- అమృత్‌సర్‌లో గోల్డెన్ టెంపుల్ వద్ద ఆపరేషన్ బ్లూస్టార్‌కు నాయకత్వం వహించిన ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ అరుణ్‌కుమార్ వైద్యను హత్యచేసిన ఉగ్రవాదులు హర్జీందర్ సింగ్ జిందా, సుఖ్‌దేవ్ సుఖాలను ఉరితీసే ముందు 1992లో పుణేలోని ఎరవాడలో ఉన్న అండా సెల్‌లో తొలిసారి ఉంచారు.

అండా సెల్స్ ఎందుకు?

- అత్యంత కరడు గట్టిన నేరస్తులను సులువుగా పర్యవేక్షించడానికి, అధిక ప్రమాదం ఉన్న ఖైదీలను సురక్షితంగా ఉంచడానికి ప్రత్యేకంగా ఈ అండా సెల్స్‌ను నిర్మించారు.
- గుడ్డు ఆకారంలో రెండు భాగాలుగా ఉండే అండా సెల్స్ జైలు అధికారుల పెట్రోలింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. వీటిలో అత్యంత పటిష్టమైన భద్రత ఉంటుంది.

ఇనుప కడ్డీలే స్నేహితులు.. ఊచలే తోబుట్టువులు

- అండా సెల్స్‌లో రెండు.. బాహ్య, అంతర్గత భద్రతా వలయాలు ఉంటాయి. మిగతా బ్యారక్‌లతో పోలిస్తే అండా సెల్స్‌ను పర్యవేక్షించడానికి ఎక్కువ మంది జైలు అధికారులు ఉంటారు.
- అండా సెల్‌లో జైలుశిక్ష అత్యంత దారుణంగా ఉంటుంది. ఇందులో ఖైదీకి ఏకాంత నిర్బంధం ఉంటుంది. రోజులో 22.5 గంటల పాటు ఒంటరిగా ఉండాల్సి ఉంటుంది. ఇనుప కడ్డీలు, జైలు ఊచలు తప్ప మరో మనిషి జాడ కనిపించదు. సెంట్రల్ జైలులో అత్యంత ఒంటరిగా ఉండే సెల్.. అండా సెల్. అందులో ఉండే ఖైదీ అన్ని వైపులా ఇనుప కడ్డీలతో కప్పబడి ఉంటాడు. ఎత్తయిన గోడలే తప్ప కిటికీలు ఉండవు. పచ్చదనం కనిపించదు. ఒక్క మాటలో చెప్పాలంటే గాలి కూడా చొర బడలేని కాంక్రీట్‌తో నిర్మితమై ఉంటుందంటే అతిశయోక్తి కాదు. గదిలో ఉన్న ఖైదీ చుట్టూ కాంక్రీట్‌ను తప్ప మరేమీ చూడలేడు. స్వచ్ఛమైన ఆక్సిజన్ కూడా అందదు. ఖైదీలు ఇతర ఖైదీలను చూడలేరు.. మాట్లాడలేరు. లైబ్రరీ, క్యాంటీన్‌కు వెళ్లే అవకాశం ఉండదు. బాత్రూమ్, టాయిలెట్ కూడా అండా సెల్‌లోనే అటాచ్డ్‌గా ఉంటాయి. అండా సెల్‌నుంచి తప్పించుకోవడం అసాధ్యం. కుటుంబ సభ్యులతో ములాఖత్ కావడానికి అంతగా అవకాశాలు ఉండవు. ఏ ఖైదీని అండా సెల్‌కు పంపాలనేది ఆ జైలు సూపరింటెండెంట్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.



వీటిలో ఎవరిని నిర్బంధిస్తారంటే..?

అత్యంత కరడు గట్టిన నేరస్తులను, మోస్ట్ వాండెట్ ఉగ్రవాదులను, తీవ్రవాదులను, గ్యాంగ్‌స్టర్‌లను, వ్యవస్థీకృత నేరాలు చేసిన వారిని ఈ అండా సెల్‌లో ఖైదు చేస్తుంటారు. ప్రొఫెసర్ సాయిబాబా, నటుడు సంజయ్‌దత్‌తో పాటు నకిలీ స్టాంప్ పేపర్ల కుంభకోణంలో అబ్దుల్ కరీం తెల్గీ తదితరులు ఇందులో శిక్ష అనుభవించారు.

స్ఫూర్తి

ఆమధ్య వచ్చిన కమల్‌హాసన్ సినిమాలో ఒక డైలాగ్....
'ఈ లోకంలో అత్యంత ధైర్యవంతులు ఎవరో తెలుసా?
కోల్పోవడానికి ఏమీ మిగలని వాళ్లు!'
ఒకప్పుడు హుమేరా బేగం పరిస్థితి అలాగే ఉండేది.
సివిల్స్‌కు ఎంపిక కావాలనేది తన లక్ష్యం.
ఆ లక్ష్యం వైపు అడుగులు పడకుండానే...'మేమున్నాం' అంటూ
సమస్యలు, వాటితోపాటు వచ్చిన బాధలు వరుస కట్టాయి.
ఇలాంటప్పుడు లక్ష్యం మసక మసకగా కనిపించడం మాట అటుంచి
అసలే కనిపించకపోయే ప్రమాదం ఉండవచ్చు.
'కోల్పోవడానికి ఏమీ లేదు' అనుకునే స్థితిలో ఉన్న తనకు
భయం ఎందుకు!
ఆ ధైర్యంతోనే సమస్యలను తట్టుకునే నిలబడింది.
ఎస్‌జీటి ఉర్దూ టీచర్‌గా సెలెక్ట్ అయింది.
మరి సివిల్స్ కల..? అంటారా...
'వెయ్యి మైళ్ల ప్రయాణం అయినా,
ఒక అడుగుతోనే ఆరంభం అవుతుంది'
అనే మాట మనకు తెలియనిది కాదు...


ఉర్దూ టీచర్‌గా హుమేరా బేగం...

టీచర్ కొలువిచ్చిన సివిల్ పవర్

హుమేరా బేగం స్వస్థలం తెలంగాణాలోని వనపర్తి. నాన్న రోజువారీ కూలీగా సైదాబాద్ (హైదరాబాద్)లో ఒక మదర్సాలో పని చేసేవాడు. అమ్మ ఉర్దూ టీచర్‌గా కొంతకాలం పని చేసింది. అన్న ఒబిద్ మానసిక సమస్యతో బాధ పడుతున్నాడు. ఐఏఎస్ ఆఫీసర్ కావాలనేది హుమేరా చిన్నప్పటి కల. హుమేరా ఏడో తరగతిలో ఉన్నప్పుడు కష్టాలు మొదలయ్యాయి.

తండ్రి పక్షవాతం బారిన పడ్డాడు. తండ్రి అనారోగ్య ప్రభావం హుమేరా చదువుపై పడింది. ప్రైవేట్ స్కూల్ నుంచి చాదర్‌ఘట్‌లోని గవర్నమెంట్ స్కూల్‌లో చేర్పించారు. అక్కడే పదో తరగతి పూర్తి చేసింది. మరోవైపు తండ్రి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి తమకు దూరం కావడానికి ఎంతో కాలం పట్టలేదు.

'నా తండ్రి వెయ్యి ఏనుగుల బలం' అనుకునే అమ్మాయి 'తండ్రి లేని బిడ్డ' అయింది.

తండ్రి చనిపోవడంతో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. దీంతో హైదరాబాద్ నుంచి తిరిగి వనపర్తి వెళ్లిపోయారు. హైదరాబాద్ విడిచి వెళుతున్నప్పుడు కళ్లలో నీళ్లు తిరిగాయి. 'హైదరాబాద్ అంటే పెద్ద సిటీ... పెద్ద చదువులు చదువుకోవచ్చు' అనుకునేది.

ధైర్యం ఇచ్చే నాన్న లేడు.
ధైర్యం ఇచ్చే మహా నగరం దూరం అయింది.

అయితే తన కల మాత్రం దూరం కాకుండా జాగ్రత్త పడింది. హుమేరాలో చదువుకోవాలనే తపన చూసి అక్క (చిన్నమ్మ కూతురు) సమీన, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బావ అహ్మద్ అలీ హుమేరా కుటుంబాన్ని మళ్లీ హైదరాబాద్ తీసుకువచ్చారు.

పట్టుదల గట్టిదైతే ఒక్కో ద్వారం దానికదే తెరుచుకుంటూ దారి చూపుతుంది. హుమేరాకు చదువుపై ఉండే ఆసక్తి, పట్టుదల, కల జైలు సూపరింటెండెంట్ వరకు వెళ్లింది. చంచల్‌గూడ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ 'సేవ్ ద గర్ల్ చైల్డ్' సంస్థ తరపున హుమేరాకు అండగా నిలబడ్డాడు. 'మేము సైతం' అన్నారు జైలు సిబ్బంది. తమ పిల్లలకు ట్యూషన్లు చెప్పేందుకు హుమేరాకు అవకాశం ఇచ్చారు.

జైలు అధికారులు, సిబ్బంది సహకారం హుమేరా కుటుంబానికి ఆర్థికంగా భరోసాను ఇచ్చాయి. ఆమెలో ఆత్మవిశ్వాస శక్తిని రెండింతలు చేశాయి. ఎన్ని సమస్యలు ఎదురైనా ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసింది. నేరేడ్‌మెట్‌లో డీఎడ్ కూడా పూర్తి చేసింది. కష్టపడే వారిని విజయం వెదుక్కుంటూ వస్తుంది... అన్నట్లు హుమేర కష్టం వృథా పోలేదు. ఎస్‌జీటీ ఉర్దూ టీచర్‌గా ఎంపిక అయింది.

ఒకప్పుడు...

'ఐఏఎస్ కావాలనేది నా కల' అని హుమేరా అని ఉంటే నవ్వేవాళ్లేమో. ఎందుకంటే తాను ఉన్న దయనీయమైన పరిస్థితుల్లో ఇంటర్మీడియేట్ పూర్తి చేయడమే చాలా కష్టం. ఇప్పుడు ఎవరూ ఎగతాళిగా నవ్వే పరిస్థితి లేదు.

'యస్... ఆ అమ్మాయి కచ్చితంగా సాధిస్తుంది' అంటారు ఇప్పుడు. ఈ నమ్మకం కలిగించడానికి ఆమె ఎంతో కష్టపడింది. గుండె ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. హుమేరాది ఎంతోమంది పేద అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చి ముందుకు నడిపించే పట్టుదల. ఆమె భవిష్యత్ కల నెరవేరాలని బలంగా కోరుకుందాం.

– నాగోజు సత్యనారాయణ,
సాక్షి, హైదరాబాద్ స్టేట్ బ్యూరో

జీవితం ముగిసిపోయింది అనుకున్న సమయంలో....


శివకుమార్ గౌడ్

సివిల్స్ సాధించాలనే నా కలను దృష్టిలో పెట్టుకొని 'సేవ్ ద గర్ల్ చైల్డ్' సంస్థ సహకారంతో శివకుమార్ గౌడ్ సార్ నాకు ఢిల్లీకి చెందిన ఓ కోచింగ్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్ సివిల్స్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఓపెన్ డిగ్రీతో పాటు, నా ట్యూషన్లు కొనసాగిస్తూనే మిగిలిన సమయంలో సివిల్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాను. నా జీవితం ముగిసింది అనుకున్న సమయంలో ఒక దారి దొరికింది. నాలా అవకాశాల కోసం కష్టపడే ఎంతోమంది పేద విద్యార్థులకు అండగా నిలబడేందుకే నేను సివిల్స్‌ను లక్ష్యంగా పెట్టుకున్నాను.

– హుమేరా బేగం



గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే - 2024



చేతులు కడుక్కుందాం

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం చేతుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం (హ్యాండ్ హైజీన్) అనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి 'గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే'ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాదికి గాను దీన్ని ఈనెల 15న నిర్వహిస్తున్నారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు కలిసి 2008లో 'గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ పార్ట్‌నర్‌షిప్ సముదాయంగా రూపొందాయి. ఆనాటి నుంచి దాదాపు 100కు పైగా దేశాల్లోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్కూళ్లు, ప్రైవేటు సంస్థలు ఈ రోజున చేతులు శుభ్రంగా కడుక్కోవడంపై అవగాహన కల్పిస్తున్నాయి.

ఈ ఏడాది థీమ్ : ''శుభ్రమైన చేతులు ఎందుకు అవసరమంటే''?

ఈ పొరబాట్లు చేయకండి...

చేతులు కడుక్కోవడం అందరికీ తెలిసిన విద్యే. ఇందులో కొత్తగా నేర్చుకోవాల్సిన నైపుణ్యాలేమీ లేవు. రెండుమూడేళ్ల కిందట కరోనా వచ్చినప్పుడు మందులూ, మాకులూ, వ్యాక్సిన్లకంటే ముందుగా అందరి ప్రాణాలు రక్షించింది ఈ చేతులు కడుక్కోవడమనే పనే. చేతులు కడుక్కోవడంలో చేసే కొన్ని పొరబాట్లను సరిదిద్దుకోవడమెలాగో చూద్దాం.




- **సబ్బును మరవకండి:** వాష్ బేసిన్‌లో నల్లా / కొళాయి కింద చేతులుంచినా చేతులు కడుక్కున్నట్టే. కానీ హానికరమైన మురికి అంతా తొలగిపోవాలంటే సబ్బును వాడాల్సిందే.
- **మొక్కుబడిగా వద్దు:** చేతులు కడిగేదే మురికినంతా శుభ్రం చేసుకోడానికి. అందువల్ల సబ్బు రాసుకున్న చేతివేళ్లను శుభ్రంగా కనీసం 20 సెకన్లపాటు రుద్దుకుంటూ కడగాలి.
- **పొడిగా అయ్యేంతవరకు ఆగండి:** చేతుల్ని శుభ్రం చేసుకున్న వెంటనే ఆ తడిచేతులతోనే ఏదైనా పనికి ఉపక్రమించడం సరికాదు. తడి చేతులు పొడిగా అయ్యేవరకు ఆగి అప్పుడు తినడం లేదా ఏదైనా పనిచేయడం మొదలుపెట్టాలి.
- ఒకసారి చేతులు శుభ్రంగా కడిగాక తినడం లేదా ఏదైనా పని చేయడం పూర్తయ్యే వరకు మురికిగా ఉండే ఉపరితలాలను తాకడం సరికాదు.
- **ఆదరాబాదరా అసలే వద్దు**

కొందరు చేతులు కడుక్కునేటప్పుడు ఆదరాబాదరా కడిగేసుకుంటారు. రెండు వేళ్లకూ మధ్యనుండే చోట్ల లేదా గోర్ల చివరల్లో అంతగా శుభ్రం చేసుకోరు. చేతులు కడుక్కోవడం అంటే వేలికీ వేలికీ మధ్యనుండే చోట్లలో, అలాగే గోర్ల కింద కూడా శుభ్రంగా కడుక్కోవాలి.

యోగా కాలమ్

వెన్నుకు దన్ను



వంగి పనిచేయడం, నిటారుగా ఉండటంలో ఏదైనా అసౌకర్యంగా అనిపిస్తుంటే వెన్నెముక కండరాలకు శక్తి అవసరం అని గుర్తించాలి. వెన్ను కండరాలను బలపరిచి, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో భుజంగాసనం బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా, పొట్ట, హిప్ కండరాలను గట్టిపరుస్తుంది. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. శ్వాసకోశ సమస్యలను నివారిస్తుంది. తాచుపాము పడగ విప్పితే ఎలా ఉంటుందో ఈ భంగిమ అలా ఉంటుంది. అందుకే ఈ ఆసనాన్ని కోబ్రా పోజ్ అని, తెలుగులో భుజంగాసనం అంటారు.

- యోగా మ్యాట్ పైన బోర్లా పడుకొని, చేతులను నడుము, హిప్ భాగానికి ఇరువైపులా ఉంచాలి.
- అర చేతులను నేలకు ఆనించి, భుజాలు, తల నెమ్మదిగా పైకి లేపాలి.
- అరచేతులను నేలకు నొక్కి పట్టి ఉంచి, నెమ్మదిగా ఛాతీ భాగాన్ని పైకి లేపాలి. దిగువ వీపుపై ఒత్తిడి పడకుండా వెనుక కండరాలను కొద్దిగా స్ట్రెచ్ చేయాలి.
- దీర్ఘ శ్వాస తీసుకుంటూ 15 నుంచి 20 సెకన్ల పాటు ఈ భంగిమలో ఉండాలి. శ్వాస వదులుతూ తిరిగి యథాస్థితికి రావాలి.
- ఇదేవిధంగా ఐదారు సార్లు ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.

గర్భిణులు ఆ ఆసనం వేయకూడదు. శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్న వారు, వయసు పైబడిన వారు ఆ ఆసనాన్ని నిపుణుల సూచనల మేరకే సాధన చేయాలి.



– జి.అనూష,
యోగా గురు

సాగుబడి
చిత్త కార్తె : అక్టోబర్ 11 నుంచి 24 వరకు



వరిలోనే గోనె సంచుల్లో కూరగాయల సాగు!


రబీ వరి పొలంలో గోనె సంచుల్లో పెరిగిన క్యాబేజీ మొక్కలు

- వరి పొలాల్లో అంతరపంటలుగా గోనె సంచుల్లో కూరగాయల సాగుకు అవకాశం
- నీరు నిల్వగట్టే రబీ వరి పొలాల్లో కూరగాయల సాగుతో పౌష్టికాహార భద్రతతో పాటు అదనపు ఆదాయం
- అధిక ఉష్ణోగ్రతల్లోనూ నిశ్చింతగా కూరగాయల దిగుబడి
- హెక్టారులో 4-5 టన్నుల వరి ధాన్యంతో పాటు 60 క్వింటాళ్ల టొమాటోలు లేదా 30 క్వింటాళ్ల క్యారట్/ ముల్లంగి దిగుబడి పొందవచ్చు
- ఐసిఎఆర్ సంస్థ 'క్రిజాఫ్' పరిశోధనల్లో వెల్లడి

సార్వా, దాళ్వా సీజన్లలో (వర్షాకాలం, ఎండా కాలాల్లో) విస్తారంగా వరి పంట సాగయ్యే ప్రాంతాల్లో గట్ల మీద తప్ప పొలంలో అంతర పంటలుగా కూరగాయ పంటలను నేలపై సాగు చేయటం సాధ్యపడదు. అయితే, వరి సాళ్ల మధ్యలో వరుసలుగా ఏర్పాటు చేసిన గోనె సంచుల్లో సాధ్యపడుతుంది. గోనె సంచిలో అడుగు ఎత్తున మట్టి + మాగిన పశువుల ఎరువు/ఘన జీవామృతాల మిశ్రమం నింపి.. అందులో రకరకాల కూరగాయ మొక్కలు సాగు చేసుకునే అవకాశం మెండుగా ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలు తెలియజేస్తున్నాయి. స్వల్ప ఖర్చుతోనే వరి రైతులు అధికాదాయం పొందేందుకు అవకాశం ఉంది. వరి సాగయ్యే ప్రాంతాల్లో స్థానికంగా కూరగాయల లభ్యత పెరగటంతో ప్రజలకు పౌష్టికాహార భద్రత చేకూరుతుందని ఈ పద్ధతిపై సుదీర్ఘ పరిశోధన చేసిన విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.కె. ఘొరాయ్ అంటున్నారు. పశ్చిమ బెంగాల్ బారక్‌పుర్‌లోని (ఐసిఎఆర్ అనుబంధ సంస్థ) సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ జ్యూట్ అండ్ అల్లీడ్ ఫైబర్స్ (ఐసిఎఆర్ - క్రిజాఫ్)లో ఈ పరిశోధనలు చేశారు. అధిక ఉష్ణోగ్రతల్లోనూ నిశ్చింతగా కూరగాయల దిగుబడి పొందవచ్చని ఈ పరిశోధనల్లో తేలింది.

పదేళ్ల పరిశోధన

2011–2021 మధ్యకాలంలో క్రిజాఫ్ ఆవరణలో, మరికొన్ని జిల్లాల్లో రబీ వరి పొలాల్లో గోనె సంచుల్లో కూరగాయలను అంతర పంటలుగా ప్రయోగాత్మకంగా సాగు చేశారు. నీరు నిల్వ ఉండే చోట నేలలో ప్రాణవాయువు లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ ద్విదళ జాతికి చెందిన కూరగాయ పంటలు సాగు చేసుకోవచ్చని తేలింది. మట్టి లోతు తక్కువగా ఉండే రాళ్ల నేలల్లో, చౌడు నేలల్లో కూడా ఈ విధంగా గోనె సంచుల్లో మట్టి మిశ్రమం నింపుకొని కూరగాయ పంటలు నిశ్చింతగా పండించుకోవచ్చు. ఎండాకాలంలో మంచి ధర పలికే టొమాటోలు, క్యారట్, ముల్లంగి, వంగ, పొద చిక్కుడు, కాలీఫ్లవర్, క్యాబేజి వంటి పంటలతో పాటు బీర, పొట్ల, సొర, ఆనప, గుమ్మడి, బూడిద గుమ్మడి వంటి తీగజాతి కూరగాయలను, కొత్తిమీర, ఉల్లి, కంద తదితర పంటలను పండించి మంచి ఆదాయం గడించవచ్చని డాక్టర్ ఘొరాయ్ తెలిపారు. తీగలు పాకడానికి మూడు కర్రలు పాతి, పురికొస చుట్టి ఆసరా కల్పించాలి. వరి పంట కోసిన తర్వాత నేల మీద పాకించవచ్చు. అవసరాన్ని బట్టి తాత్కాలిక పందిరి వేసుకోవచ్చు. ఈ మడుల్లో ఒక పంట పూర్తయ్యాక మరో పంటను వేసుకోవచ్చు.

ఖర్చుకు పది రెట్ల ఆదాయం

నీరు నిల్వ గట్టే వరి పొలాల్లో గోనె సంచుల్లో వరుసలుగా ఈ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తే రైతుల కుటుంబాలకు, స్థానిక ప్రజలకు పుష్కలంగా కూరగాయలు అందుబాటులోకి వస్తాయి. ఒకే స్థలంలో అవే వనరులతో వరితో పాటు అనేక రకాల కూరగాయ పంటలు పండించుకోవచ్చు. వరి రైతులు రూపాయి అదనంగా ఖర్చుపెట్టి పది రెట్లు ఆదాయం సమకూర్చుకోవచ్చు. వరి పొలంలో నీరు నిల్వ ఉండటం వల్ల ఆరుబయట కూరగాయ తోటలతో పోల్చితే 6–8 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. అందువల్ల ఎండలు ముదిరిన తర్వాత కూడా కూరగాయల దిగుబడి బాగుంటుంది. వేసవిలో నీరు తదితర వనరులను మరింత ఉత్పాదకంగా వినియోగించుకోవటానికి ఈ పద్ధతి తోడ్పడుతుంది.



– డాక్టర్ ఎ.కె. ఘొరాయ్,
విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త,
సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ జ్యూట్ అండ్ అల్లీడ్ ఫైబర్స్ (ఐసిఎఆర్ - క్రిజాఫ్),
బారక్‌పుర్, పశ్చిమ బెంగాల్.


రబీ వరి పొలంలో గోనె సంచుల్లో పెరిగిన క్యారట్ దుంపలు


రబీ వరి పొలంలో సాగైన ముల్లంగి

గోనె సంచుల్లో సాగు ఎలా?

ప్లాస్టిక్ వాడకం జోలికి పోకుండా వాడేసిన గోనె సంచిని అడ్డంగా ముక్కలుగా చేయాలి. బ్లైటాక్ నాడ్ రోగార్ కలిపిన నీటిలో గోనె సంచిని శుద్ధి చేస్తే శిలీంధ్రాలు, పురుగులను తట్టుకోవడానికి వీలుంటుంది. వాటికి నిలువుగా నిలబెట్టి, మట్టి+ సేంద్రియ ఎరువు నింపాలి. బయట ఏర్పాటు చేసి తీసుకెళ్లి పొలంలో పెట్టకూడదు. నీటిని నిల్వగట్టిన వరి పొలంలోనే వీటిని తయారు చేసుకోవాలి. గోనె అడుగున మొదట 2 అంగుళాల మందాన ఎండు వరి గడ్డి వేయాలి. దానిపై వరి పొలంలోని బురద మట్టినే 4 అంగుళాలు వేయాలి. ఆపైన మాగిన పశువుల ఎరువు లేదా ఘన జీవామృతం 2 అంగుళాల మందాన వేయాలి. ఆపైన మళ్లీ 2 అంగుళాల మందాన ఎండు వరి గడ్డి, మట్టి, ఎరువు పొరలుగా వేసి ఆపైన కొంచెం మట్టి కప్పాలి. అంతే.. కూరగాయ మొక్కలు నాటడానికి గోనె సంచి మడి సిద్ధమైనట్టే. వరి గడ్డి క్రమంగా కుళ్లి పోషకాలను అందించటంతో పాటు మట్టి పిడచకట్టుకుపోకుండా గుల్లబరుస్తుంది. ఈ గోనె సంచుల మడులకు పనిగట్టుకొని నీరు పోయాల్సిన అవసరం లేదు. కాపిల్లరీ మూమెంట్ ద్వారా మట్టి అడుగున ఉన్న నీటి తేమను ఎప్పటికప్పుడు పీల్చుకొని మొక్కల వేర్లకు అందిస్తుంది. అప్పుడప్పుడూ ద్రవజీవామృతం తదితర ద్రవరూప ఎరువులను ఈ మడుల్లో పోస్తుంటే మొక్కలకు పోషకాల లోపం లేకుండా పెరిగి ఫలసాయాన్నిస్తాయి. వరి పంటను కంబైన్ హార్వెస్టర్‌తో కోత కోసే పనైతే.. అది వెళ్లడానికి వీలైనంత దూరంలో ఈ కూరగాయ మొక్కలను వరుసలుగా ఏర్పాటు చేసుకోవాలి.

హెక్టారుకు 3 వేల మడులు

95 సెం.మీ. పొడవుండే 50 కిలోల గోనె సంచిని అడ్డంగా 3 ముక్కలు చేసి మూడు మడులు ఏర్పాటు చేయొచ్చు. హెక్టారుకు వెయ్యి గోనె సంచులు (3 వేల మడులకు) సరిపోతాయి. మడి ఎత్తు 30 సెం.మీ. (అడుగు), చుట్టుకొలత 45 సెం.మీ. ఉంటుంది. వరి పొలంలో 5-10 సెం.మీ. లోతు నీరుంటుంది. కాబట్టి కూరగాయ మొక్కలకు ఇబ్బంది ఉండదు. హెక్టారుకు 3 వేల గోనె సంచి మడులు పెట్టుకోవచ్చు. 3వేల వంగ మొక్కల్ని లేదా 6 వేల క్యాబేజి మొక్కల్ని వేసుకోవచ్చు. సమ్మర్ కేరట్ లేదా ముల్లంగి హెక్టారుకు 30 క్వింటాళ్ల దిగుబడి తీసుకోవచ్చు. టొమాటో మొక్కకు 2 కిలోల చొప్పున హెక్టారుకు 60 క్వింటాళ్ల టొమాటోల దిగుబడి పొందవచ్చు. హెక్టారుకు 4-5 టన్నుల వరి ధాన్యానికి అదనంగా కూరగాయలను పుష్కలంగా పండించుకోవచ్చని డాక్టర్ ఘొరాయ్ వివరించారు. రబీ వరిలో అంతరపంటలుగా కూరగాయల సాగుపై మన యూనివర్సిటీలు / కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తే రైతులు అందిపుచ్చుకుంటారు. ఈ పంటల వీడియోలను డాక్టర్ ఘొరాయ్ తన యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేశారు.

https://www.youtube.com/@aseshghorai8478

సేంద్రియ/ ప్రకృతి సేద్యంలో 3 నెలల కోర్సు

రా వ స్వా ప్ర సం
NIPHM

కేంద్ర వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థ హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపిహెచ్‌ఎం) దేశంలోనే పేరెన్నికగల వ్యవసాయ శిక్షణా సంస్థ. సేంద్రియ / ప్రకృతి సేద్య పద్ధతులపై రైతులు, ఎఫ్‌పిఓలు/ సహకార సంఘాల నిర్వాహకులు, రైతు శాస్త్రవేత్తలుగా ఎదిగి స్వయం ఉపాధి పొందాలనుకునే యువతకు లోతైన శాస్త్రీయ అవగాహన, ఆచరణాత్మక శిక్షణ కల్పించడానికి ఎన్‌ఐపిహెచ్‌ఎం 3 నెలల సర్టిఫికెట్ కోర్సు తెలుగు/హిందీ భాషల్లో నిర్వహించనుంది. నూటికి నూరు శాతం రసాయనాల్లేకుండా సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయదలచిన వారికి ఇది సదవకాశం. నవంబర్ 27 నుంచి వచ్చే మార్చి 5 వరకు ఈ కోర్సు ఉంటుంది. వివిధ కేంద్ర వ్యవసాయ సంస్థలతో కలసి ఎన్‌ఐపిహెచ్‌ఎం నిర్వహించే ఈ కోర్సులో 3 దశలుంటాయి. మొదట 21 రోజులు రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐపిహెచ్‌ఎం ఆవరణలో శాస్త్రీయ అంశాల బోధన. తర్వాత అభ్యర్థి ఎంపిక చేసుకున్న ప్రాంతంలో 2 నెలలు క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు. ఆ తర్వాత ఎన్‌ఐపిహెచ్‌ఎంలో 10 రోజుల తుది దశ శిక్షణ ఉంటాయి. ఇంటర్ లేదా టెన్త్ తర్వాత వ్యవసాయ డిప్లొమా చేసిన 18 ఏళ్లు నిండిన అన్ని సామాజిక వర్గాల స్త్రీ పురుషులు అర్హులు. గ్రామీణ యువతకు ప్రాధాన్యం. కోర్సు ఫీజు: రూ. 7,500. శిక్షణా కాలంలో ఉచిత వసతి కల్పిస్తారు. భోజనానికి రోజుకు రూ.305 అభ్యర్థి చెల్లించాలి. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ఇస్తారు. దరఖాస్తులను నవంబర్ 22 లోగా పోస్టు/మెయిల్ ద్వారా పంపవచ్చు. ఇతర వివరాలకు కోర్సు కోఆర్డినేటర్ డా. కె. దామోదరాచారి (95426 38020)ని సంప్రదించవచ్చు. asomicroniphm2019@gmail.com

ఈనెల 22, 23 తేదీల్లో బయోడైనమిక్ సేద్యంపై శిక్షణ

Biodynamic Association of India

దేశ విదేశాల్లో చిరకాలంగా కొందరు రైతులు అనుసరిస్తున్న సేంద్రియ సేద్య పద్ధతుల్లో బయోడైనమిక్ సేద్యం ఒకటి. రైతులు స్వయంగా తయారు చేసుకునే ఆవు కొమ్ము ఎరువు తదితర సేంద్రియ ఎరువులను సూక్ష్మ పరిమాణంలో వేస్తూ చేసే రసాయన రహిత సేద్య పద్ధతి ఇది. టైమ్ టేబుల్ ప్రకారం ప్రతి వ్యవసాయ పనినీ నిర్దేశిత రోజుల్లో మాత్రమే చేయటం ఇందులో ప్రత్యేకత. బయోడైనమిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో బెంగళూరులోని బెంగళూరు ఇంటర్నేషనల్ సెంటర్‌లో రైతు శిక్షణా శిబిరం జరగనుంది. బయోడైనమిక్ సేద్యంలో అనుభవం కలిగిన రైతులు శిక్షణ ఇస్తారు. క్షేత్ర సందర్శన ఉంటుంది. ప్రవేశ రుసుము (శిక్షణ, భోజనం సహా): రూ. 1,500. వసతి ఎవరికి వారే చూసుకోవాలి. ఆసక్తి గల వారు ముందుగా గూగుల్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.
ఇతర వివరాలకు.. 97386 76611. https://events.biodynamics.in/

జైవిక్ భారత్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

JAIVIK INDIA AWARDS

సేంద్రియ / ప్రకృతి వ్యవసాయదారులకు మన దేశంలో ప్రదానం చేసే ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా పురస్కారాలకు ఈ నెలాఖరు లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (ఐసిసిఓఎ) ఆధ్వర్యంలో బెంగళూరులో డిసెంబర్ 27, 28 తేదీల్లో జరిగే భారీ సేంద్రియ ఉత్పత్తుల వాణిజ్య ప్రదర్శన 'బయోఫెస్ట్ 20021 లో తొలి రోజు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. సేంద్రియ సేద్యం. వ్యాపారం తదితర 12 విభాగాలకు సంబంధించి 57 జైవిక్ ఇండియా పురస్కారాలను ప్రదానం చేస్తారు. 12 మంది సేంద్రియ / ప్రకతి వ్యవసాయదారులకు నగదు బహుమతితో కూడిన పురస్కారాలను ప్రదానం చేస్తారు. కనీసం మూడేళ్లుగా ప్రకతి/ సేంద్రియ సేద్యం చేస్తూ.. ఎన్పిఓపి లేదా పిజిఎస్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ కలిగిన రైతులు పూర్తి వివరాలకు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31 లోగా అందేలా పంపాలి. ఎఫ్పిఓలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ విభాగాలు అవార్డు కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు రూ.2,500 ఫీజు చెల్లించాలి. అయితే. రైతులకు మినహాయింపు ఉంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న రైతులకు బయోఫెస్ట్ లో పాల్గొనేందుకు కూడా ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్, తదితర వివరాలకు.. 9902745413, 98110 07283. www.iccoa.org/jaivikindiaawards/



జర్మన్ ఓపెన్ జూనియర్ టోర్నీ రన్నరప్ సాయిప్రసాద్

హైదరాబాద్ బ్యాడ్మింటన్ యువతార తీగల సాయిప్రసాద్ మరో అంతర్జాతీయ టోర్నీలో రాణించాడు. జర్మన్ ఓపెన్ జూనియర్ టోర్నీ అండర్-19 పురుషుల సింగిల్స్ విభాగంలో సాయిప్రసాద్ రన్నరప్‌గా నిలిచాడు. ఇవాన్ సారెహోరోదిసెవ్ (ఉక్రెయిన్)తో జరిగిన ఫైనల్లో 17 ఏళ్ల సాయిప్రసాద్ 21-13, 17-21, 19-21తో పోరాడి ఓడిపోయాడు. అంతకుముందు సెమీఫైనల్లో సాయిప్రసాద్ 21-12, 21-16తో మాథ్యూ వార్నింగ్ (స్కాట్లాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 21-17, 13-21, 21-15తో థామస్ టోర్నీఫియర్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు.

క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ



అల్మాటీ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. కజకిస్తాన్‌లో సోమవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో రిత్విక్-అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6-4, 7-6 (7/3)తో మార్కో బొర్టోలోటి (ఇటలీ)-ప్యాట్రిక్ నిక్లాస్ (ఫిన్లాండ్) జోడీపై నెగ్గింది. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రితిక్-అర్జున్ జంట ఎనిమిది ఏస్‌లు సంధించింది.

కథ మళ్లీ మొదటికి...

'నా దృష్టిలో టి20ల్లో ఇదే భారత అత్యుత్తమ జట్టు. 15 మందిలో 12 మందికి ప్రపంచ కప్ ఆడిన అనుభవం ఉంది. అందరికీ తమ బాధ్యతలు బాగా తెలుసు. వారి సత్తాపై నాకు బాగా నమ్మకముంది'... వరల్డ్ కప్ కోసం బయల్దేరే ముందు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చేసిన వ్యాఖ్య ఇది. కానీ తుది ఫలితం చూస్తే మాత్రం అందరికీ నిరాశ కలిగించింది. ప్లేయర్‌గా 9వ ప్రయత్నంలో కూడా వరల్డ్ కప్ ట్రోఫీ లేకుండానే హర్మన్ ముగించింది. వరుసగా గత మూడు టి20 వరల్డ్ కప్‌లలో సెమీస్, ఫైనల్, సెమీస్... ఇదీ మన ప్రదర్శన. టీమ్ బలాబలాలు, ఫామ్, ర్యాంక్‌ను బట్టి చూసుకుంటే మన జట్టు మహిళల క్రికెట్‌లో కచ్చితంగా టాప్-4లో ఉంటుంది. కాబట్టి మరో చర్చకు తావు లేకుండా కనీసం సెమీఫైనల్ అయినా చేరుతుందని అందరూ అంచనా వేశారు. తర్వాతి రెండు నాకౌట్ మ్యాచ్‌ల సంగతేమో కానీ... సెమీస్ గురించి ఎవరికీ సందేహాలు లేవు. గత రెండు సీజన్లుగా పూర్తి స్థాయిలో సాగుతున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాణించి అవకాశం దక్కించుకున్న యువ ప్లేయర్లు జట్టును మరింత పటిష్టంగా మార్చారు. ఇలాంటి స్థితిలో వరల్డ్ కప్‌లో జట్టు ప్రదర్శన ఆశ్చర్యం కలిగించింది. అసలు ఆటగాళ్లలో దూకుడు, ఆత్మవిశ్వాసమే కనిపించలేదు. పైగా యూఏఈలో వాతావరణం, పిచ్‌లు భారత్‌కు అనుకూలం అంటూ జరిగిన ప్రచారంతో హర్మన్ బృందం ఫేవరెట్‌గా మారింది. కొన్ని రోజుల క్రితమే ఆసియా కప్ ఫైనల్లో భారత్ అనూహ్యంగా శ్రీలంక చేతిలో ఓడింది. అయితే ఆ మ్యాచ్ ఒక 'అరుదైన పరాజయం'గానే అంతా భావించారు. ఎందుకంటే ఫైనల్‌కు ముందు ఆ టోర్నీలో మన జట్టు అద్భుతంగా ఆడింది. కాబట్టి దాని ప్రభావం వరల్డ్ కప్‌పై ఉండకపోవచ్చు అని కూడా అంతా భావించారు. గ్రూప్ 'ఎ' నుంచి ఆస్ట్రేలియా తర్వాత రెండో జట్టుగా భారత్ సెమీస్ చేరే అవకాశం కనిపించింది. అయితే తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో 58 పరుగులతో చిత్తుగా ఓడటంతోనే అంతా తలకిందులైంది. సెమీస్‌లో స్థానం కోసం మనతో పోటీ పడే జట్టుపై గెలవకపోవడమే చివరకు దెబ్బ తీసింది. ఆ తర్వాత పాక్‌పై 106 పరుగుల లక్ష్యాన్ని అందుకునేందుకు కూడా 18.5 ఓవర్లు తీసుకోవడం మన బలహీన ఆటను గుర్తు చేసింది. ఆపై శ్రీలంకను 82 పరుగులతో చిత్తు చేసినా... ఆసీస్ ముందు తలవంచాల్సి వచ్చింది. నాలుగో వికెట్‌కు హర్మన్, దీప్తి 55 బంతుల్లోనే 63 పరుగులు జోడించి గెలుపు దిశగా సాగుతున్న మ్యాచ్‌లో కూడా చివరకు మన జట్టు తలవంచింది. ఓవరాల్‌గా లంకపై మినహా మన ఆటతీరు అతి సాధారణంగా కనిపించింది. హర్మన్ ఒక్కతే రెండు అర్ధసెంచరీలు చేయగా... టాప్-5లో మిగతా నలుగురు పూర్తిగా విఫలమయ్యారు. స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన కూడా మూడు కీలక మ్యాచ్‌లలో కనీస ప్రదర్శన ఇవ్వలేదు. షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. బ్యాటింగ్‌తో పోలిస్తే మన బౌలింగ్ మెరుగ్గా అనిపించింది. అరుంధతి రెడ్డి, రేణుక సింగ్ చెరో 7 వికెట్లతో ఆకట్టుకోగా... ఆశా శోభన రాణించింది. అయితే సమష్టి వైఫల్యం కివీస్, ఆసీస్‌తో మ్యాచ్‌లలో దెబ్బ తీసింది. సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన ఫిట్‌నెస్ క్యాంప్, స్కిల్ క్యాంప్‌లు చాలా బాగా జరిగాయని కోచ్ అమోల్ మజుందార్ చెప్పాడు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు స్పోర్ట్స్ సైకాలజిస్ట్ ముగ్ధ బవరే కూడా జట్టుతో ఉంది. కానీ తాజా ఫలితం చూస్తే అతను మెరుగుపర్చాల్సిన అంశాలు చాలా ఉన్నాయనేది స్పష్టం.

-సాక్షి క్రీడా విభాగం



హర్మన్‌ప్రీత్

న్యూజిలాండ్ సెమీస్‌కు భారత్ ఇంటికి



హర్మన్‌ప్రీత్ బృందం సెమీస్ ఆశలు గల్లంతు

- చివరి మ్యాచ్‌లో పాక్‌ను చిత్తు చేసిన కివీస్
- 54 పరుగులతో ఘన విజయం
- మహిళల టి20 వరల్డ్ కప్

దుబాయ్: టి20 వరల్డ్ కప్‌లో భారీ అంచనాలతో వెళ్లిన భారత మహిళల బృందం కథ లీగ్ దశలోనే ముగిసింది. తమ అదృష్టాన్ని ఇతర జట్ల చేతిలో పెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ టీమ్‌కు కలిసి రాలేదు. గ్రూప్ 'ఎ' చివరి పోరులో న్యూజిలాండ్‌పై పాకిస్తాన్ నెగ్గితేనే భారత్ ముందంజ వేసే అవకాశం ఉండగా... కివీస్ ఆ అవకాశం ఇవ్వలేదు. లీగ్ దశలో మూడో విజయంతో ఆ జట్టు దర్జాగా సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 54 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. ముందుగా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేయగా... పాక్ 11.4 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. 2 కీలక వికెట్లు తీసిన ఎడెన్ కార్సన్ (2/7) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఈ గ్రూప్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌లూ గెలిచి ఆస్ట్రేలియా ఇప్పటికే సెమీస్ చేరగా, కివీస్‌కు రెండో స్థానం ఖాయమైంది. రెండు విజయాలకే పరిమితమైన భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

గెలిపించిన బౌలర్లు...

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది. నెమ్మదైన పిచ్‌పై ఎవరూ దూకుడుగా ఆడలేకపోవడంతో పరుగులు వేగంగా రాలేదు. సుజీ బేట్స్ (29 బంతుల్లో 28; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, హ్యాలిడే (22), సోఫీ డివైన్ (19), ప్లిమ్మర్ (17) కీలక పరుగులు జోడించారు. పాక్ బౌలింగ్ మెరుగ్గా ఉన్నా... టీమ్ ఫీల్డింగ్ దెబ్బ తీసింది. పాక్ ఫీల్డర్లు ఏకంగా 8 క్యాచ్‌లు వదిలేయడంతో కివీస్ 100 పరుగులు దాటగలిగింది. అనంతరం పాక్ పేలవమైన బ్యాటింగ్‌తో చేతులెత్తేసింది. సులువైన లక్ష్యం ముందున్నా ఆ జట్టు కనీస స్థాయి ప్రదర్శన ఇవ్వకపోగా, కివీస్ బౌలర్లు సెమీస్ స్థానం కోసం బలంగా పోరాడారు. పాక్ జట్టులో ఫాతిమా సనా (21), మునీబా (15) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. పవర్‌ప్లే లోపే 5 వికెట్లు కోల్పోయిన పాక్ జట్టు... 12 బంతుల వ్యవధిలో చివరి 5 వికెట్లు చేజార్చుకుంది.

ముగ్గురు పేసర్లతో బరిలోకి...

న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకు భారత్ సన్నద్ధత

బెంగళూరు: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల్లో భారత జట్టు ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగి మంచి ఫలితాలు సాధించింది. బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్ కూడా తమ బౌలింగ్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు ఇదే వ్యూహాన్ని న్యూజిలాండ్‌పై కూడా టీమిండియా అమలు చేసే అవకాశం ఉంది. ఈ సిరీస్ తర్వాత జరగబోయే ఆస్ట్రేలియా పర్యటనకు కూడా పేసర్లకు ఇది సన్నాహకంగా పనికొస్తుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. రేపటి నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు జరగనున్న నేపథ్యంలో చిన్నస్వామి స్టేడియంలో సోమవారం జట్టు ఆటగాళ్లంతా ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. 'పరిస్థితులు, పిచ్, ప్రత్యర్థిని బట్టి తుది జట్టు ఎంపిక ఉంటుంది. మా డ్రెస్సింగ్ రూమ్‌లో పెద్ద సంఖ్యలో అత్యుత్తమ ఆటగాళ్లు ఉండటం సానుకూలాంశం. వారిలోంచి ఎవరినైనా ఎంచుకోవచ్చు. అందరూ జట్టును గెలిపించగల సమర్థులే అని మా నమ్మకం. చిన్నస్వామి స్టేడియంలో పిచ్‌ను చూసిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం' అని జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇటీవల శ్రీలంక చేతిలో 0-2తో టెస్టు సిరీస్‌లో ఓడిన కివీస్... 37 వికెట్లను స్పిన్నర్లను సమర్పించుకుంది. ఈ నేపథ్యంలో కుల్దీప్, అక్షర్‌లకు కూడా తొలి టెస్టులో చోటు ఇస్తారా అనేది ఆసక్తికరం. 'వారిద్దరూ ప్రతిభావంతులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎవరినీ మేం పక్కన పెట్టడం లేదు. అయితే జట్టును గెలిపించగల 11 మందిని ఎంపిక చేయడమే అన్నింటి కంటే ముఖ్యం' అని గంభీర్ స్పష్టం చేశాడు.



సిరాజ్

సినిమా

నాగబంధం ఆరంభం



● నభా నటేష్, విరాట్ కర్ణ, ఐశ్వర్యా మీనన్‌లపై క్లాప్ కొడుతున్న చిరంజీవి

'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా 'నాగబంధం- ది సీక్రెట్ ట్రెజర్' అనే సినిమా ఆరంభమైంది. 'డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్' తో దర్శకుడిగా మారిన నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ ఇతర పాత్రలు పోషించనున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిషోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్న 'నాగబంధం' సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో చిరంజీవి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తొలి సన్నివేశానికి డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. నిర్మాత సునీల్ నారంగ్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. ఈ సందర్భంగా నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ– ''నాగబంధం- ది సీక్రెట్ ట్రెజర్ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ని ఈ నెల 23 నుంచి ప్రారంభిస్తున్నాం. 2025లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం'' అన్నారు. ''భారతదేశంలోని 108 విష్ణు దేవాలయాలు నాగబంధం ద్వారా రక్షించబడుతున్నాయి. ఆ నేపథ్యంలో ఈ చిత్ర కథ ఉంటుంది'' అని అభిషేక్ నామా తెలిపారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: తారక్ సినిమాస్, కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే, సీఈఓ: వాసు పోతిని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అభినేత్రి జక్కల్.

కాంబినేషన్ సెట్?



● ఆమిర్ ఖాన్

బాలీవుడ్ అగ్ర హీరో ఆమిర్ ఖాన్, తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ కథ విషయమై ఇటీవల ఆమిర్ ఖాన్, లోకేష్ పలుమార్లు చర్చించుకున్నారట. ప్రస్తుతం వీరిద్దరికి ఉన్న కమిట్‌మెంట్స్ పూర్తయిన తర్వాత ఈ సినిమాపై అధికారిక ప్రకటన రావచ్చని, 2026లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయని బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. అంతేకాదు.. ఈ సినిమా సూపర్‌హీరో జానర్‌లో ఉంటుందట. మరి.. ఆమిర్, లోకేష్ కాంబినేషన్ సెట్ అవుతుందా? వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో ఆమిర్ ఖాన్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారనే టాక్ కూడా తెర‌పైకి వచ్చిన సంగతి తెలిసిందే.

నవంబరులో స్టార్ట్



● సూర్య

సూర్య హీరోగా ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ రూపుదిద్దుకోనుంది. సూర్య కెరీర్‌లో 45వ సినిమాగా రూపొందనున్న ఈ మూవీని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను నవంబరులో ప్రారంభించి, వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు మేకర్స్. ''ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌లో ఆర్‌జే బాలాజీ బిజీగా ఉన్నారు. ఈ కథపై ఆయన ఏడాదిగా వర్క్ చేస్తున్నారు. చిత్రీకరణకు అనువైన లొకేషన్ల సందర్శన కూడా చేస్తున్నారాయన'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

సంక్రాంతి బరిలో...



● సుమంత్

సుమంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో కాలిపు మధు నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయాలని చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ''మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశంతో ఈ సినిమాని తీస్తున్నాం. మా చిత్రం కచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. బ్రహ్మానందం ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు.

క అందరికీ నచ్చుతుంది

– కిరణ్ అబ్బవరం



● తన్వీ రామ్, కిరణ్ అబ్బవరం

''క' సినిమా 70వ దశకం నేపథ్యంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో సాగుతుంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులు, పెద్ద వాళ్లను కూడా ఆకర్షించే అంశాలున్నాయి. అందుకే ఈ సినిమా అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించిన చిత్రం 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమాని దీపావళి సందర్భంగా ఈ నెల 31న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడలో రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'క' ని తెలుగులో నిర్మాత వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ వేఫరర్ ఫిలింస్‌పై రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ–''క' సినిమా ఫస్ట్ డే షూటింగ్ లొకేషన్‌కు అల్లు అర్జున్‌గారు వచ్చి.. 'కిరణ్.. ఈ సినిమాతో నువ్వు పెద్ద హిట్ కొట్టాలి' అని ఆశీర్వదించడం చాలా సంతోషంగా ఉంది'' అని తెలిపారు. ''ఈ కథను తెరకెక్కించే క్రమంలో మేమంతా ఎలాంటి అనుభూతి పొందామో ప్రేక్షకులు కూడా అదే అనుభూతి చెందుతారు'' అని సందీప్ అన్నారు. ''1970వ దశకంలో అభినవ్ వాసుదేవ్ అనే ఓ పోస్ట్ మ్యాన్ జీవితంలో జరిగిన కథే ఈ సినిమా'' అని సుజీత్ చెప్పారు. ''ఈ నెల 30వ తేదీన 'క' ప్రీమియర్స్ వేయబోతున్నాం'' అని వంశీ నందిపాటి తెలిపారు. తన్వీ రామ్, సహ నిర్మాత చింతా రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు.

మెకానిక్ డేట్ చేంజ్



● మీనాక్షీ చౌదరి, విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'మెకానిక్ రాకీ' సినిమా విడుదల తేదీ మారింది. ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ తొలుత ప్రకటించింది. అయితే నవంబరు 22న రిలీజ్ చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు మేకర్స్. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్‌ని ఈ నెల 20న, సినిమాని నవంబరు 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ విడుదల చేశారు. ''మోస్ట్ ఎవైటెడ్ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'మెకానిక్ రాకీ' రూపొందింది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి, రెండు పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది'' అని యూనిట్ పేర్కొంది. వీకే నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్ నటించిన ఈ సినిమాకి కెమెరా: మనోజ్ కాటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: 'సత్యం' రాజేష్, విద్యాసాగర్ జె.

వెంకటేష్‌గారి మాటే వీక్షణంకి మూలం

– మనోజ్ పల్లేటి



● మనోజ్, సమర్థ్

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించిన చిత్రం 'వీక్షణం'. పద్మనాభ సినీ ఆర్ట్స్ పతాకంపై పి. పద్మనాభ రెడ్డి, అశోక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మనోజ్ పల్లేటి మాట్లాడుతూ– ''ఎమ్‌బీఏ పూర్తయ్యాక సినిమాలపై ఆసక్తితో రామానాయుడు ఫిల్మ్ స్కూల్‌లో డీఎఫ్‌టీ కోర్సు పూర్తి చేశా. 'జార్జి రెడ్డి, జోహార్' వంటి చిత్రాలకు పనిచేశాను. ఓ సందర్భంలో వెంకటేష్‌గారితో మాట్లాడే అవకాశం లభించింది. 'ప్రపంచంలో అత్యంత కష్టమైన పని ఏంటంటే.. మన పని మనం చూసుకోకపోవడమే' అని అన్నారాయన. ఈ లైన్ నాకు ఎగ్జైటింగ్‌గా అనిపించింది. 'వీక్షణం' కథకు ఈ లైన్ మూలం. సంతోషంగా జీవిస్తున్న ఓ అబ్బాయి జీవితంలోకి ఓ అమ్మాయి రావడం వల్ల అతని జీవితం ఎలా ప్రభావితమైంది? అన్నది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు. చిత్ర సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి మాట్లాడుతూ–''కోటిగారి దగ్గర వర్క్ చేశాను. ఎమ్ఎస్ రాజుగారి '7 డేస్ 6 నైట్స్' చిత్రానికి సంగీతం అందించాను. మ్యూజిక్ డైరెక్టర్‌గా 'వీక్షణం' రెండో చిత్రం. ఇందులో మూడు పాటలున్నాయి'' అని పేర్కొన్నారు.

నా నిరీక్షణ !

అమర్ దీప్, లిపి గణేష్ కల్లపు జంటగా సాయివర్మ దాట్ల దర్శకత్వంలో పి.సంతోష్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'నా నిరీక్షణ'. ఈ చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత గణపతి రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. నటుడు రాజా రవీంద్ర స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన నిర్మాత డి.సురేష్‌బాబు మాట్లాడుతూ– ''నా నిరీక్షణ' సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''బిగ్‌బాస్ షో తర్వాత నేను ఎంచుకున్న తొలి స్క్రిప్ట్ ఇది. నా కెరీర్‌లో రెండో సినిమా 'నా నిరీక్షణ'' అని అమర్‌దీప్ తెలిపారు. ''ఓ మంచి చిత్రం తీస్తున్నామనే నమ్మకం ఉంది'' అని సాయి వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులు లిపి గణేష్ కల్లపు, చైతన్య వర్మ, రమ్యప్రియ మాట్లాడారు. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర.



● అమర్ దీప్, లిపి, రమ్య, చైతన్య

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 592	81,973
నిఫ్టీ ▲ 164	25,128

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	18,502	▲ 160
డోజోన్స్	43,022	▲ 159
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,293	▲ 39
డాక్స్	19,508	▲ 61
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,284	▲ 67
నికాయ్	39,606	▲ 225

అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,001
బంగారం (99.5 స్వచ్ఛత)	75,697
వెండి (కిలో)	90,026

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎప్పటి	83.66	84.51
£	బ్రిటన్ పౌండ్	ఎప్పటి	108.62	111.23
€	యూరో	ఎప్పటి	90.72	93.17
¥	జపాన్ ఎన్ (100)	ఎప్పటి	55.71	57.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎప్పటి	55.77	57.61
S$	సింగపూర్ డాలర్	చాలామటికి	62.01	66.69
SAR	సౌదీ రియాల్	చాలామటికి	21.51	23.04
UAE D	యూఏఈ దిర్హామ్	చాలామటికి	21.95	23.72
¥	చైనా యువాన్	చాలామటికి	11.00	12.79

రిలయన్స్‌కు జియో దన్ను

క్యూ2 లాభం రూ. 16,563 కోట్లు ● ఆదాయం రూ. 2.4 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: **డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసిక ఫలితాలు వెల్లడించింది.** జూలై- సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 16,563 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 17,394 కోట్లు ఆర్జించింది. చమురు శుద్ధి, పెట్రోకెమికల్ బిజినెస్‌లు నీరసించడంతో ప్రభావం చూపింది. రిటైల్, టెలికం బిజినెస్‌లు మాత్రం పటిష్ట పనితీరును ప్రదర్శించాయి. రష్యా చౌక చమురుతో చైనా పెట్రోలియం ప్రొడక్టుల సరఫరాలు పెరిగి ఓటూసీ బిజినెస్ మార్జిన్లు మందగించాయి. రిటైల్ సైతం పెద్దగా వృద్ధి సాధించలేదు. కంపెనీ ఇబిటా 2 శాతం తగ్గి రూ. 43,934 కోట్లకు చేరింది. ఫైనాన్స్ వ్యయాలు 5 శాతం పెరిగి రూ. 6,017 కోట్లను తాకాయి. కాగా.. మొత్తం ఆదాయం రూ. 2.38 లక్షల కోట్ల నుంచి రూ. 2.4 లక్షల కోట్లకు బలపడింది. రుణ భారం రూ. 3.36 లక్షల కోట్లకు చేరింది. చేతిలో ఉన్న నగదును పరిగణిస్తే నికర రుణ భారం రూ. 1.16 లక్షల కోట్లకు పరిమితమైనట్లు కంపెనీ వెల్లడించింది.



“ డైవర్సిఫైడ్ బిజినెస్‌ల పోర్ట్‌ఫోలియో మరోసారి పటిష్ట పనితీరును చూపింది.

– ముకేశ్ అంబానీ
ఆర్‌ఐఎల్ చైర్మన్, ఎండీ

టెలికం జోరు



ఈ ఏడాది క్యూ2లో ఆర్‌ఐఎల్ టెలికం, డిజిటల్ బిజినెస్‌ల విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం 23 శాతంపైగా జంప్ చేసి రూ. 6,539 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 7.4 శాతం మెరుగై రూ. 195.1కు చేరింది. టారిఫ్‌ల పెంపుతో రానున్న 2–3 క్వార్టర్లలో మరింత పుంజుకోనుంది. స్థూల ఆదాయం 18 శాతం ఎగసి రూ. 37119 కోట్లుగా నమోదైంది. 14.8 కోట్ల 5జీ వినియోగదారులతో అతిపెద్ద టెలికం ఆపరేటర్‌గా ఆవిర్భవించింది. సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 4 శాతం పెరిగి 47.88 కోట్లను తాకింది.

రిటైల్ ఓకే



రిలయన్స్ రిటైల్ నికర లాభం స్వల్ప వృద్ధితో రూ. 2,836 కోట్లకు చేరింది. ఇబిటా నామమాత్రంగా బలపడి రూ. 5,675 కోట్లయ్యింది. స్థూల ఆదాయం స్వల్పంగా నీరసించి రూ. 76,302 కోట్లకు పరిమితమైంది. స్టోర్ల సంఖ్య 464 పెరిగి 18,946ను తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఆర్‌ఐఎల్ షేరు బీఎస్‌ఈలో స్వల్ప లాభంతో రూ. 2,745 వద్ద ముగిసింది.

హెచ్‌సీఎల్ టెక్ లాభం అప్



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్ క్యూ2లో నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 4,235 కోట్లుగా నమోదైంది. ఇక సమీక్షాకాలంలో ఆదాయం 8 శాతం వృద్ధితో రూ. 26,672 కోట్ల నుంచి రూ. 28,862 కోట్లకు చేరింది. రెవెన్యూ వృద్ధితో పాటు లాభదాయకత కూడా మెరుగ్గా ఉందని సంస్థ సీఈవో సి. విజయ్ కుమార్ తెలిపారు. వార్షికంగా ఆదాయ వృద్ధి 3.5–5.0 శాతంగా ఉంటుందని హెచ్‌సీఎల్ టెక్ గైడెన్స్ ఇచ్చింది. క్యూ2లో 780 మంది ఉద్యోగులను తగ్గించుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,18,621కి చేరింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ. 12 చొప్పున కంపెనీ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

సోమవారం బీఎస్‌ఈలో హెచ్‌సీఎల్ టెక్ షేరు స్వల్పంగా ఒక్క శాతం పెరిగి రూ. 1,856 వద్ద క్లోజయ్యింది.

బ్యాంకులు, ఐటీ షేర్లలో కొనుగోళ్లు

భారీ లాభాలతో ముగిసిన మార్కెట్



ముంబై: బ్యాంకులు, ఐటీ షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు సోమవారం లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, క్రూడాయిల్ ధరల తగ్గుదల సానుకూల ప్రభావం చూపించాయి. సెన్సెక్స్ 592 పాయింట్లు పెరిగి 81,973 వద్ద నిలిచింది. నిఫ్టీ 164 పాయింట్లు లాభపడి 25వేల స్థాయిపైన 25,128 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 692 పాయింట్లు బలపడి 82వేల స్థాయిపైన 82,072 వద్ద, నిఫ్టీ 196 పాయింట్లు ఎగసి 25160 వద్ద గరిష్టాన్ని తాకాయి. కాగా, క్యూ2 నిరాశాజనక ఫలితాల నేపథ్యంలో అవెన్యూ సూపర్‌మార్ట్స్(డీమార్ట్) షేరు బీఎస్‌ఈలో 8.50% నష్టపోయి రూ.4,184 వద్ద స్థిరపడింది.

నేటి నుంచి హ్యుందాయ్ ఐపీవో



హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్(హెచ్ఎంఐఎల్) పబ్లిక్ ఇష్యూ మంగళవారం (15న) ప్రారంభమై గురువారం(17న) ముగుస్తుంది. ఐపీవోలో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 8,315 కోట్లు సమీకరించింది. ఐపీవో ద్వారా ఇంతక్రితం 2022 మే నెలలో రూ. 21,000 కోట్లు సమీకరించిన ఎల్‌ఐసీని మించి హెచ్ఎంఐఎల్ అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలవనుంది.

వివరాలు ఇవీ ధరల శ్రేణి: షేరుకి రూ. 1,865-1,960 › సమీకరణ లక్ష్యం: రూ. 27,870 కోట్లు › కనీస దరఖాస్తు: 7 షేర్లు › లిస్టింగ్: బీఎస్ఈ, ఎన్ఎస్ఈ(22న) › షేర్ల కేటాయింపు: 18న(21కల్లా ఖాతాల్లోకి)

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
సెప్టెంబర్‌లో రిటైల్ ధరల సెగ | 6జీ రేసులో భారత్ స్పీడ్

'స్మార్ట్' స్టోర్స్ విస్తరణ

(హైదరాబాద్, బిజినెస్ బ్యూరో)

చమురు నుంచి టెలికామ్ వరకూ **అన్ని రంగాల్లో ఆధిపత్యాన్ని** కొనసాగిస్తున్న **రిలయన్స్... తన రిటైల్ బిజినెస్‌**ను మరింతగా **విస్తరిస్తోంది. ప్రస్తుతం సుమారు** 900 పైచిలుకు **ఉన్న బిగ్ బాక్స్ స్టోర్స్ (స్మార్ట్ బజార్,** స్మార్ట్ స్టోర్స్) సంఖ్యను వచ్చే ఏడాది ఆరంభానికల్లా వెయ్యికి పెంచుకోనుంది. చిన్న పట్టణాల్లో కూడా స్టోర్స్‌కి ఆదరణ లభిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోనూ గణనీయంగా విస్తరిస్తున్నట్లు సంస్థ రిలయన్స్ రిటైల్ సీఈవో (గ్రోసరీ రిటైల్ బిజినెస్) దామోదర్ మాల్ తెలియజేశారు.

'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన... రిలయన్స్ రిటైల్‌కి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో విస్తరణకు చేస్తున్న ప్రయత్నాలను సమగ్రంగా వివరించారు. ఐఐటీ, ఐఐఎంలో విద్యాభ్యాసం చేసిన దామోదర్, యూనిలీవర్‌లో తన కెరీర్‌ను ఆరంభించారు. వ్యాపారవేత్తగా సొంతంగా సూపర్‌మార్కెట్ వెంచర్‌ను కూడా నిర్వహించారు. ఫ్యూచర్ గ్రూప్ తర్వాత రిలయన్స్ రిటైల్‌లో వేల్యూ ఫార్మాట్‌కి (స్మార్ట్ బజార్, రిలయన్స్ ఫ్రెష్ మొదలైనవి) సంబంధించిన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే భారతీయ వినియోగదారుల పోకడలను, సూపర్ మార్కెట్ల తీరుతెన్నులను గురించి వివరిస్తూ 'సూపర్‌మార్కెట్‌వాలా', 'బీ ఎ సూపర్‌మార్కెట్‌వాలా' పుస్తకాలు కూడా రాశారు. రిలయన్స్ రిటైల్ కార్యకలాపాలపై మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే.


తెలుగు రాష్ట్రాలకు చాలా ప్రాధాన్యం ఉంది...

రిలయన్స్ రిటైల్‌కి దేశవ్యాప్తంగా కార్యకలాపాలు ఉన్నప్పటికీ తెలుగు రాష్ట్రాలకు చాలా ప్రాధాన్యముంది. ఎందుకంటే తొలి రిటైల్ స్టోర్‌ను హైదరాబాద్‌లోనే ప్రారంభించాం. అలాగే తక్కువ ప్రాంతంలో ఎక్కువ స్టోర్స్ ఉన్నది కూడా ఇక్కడే. పండ్లు, ఎఫ్ఎంసీజీ, దుస్తులు, ఆహారోత్పత్తులు మొదలైనవన్నీ లభించే మా స్మార్ట్ బజార్ స్టోర్స్‌కి కూడా ఇక్కడ ప్రాధాన్యం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ఫార్మాట్లకు సంబంధించి 180 పైచిలుకు స్టోర్స్ ఉండగా వీటిలో 75 పైగా బిగ్ బాక్స్ స్టోర్స్ ఉన్నాయి. తెలంగాణలోనూ వివిధ ఫార్మాట్ల స్టోర్స్ 145 పైచిలుకు ఉండగా వాటిలో సుమారు 45 బిగ్ బాక్స్ ఫార్మాట్లో ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి 330 పైగా స్టోర్స్ ఉన్నాయి. ఇక చిన్న పట్టణాల విషయానికొస్తే, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ, ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు, మదనపల్లె మొదలైనవి... అలాగే తెలంగాణలో బోధన్, సిద్దిపేట్ వంటి టౌన్లలో కూడా మా స్టోర్స్‌ను విస్తరించాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మా బిగ్ బాక్స్ స్టోర్స్ 900 పైచిలుకు ఉండగా వచ్చే ఏడాది ఆరంభం నాటికి ఈ సంఖ్యను వెయ్యికి పెంచుకోబోతున్నాం. పెద్ద నగరాల్లోలాగే చిన్న పట్టణాల్లోనూ వేల్యూ యాడెడ్, ప్రీమియం ఉత్పత్తుల కు మంచి డిమాండ్ ఉంటోంది.

వచ్చే ఏడాది ఆరంభానికల్లా మరో 100 స్టోర్ల ఏర్పాటు

- ప్రస్తుత 900 స్టోర్లలో 330కి పైగా తెలుగు రాష్ట్రాల్లోనే..
- తొలి స్టోర్ కూడా ఇక్కడే... అందుకే ఈ ప్రాంతం ప్రత్యేకం

'సాక్షి'తో రిలయన్స్ రిటైల్ సీఈవో దామోదర్ మాల్



ఇక్కడి నుంచే భారీగా కొనుగోళ్లు..

తెలుగు రాష్ట్రాల్లో ఆహారోత్పత్తులకు గణనీయమైన డిమాండ్ ఉంది. ఇక్కడ వాటి విక్రయాలు ఎక్కువ. దేశవ్యాప్తంగా ఉత్పత్తులను విక్రయించుకునేలా స్థానిక వ్యాపారులకు అవకాశాలు కల్పిస్తున్నాం. పలు లోకల్ బ్రాండ్లకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పిస్తున్నాం. ఎంట్రప్రెన్యూర్లతో కలిసి పని చేస్తున్నాం. ప్రాంతీయంగా వినియోగదారులతో మరింతగా మమేకం అవుతూ ఇటీవల పలు స్టోర్స్‌లో బతుకమ్మ వేడుకలను కూడా నిర్వహించాం.

మెరుగ్గా పండుగ సీజన్..

ప్రస్తుతం పండుగ వేడుకలు భారీ స్థాయిలో ఉంటున్నాయి. వివిధ పండుగలను కలిసి జరుపుకుంటున్నారు. సాధారణంగా కొన్నాళ్ల క్రితం వరకు ఒక ప్రాంతానికి పరిమితమైన నవరాత్రి, దాండియా, పూజో మొదలైన వాటిని ఇపుడు మిగతా ప్రాంతాల వారు కూడా చేసుకునే ధోరణి పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో మహాశివరాత్రి, వరలక్ష్మీ వ్రతం, వినాయక చవితి మొదలైనవి పెద్ద స్థాయిలో జరుపుకుంటారు. ఇలాంటి పండుగ సీజన్‌లో ఆహారోత్పత్తులు, దుస్తులు, బహుమతులు మొదలైన వాటికి డిమాండ్ గణనీయంగా ఉంటుంది. కాబట్టి వివిధ ప్రాంతాల్లో వివిధ వర్గాల నుంచి ఉండే డిమాండ్‌కి అనుగుణంగా మా స్టోర్స్‌ను నిర్వహిస్తున్నాం. పండుగ సీజన్ సందర్భంగా మరిన్ని ఆఫర్లు అందిస్తున్నాం. మా స్టోర్స్ విషయానికొస్తే పండుగ సీజన్ చాలా సానుకూలంగా ప్రారంభమైంది. వివిధ కేటగిరీలవ్యాప్తంగా విక్రయాలు బాగున్నాయి. పూజా ద్రవ్యాలు, దుస్తులు మొదలైన వాటికి డిమాండ్ ఉంటోంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రిటైల్ పోటీపడుతున్నాయని అనుకోవడం కన్నా ఒకదానికి మరొకటి అనుబంధంగా ఉంటున్నాయని చెప్పవచ్చు. అందుకే వీటన్నింటినీ కలిపి ఓమ్నిచానల్‌గా వ్యవహరిస్తున్నాం. ఇక, ఆన్‌లైన్‌లో ఫేక్ ఆఫర్ల విషయాల్లో వినియోగదారులు జాగ్రత్త వహించక తప్పదు. అపరిచితుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయకుండా, విశ్వసనీయమైన చోటే కొనుగోలు చేయడం శ్రేయస్కరం.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ ప్రవేశాలు



ఇండియన్ ఆర్మీలో జూలై 2025లో ప్రారంభమయ్యే 53వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ (టీఈఎస్) కోర్సు శిక్షణలో ప్రవేశాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన వారికి బీటెక్ కోర్సు, లెఫ్టినెంట్ పోస్టులకు ఉచిత శిక్షణ అందజేస్తారు.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 90.
» **అర్హత:** గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో 10+2 (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) లేదా దానికి సమానమైన పరీక్షతో పాటు జేఈఈ (మెయిన్స్) 2024లో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 16.5 ఏళ్ల నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ (మెయిన్స్) స్కోరు, స్టేజ్–1, స్టేజ్–2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **కోర్సు, శిక్షణ:** మొత్తం ఐదేళ్ల కోర్సు, శిక్షణ కొనసాగుతుంది. ఇందులో ఏడాది పాటు బేసిక్ మిలిటరీ ట్రైనింగ్, నాలుగేళ్లు టెక్నికల్ ట్రైనింగ్ ఇస్తారు. శిక్షణ, కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి ఇంజనీరింగ్(బీఈ/బీటెక్) డిగ్రీ అందజేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.11.2024
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 600 అప్రెంటిస్‌లు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 600.
» **శిక్షణ వ్యవధి:** ఏడాది
» **స్టైపెండ్:** నెలకు రూ.9000.
» ఆంధ్రప్రదేశ్‌లో 11 ఖాళీలు, తెలంగాణలో 16 ఖాళీలు.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 30.06.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 నుంచి 15 ఏళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** 12వ తరగతి(హెచ్ఎస్సీ/10+2)/డిప్లొమా మార్కులు, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.10.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.10.2024
» **వెబ్‌సైట్:** https://bankofmaharashtra.in

ఐఆర్ఈఎల్ (ఇండియా) లిమిటెడ్‌లో 38 అప్రెంటిస్‌లు

తమిళనాడులోని ఇండియన్ రేర్ ఎర్త్స్(ఇండియా) లిమిటెడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 38.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–03, టెక్నీషియన్ అప్రెంటిస్–04, ట్రేడ్ అప్రెంటిస్–31.
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్(మోటార్ వెహికల్), వెల్డర్, టర్నర్, ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రానిక్/ఇన్‌స్ట్రుమెంట్ తదితరాలు.
» **అర్హత:** విభాగాన్ని అనుసరించి ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ(కెమిస్ట్రీ), బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.09.2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, సర్టిఫికేట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.10.2024.
» **వెబ్‌సైట్:** https://www.irel.co.in

మెడికల్ విద్య.. మెరిసేదెలా!!

» ప్రారంభం కానున్న ఎంబీబీఎస్, బీడీఎస్ తరగతులు
» ప్రాక్టికల్ అప్రోచ్‌తో అడుగులు వేయాల్సిన ఆవశ్యకత
» మొదటి నుంచే ఉన్నత విద్య లక్ష్యాలపై దృష్టిపెట్టాలి
» పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులతో విస్తృత నైపుణ్యం

ఎంబీబీఎస్.. బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ! బీడీఎస్.. బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ!! వైద్య వృత్తిలో స్థిరపడాలనుకునే విద్యార్థులు ఎంచుకునే కోర్సులివి. వీటిల్లో చేరేందుకు అహర్నిశలు కృషి చేసి.. లక్షల మందితో పోటీ పడి ర్యాంకు సాధిస్తారు. అలా మెడికల్ కోర్సుల్లో సీటు దక్కించుకున్న విద్యార్థులు తరగతి గదిలో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు! త్వరలో దేశ వ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. వైద్య కోర్సుల్లో రాణించేందుకు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

అయిదున్నరేళ్ల వ్యవధిలో ఉండే ఎంబీబీఎస్ కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి నుంచి అకడమిక్స్‌తోపాటు ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటర్మీడియెట్‌లో మాదిరిగా పుస్తకాలకే పరిమితమైతే సబ్జెక్ట్ నైపుణ్యం లభించొచ్చు. కానీ తమ కెరీర్ లక్ష్యం నెరవేరదని స్పష్టం చేస్తున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్‌లో సీటు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో నిపుణులైన వైద్యులుగా రాణించేందుకు అకడమిక్‌గా తొలి రోజు నుంచే కృషి చేయాలని పేర్కొంటున్నారు.

మూడు విభాగాలుగా బోధన

- ఎంబీబీఎస్ కోర్సును ప్రస్తుతం మూడు స్పెషలైజేషన్లుగా వర్గీకరించి బోధిస్తున్నారు. అవి ప్రీ-క్లినికల్, పారా-క్లినికల్, క్లినికల్. అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ సబ్జెక్ట్‌లు ఉండే ప్రీ-క్లినికల్‌లో రాణించడం చాలా అవసరం. కమ్యూనిటీ మెడిసిన్, ఫోరెన్సిక్ సైన్స్, పాథాలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ సబ్జెక్ట్‌లు పారా క్లినికల్ విభాగంలో ఉంటాయి. ఈ దశలోనే విద్యార్థులు ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్స్, వార్డ్స్‌లో క్లినికల్ పోస్టింగ్స్ పేరుతో ఆస్పత్రులలో ప్రాక్టికల్‌గా పని చేస్తూ నైపుణ్యం పెంచుకోవాల్సి ఉంటుంది. క్లినికల్ విభాగంలో కమ్యూనిటీ మెడిసిన్, మెడిసిన్- మెడిసిన్ అనుబంధ సబ్జెక్ట్‌లైన సైకియాట్రి, డెర్మటాలజీ, ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, పీడియాట్రిక్స్‌తోపాటు సర్జరీ, సర్జరీ అనుబంధ సబ్జెక్ట్‌లుగా అనస్థీషియాలజీ, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్ ఉంటాయి. దీంతోపాటు క్లినికల్ పోస్టింగ్స్ అంటే ఆస్పత్రుల్లో ఆయా విభాగాల్లో ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది.
- స్పెషలైజేషన్లు, వాటిలోని సబ్జెక్ట్‌లను పరిశీలిస్తే సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వైద్య నైపుణ్యాలు అందించే కమ్యూనిటీ మెడిసిన్ మొదలు వైద్య రంగంలో కీలకమైన సర్జరీ వరకు అనేక సబ్జెక్ట్‌లు ఉన్నాయి. వీటిలో రాణించేందుకు విద్యార్థులు అకడమిక్ లెక్చర్స్ వినడం, పుస్తకాలను చదవడంతోపాటు వాస్తవ పరిస్థితులపై అవగాహన పొందేలా ప్రాక్టికల్స్‌లోనూ నైపుణ్యం పెంచుకోవాలి. అందుకోసం టీచింగ్ హాస్పిటల్స్‌లోని అధ్యాపకులతో నిత్యం సంప్రదిస్తూ.. వారు చికిత్స పరంగా అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలి. అదే విధంగా రోగులకు సంబంధించి కేస్‌షీట్లు పరిశీలిస్తూ.. సంబంధిత వ్యాధులు, వాటి నివారణ మార్గాలపై అవగాహన పెంచుకోవాలి.

ఇంటర్న్‌షిప్

ఎంబీబీఎస్ కరిక్యులంలో భాగంగా విద్యార్థులు చివరల్లో ఏడాది పాటు రొటేటరీ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. మెడిసిన్, సర్జరీ, రూరల్, పీడియాట్రిక్స్, ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, క్యాజువాలిటీ, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, ఎలక్టివ్ విభాగాల్లో.. ఒక్కో విభాగంలో నిర్దేశిత వ్యవధిలో మొత్తం 12నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేయాలి. విద్యార్థులు అకడమిక్‌గా అప్పటి వరకు నాలుగున్నరేళ్లపాటు నేర్చుకున్న అంశాలను ప్రాక్టికల్‌గా అన్వయించేలా చూడటమే ఈ ఇంటర్న్‌షిప్ ప్రధాన ఉద్దేశం. కాబట్టి విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను ఎట్టి పరిస్థితుల్లో విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు ఈ సమయంలో ఉన్నత విద్య ఎంట్రన్స్‌ల ప్రిపరేషన్‌కు, ఇతర ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నారని, ఇది ఏ మాత్రం సరికాదని వైద్య రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఫౌండేషన్ కోర్సు

ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులు ఫౌండేషన్ కోర్సుకు తప్పనిసరిగా హాజరుకావాలి. ఎంబీబీఎస్ విద్యార్థులకు వైద్య విద్య ప్రధాన ఉద్దేశం, నేటి పరిస్థితుల్లో అనుసరించాల్సిన పద్ధతులు, వైద్య రంగంలో నైతిక విలువలు, అభ్యసన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఇందులో అవగాహన కల్పిస్తారు. వీటితోపాటు సామాజిక పరిస్థితులపై అవగాహన కలిగేలా.. లైఫ్ సపోర్ట్, సోషియాలజీ అండ్ డెమోగ్రాఫిక్స్, బయో-హజార్డ్ సేఫ్టీ, పర్యావరణం, సామాజిక దృక్పథం వంటి వాటిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఫౌండేషన్ కోర్సు పేరిట కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు.

ఉన్నత లక్ష్యాలు చేరుకునేలా

- ప్రస్తుతం ఎంబీబీఎస్ సర్టిఫికెట్‌తోనే కెరీర్‌లో స్థిరపడొచ్చు అనే పరిస్థితి లేదు. పీజీ, సూపర్ స్పెషాలిటీ వంటి ఉన్నత కోర్సులు పూర్తి చేస్తేనే రాణించే అవకాశం ఉంది. కాబట్టి ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులు మొదట్నుంచే ఉన్నత విద్య మార్గాలపై అవగాహన పెంచుకొని ఆ దిశగా కృషి చేయాలి.
- ఎంబీబీఎస్ తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఎండీ లేదా ఎంఎస్ చేసే అవకాశముంది. ఎండీ కోర్సుల్లో దాదాపు 30 స్పెషలైజేషన్లు ఉన్నాయి. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌ను ఎంచుకుని అందులో సీటు పొందేలా నీట్–పీజీ ఎంట్రన్స్‌లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది. సర్జరీలపై ఆసక్తి ఉన్న వారు ఎంఎస్ కోర్సును ఎంచుకోవచ్చు. శస్త్రచికిత్సలు చేసేందుకు ఎంఎస్ ఉత్తీర్ణులకు మాత్రమే అర్హత లభిస్తుంది. పీజీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు నీట్-పీజీ ఎంట్రన్స్‌లో; డీఎం, ఎంసీహెచ్, డీఎన్‌బీ వంటి సూపర్ స్పెషాలిటీ కోసం నీట్–ఎస్ఎస్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- **రీసెర్చ్ అవకాశాలు:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులకు రీసెర్చ్ అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎయిమ్స్, జిప్‌మర్, నిమ్‌హాన్స్, పీజీఐఎంఈఆర్ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లతోపాటు రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీలు, ఇతర ప్రముఖ మెడికల్ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంది.



కెరీర్ గైడెన్స్

బీడీఎస్‌లో రాణించేలా..

- బీడీఎస్ కోర్సు.. మెడికల్, డెంటల్ సబ్జెక్ట్‌ల సమ్మేళనంగా ఉంటుంది. కోర్సు వ్యవధి అయిదేళ్లు. నాలుగేళ్ల క్లాస్ రూమ్ టీచింగ్, మరో ఏడాది రొటేటరీ ఇంటర్న్‌షిప్. కోర్సులో భాగంగా దంత సమస్యలకు సంబంధించిన చికిత్స పద్ధతులపై నైపుణ్యం కల్పిస్తారు. ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ, ప్రోస్థోడాంటిక్స్, ఆర్థో డాంటిక్స్, ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ, పెరియోడాంటిక్స్, పెడోడాంటిక్స్, కన్సర్వేటివ్ డెంటిస్ట్రీ వంటి దంత వైద్య సంబంధిత అంశాలతో పాటు జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఫార్మకాలజీ వంటి అంశాల్లోనూ శిక్షణనిస్తారు.

ఉన్నత విద్య

- బీడీఎస్ తర్వాత ఉన్నత విద్య కోణంలో ఎండీఎస్(మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) కోర్సు అందుబాటులో ఉంది. మూడేళ్ల వ్యవధిలో ఉండే ఈ కోర్సులో పలు స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఇవి కూడా క్లినికల్, నాన్-క్లినికల్ సబ్జెక్ట్‌లుగా అందుబాటులో ఉండటం విశేషం. నీట్-పీజీ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత ఆధారంగా ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.

పీజీ డిప్లొమా

డెంటల్ మెడికల్ కేర్ విభాగంలో మరో ఉన్నత విద్య కోర్సు.. పీజీ డిప్లొమా. రెండేళ్ల వ్యవధిలో ఉండే ఈ పీజీ డిప్లొమా కోర్సులు పూర్తి చేయడం ద్వారా పీజీ స్థాయి స్థాయి అవకాశాలను సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ప్రైవేట్ రంగంలో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులకు మంచి అవకాశాలే లభిస్తున్నాయి.

ఉద్యోగావకాశాలు

బీడీఎస్‌తో అసిస్టెంట్ సివిల్ సర్జన్ హోదాలో ప్రభుత్వ వైద్య విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఇందుకోసం ఆయా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు లేదా వైద్య శాఖలు నిర్వహించే నియామక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అదేవిధంగా బీడీఎస్ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వంలో పలు శాఖల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉంటున్నాయి. ఆర్మీ డెంటల్ కార్ప్స్, టెరిటోరియల్ ఆఫీసర్ ఇన్ ఆర్మీ పేరుతో రక్షణ దళాల్లో, డెంటల్ ఆఫీసర్‌గా ఇండియన్ నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో కొలువులు సొంతం చేసుకోవచ్చు. రైల్వే శాఖ, ఇతర పబ్లిక్ సెక్టార్ యూనిట్స్‌లోనూ డెంటల్ డాక్టర్‌గా ఉద్యోగం దక్కించుకోవచ్చు. ఇందుకోసం ఆయా శాఖలు, విభాగాలు నిర్వహించే నియామక పరీక్షలు, లేదా ఇంటర్వ్యూల్లో విజయం సాధించాల్సి ఉంటుంది.

ఓర్పు అవసరం

ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు ఓర్పు, సహనం, సేవా దృక్పథంతో మెలగడం చాలా అవసరం. ఇబ్బందులు ఎదురైనా తట్టుకోగలిగే స్వభావం ఉండాలి. విద్యార్థులు ప్రాక్టికల్ అప్రోచ్‌తో అడుగులు వేయాలి. అదే విధంగా రోగులతో మాట్లాడుతుండటం, క్లినికల్ సబ్జెక్ట్‌ల విషయంలో ప్రొఫెసర్లను నిరంతరం సంప్రదించడం వంటివి అలవర్చుకోవాలి. ప్రస్తుతం కమ్యూనిటీ మెడిసిన్‌కు కూడా ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని కూడా అలవర్చుకోవాలి.




ఇవన్నీ ప్లాస్టిక్ ముక్కలు.. మొత్తం 403.. వీటన్నిటినీ పక్కన చనిపోయి కనిపిస్తోందే.. ఆ సముద్రపు పక్షి జీర్ణాశయం నుంచి తీశారు. సాగరాల్లో పెరిగిపోతున్న ప్లాస్టిక్ కాలుష్య తీవ్రతకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్న ఈ చిత్రం ప్రఖ్యాత 'వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్' పోటీలో 'ఓషియన్' విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన జస్టిన్ గిలిగన్ అనే ఫొటోగ్రాఫర్ దీన్ని తీశారు.

టుడేస్ గ్రాఫిక్

2033కు అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరాలివే..

ప్రపంచవ్యాప్తంగా 2033కి అత్యంత వేగంగా అభివృద్ధి చెందే టాప్–10 నగరాల జాబితాను బ్రిటన్‌కు చెందిన సావిల్స్ అనే గ్లోబల్ రియల్ ఎస్టేట్ సర్వీసుల కంపెనీ రూపొందించింది. గ్రోత్ హబ్స్ ఇండెక్స్ పేరుతో దీన్ని తాజాగా విడుదల చేసింది. ప్రపంచ దేశాలకు చెందిన 230 నగరాల్లో గతేడాది నమోదైన జీడీపీ, జనాభా, వలసలు, కుటుంబాల సంపాదన శక్తి తదితర అంశాల ఆధారంగా టాప్–10 సిటీలను ఎంపిక చేసింది. ఈ జాబితాలో భారత్ నుంచి బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, ముంబైకి చోటు లభించడం విశేషం.



ట్రాక్టర్ అడ్డుపెట్టి .. ఆర్టీసీ బస్సును ఆపి..

ఆత్మకూరు(ఎం): ట్రాక్టర్‌ను అడ్డుపెట్టి ఆర్టీసీ బస్సును ఆపిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. దసరాకు సొంత ఊళ్లకు వచ్చిన జనం తిరిగి హైదరాబాద్ వెళ్లడానికి మోత్కూరు– రాయగిరి రోడ్డుపై ఆత్మకూర్ స్టేజీవద్ద వేచి ఉన్నారు. కానీ మోత్కూరువైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సులన్నీ రద్దీగా ఉండటం వల్ల ఈ స్టేజీ వద్ద ఆపకుండా వెళ్లిపోతుండటంతో 4 గంటల పాటు వేచిచూసిన ప్రయాణికులు విసిగిపోయారు. చివరికి సాయంత్రం ఐదుగంటల సమయంలో తొర్రూరు నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే బస్సు రావడంతో అటుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టాలని ప్రయాణికులు కోరారు. దీంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను నిలిపివేయడంతో వెనుకవస్తున్న బస్సు ఆగింది. వెంటనే ప్రయాణికులు బస్సు ఎక్కారు.



నవంబర్ నుంచే 'వాహనాల స్క్రాపింగ్'

- తుక్కు కేంద్రాల నిర్వహణకు దరఖాస్తు చేసిన నాలుగు సంస్థలు
- ఆ తర్వాత ఆసక్తి చూపని ఓ బడా సంస్థ.. మూడింటి తనిఖీ పూర్తి చేసిన అధికారులు.. వారం పదిరోజుల్లో అనుమతి



సాక్షి, హైదరాబాద్: కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చే ప్రక్రియ నవంబరు మొదటివారంలో ప్రారంభం కానుంది. వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం వాహన తుక్కు విధానాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వాహనాలను తుక్కుగా మార్చే కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందుకోసం ప్రైవేటు కేంద్రాలకు అనుమతి ఇవ్వనున్నారు. పదిహేనేళ్లు దాటిన వాహనాలను తుక్కుగా (స్వచ్ఛంద విధానం) మార్చాల్సి ఉంటుంది. ఇందుకోసం రిజిస్టర్డ్ వెహికిల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ విధానం కింద తెలంగాణకు మూడు కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం అనుమతించింది. ప్రస్తుతానికి నాలుగు ప్రైవేట్ సంస్థలు దరఖాస్తు చేశాయి. ఆయా కేంద్రాలు కేంద్ర నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తేల్చేందుకు ఇటీవల అధికారులు వాటిని తనిఖీ చేశారు. మరో పది రోజుల్లో వాటిల్లో అనుకూలమైన కేంద్రాలకు పచ్చజెండా ఊపనున్నారు. ఆ వెంటనే వాహనాలను తుక్కుగా మార్చే ప్రక్రియ మొదలవుతుంది.

కేవలం ఐదుగురు వాహనదారులే ముందుకు..

కేంద్ర ప్రభుత్వం 2021లో చట్ట సవరణ చేయగా, దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో స్క్రాపింగ్ విధానం అమలవుతోంది. తుక్కు విధానం ప్రకటించిన ఈ వారం రోజుల్లో తెలంగాణలో కేవలం ఐదుగురు వాహనదారులు మాత్రమే తమ 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు ఆసక్తి చూపారు.

నిర్బంధం కాకపోవటంతో.. పదిహేనేళ్లు దాటిన వాహనాలకు ఫిట్‌నెస్ చేయించి గ్రీన్ ట్యాక్స్ చెల్లించి మరో ఐదేళ్లు నడుపుకొనే విధానం అమలవుతోంది. గ్రీన్ ట్యాక్స్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దీంతో చాలా రాష్ట్రాలు స్క్రాపింగ్ విధానంలో దాన్ని కొనసాగిస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసిన తెలంగాణ ప్రభుత్వం కూడా దాన్నే అనుసరించాలని నిర్ణయించి పాలసీలో పొందుపరిచింది. దీంతో కాలం తీరిన వాహనాలను తుక్కుగా మార్చటం కంటే గ్రీన్ ట్యాక్స్ చెల్లించి ఐదేళ్లు చొప్పున రెండు దఫాలు అనుమతి పొంది నడుపుకొనేందుకే ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. కేంద్రం ఈ విధానం తెచ్చిన తర్వాత (ఢిల్లీ మినహా) దేశవ్యాప్తంగా కేవలం 44,900 వాహనాలను మాత్రమే తుక్కుగా మార్చారు.

అధికారులు అడిగినా స్పందించని ఓ సెంటర్: ఓ బడా వాహన తయారీ సంస్థకు నగర శివారులో స్క్రాపింగ్ సెంటర్ ఉంది. వెహికిల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ సెంటర్ నిర్వహణకు అనుమతి ఇవ్వాల్సిందిగా దరఖాస్తు చేసింది. కానీ ఆ తర్వాత స్పందించటం మానేసింది. దీంతో దరఖాస్తు చేసిన మరో మూడు కేంద్రాల వద్దకు వెళ్లి అక్కడి వసతులను తనిఖీ చేసి వచ్చారు.

గ్రూప్–1 హాల్‌టికెట్లు రెడీ

- పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్లో అందుబాటులోకి..
- ఈ నెల 21వ తేదీన ఉదయం వరకు డౌన్‌లోడ్ చేసుకునే చాన్స్
- ఆ రోజు నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో సోమవారం నుంచే హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచామని, మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ ప్రకటించారు. మొదటి పరీక్ష ప్రారంభమయ్యే సమయం వరకు వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నెల 21 నుంచి 27 వరకు ఈ రాత పరీక్షలు (కన్వెన్షియల్/డిస్క్రిప్టివ్ టైప్) జరగనున్నాయి.

563 పోస్టుల కోసం..

18 రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని 563 గ్రూప్–1 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఈ ఏడాది ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. జూలైలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన కమిషన్.. గత నెలలో ఫలితాలు విడుదల చేసి, 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 29కు అనుగుణంగా ఎంపిక ప్రక్రియ చేపట్టడంతో మొత్తం 31,382 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు ఎంపికయ్యారు.

ముందే పరీక్షా కేంద్రాన్ని చూసుకోవాలి..

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ఈనెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతాయి. హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు.. ముందుగానే పరీక్షా కేంద్రాన్ని చూసుకోవాలని కమిషన్ సూచించింది. ప్రతి పరీక్షకు 3గంటల సమయం ఉంటుంది. ప్రతి పరీక్షకు గరిష్ట



మార్కులు 150. జనరల్ ఇంగ్లిష్ పరీక్ష మినహా మిగతా ఆరు పరీక్షలకు.. ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రశ్నపత్రాలు ఉంటాయి. అభ్యర్థి ఇష్టానుసారం భాషను ఎంచుకుని జవాబులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ ఆరు పరీక్షలను కూడా ఎంపిక చేసుకున్న ఒకే భాషలో రాయాల్సి ఉంటుంది. ఒక్కో పరీక్షను ఒక్కో భాషలో రాసే అవకాశం లేదు. అలా రాస్తే పరిగణనలోకి తీసుకోరు. జనరల్ ఇంగ్లిష్ పేపర్ కేవలం అర్హత పరీక్ష మాత్రమే. దాని మార్కులను ర్యాంకింగ్‌లోకి తీసుకోరు. అభ్యర్థులు అన్ని పరీక్షలు తప్పనిసరిగా రాయాలి. ఏ ఒక్క పరీక్ష రాయకున్నా అనర్హతకు గురవుతారు.

అరగంట ముందే పరీక్ష కేంద్రాల మూసివేత

మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షా కేంద్రాలను మూసివేస్తారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోను అభ్యర్థులను కేంద్రంలోనికి అనుమతించరు. అభ్యర్థి తొలి పరీక్షకు వినియోగించిన హాల్‌టికెట్‌నే చివరి పరీక్ష వరకు వెంట ఉంచుకోవాలి. డూప్లికేట్ హాల్‌టికెట్ జారీ చేసే అవకాశం లేదు. ఇక సమయం తెలుసుకునేందుకు వీలుగా పరీక్ష హాళ్లలో గడియారాలను ఏర్పాటు చేస్తారు. హాల్‌టికెట్‌లో పొరపాట్లు, ఇతర సాంకేతిక సమస్యలుంటే కమిషన్ కార్యాలయం పనిదినాల్లో 040–23542185 లేదా 040–23542187 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని.. లేదా హెల్ప్‌డెస్క్‌ను ఈమెయిల్ ద్వారా సంప్రదించాలని టీజీపీఎస్సీ సూచించింది. కాగా గ్రూప్–1 పరీక్షలకు సంబంధించి హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై మంగళవారం తీర్పు వెలువడనుంది.

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ ఇదీ..

సబ్జెక్టు	పరీక్ష తేదీ
జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్)	21.10.2024
పేపర్-1, జనరల్ ఎస్సే	22.10.2024
పేపర్-2, హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ	23.10.2024
పేపర్-3, ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్	24.10.2024
పేపర్-4, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్	25.10.2024
పేపర్-5, సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్	26.10.2024
పేపర్-6, తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్	27.10.2024

(అన్ని పరీక్షలకు 3 గంటల సమయం ఇస్తారు. ప్రతి పేపర్ 150 మార్కులకు ఉంటుంది)

బండ్లన్నీ బారులు తీరి...

చౌటుప్పల్, కేతేపల్లి, బీబీనగర్: దసరా పండగకు స్వస్థలాలకు వెళ్లిన వారు ఇళ్లకు తిరుగు ముఖం పట్టడంతో.. హైదరాబాద్–విజయవాడ, వరంగల్– హైదరాబాద్ జాతీయ రహదారులపై వాహనాల రద్దీ సోమవారం సైతం కొనసాగింది. గూడూరు టోల్ ప్లాజా నుంచి పగిడిపల్లి పరిధిలోని రేణుక ఎల్లమ్మ గుడి వరకు వాహనాలు సుమారు రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.



చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

24 నుంచి బీసీ కమిషన్ క్షేత్రస్థాయి పర్యటన

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని అధ్యయనం చేసేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ఈనెల 24వ తేదీ నుంచి క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టనుంది. బీసీ కమిషన్ కార్యాలయంలో సోమవారం కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషన్ సభ్యులతో పాటు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వం ఇచ్చిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌కు అనుగుణంగా సర్వే నిర్వహించాలని నిర్ణయించిన కమిషన్.. ఈనెల 24 నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో వినతులు, విజ్ఞాపనలు తీసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్‌ను అతిత్వరలో విడుదల చేయనున్నట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి. ఈ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో నిర్దేశించిన వర్గాల స్థితిగతులను పరిశీలించనుంది. ఇందులో బీసీ కమిషన్‌కు కూడా కీలక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



పెదరామన్‌చర్లలో
కన్నడ శాసనం

చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి

జనగామ: జనగామ మండలం పెదరామన్‌చర్ల గ్రామంలో కన్నడ శాసనం వెలుగు చూసినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలోని రాముల వారి గుట్ట వెనుక వైపు వెంకన్న బండపై వినాయకుడి బొమ్మకు ఎడమ వైపు ఒక బండరాయిపై శాసనం చెక్కి ఉందని సోమవారం తెలిపారు. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డాక్టర్ మునిరత్నం సహకారంతో ఈ వివరాలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. పెదరామన్‌చర్లలో వెలుగు చూసిన శాసనం 9వ శతాబ్దపు నాటి కన్నడ భాషలో ఉందని చెప్పారు. దీనిపై గణేశుడి శిల్పాన్ని సాంబయ్య అనే వ్యక్తి చెక్కించినట్లు ఆ శాసనంలో పేర్కొన్నారని వివరించారు. జిల్లావ్యాప్తంగా ఇలాంటివి 50కి పైగా శాసనాలను వెలుగులోకి తెచ్చామని వెల్లడించారు. పురావస్తు శాఖ వీటిని పరిశీలిస్తే జనగామ చరిత్ర సంపూర్ణంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.


పెదరామన్‌చర్లలో వెలుగు చూసిన కన్నడ శాసనం



నార్త్ కరోలినాలో ఘనంగా
సద్దుల బతుకమ్మ

ట్రయాంగిల్‌తెలంగాణ అసోసియే షన్(టీటీజీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో పాల్గొన్న 7వేల మంది

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని నార్త్‌కరోలినా రాష్ట్రం మారిస్విల్‌లో సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ట్రయాంగిల్‌తెలంగాణ అసోసియే షన్(టీటీజీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో దాదాపు 7వేల మంది పాల్గొన్నారు. నార్త్‌కరోలినాలో ఉంటున్న తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఆరు గంటలపాటు నిర్వహించిన బతుకమ్మ నృత్య కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సెనేటర్ జేజే చౌదరి, మారిస్విల్ మేయర్ టీజే కౌలీ, మేయర్ ప్రొటెం సతీశ్ గరిమెళ్ల, కౌన్సిల్ సభ్యులు లిజ్ జాన్సన్, స్టీవ్ రావు, కేరీ టౌన్ కౌన్సిల్ మెంబర్‌సరికా బన్సాల్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలను టీటీజీఏ అధ్యక్షుడు మహిపాల్ బిరెడ్డి, ఉపాధ్యక్షురాలు భారతి వెంకన్నగారి, ఈవెంట్ డైరెక్టర్ శశాంక్ ఉండీల, సాంస్కృతిక డైరెక్టర్ పూర్ణ అల్లె, యువత డైరెక్టర్ శ్రీకాంత్ మందగంటి, ఫెసిలిటీ డైరెక్టర్ రఘు యాదవ్, ఫుడ్ డైరెక్టర్ మహేశ్ రెడ్డి, కోశాధికారి రవి ఎం,కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ స్వాతి గోలపల్లి, కమ్యూనికేషన్ డైరెక్టర్ మాధవి కజా నాయకత్వంలో నిర్వహించారు.

డ్రోన్లతో చుట్టుముట్టి..
ఎడాపెడా కాల్పులు



మావోల అడ్డాను పకడ్బందీగా చుట్టుముట్టిన భద్రతాదళాలు

- అక్టోబర్ 3న ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు తుపాకుల మోత
- మృతుల సంఖ్య 35 మందిగా నిర్ధారణ
- తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌పై స్పందించిన మావోలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని తుల్‌తులీ-గవాడీ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ మొత్తంగా 35 మంది సభ్యులను నష్టపోయింది. ఈ ఎదురుకాల్పులపై ముందుగా ప్రకటన చేసిన పోలీసులు 31 మంది చనిపోయినట్టుగా పేర్కొన్నారు. ఘటనాస్థలి నుంచి స్వాధీనం చేసుకున్న 31 మృతదేహాల్లో 22 మందినే గుర్తుపట్టగా, మిగిలిన వారు ఎవరనే అంశంపై సందిగ్ధత కొనసాగింది. అయితే ఎన్‌కౌంటర్ జరిగిన తొమ్మిది రోజుల తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ స్పందించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 35 మంది చనిపోయినట్టు ఆదివారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో ఆ పార్టీ పేర్కొంది. ఘటన జరిగిన తీరుపైనా పోలీసులు వెల్లడించిన వివరాలకు మించి అనేక అంశాలను మావోయిస్టులు ప్రకటించారు.

మూడో తేదీనే చేరుకున్న బలగాలు

మావోయిస్టులు బస చేసిన దంతెవాడ – నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దు అబూజ్‌మడ్ అడవుల్లోకి పోలీసులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, డీఆర్‌జీ బలగాలు ఈనెల 3వ తేదీ రాత్రికే చేరుకున్నాయి. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు రోలింగ్ కాల్‌కు పిలుపునిచ్చి టీ, టిఫిన్లు చేసేందుకు తాము సిద్ధమవుతున్న సమయాన ఆ ప్రాంతంపై డ్రోన్లు ఎగురుతూ కనిపించాయని మావోయిస్టులు వెల్లడించారు. దీంతో అప్రమత్తమై సమీప గ్రామంలో విచారిస్తే భద్రతా దళాలు చుట్టుముట్టినట్టు రూఢీ అయ్యిందని.. ఈ క్రమాన ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే 4న ఉదయం 10 గంటలకు కాల్పులు మొదలయ్యాయని తెలిపారు. ఆ తర్వాత 11:30 గంటలకు ఊపందుకున్న కాల్పులు రాత్రి 9 గంటల వరకు పలుమార్లు కొనసాగాయని మావోలు ప్రకటించారు.

31 కాదు 35 మంది మృతి..

తుల్‌తులీ-గవాడీ ఎదురు కాల్పుల్లో నేరుగా 14 మంది చనిపోగా తమ పార్టీకి చెందిన 17 మంది దళ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారని మావోయిస్టులు లేఖలో వెల్లడించారు. దీంతో వీరిని అక్కడే పట్టుకున్న ప్రభుత్వ బలగాలు మరుసటి రోజైన అక్టోబర్ 5 ఉదయం 8 గంటలకు కాల్చిచంపారని ఆరోపించారు. దీంతో అధికారికంగా 31 మంది చనిపోయినట్టు నిర్ధారణ కాగా.. మరో నలుగురు గాయపడి చికిత్స పొందుతూ మావోల చెంతే చనిపోయినట్టు తెలుస్తోంది. దీంతో మొత్తం మృతుల సంఖ్య 35గా మావోయిస్టులు వెల్లడించారు.

పట్టు సాధించిన బలగాలు

బస్తర్ ప్రాంతంలో దండకారణ్యం, అబూజ్‌మడ్ ప్రాంతాల్లో మావోయిస్టులకు గట్టిపట్టు ఉండేది. దండకారణ్య ప్రాంతంలో జనతన సర్కార్‌ను బీజ దశ నుంచి ఆ పార్టీ అభివృద్ధి చేసుకుంటూ రాగా, అబూజ్‌మడ్ ప్రాంతం షెల్టర్ జోన్‌గా ఉపయోగపడేది. కానీ గడిచిన రెండేళ్లుగా దండకారణ్యం ప్రాంతంపై భద్రతా దళాలు, పోలీసులు కలిసికట్టుగా మావోల ప్రభావాన్ని తగ్గించగలిగారు. అంతేకాక మావోయిస్టుల అంచనాలను తలకిందులు చేస్తూ దాదాపు 2వేల మంది భద్రతా దళాలు, ఆధునిక సాంకేతిక సంపత్తితో అడవులను గాలిస్తూ మావోల అడ్డాకు చేరుకోవడమే పెద్ద విజయం అనుకునే అభిప్రాయం నుంచి మాడ్ అడవుల్లోనే ఏకంగా 35 మంది మావోయిస్టులు నేలకొరిగేలా చేయగలగడం ప్రభుత్వ పరంగా భారీ విజయంగానే ఉంది. కాల్పులు జరిగిన తీరుపై మావోయిస్టులు వెల్లడించిన అంశాలు ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు

మాజీ ఎంపీ వీహెచ్ సూచన



సాక్షి, హైదరాబాద్: కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన అమలు చేసి.. మొట్టమొదట తెలంగాణను దిక్సూచిగా నిలబెట్టాలని కోరారు. పదేళ్లు ప్రధానిగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీలను పట్టించుకోలేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ హామీ ప్రకారం.. కులగణన అమలు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాటిచ్చా రన్నారు. తాను రాసిన పుస్తకాన్ని త్వరలో విడుదల చేయనున్నానని చెప్పారు. ఈ పుస్తకం చదవడం వల్ల భవిష్యత్ తరాలు ప్రేరణ పొందుతాయని వీహెచ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కులగణనపై బీజేపీకి భయమేల?

సాక్షి, హైదరాబాద్: కులగణన చేస్తామంటే బీజేపీ ఎందుకు భయపడుతోందని టీపీసీసీ అధికార ప్రతినిధి లింగంయాదవ్ ప్రశ్నించారు. బీజేపీ అంటేనే బీసీల వ్యతిరేక పార్టీ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరగాలంటే కులగణన జరగాలన్న రాహుల్‌గాంధీ నిర్ణయాన్ని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

సూక్ష్మ సేద్యంపై
చిన్నచూపు!



- రాష్ట్రవ్యాప్తంగా 2.17 లక్షల మంది రైతుల ఎదురుచూపులు
- నాగర్‌కర్నూలు జిల్లాలో అత్యధికంగా 55,959 ఎకరాలకు దరఖాస్తులు
- ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉందంటున్న ఉద్యానశాఖ
- రాష్ట్రంలో 25 టీఎంసీల నీటి పొదుపు
- సుమారు రూ.76 కోట్ల విలువైన విద్యుత్ ఆదా..

సాక్షి, హైదరాబాద్: ఉద్యాన అధికారుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సూక్ష్మ సేద్యం ముందుకు సాగడంలేదు. ఒకవైపు ఆయిల్‌పామ్ సాగును పెంచాలని చెబుతున్న అధికారులు..మరోవైపు రైతులకు సబ్సిడీ విషయంలో తీవ్ర నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. దీంతో లక్షలాది మంది రైతులు సూక్ష్మ సేద్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యానశాఖ లెక్కల ప్రకారమే, రాష్ట్రవ్యాప్తంగా 2.17 లక్షల మంది రైతులు 6.70 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం చేస్తామని, అందుకు అవసరమైన పరికరాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా నాగర్‌కర్నూలు జిల్లాలో 55,959 ఎకరాలకు, వనపర్తి జిల్లాలో 53,887 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 18,929 ఎకరాలకు దరఖాస్తులు వచ్చాయి. మిగతా అన్ని జిల్లాల్లోనూ రైతులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. కానీ అధికారులు అనుమతి ఇవ్వకుండా పెండింగ్‌లోనే పెట్టారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉందని, తామేమీ చేయలేమని ఉద్యాన అధికారులు చేతులెత్తేస్తున్నారు. నిధులు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు.

దేశంలోనే వెనుకంజలో..

దేశంలోనే తెలంగాణ సూక్ష్మసేద్యంలో వెనుకబడి ఉంది. గతంలో కేంద్రం విడుదల చేసిన లెక్కల ప్రకారం చూస్తే.. దేశవ్యాప్తంగా 2.30 కోట్ల ఎకరాల్లో సూక్ష్మసేద్యం అందుబాటులోకి వచ్చింది. కానీ తెలంగాణలో కేవలం 3.31 లక్షల ఎకరాల్లోనే రైతులు సూక్ష్మ సేద్యం చేస్తున్నారు. దేశంలో తెలంగాణ పదో స్థానంలో ఉన్నట్లు ఆ లెక్కలు చెబుతున్నాయి. అత్యధికంగా రాజస్తాన్‌లో 44.71 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్యం జరుగుతోంది. ఆ తర్వాత మహారాష్ట్రలో 35.31 లక్షల ఎకరాల్లో, గుజరాత్‌లోనూ 28.45 లక్షల ఎకరాల్లో సాగవుతుండగా చిన్న రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లోనూ 7.10 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్యం చేస్తుండటం గమనార్హం. ఎకరానికి సూక్ష్మసేద్యం ఏర్పాటు చేసుకోవాలంటే దాదాపు రూ. 25–30 వేల వరకు ఖర్చు కానుంది. అయితే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఈ పరికరాలను అందజేస్తోంది. ఇక బీసీలకు 90 శాతం, ఇతరులకు 80% వరకు సబ్సిడీ ఇస్తుంది.

52% అదనపు దిగుబడి

ఇప్పటివరకు సూక్ష్మసేద్య పద్ధతి ద్వారా రాష్ట్రంలో 43 శాతం నీటిని అంటే 25 టీఎంసీల నీటిని పొదుపు చేశారు. వివిధ రకాల పంటల సాగును నూతన నీటి పొదుపు పద్ధతుల ద్వారా ప్రోత్సహించారు. ఈ పథకం ద్వారా 33 శాతం విద్యుత్ అంటే 1,703 లక్షల యూనిట్లు ఆదా అయినట్లు న్యాబ్కాన్స్ సంస్థ సర్వేలో తేలింది. సుమారుగా రూ.76 కోట్ల విలువైన విద్యుత్ పొదుపు అయినట్లు ఆ సర్వేలో పేర్కొంది. అదే సమయంలో దిగుబడి 52 శాతం వరకు అదనంగా పెరిగినట్లు గుర్తించారు. సూక్ష్మ సేద్యం ప్రాజెక్టులో భాగంగా అందించిన పరికరాల ద్వారా 7 సంవత్సరాల వరకు లబ్ధి పొందవచ్చు. అయితే రైతులకు మేలు చేసే సూక్ష్మసేద్యంపై నిర్లక్ష్యం కనిపిస్తోందనే చర్చ జరుగుతోంది. సాగునీరు వృధా అవుతోందని, ఎరువుల అధిక అధిక వినియోగం జరుగుతోందని, ఆయిల్‌పాం సాగు ముందుకు సాగడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి


సాయిబాబా భౌతికకాయం వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు, కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎంపీ కేశవరావు... గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద సాయిబాబా భౌతికకాయం. చిత్రంలో నారాయణ





చక్కని బొమ్మా..

నిను చెక్కిన చేతులకు సలాం

ప్రపంచాన్ని చుట్టేసిన ఏటికొప్పాక లక్కబొమ్మ

- అంకుడు కర్రతో అద్భుత కళారూపాలు
- సహజరంగుల వినియోగంతో ఇనుమడించిన ఖ్యాతి
- రాంచీ నుంచి లక్క.. తూర్పు కనుమల నుంచి రంగులు
- మన్‌కీ బాత్‌లో లక్క బొమ్మల విశిష్టతను ప్రస్తావించిన ప్రధాని
- సహజసిద్ధమైన ఈ బొమ్మల తయారీ డాక్యుమెంట్‌కు అంతర్జాతీయ అవార్డు



పొట్టకూటి కోసం తయారుచేసిన లక్క బొమ్మ .. కాలాంతరంలో ఆ గ్రామానికి ఖండాంతర ఖ్యాతిని ఆర్జించిపెట్టింది. వంట చెరకుగా కూడా పనికిరాని అంకుడు కర్ర మూలవస్తువుగా, ఆకులూ అలములే సహజ రంగులుగా, కళాకారుడి సృజనాత్మకతే అతిపెద్ద పెట్టుబడిగా తయారవుతున్న ఏటికొప్పాక లక్కబొమ్మ ప్రపంచం నలుమూలలా గొప్ప ఆదరణ పొందుతోంది. వరాహనది ఒడ్డున ఉన్న ఈ ప్రశాంత గ్రామంలో నిరంతరం ఉలి శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. వైవిధ్యమైన బొమ్మల తయారీ కోసం కళాకారులు తమ సృజనకు పదును పెడుతూనే ఉంటారు. చేయితిరిగిన ఇక్కడి కళాకారుడి ఉలి నుంచి జాలువారిన ఒక్కో బొమ్మా ఒక్కో కళాఖండమే.. వందలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న ఏటికొప్పాక బొమ్మ రాష్ట్రపతి, ప్రధాని ప్రశంసలు సైతం అందుకుంది. ఏటికొప్పాక హస్తకళా నైపుణ్యంపై 'సాగా ఆఫ్ ది విమెన్' పేరిట ప్రొఫెసర్ బొగాది నీలిమ తీసిన డాక్యుమెంటరీ ప్రపంచ స్థాయిలో రెండో స్థానం దక్కించుకుంది.

సాక్షి, అనకాపల్లి: ఏడు దశాబ్దాల కిందట అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామంలో నాలుగు విశ్వకర్మ కుటుంబాలు జీవనోపాధి కోసం లక్కబొమ్మల తయారీ ప్రారంభించాయి. నాడు అవసరం కోసం బీజం పడిన ఈ కళ ఇప్పుడు ఆ గ్రామానికి ప్రపంచపటంలో ఒక గుర్తింపు తీసుకు వచ్చింది. అంకుడు కర్రలతో లక్కబొమ్మలు తయారు చేసే హస్తకళాకార కుటుంబాలు ఈ గ్రామంలో దాదాపు 150 వరకూ వున్నాయి. మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా ఇక్కడి కళాకారులు కూడా విశేష నైపుణ్యంతో అపురూప కళాఖండాలను తమ మునివేళ్లతో సృష్టించి అబ్బురపరుస్తున్నారు.

జార్ఖండ్ నుంచి లక్క దిగుమతి

రసాయన రంగులతో పోలిస్తే సహజ రంగులే ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందుకే లక్కకి సహజమైన రంగులను కలిపి ఇక్కడి కళాకారులు అనేక ప్రయోగాలు చేస్తుంటారు. చుట్టుపక్కల లభించే ఉసిరి, కరక్కాయ, వేప వంటి వాటితో సహజ రంగులను తయారు చేస్తారు. సహజమైన లక్కను ఎక్కువగా జార్ఖండ్‌లోని రాంచీ నుంచి దిగుమతిచేసుకుంటారు. అక్కడ ఒక రకమైన సూక్ష్మజీవి విసర్జితాల నుంచి ఇది లభిస్తుంది. స్థానిక గిరిజనులు దాన్ని సేకరించి అమ్ముతారు. ఆ లక్కకి తూర్పుకనుమల్లో దొరికే వివిధ రకాల మొక్కలు, వాటి విత్తనాలు, ఆకులు, వేళ్లు, కాండం నుంచి వచ్చే సహజ సిద్ధమైన రంగులను కలుపుతారు. 100 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద లక్కని వేడిచేసి, రంగుని కలిపి... దాన్ని బొమ్మలకు అద్దుతారు. గది ఉష్ణోగ్రతవద్ద వద్ద ఈ రంగులు ఎంత కాలమైనా పాడవకుండా ఉంటాయి. 1990 వరకు ఏటికొప్పాక బొమ్మలకు రసాయన రంగులే పూసేవారు. గ్రామానికి చెందిన సీవీ రాజు (చింతలపాటి వెంకటపతిరాజు) రసాయన రంగుల స్థానంలో సహజ సిద్ధమైన రంగులను వాడటం మొదలుపెట్టారు. క్రమంగా గ్రామంలోని కళాకారులందరూ సహజరంగులు వినియోగించడం ప్రారంభించారు.

బొమ్మల తయారీలో మహిళలే ఎక్కువ....

ఏటికొప్పాకలో దాదాపు ప్రతి ఇంటిలోనూ బొమ్మల తయారీ కళాకారులుంటారు. ఇందులో మహిళలే అధిక సంఖ్యలో ఉంటారు. ఇంటి పనులు చూసుకుంటూ వీలు దొరికినప్పుడల్లా వీరు బొమ్మలు తయారు చేస్తుంటారు. మరికొందరు దీన్నే వృత్తిగా తీసుకుంటారు. కుంకుమ భరిణెలు, ఆభరణాలు దాచుకునే డబ్బాలు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, మహిళలు ధరించే గాజులు, కీచైన్లు, ఫ్లవర్‌వాజ్‌లు, దేవతామూర్తుల బొమ్మలు మొదలుకుని గ్రామీణ వాతావరణం, శ్రీ వేంకటేశ్వరస్వామి, రామాంజనేయ యుద్ధ సన్నివేశాలు.పెళ్లి తంతు. పెళ్లి సారె ఇలా ఎన్నో రకాల బొమ్మలు ఇక్కడి కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటాయి.



కళ అంతరించిపోకూడదనే..

ఒకప్పుడు రూ.400కు దొరికే అంకుడు కర్రల మోపు.. ఇప్పుడు రూ.4వేలకు పెరిగింది. ఇది కళాకారులకు భారంగా మారింది. స్థానికంగా అంకుడు కర్ర డిపో ఏర్పాటు చేస్తే కళాకారులకు ఉపయుక్తంగా ఉంటుంది. అద్భుతమైన లక్కబొమ్మల తయారీ కళ అంతరించిపోకూడదు. ఇది మా పూర్వీకుల నుంచి మాకు వచ్చిన అరుదైన కళ. బొమ్మల తయారీ గిట్టుబాటు కావడం లేదని గతంలో చాలా మంది కళాకారులు ప్రత్యామ్నాయ పనులకు వెళ్లిపోయారు. దీనిని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు గ్రామంలో సుమారు 100 మందికి పైగా మహిళలకు శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం వారికి ఇది ఉపాధినిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే మరింతమందికి ఉపాధి దొరుకుతుంది.



–శ్రీశైలపు చిన్నయాచారి,
కళాకారుడు, జాతీయ అవార్డు గ్రహీత





విదేశాలకు ఎగుమతి



ఏటికొప్పాక లక్కబొమ్మలకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. సహజసిద్ధమైన రంగులతో ఎంతో ఆకర్షణీయంగా కనిపించడం ఎన్నాళ్లయినా ఈ రంగులు సహజత్వాన్ని కోల్పోకుండా ఉండటంతో విదేశీయులను ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా తెప్పించుకునే వెసులుబాటు ఉండటం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి వాటిలో అందుబాటులో ఉండటంతో అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, పోలెండ్, హాలెండ్, స్విట్జర్లాండ్, బ్రిటన్, జర్మనీ, శ్రీలంక, నేపాల్ దేశాలకు ఏటికొప్పాక బొమ్మలు ఎగుమతవుతున్నాయి.

జాతీయ, అంతర్జాతీయ అవార్డులు



ఏటికొప్పాక లక్కబొమ్మలను వినూత్న రీతిలో తయారు చేసిన పలువురు కళాకారులకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ప్రధాని మోదీ ‘మన్ కీ బాత్’ కార్యక్రమంలో లక్క బొమ్మల విశిష్టత గురించి ప్రస్తావించారు. భారత నౌకాదళం విశాఖలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ–2016లో ఏర్పాటు చేసిన ఏటికొప్పాక బొమ్మల స్టాల్‌ని ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడ తన ఫొటోతో తయారు చేసిన లక్క డబ్బాని చూసి ముచ్చటపడి దాని మీద సంతకం కూడా చేశారు. సహజసిద్ధమైన రంగులతో ప్రయోగాలు చేసి, ఏటికొప్పాక బొమ్మకి కొత్త కళను తెచ్చినందుకు సీవీ రాజుకి 2002లో రాష్ట్రపతి అవార్డు, 2012 లో నేషనల్ ఇన్నోవేషన్ అవార్డు వచ్చింది. అదేవిధంగా ఏటికొప్పాకకు చెందిన మరో కళాకారుడు శ్రీశైలపు చిన్నయాచారి మైక్రో ఆర్ట్స్‌లో నిపుణుడు. 2003లో జాతీయ హస్త కళల పోటీలో ఇతను తయారు చేసిన బొమ్మకు ప్రథమ బహుమతి లభించింది. అలాగే బియ్యపు గింజ మీద పట్టేంత వీణ, గుండుసూది మీద పట్టేంత తాజ్ మహల్, ఏనుగు, బుద్ధుడు, ఎడ్లబండి, శ్రీరామ పట్టాభిషేకం, తల వెంట్రుక మీద నిలబెట్టగలిగే పక్షులు... ఇలా అనేక మినీయేచర్ ఆర్టులను చిన్నయాచారి తయారుచేసి అవార్డులు పొందారు.

'బకాయిలతో కలిపి ఐఆర్ చెల్లించాలి'

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ కరువు భత్యం, వేతన స్థిరీకరణ, వైద్య బిల్లులు, సంపాదిత సెలవు నగదు బకాయిలతో కలిపి మధ్యంతర భృతి (ఐఆర్) చెల్లించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర సెక్రటరీ సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 16న జరిగే మంత్రివర్గ సమావేశంలో బకాయిల చెల్లింపు, పీఆర్సీ, ఐఆర్ అంశాలపై చర్చించి ఉద్యోగులకు మేలు చేయాలని పేర్కొన్నారు.

వైవీయూ రిజిస్ట్రార్ రాజీనామాకు వీసీ ఆమోదం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి రాజీనామాకు వర్సిటీ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి సోమవారం ఆమోదం తెలిపారు. అక్టోబర్ 1న ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించగా, 3న బాధ్యతలు స్వీకరించారు. లైంగిక ఆరోపణలున్న ఆయన నియామకంపై దుమారం రేగడంతో ఆయన బాధ్యతలకు దూరంగా ఉన్నారు.

వృద్ధి రేటు పెంచేలా విజన్ ప్రణాళికలు

సాక్షి, అమరావతి: వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర – 2047 కింద ఏటా 15 శాతానికి మించి వృద్ధి రేటు సాధించేలా జిల్లా, మండల స్థాయి విజన్ ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్ వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లకు చెప్పారు. స్వర్ణాంధ్ర – 2047 అప్‌డేట్ పై సోమవారం ఆయన వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. విజయనగరం, మచిలీపట్నం, నంద్యాల, ఒంగోలు, చిత్తూరు అర్బన్ మండలాలు మినహా మిగతా మండలాలన్నింటిలో మండల ప్రణాళికలు పూర్తి చేశారన్నారు. ఈ ఐదు అర్బన్ మండలాలు వెంటనే విజన్ ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు.

మమ్మల్ని పట్టించుకోకుంటే పోరాటమే..

సాక్షి, అమరావతి: పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని పురపాలక టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు మేలు చేసేందుకు జీవో నం.117పై చర్చలు జరుపుతోందని, కానీ మున్సిపల్ టీచర్లకు ఇబ్బందిగా మారిన జీవో నం.84పై మాత్రం మాట్లాడకపోవడం అన్యాయమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అమెరికాలో వైఎస్సార్‌సీపీ సేవా కార్యక్రమాలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ డల్లాస్ విభాగం, డాక్టర్ వైఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టెక్సాస్‌లోని ఇర్వింగ్ రెడ్ క్రాస్ అండ్ ప్లేట్‌లెట్ డొనేషన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎన్ఆర్ఐలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ డల్లాస్ విభాగం నాయకులు వల్లూరు శివశంకర్ రెడ్డి, డాక్టర్ రాజేంద్ర పోలు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు ఉన్న చరిష్మా మరే ఇతర నాయకులకు లేదన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు వైఎస్సార్ సేవలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉంటారన్నారు. ఆయన తన జీవితాన్ని ప్రజల సంక్షేమం కోసం అర్పించారన్నారు. ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు కృష్ణారెడ్డి, సుధాకర్ మీనకూరు, రవీందర్ రెడ్డి అరమింద, శివకోటిరెడ్డి గుడ్డేటి, గడికోట భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, వీరశివారెడ్డి, చంద్ర, అనిల్ కుండ, నాగేశ్వర్, సుబ్రహ్మణ్యం రెడ్డి, సురేష్ మోపూరు, చైతన్య రెడ్డి, రవితేజ, కిరణ్, శ్రీనాథ్, ఎల్లారెడ్డి, విష్ణు, ప్రసాద్ నాగారపు, ఆనంద్‌రెడ్డి, అజయ్, తరుణ్, దీపేశ్వర్ రెడ్డి, అనురాగ్, మణిదీప్‌రెడ్డి, వివేక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదిమూలం'కు లోకేశ్ అండ




గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): అధికార పార్టీ ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసు పెట్టిన బాధిత మహిళను మంత్రి లోకేశ్ బెదిరించి కేసు విత్ డ్రా చేయించారని జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కేసు విత్ డ్రా చేసుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని మంత్రి లోకేశ్ ఆ మహిళను హెచ్చరించారన్నారు. కూటమి ఎమ్మెల్యేలు మహిళలపై వేధింపులకు పాల్పడుతుంటే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం గాంధీనగర్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాటాడుతూ..కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు తమ పదవీ కాలం మొత్తంలో చేయాల్సిన తప్పులను మొదటి ఆర్నెల్లలోనే చేసేస్తున్నారని మండిపడ్డారు.

27 నుంచి విజయవాడ-విశాఖకు నూతన విమాన సర్వీస్‌లు

విమానాశ్రయం (గన్నవరం): ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి విశాఖ-విజయవాడ మధ్య విమాన సర్వీస్‌లను ప్రారంభించనుంది. ఈ మేరకు ప్రయాణ షెడ్యూల్‌ను ఆ సంస్థ సోమవారం ప్రకటించింది. ఈ విమానం ప్రతిరోజు ఉదయం 9.35కు విశాఖ నుంచి బయలుదేరి 10.35 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. తిరిగి ఇక్కడి నుంచి రాత్రి 7.55కు బయలుదేరి 9 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ సర్వీస్ నిమిత్తం 180 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన బోయింగ్ 737 విమానాన్ని ఆ సంస్థ నడపనుంది. అలాగే, ఈ నెల 27 నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ కూడా విజయవాడ–విశాఖ మధ్య రెండో విమాన సర్వీస్‌ను ప్రారంభించనుంది. ఈ విమానం సాయంత్రం 7.15కు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. తిరిగి రాత్రి 8.45కు విశాఖ నుంచి బయలుదేరి 9.50 గంటలకు ఇక్కడికి చేరుకుంటుంది.

విద్యుత్ అధికారులూ అప్రమత్తం

- భారీ వర్షాలకు ఏర్పడే విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించాలి
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం



సాక్షి,అమరావతి: ఈ నెల 17 వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ సంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఆదేశించారు. విద్యుత్ సంస్థల అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వర్షాలు కురవడం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఫీడర్లను సక్రమంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో విద్యుత్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను కేటాయించి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేయాలని ఆయన సీఎండీలను కోరారు. లైన్‌మెన్ నుంచి చైర్మన్ వరకూ ప్రతి ఒక్కరూ ఇరవై నాలుగంటలూ అందుబాటులో ఉండాలని, సెలవులు తీసుకోకూడదని విజయానంద్ ఆదేశించారు. జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, డిస్కంల సీఎండీలు రవి పట్టన్ శెట్టి, ఐ.పృథ్వితేజ్, కె.సంతోషరావు పాల్గొన్నారు.

నూతన కల్లుగీత పాలసీని ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి డిమాండ్

సాక్షి, అమరావతి: ఈ ఏడాది అక్టోబరు ఒకటో తేదీకి ప్రకటించాల్సిన కల్లు గీత నూతన పాలసీని కూటమి ప్రభుత్వం.. ఇప్పటికైనా వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలంటూ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మద్యం ఆదాయం కోసం కల్లుగీత వృత్తిని దెబ్బతీసే ఆలోచన మంచిది కాదని పేర్కొన్నారు. ప్రకృతి సహజ సిద్ధమైన తాటికల్లుపై ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వాగ్దానాలు చేసి గీత కార్మిక కుటుంబాల్లో ఆశలు కల్పించిన చంద్రబాబు.. ఇప్పుడు వాటి అమల్లో తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చెట్టు పన్ను రద్దు చేసి గీత కార్మికులకు చెట్లపై హక్కు లేకుండా అన్యాయం చేసిందని గుర్తు చేశారు. తాటి చెట్ల పైనుండి ప్రమాదవశాత్తూ పడి మరణించిన, దివ్యాంగులైన కుటుంబాలను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 16న జరిగే మంత్రివర్గ సమావేశంలో విధి విధానాల ప్రకటనతో పాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, తాటిచెట్టుకు రూ.పది పన్ను కట్టించుకునేలా పాలసీని విడుదల చేయాలని సూచించారు. కల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని, నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

అరుణమ్మ వ్యాజ్యంపై విచారణ 19కి వాయిదా

- ఆమె సంతకంతోనే బదిలీలు
- హైకోర్టుకు నివేదించిన జెడ్పీ సీఈవో

సాక్షి, అమరావతి: జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) పరిధిలోని ఉద్యోగులను, సిబ్బందిని తనను సంప్రదించకుండా, తన ఆమోదం లేకుండా జెడ్పీ సీఈవో బదిలీ చేశారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ దాఖలు చేసిన వ్యాజ్యంలో హైకోర్టు తదుపరి విచారణను 19కి వాయిదా వేసింది. అరుణమ్మ ఆమోదంతోనే బదిలీలు చేశామని, బదిలీల ఫైల్‌పై ఆమె సంతకం కూడా చేశారని సీఈవో సోమవారం హైకోర్టుకు నివేదించిన నేపథ్యంలో తదుపరి వాదనల నిమిత్తం విచారణ వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఉత్తర్వులిచ్చారు. అరుణమ్మ దాఖలు చేసిన వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు రాగా సీఈవో తరపు న్యాయవాది బీవీ అపర్ణలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. బదిలీల విషయమై చైర్‌పర్సన్‌ను సంప్రదించామని, ఫైల్‌పై ఆమె సంతకం కూడా చేశారని తెలిపారు. అందుకు సంబంధించిన రికార్డులన్నింటినీ ఆమె న్యాయమూర్తి ముందుంచారు. వీటిని పరిశీలించిన న్యాయమూర్తి.. బదిలీల ఫైల్‌పై అరుణమ్మ సంతకం ఉందని తెలిపారు. అలాంటప్పుడు ఆమెకున్న అభ్యంతరమేంటని ప్రశ్నించారు. అరుణమ్మ తరపు న్యాయవాది వేనాటి శివప్రసాద్‌రెడ్డి స్పందిస్తూ.. కోర్టు ముందుంచిన వివరాలను తమకు అందచేయలేదని, వాటిని తమకు అందజేస్తే.. వాటిపై పిటిషనర్‌తో మాట్లాడి తదుపరి వాదనలు వినిపిస్తామని చెప్పారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ తదుపరి విచారణను 19కి వాయిదా వేశారు. కోర్టుకు సమర్పించిన రికార్డుల కాపీని పిటిషనర్‌కు అందచేయాలని సీఈవోను ఆదేశించారు.

'పవన్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి'

నగరంపాలెం: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాజ్యాంగ పదవిలో ఉండి మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నందువల్ల.. అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని జైభీమ్ కార్మిక సంక్షేమ సంఘం కూటమి అధ్యక్షుడు పిల్లి బాబురావు డిమాండ్ చేశారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠికి గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన, కూటమి సభ్యులు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఎవరైనా హేళన చేస్తే వారి అంతు చూస్తానంటూ బలవంతపు హిందూ మతమార్పిడులను ప్రేరేపిస్తున్నారని, ఇది రాజకీయకుట్ర అని ఆరోపించారు. ఈ కుట్ర వెనుక ప్రధాని మోదీ కూడా ఉన్నారని, వారివురిపై దేశద్రోహం, రాజద్రోహం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక పెండింగ్ అంశాలు ఉన్నాయని, వాటిని విస్మరించి లడ్డూలపై తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. కూటమి సభ్యులు ఎస్.నీలాంబరం, కొండపల్లి విల్సన్ పాల్గొన్నారు.



ఐజీ సర్వశ్రేష్టత్రిపాఠికి ఫిర్యాదు చేస్తున్న బాబూరావు తదితరులు

'వాటర్ షెడ్'లకు 'ఉపాధి' నిధులు

సాక్షి, అమరావతి: వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగంగా గతంలో పీఎంకేఎస్‌వై పథకం ద్వారా చేపట్టిన పనులకు అవసరమైతే ఉపాధి హామీ పథకం నిధులతో మరమ్మతులు చేసుకునేందుకు కేంద్రం అనుమతి తెలిపింది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం మాస్టర్ సర్క్యులర్‌లో నిబంధనలను సవరించింది.

సోషల్ ఆడిట్ డైరెక్టర్ ఎంపికకు సెర్చ్ కమిటీ


సాక్షి, అమరావతి: సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబులిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఎస్ఎస్ఏఏటీ) డైరెక్టర్ నియామకం కోసం సెర్చ్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నామినీగా సీసీఎల్ఏ జి.జయలక్ష్మిని చైర్మన్‌గా నియమించారు.

ఏఈలు లేనిచోట ఎస్ఈఏలకు బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మండల ఇంజనీరింగ్ అధికారులు (ఏఈలు) లేనిచోట ఆ మండల పరిధిలో పనిచేసే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ (ఎస్ఈఏ)లకు అధికారాలు కల్పిస్తూ పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలునాయక్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. వీరి పరిధిలో జరిగే పనులకు సంబంధించి ఎం.బుక్ నమోదు వంటి అధికారాలను కల్పించారు.

ప్రధాని మోదీ ఫొటో పెట్టండి

ఎక్స్‌లో పవన్‌కళ్యాణ్ పోస్ట్



సాక్షి, అమరావతి: పల్లె పండుగ వారోత్సవాల పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, వాల్ పెయింటింగ్స్‌లో ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, వాల్ పెయింట్లపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ఏర్పాటు చేయని విషయం నా దృష్టికి వచ్చింది. పల్లె పండుగ వారోత్సవాలకు సంబంధించిన ప్రతి ఫ్లెక్సీ, వాల్ పెయింట్, సిటిజన్ నాలెడ్జ్ బోర్డులపై కచ్చితంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం, పంచాయతీరాజ్ లోగో, ఉపాధి హామీ పథకం లోగో ఉండేలా చూడగలరు' అని ఆ పోస్టులో సూచించారు.

సాక్షి ప్లస్
మంగళవారం ॥ 15-10-2024
హెల్త్

పొట్టలో గ్యాస్ బండ



"పొట్టంతా టైట్‌గా ఉండి... కడుపంతా ఉబ్బరం" ఒకరి ఆవేదన. "అబ్బా... గొంతులోంచి పైకి వస్తున్న మంటలా ఏదో బర్నింగ్ సెన్సేషన్" ఇంకొకరి ఆక్రందన. "తిన్నవెంటనే రొమ్ముమీదే అతుక్కున్నట్టుగా ఉంటోంది. యాంటాసిడ్ ఏదైనా ఉందా" మరొకరి అభ్యర్థన. ఇలాంటి మాటలన్నీ ఏ కుటుంబంలోనైనా ఎవరో ఒకరి నుంచి తరచూ వినిపిస్తుండేవే. గతంలో కాస్తంత పెద్దవాళ్లు మాత్రమే అనే ఈ మాటల్ని ఇటీవలి లైఫ్ స్టైల్‌తో మరీ కొందరు చిన్నపిల్లల్ని మినహాయిస్తే... యువతా, మధ్యవయస్కులూ, పెద్దలూ ఇలా వయసు తేడాల్లేకుండా అందరూ మాట్లాడేస్తున్నారు. కారణం గ్యాస్ చేరి కడపంతా ఉబ్బరంగా ఉంటూ, పొట్ట టైట్‌గా అనిపిస్తూ ఏమాత్రం స్థిమితం లేకుండా చేయడం. కడుపులో 'గ్యాస్' చేరుతుందనే ఈ గ్యాస్ట్రిక్ సమస్య గురించి తెలుసుకుందాం.

సాధారణంగా మనం ఆహారంతోపాటు గాలినీ మింగేస్తుంటాం. దాంతో అది పెరిస్టాలిటిక్ చలనంతో జీర్ణవ్యవస్థలోకి వెళ్తుంది. చాలా సందర్భాల్లో తేన్పు రూపంలో బయటికొస్తుంది. మరీ కాస్త కిందికి వెళ్లి ఉంటే పెద్ద పేగుల ద్వారా మలద్వారం గుండా కింది నుంచి వెళ్లే గ్యాస్ రూపంలో బయటకు పోతుంటుంది. అయితే కొంతమందిలో ఆ గ్యాస్ కడుపులో చిక్కుకుపోయినట్టుగా మారి పొట్టఉబ్బరంగా, ఇబ్బందికరంగా మారుతుంది. మొదట్లోనే ఈ సమస్యను పట్టించుకోకపోతే అది దీర్ఘకాలంలో మలబద్ధకం, పొట్ట నొప్పి, హైపర్ అసిడిటీలకు దారితీయవచ్చు.

ఈ సమస్య ఎవరెవరిలో...

• ఆహారాన్ని బాగా వేగంగా తినేసేవారు • వదులుగా ఉండే కట్టుడుపళ్లు ఉన్నవారు... (వీళ్లు గ్యాస్ ఎక్కువగా మింగుతుంటారు) • పొగతాగే అలవాటున్నవారు • చ్యూయింగ్‌గమ్ నమిలేవారు • ఏవైనా పదార్థాలను చప్పరిస్తూ ఉండేవారు • కార్బొనేటెడ్ డ్రింక్స్ / కూల్‌డ్రింక్స్ (గ్యాస్ కలిగి ఉండేవి) ఎక్కువగా తాగేవారిలో.

ఛాతీలో/కడుపులో మంట ఎందుకంటే...?

ఆహారం తిన్న తర్వాత సరిగా అరగకపోవడం: కొన్ని తిన్న తర్వాత అవి ఛాతీలోపల అంటుకున్నట్టుగా ఉండటం; ఛాతీలో / గుండెలో మంటగా అనిపించడం అనే సమస్య నిత్యం చాలామంది ఎదుర్కొనేదే. ఎందుకిలా జరుగుతుంటుందంటే... ఆహారం తీసుకున్న వెంటనే దాన్ని జీర్ణం చేసేందుకు కడుపులో కొన్ని ఆమ్లాలు (యాసిడ్స్) స్రవిస్తాయి. ఈ యాసిడ్స్ కొందరిలో కడుపునకు పై భాగంలో ఉండే బిరడా వంటి స్ఫింక్టర్ కండరం కాస్తంత వదులైనందువల్ల పైకి వచ్చేస్తుంటాయి. ఇలా గొంతులోకి పుల్లటి పదార్థాలు రావడం చాలామందికి అనుభవంలోకి వచ్చే విషయమే. సదరు యాసిడ్ గ్యాస్ కారణంగా అన్నవాహిక నుంచి పైకి పయనించడాన్ని యాసిడ్ రిఫ్లక్స్ అంటారు. ఈ యాసిడ్ వల్లనే ఛాతీలో / కడుపులో మంట వస్తుంటుంది.





గ్యాస్‌కు కారణమయ్యే ఆహారాలు ఏమిటంటే...

కొన్ని రకాల ఆహారాలు తీసుకునేవారిలోనూ ఈ సమస్య కనిపిస్తుంది. అవి...

• పొట్టు ఉండే ఆహారధాన్యాల్లో గోధుమలు, • కూరగాయల్లో బ్రాకొలీ, కాలీఫ్లవర్, క్యాబేజీ, ఉల్లిగడ్డలు, బీన్స్ • పండ్లలో పియర్స్, ఆపిల్స్, • పానీయాల్లో గ్యాస్ ఎక్కువగా ఉండే సోడాలు, కూల్‌డ్రింక్స్, • పాలు, పాల ఉత్పాదనల్లో పెరుగు, ఐస్‌క్రీమ్స్, చీజ్, • ప్యాకేజ్‌డ్ ఫుడ్స్‌లో బ్రెడ్స్ వంటివి తినే వారిలో కడుపు ఉబ్బరం, గ్యాస్ పోవడం ఎక్కువ. అయితే వీటిలో సోడా, కూల్‌డ్రింక్స్ మినహాయిస్తే మిగతావి ఆరోగ్యకరం. కాబట్టి సమస్య రానంత మేరకు వాటిని తగు మోతాదులో తీసుకోవాలి.

ఈ సమస్యను పెంచేవి ఇవే...

• ఎక్కువగా నమలకుండానే గబగబా ఆహారాన్ని మింగేయడం • సాధారణం కంటే ఎక్కువగా ఆహారం తీసుకోవడం • తీసుకున్న ఆహారంలో కొవ్వులు ఎక్కువగా ఉండటం • కొందరిలో పుల్లటి ఆహారాలైన టొమాటో, పులుపు ఎక్కువగా ఉండే నిమ్మ జాతి పండ్లు, కూల్‌డ్రింక్స్‌లో కోలా డ్రింక్స్ ఎక్కువగా తాగడం, కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీతో పాటు కొన్నిసార్లు టీ ఎక్కువగా తాగడం వంటి అంశాలన్నీ ఛాతీలో మంటకు కారణమవుతాయి. ఈ పదార్థాలను చాలా పరిమితంగా తీసుకోవడం లేదా వీలైతే తీసుకోకుండా ఉండటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

గ్యాస్ సమస్య తగ్గాలంటే...

ఆహారం తీసుకునే సమయంలో గాలి ఎక్కువగా నోట్లో పోకుండా చేయడం వల్ల చాలావరకు గ్యాస్ సమస్యను అధిగమించవచ్చు. దీనికోసం తీసుకోవాల్సి జాగ్రత్తలు..

• తినే సమయంలో మెల్లగా, నింపాదిగా తినాలి • పెదవులు మూసి తినడం మేలు • పొగతాగే అలవాటు ఉంటే తక్షణం మానేయాలి • కట్టుడు పళ్ల ఉన్నవారు డెంటిస్ట్ సహాయంతో అవి సరిగా అమరేలా చూసుకోవాలి • సోడాలు, కూల్‌డ్రింక్స్, బీర్ వంటి వాటికి దూరంగా ఉండాలి • జ్యూస్ రూపంలో కాకుండా పండ్లను కొరికి, నమిలి తినాలి • గ్యాస్ ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవడం • కొవ్వులు ఉండే పదార్థాలను చాలా పరిమితంగా తీసుకోవడం • వేళకు తినడం (చాలా మంది వేళకు తినకుండా చాలా ఆలస్యంగా తింటుంటారు. వారిలో గ్యాస్‌తో కడుపు ఉబ్బరం రావడం చాలా ఎక్కువ) • ఏం తింటున్నామో గమనిస్తూ, వాటిలో దేనివల్ల గ్యాస్ వల్ల కడుపు ఉబ్బరం సమస్య ఎక్కువవుతోందో గుర్తించి, ఆ ఆహారపదార్థాలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలతో చాలావరకు ఈ సమస్యను అధిగమించవచ్చు.

మరో సూచన: పాలు, పాల ఉత్పాదనలు తీసుకున్నప్పుడు కడుపు ఉబ్బరంగా మారిపోయి, గ్యాస్ సమస్య పెరుగుతుంటే... మార్కెట్‌లో ఇటీవల ల్యాక్టోజ్ రహిత పాలు, పాల ఉత్పాదనలు దొరుకుతున్నాయి. వీటితో గ్యాస్, పొట్ట ఉబ్బరం సమస్యను దూరం చేసుకోవచ్చు.

కడుపు ఉబ్బరం సమస్యకు సాధారణ పరిష్కారాలు...

• తక్కువ తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినాలి. రోజుకు రెండు మూడు సార్లు ఎక్కువగా తినడం కంటే... తక్కువ మోతాదుల్లో 4 నుంచి 6 సార్లు తినడం మేలు • ఆహారం పీచు ఎక్కువగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి. ఇందుకు... పొట్టుతో ఉండే ధాన్యాలతో చేసిన ఆహారం, ఆకుకూరలు, తాజా పండ్లు ఎక్కువగా తినాలి • చేపలు తినేవారు తమ ఆహారంలో చేపలను వారంలో కనీసం రెండు-మూడు సార్లకంటే ఎక్కువగా తీసుకోవడం చాలా మంచిది • ఎక్కువ కొవ్వుతో ఉండేవి, బాగా వేయించిన ఆహారపదార్థాలను వీలైనంత పరిమితంగా తీసుకోవాలి • తినకముందే పాక్షికంగా పులిసే పదార్థాలైన ఇడ్లీ, దోసెల వంటివాటిని (పూరీ, చపాతీల కంటే) మీ బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఎక్కువగా తీసుకోండి. అలాగే ఇలా పులిసేందుకు అవకాశం ఉన్న మజ్జిగ వంటి ఆహారాల్లో జీర్ణవ్యవస్థకు మేలు చేసే 'ప్రో-బయాటిక్' బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటుంది. అయితే అది పూర్తిగా పులియకముందే తాజాగా ఉన్నప్పుడు తినడం మంచిదని గుర్తుంచుకోవాలి • మాంసాహారం తినాలనుకునేవారు వేటమాంసం, రెడ్‌మీట్ కంటే కొవ్వు తక్కువగా ఉంటే చికెన్‌ను ఎంచుకోవడం అన్ని విధాలా మంచిది. • రోజూ కనీసం రెండు లీటర్ల కంటే ఎక్కువగా మంచినీళ్లు తాగాలి. ఇక కాఫీలు, ఆల్కహాలిక్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. కాఫీలు పరిమితంగా తీసుకున్నప్పటికీ, పొగ తాగే అలవాటుకు దూరంగా ఉండాలి. ఆల్కహాలిక్ డ్రింక్స్ పూర్తిగా మానేయాలి • రోజూ చురుగ్గా ఉండండి. వ్యాయామం చేయండి • బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోండి.

ఇక్కడ పేర్కొన్న ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నంత కాలం మన జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటుందని గుర్తుంచుకోండి.

పరదా చాటున అలర్జీ మాటేస్తది!

తలుపులకూ, కిటికీలకు పరదాలు (డోర్ అండ్ విండో కర్టెయిన్స్) అందాన్నీ, ప్రైవసీని ఇస్తాయి. కొన్ని స్టార్ హోటల్స్‌లో మంచి రాజసపు లుక్ కోసం వెరైటీగా కర్టెన్‌లు అమరుస్తారు. ఇటీవల ఇండ్లలోనూ ఈ తరహాలోనే రంగురంగుల ఆకర్షణీయమైన కర్టెన్స్ అమర్చుకోవడం చాలా సాధారణం. కొన్నిసార్లు ఇంటి పై సజ్జబల్లల మీద / అటక మీద పాత సామాన్ల వంటివి సర్దిపెట్టినప్పుడు అవి బయటకు కనపడకుండా పరదాలు అడ్డుగా అమర్చి ఉంచడమూ మామూలే. అయితే వాటిని నెలల తరబడి అలాగే ఉంచడం వల్ల వాటి వెనక అలర్జీకి కారణమయ్యే డస్ట్‌మైట్స్ చేరి అలర్జీ కలిగించవచ్చు. అది ఎన్ని రకాలుగా కలుగుతోందో, నివారణకు ఏం చేయాలో తెలుసుకుందాం.

సాధారణంగా కర్టెన్లతో వచ్చే అలర్జీలు రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించడం వల్ల... అత్యంత చురుకుగా పనిచేసే ఆ వ్యాధి నిరోధక వ్యవస్థ సొంత కణాలపైనే ప్రతికూలంగా పనిచేయడం వల్ల అలర్జీలు వస్తాయి. అది ఈ కింది విధాలుగా జరుగుతుంది.

• **ఫ్యాబ్రిక్ కర్టెన్లలో చేరే అలర్జెన్లూ, డస్ట్‌మైట్స్:** కర్టెన్లు ఇళ్లలోకి దుమ్మూ, ధూళి రాకుండా నిరోధిస్తాయి. ఈ క్రమంలో దుమ్ము ధూళిలో ఉండే డస్ట్ మైట్స్... తలగడల్లో, పక్కబట్టల్లో చేరినట్టే పరదాల్లోకీ చేరతాయి. ఒక అధ్యయనంలో తేలిన విషయం ఏమిటంటే... 30 గ్రాముల దుమ్ములో కనీసం 14,000 డస్ట్‌మైట్స్ ఉంటాయి. ఒక చదరపు గజం విస్తీర్ణంలో కనీసం 1,00,000 (లక్ష) వరకు ఉండవచ్చు. ఒక్కో డస్ట్ మైట్ తన జీవితకాలంలో 300 మిల్లీగ్రాముల విసర్జకాలను వెలువరిస్తుంది. ఈ విసర్జకాల్లోని ఒక రకమైన ప్రోటీన్ మనుషులు శ్వాసించేటప్పుడు ముక్కులోకి వెళ్లి... అది వారిలో అలర్జీ కలిగిస్తుంది. కొన్నిసార్లు అలర్జీలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకూ దారితీస్తాయి. కేవలం డస్ట్ మైట్స్ మైట్స్ మాత్రమే కాకుండా అనేక రకాల అలర్జెన్స్ సైతం కర్టెన్లలో దాగి ఉంటాయి. అవి కలిగించే అలర్జీ కారణంగా దగ్గడం, తుమ్ములు రావడం, అదేపనిగా ముక్కుకారడం, భయం కలిగించేలా కళ్లెర్రబడటం వంటి రియాక్షన్స్ కనిపిస్తాయి. కొందరిలో ఈ డస్ట్ మైట్స్, అలర్జెన్లు తీవ్రమైన ఆస్తమాను కలిగించి, ఊపిరాడకుండా చేస్తూ తీవ్రంగా బాధిస్తాయి.

• **మౌల్డ్స్ లాంటి ఫంగస్ చేరడం:** కర్టెన్లలో మౌల్డ్స్ వంటి ఫంగల్ జాతికి చెందిన అతి సూక్ష్మమైన జీవులు చేరతాయి. ఇవి ఒకరకంగా బూజు లాంటివి. గాలిలో తేమ ఉండేచోట్ల, వెలుతురు తక్కువగా ప్రసరించే చోట్లలో ఈ మౌల్డ్స్, ఇతర ఫంగస్‌లు పెరుగుతాయి. అన్ని చోట్లలాగే కర్టెన్లలో చేరినప్పుడు అవి కలిగించే అలర్జిక్ రియాక్షన్ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు రావచ్చు.

• **సూక్ష్మ జీవుల ఆవాసంగా:** అనేక రకాల సూక్ష్మ జీవులు (జెర్మ్స్) సైతం పెద్దసంఖ్యలో కర్టెన్లలో చేరి అవి కూడా ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు.

• **దుమ్ము కణాలు:** అత్యంత సూక్ష్మమైన దుమ్ము కణాలు కూడా అలర్జీలకు తెచ్చి పెడతాయి.

• **ప్లాస్టిక్ కర్టెన్ల విషయంలో:** మొదట్లో ఇళ్లలో, నివాస ప్రదేశాల్లో కేవలం క్లాత్ కర్టెన్లు మాత్రమే ఉపయోగించేవారు. కానీ ఇటీవల ఉపయోగాలూ, ఫ్యాషన్ దృష్ట్యా ప్లాస్టిక్‌తో తయారైనవీ వాడుతున్నారు. ఇక బాత్‌రూమ్‌ల విషయానికి వస్తే... అక్కడ అవి నీళ్ల వల్ల పాడైపోకుండా ఉండటం కోసం పూర్తిగా వాటర్‌ప్రూఫ్ మెటీరియల్‌తో తయారయ్యేవే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అయితే కొన్ని ప్లాస్టిక్ కర్టెన్లు ఫ్యాబ్రిక్‌లతో చేసిన పరదాల్లో అటు ఇటు ఒంగకుండా (ఫ్లెక్సిబుల్‌గా లేకుండా) ఉంటాయి. అందుకే అవి బట్టలాగే ఎటు పడితే అటు కాస్తంత వంగేందుకు వీలుగా వాటిల్లో 'థాలేట్' అనే పదార్థంతో తయారు చేస్తారు. ఇదే పదార్థాన్ని వాల్‌పేపర్లు, ఫ్లెక్సీల్లో కూడా వాడతారు.



ప్లాస్టిక్ కర్టెన్లతో ఎంతో హాని...

ఈ ప్లాస్టిక్ వంటి కర్టెన్లలోని హానికర / విష పదార్థాలు (టాక్సిక్ మెటీరియల్స్) కేవలం అలర్జీలను ప్రేరేపించడం, శ్వాససంబంధ సమస్యలను తెచ్చిపెట్టడం మాత్రమే కాకుండా హార్మోన్ల వ్యవస్థపైన కూడా ప్రతికూలంగా పనిచేసి ప్రత్యుత్పత్తి వ్యవస్థనూ దెబ్బతీస్తాయి. ఇక గర్భవతులపై కూడా ప్రతికూలంగా పనిచేయడం వల్ల పుట్టబోయే పిల్లలకు ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిసిట్ హైపర్ అటెన్షన డిజార్డర్) వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వంటి పదార్థాలతో తయారైన కర్టెన్ల కారణంగా నాలుగు నుంచి తొమ్మిదేళ్ల పిల్లల్లో ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్) వచ్చే అవకాశాలు ఎక్కువని 'మౌంట్ సినాయ్ మెడికల్ సెంటర్' ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనల్లోనూ తేలింది.

అలర్జీలు వస్తే...

కర్టెన్లు లేదా ఇతరత్రా కూడా అలర్జీలు వచ్చినప్పుడు తీవ్రతను బట్టి డాక్టర్ల పర్యవేక్షణలో యాంటీహిస్టమైన్స్ వాడాల్సి ఉంటుంది. తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నప్పుడు డాక్టర్లు చాలా నిశితంగా పరిశీలిస్తూ, అవసరమైన మోతాదుల్లో స్టెరాయిడ్స్ ఇస్తూ చికిత్స అందిస్తారు. ఈ పరిస్థితి తెచ్చుకోవడం కంటే కర్టెన్స్‌ను ఎప్పటికప్పుడు ఉతికి శుభ్రం చేసుకోవడం వల్ల ఇంటి పరిశుభ్రతతో పాటు ఒంటి ఆరోగ్యాన్నీ కాపాడుకున్నట్లు అవుతుంది.

అలర్జీల నివారణకు...

• డోర్, విండో కర్టెన్ల కోసం వీలైనంతవరకు వస్త్రంతోతయారైన పరదాలు (ఫ్యాబ్రిక్ కర్టెన్స్) వాడటమే మంచిది షవర్ కర్టెన్ల కోసం ఫ్యాబ్రిక్ మెటీరియల్ వాడటం మంచిది • అయితే... బాత్‌రూమ్‌ల్లో వాడటం వల్ల అవి తడిసే అవకాశాలు ఎక్కువ కాబట్టి అక్కడ పీవీసీ మెటీరియల్ కంటే హానికరం కాని అలర్జీ ఫ్రెండ్లీ బ్లైండ్స్ వంటివి వాడటం మంచిది • కర్టెన్లు ఫ్యాబ్రిక్ లేదా ప్లాస్టిక్ మెటీరియల్‌తో చేసినవైనా బాగా మాసిపోయే వరకు ఆగకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచడం అవసరం. ఫ్యాబ్రిక్ మెటీరియల్‌తో తయారైన కర్టెన్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉతికి, పూర్తిగా పొడిబారే వరకు ఆరబెట్టడం... అదే విధంగా ప్లాస్టిక్ మెటీరియల్‌తో తయారైన వాటిని డిస్‌ఇన్ఫెక్టెంట్స్‌తో తరచూ శుభ్రపరచడం చాలా అవసరం. ఇలా ప్లాస్టిక్‌తో తయారైనవి వాడాల్సి వచ్చినప్పుడు హైపో అలర్జెనిక్ వాషబుల్‌వి వాడాలి. దాంతో వాటిని కూడా సబ్బుతో కడిగినట్టే కడిగే అవకాశం ఉంటుంది.

మహిళల్లో గుండె పరీక్షలు ఏ వయసు నుంచి?



గుండె జబ్బుల్ని ముందుగానే తెలుసుకుంటే మరణాలను నివారించడమే కాదు... చాలారకాల అనర్థాలను సమర్థంగా నివారించవచ్చు. నిజానికి ఏ వయసు నుంచి మహిళలు గుండె పరీక్షలను చేయించుకోవడం మంచిది అనే అంశంపై కొంతమంది నిపుణులైన కార్డియాలజిస్టులు చెబుతున్న మాటలే మీతో చూద్దాం.

మహిళలకు స్థూలకాయం, దేహ జీవక్రియలకు సంబంధించిన ఆరోగ్య రుగ్మతలు (మెటబాలిక్ డిజార్డర్స్), కుటుంబంలో (చాలా చిన్న వయసులోనే గుండె జబ్బులు (ప్రీ-మెచ్యూర్ హార్ట్ డిజీసెస్) కనిపిస్తుండటం వంటి ముప్పు ఉన్నప్పుడు వారు తమ 20వ ఏటి నుంచే ప్రతి ఏటా బేసిక్ గుండె పరీక్షలైన ఈసీజీ, 2 డీ ఎకో వంటివి చేయించుకుని నిర్భయంగా ఉండటం సముచితమంటున్నారు పలువురు గుండెవైద్య నిపుణులు.


ఒకవేళ ఏవైనా గుండెజబ్బులకు కారణమయ్యే నిశ్శబ్దంగా ఉండు ముప్పు అంశాలు (సైలెంట్ రిస్క్ ఫ్యాక్టర్స్) కనిపిస్తే వాటికి అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చర్యలను ముందునుంచే తీసుకుంటూ ఉడటం, నివారణ చర్యలను పాటిస్తూ ఉండటం వల్ల ప్రాణాంతక పరిస్థితులను చాలా తేలిగ్గా నివారించవచ్చు. ఉదాహరణకు హైబీపీ లేదా రక్తంలో కొవ్వుల మోతాదులు ఎక్కువగా ఉండే డిస్‌లిపిడేమియా అనే పరిస్థితి ఉన్నట్లయితే వాటిని పట్టించుకోకపోవడం వల్ల కొన్ని ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీసే అవకాశముంటుంది. అదే పైన పేర్కొన్న ముప్పు ఉన్నవారైతే 20వ ఏటి నుంచీ లేదా అన్నివిధాలా ఆరోగ్యవంతులైన మహిళలు తమ 40 ల నుంచి గుండె పరీక్షలను తరచూ (లేదా మీ కార్డియాలజిస్ట్ సిఫార్సు మేరకు) చేయించుకోవడం మంచిది.

అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎప్పుడూ పాటించడమనే అంశం కూడా గుండెజబ్బులతో పాటు చాలా రకాల జబ్బులు, రుగ్మతలను నివారించి మహిళలెప్పుడూ ఆరోగ్యంగా ఉండేలా చేయడానికి ఉపయోగపడుతుంది.

ఇమ్యూనిటీ పెరుగుతుంది

ఇటీవల చాలామందికి డాక్టర్లు అత్యంత ఖరీదైన ప్రో-బయాటిక్స్ ప్రిస్క్రయిబ్ చేస్తుండటం చాలామందికి అనుభవంలోకి వచ్చే విషయమే. జీర్ణవ్యవస్థ పొడవునా ఉంటూ మనకు మేలు చేసే సూక్ష్మజీవులు పెరుగులో పుష్కలంగా ఉంటాయి. అవి ఉండటం వల్లనే వ్యాధి నిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. అందుకే పెరుగు తినడం అన్ని విధాలా ఆరోగ్యానికి మేలు చేసే విషయం మాత్రమే కాదు... ఎన్నో రకాల వ్యాధులను దూరంగా ఉంచేందుకు ఓ సమర్థమైన మార్గం కూడా. పెరుగుతో ఉండే ప్రయోజనాలు చూద్దాం.

• జీర్ణవ్యవస్థ పొడవునా కోటానుకోట్ల సంఖ్యలో ఉండే బ్యాక్టీరియా జీర్ణవ్యవస్థ చురుగ్గా ఉండేలా చూడటం మాత్రమే కాకుండా... కడుపులో మంటను తగ్గిస్తాయి. • రోజుకు రెండువందల గ్రాముల పెరుగు తినేవారిలో రోజూ యాంటీబయాటిక్స్ టాబ్లెట్ తీసుకున్నంతటి ఫలితం ఉంటుందనీ, పైగా ఇది నేచురల్‌గా కలిగే రోగనిరోధక శక్తి కాబట్టి ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఉండవంటూ ఆస్ట్రియాలోని యూనివర్సిటీ ఆఫ్ వియన్నాలో శాస్త్రవేత్తల బృందం నిర్వహించిన ఓ అధ్యయనంలో తేలింది. • దాదాపు 250 గ్రాముల పెరుగులో 275 ఎంజీ క్యాల్షియమ్ ఉంటుంది. కాబట్టి రోజూ పెరుగు తినేవారి ఎముకలు చాలా పటిష్ఠంగా ఉంటాయి. • చర్మంలో తేమ ఎల్లప్పుడూ ఉండేలా పెరుగు సహాయపడుతుంది కాబట్టి ఒంటికి ఆ నిగారింపు వస్తుందన్నది ఆహార నిపుణుల మాట. • పెరుగులో పొటాషియమ్, మెగ్నీషియమ్ ఎక్కువగా ఉండటం వల్ల అది అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. మిగతావారితో పోలిస్తే కొవ్వు అంతగా లేని పెరుగు తినేవారిలో హైబీపీ వచ్చే అవకాశాలు 31% తక్కువగా ఉంటాయని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్‌ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన రీసెర్చ్ సెంటిఫిక్ సెషన్స్‌లో పాల్గొన్న కొందరు శాస్త్రవేత్తలు వివరించారు. • మహిళలకు పెరుగు చేసే మేలు అంతా ఇంతా కాదు. పెరుగు వల్ల మనకు సమకూరే ల్యాక్టోబాసిల్లస్ అసిడోఫిల్లస్ బ్యాక్టీరియా అనే మేలు చేసే బ్యాక్టీరియా వల్ల మహిళల్లో పెరిగే హానికరమైన బ్యాక్టీరియాను తుదముట్టించి, ఎన్నో రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. • బరువు తగ్గాలనుకున్న వారికి కొవ్వు లేని పెరుగన్న మంచి ఆహారం అన్నది ఒబేసిటీని నియంత్రించే డాక్టర్లు చెబుతున్న మాట.



పిల్లల్లో పేనుకొరుకుడు!

కొందరు చిన్నారులకు తల పైన వెంట్రుకలు కొంతమేర రాలిపోతుంటాయి. కొందరు పెద్దల్లోనూ ఇలా జరుగుతుంటుంది. ఇలా జుట్టురాలిపోయి ప్యాచ్‌లా రూపొందే కండిషన్‌ను 'అలోపేషియా ఏరేటా' అంటారు.

కారణాలు: అలోపేషియాకు ఫలానా అంశమే కారణం అంటూ చెప్పడం సాధ్యం కాదు. అయితే సాధారణంగా ఆటో ఇమ్యూన్ డిసీజెస్ ఈ కండిషన్‌కు ప్రధాన కారణం. ఇలాంటి కండిషన్ ఉన్న పిల్లల్లో మాడు ఎర్రబారడం, ఆ ప్రాంతంలో పొట్టులా రాలడం వంటి లక్షణాలూ కనిపించవచ్చు. వీళ్లలో అలర్జీకి సంబంధించిన సమస్యలు, ఆస్తమా, అటోపిక్ డెర్మటైటిస్, చేతివేళ్ల గోళ్లలో కూడా సమస్యలూ కనిపించవచ్చు. ఇలాంటి పిల్లల్లో థైరాయిడ్ సమస్యలు (హైపో థైరాయిడిజం), కడుపుకు సంబంధించిన సమస్యలు, కళ్ల సమస్యలు, ఇతర ఆటో ఇమ్యూన్ సమస్యలు కూడా కనిపించవచ్చు. ఆ కండిషన్ కనిపించే పిల్లల్లో దాదాపు 10% నుంచి 20% మందిలో ఇదే జబ్బుకు సంబంధించిన ఫ్యామిలీ హిస్టరీ కూడా ఉంటుంది. కాబట్టి ఇది జన్యుపరమైన కారణాల వల్ల కూడా వచ్చే అవకాశం ఉందని చెప్పవచ్చు.



కొన్ని సందర్భాల్లో పిల్లల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడులు, మానసికమైన ఉద్వేగాల వంటి అంశాలు కూడా ఈ సమస్యను ప్రేరేపించవచ్చు. మానసికమైన అంశాలతో పాటు... ఫంగల్ ఇన్ఫెక్షన్స్, అలర్జీకి సంబంధించిన సమస్యలు, సెబోరిక్ డెర్మటైటిస్ అనే కండిషన్లలో సైతం వెంట్రుకలు రాలిపోతూ ఉంటాయి. ఇలా జుట్టురాలిపోయే పిల్లల్లో సాధారణంగా ఆర్నెల్ల నుంచి ఏడాదిలోపు మళ్లీ వెంట్రుకలు వాటంతట అవే వచ్చే అవకాశం ఉంది. ఈ అలోపేషియా ఏరేటా కండిషన్ చిన్న చిన్న ప్యాచెస్‌లా కనిపిస్తుంటే త్వరగా తగ్గే అవకాశం ఉంది.

చికిత్స: జుట్టు రాలిపోతున్నందు వల్ల ఇలాంటి పిల్లలు ఆత్మన్యూనతకూ, మానసిక ఒత్తిడికీ గురయ్యే అవకాశం కూడా ఉంది. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు, సంరక్షకులు వారికి తగిన మానసిక స్థైర్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. పైగా తమ తోటివారు ఎగతాళి చేస్తారన్న ఆందోళన పిల్లల్లో చాలా ఎక్కువగా ఉంటుంది.

ఇలా జుట్టు రాలిపోయేచోట్ల టాపికల్ స్టెరాయిడ్స్, స్టెరాయిడ్ క్రీమ్స్ రాయడం, ఆ ప్రాంతాల్లో చర్మంలోకి (సబ్ క్యూటేనియస్) ఇంజెక్షన్లు ఇవ్వడం, అల్ట్రా వయొలెట్ థెరపీ వంటి వాటివల్ల ప్రయోజనం ఉండవచ్చు. కొన్ని సందర్భాల్లో హెయిర్ గ్రోత్ ప్రమోటింగ్ ఏజెంట్స్ వంటి మందుల్ని వాడాలి. అయితే వాటితో కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉండే అవకాశం కూడా ఉంది కాబట్టి తప్పనిసరిగా డర్మటాలజిస్టుల పర్యవేక్షణలోనే వాటిని వాడాల్సి ఉంటుంది.

బిజినెస్ రీల్

ఆల్ టైమ్ హై స్థాయికి పసిడి



న్యూఢిల్లీ: బంగారం ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం ఆల్‌టైమ్ హై స్థాయిని తాకింది. పూర్తిస్థాయి స్వచ్ఛత 10 గ్రాముల ధర గత శుక్రవారంతో పోల్చితే రూ.200 పెరిగి రూ.78,700కి చేరింది. ఇదే స్థాయిని పసిడి అక్టోబర్ 7న చూసింది. ఇక వెండి ధర సోమవారం రూ.500 పెరిగి రూ.93,500కు చేరింది. దేశీయ డిమాండ్ పసిడికి డిమాండ్‌ను పెంచుతోంది.

ఎంఎస్ఎంఈలకు రుణ పరిమితులు పెంపు

ఎస్‌బీఐ యోచన



న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణ లభ్యతను మరింతగా పెంచడంపై ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఇన్‌స్టంట్ లోన్ స్కీమ్ కింద రూ. 5 కోట్లుగా ఉన్న పరిమితిని పెంచే యోచనలో ఉంది. ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ఈ విషయాలు తెలిపారు. రుణ దరఖాస్తు, డాక్యుమెంటేషన్, నిధుల విడుదల మొదలైన ప్రక్రియంతా 15-45 నిమిషాల్లోనే పూర్తి చేసేలా బ్యాంకు 'ఎంఎస్ఎంఈ సహజ్-ఎండ్ టు ఎండ్ డిజిటల్ ఇన్వాయిస్ ఫైనాన్సింగ్'ను అమలు చేస్తోంది. చిన్న సంస్థలకు రుణాలను మరింత సరళతరం చేయడంపై కసరత్తు జరుగుతోందని శెట్టి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 600 శాఖలను ప్రారంభించే ప్రణాళికలున్నాయని ఆయన వివరించారు. ప్రస్తుతం ఎస్‌బీఐకి 22,542 శాఖలు, 65,000 పైచిలుకు ఏటీఎంలు, సుమారు 85,000 మంది బిజినెస్ కరెస్పాండెంట్లు ఉన్నారు.

ఫారెక్స్ నిల్వల్లో స్వల్ప క్షీణత

అక్టోబర్ 4కు 701 బిలియన్ డాలర్లు

ముంబై: విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలు అక్టోబర్4తో ముగిసిన వారంలో 3.709 బిలియన్ డాలర్ల మేర క్షీణించాయి. 701.176 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం వారంలో విదేశీ మారకం నిల్వలు 12.588 బిలియన్ డాలర్ల మేర పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 704.885 బిలియన్ డాలర్లకు చేరడం గమనార్హం. అక్టోబర్ 4తో ముగిసిన వారంలో మొత్తం ఫారెక్స్ నిల్వల్లో.. విదేశీ కరెన్సీ ఆస్తులు 3.511 బిలియన్ డాలర్ల మేర క్షీణించి 612.643 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం నిల్వల విలువ 40 మిలియన్ డాలర్ల మేర తగ్గి 65.756 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఐఎంఎఫ్ వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) విలువ 123 మిలియన్ డాలర్లు తగ్గి 18.425 బిలియన్ డాలర్లుగా ఉంటే.. ఐఎంఎఫ్ వద్ద భారత నిల్వల పరిమాణం 35 మిలియన్ డాలర్లు తగ్గి 4.352 బిలియన్ డాలర్లుగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-10-2024	
విశాఖ	525-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	550.7	4.24
TECHM	1,694.50	2.88
HDFCLIFE	741.2	2.4
HDFCBANK	1,689.00	2.3
LT	3,552.75	2.02

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	286.55	-2.05
MARUTI	12,551.00	-1.77
TATASTEEL	158.29	-1.48
BAJFINANCE	7,210.15	-1.26
ADANIENT	3,098.85	-1.22

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,810
ఎన్ఎస్ఈ	91,179
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,64,566
ఎఫ్ఐఐ	- 3,732
డీఐఐ	+ 2,278

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.18	$ 75.86
బ్రెంట్	77.79	$ 79.04

6జీ రేసులో భారత్



- భారీగా పేటెంట్ల దాఖలు
- అంతర్జాతీయంగా నాలుగో స్థానం

న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతికతల ప్రయోజనాలను అందిపుచ్చుకునే దిశగా భారత్ మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఈ బాటలో 6జీ టెక్నాలజీకి సంబంధించి ఇప్పటికే గణనీయంగా పేటెంట్లు దాఖలు చేసింది. ఈ విషయంలో వివిధ అధ్యయనాల ప్రకారం భారత్ నాలుగు, ఆరు స్థానాల్లో ఉంది. బ్రిటన్‌కి చెందిన యూ స్విచ్ ప్లాట్‌ఫాం ప్రకారం గతేడాది ఏప్రిల్ నాటికి 265 పేటెంట్లతో (6జీ) భారత్ నాలుగో స్థానంలో ఉంది. చైనా (4,604), అమెరికా (2,229), దక్షిణ కొరియా (760) తొలి మూడు ర్యాంకుల్లో ఉన్నాయి. ఇక గ్లోబల్ ఐపీ మేనేజ్‌మెంట్ సంస్థ మ్యాక్స్‌వాల్ ప్రకారం 188 పేటెంట్లతో భారత్ ఆరో స్థానంలో ఉంది. (ప్రభుత్వ డేటా ప్రకారం ఈ సంఖ్య ఈ ఏడాది 200 దాటేసింది). ఈ విషయంలో బ్రిటన్ (151), జర్మనీ (84), స్వీడన్ (74), ఫ్రాన్స్ (73) కన్నా ముందుండటం గమనార్హం. 6,001 పేటెంట్లతో చైనా అగ్రస్థానంలో ఉండగా, అమెరికా (3,909), దక్షిణ కొరియా (1,417), జపాన్ (584), యూరోపియన్ యూనియన్ (214) వరుసగా టాప్ 5 ర్యాంకుల్లో ఉన్నాయి. భారత్ ప్రధానంగా బ్లాక్‌చెయిన్, డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ (డీఎల్‌టీ), 6జీ కమ్యూనికేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎనర్జీ హార్వెస్టింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ వంటి విభాగాల్లో ఎక్కువగా పేటెంట్లు దాఖలు చేసినట్లు ఫ్రాన్స్‌కి చెందిన ఐపీ సొల్యూషన్స్ సంస్థ క్వెస్టెల్ తెలిపింది.

10 శాతం వాటా లక్ష్యం..

6జీ సాంకేతికతకు సంబంధించి భారత్ భారీ లక్ష్యాలనే పెట్టుకుంది. వచ్చే మూడేళ్లలో అంతర్జాతీయంగా 6జీ పేటెంట్లలో 10 శాతం వాటా దక్కించుకోవాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా భారత్ 6జీ అలయెన్స్ ఆవిష్కరణ, 6జీ ట్రయల్స్ కోసం టెస్ట్ బెడ్స్ ఏర్పాటు తదితర చర్యలు తీసుకుంది. పేటెంట్ల దాఖలుకే పరిమితం కాకుండా 6జీ ప్రమాణాలను ప్రభావితం చేసే దిశగా కూడా భారత్ కృషి చేస్తోంది. 160 పైగా దేశాల ప్రమాణాల సంస్థలకు సభ్యత్వం ఉన్న ఐఎస్‌వోలోని (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్) టెక్నికల్ కమిటీలు, సబ్‌కమిటీల్లో మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. అక్టోబర్ 15 నుండి 24 వరకు భారత్‌లో వరల్డ్ టెలికమ్యూనికేషన్స్ స్టాండరైజేషన్ అసెంబ్లీ (డబ్ల్యూటీఎస్ఏ) జరగనున్న నేపథ్యంలో ఈ విషయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 6జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటాలాంటి కీలక టెక్నాలజీల భవిష్యత్ ప్రమాణాల గురించి చర్చించేందుకు 190 పైగా దేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు.

ఆలూ, ఉల్లి ధరల తీవ్రత

సెప్టెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 1.84%



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 1.84 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. ఆగస్టులో ఇది 1.31 శాతంకాగా, 2023 సెప్టెంబర్‌లో అసలు పెరుగుదల లేకపోగా -0.07 శాతం క్షీణించింది. కూరగాయల ధరలు ప్రత్యేకించి ఆలూ, ఉల్లి ధరల తీవ్రత అధికంగా ఉంది. సమీక్షా నెల్లో మూడు ప్రధాన విభాగాలు చూస్తే..

- ఫుడ్ ఐటమ్స్ టోకు ద్రవ్యోల్బణం 11.53 శాతంగా నమోదయ్యింది. ఆగస్టులో ఈ రేటు కేవలం 3.11 శాతం కావడం గమనార్హం. ఆగస్టులో కూరగాయల ధరల్లో అసలు పెరుగుదల లేకపోగా -10.01 శాతం తగ్గుదల నమోదయ్యింది. అయితే సమీక్షా నెల సెప్టెంబర్‌లో ఈ పెరుగుదల రేటు ఏకంగా 48.73 శాతంగా ఉంది. ఆలూ ధరలు 78.13 శాతం పెరిగితే, ఉల్లి ధరలు ఏకంగా 78.82 శాతం ఎగశాయి.
- ఇంధనం, విద్యుత్ విభాగంలో ధరలు 4.05 శాతం తగ్గాయి.

రిటైల్ ధరలూ భారమే...!

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం కూడా సెప్టెంబర్‌లో తీవ్రంగా ఉండడం గమనార్హం. సమీక్షా నెల్లో ఈ స్పీడ్ ఏకంగా 9నెలల గరిష్ఠ స్థాయిలో 5.49 శాతంగా నమోదయ్యింది. ఆగస్టులో ఈ రేటు కేవలం 3.65 శాతం. అధిక కూరగాయల ధరలు దీనికి కారణమని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. జాతీయ గణాంకాల కార్యాలయం వివరాల ప్రకారం ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం సమీక్షా నెల్లో 9.24 శాతంగా ఉంది. ఆగస్టులో ఈ రేటు 5.66 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే నెల్లో 6.62 శాతం.



ఎఫ్ఎంసీజీ సంస్థల మార్జిన్లకు సవాళ్లు

- లాభాలపై తయారీ వ్యయాల ప్రభావం
- ఆదాయాల్లో మాత్రం వృద్ధి
- గోద్రేజ్, డాబర్, మారికో సంకేతాలు

న్యూఢిల్లీ: పెరుగుతున్న పామాయిల్, ముడిసరుకుల ధరలు.. ప్రకటనలు, ప్రచారంపై అధిక వ్యయాలు వెరసి ఎఫ్ఎంసీజీ సంస్థల మార్జిన్లు, లాభాలపై సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రభావం పడనుంది. ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థలు గోద్రేజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ (జీసీపీఎల్), డాబర్, మారికో ఇప్పటికే ఇందుకు సంబంధించి సంకేతాలు ఇచ్చాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో మార్జిన్లలో వృద్ధి క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే ఫ్లాట్‌గా ఉండొచ్చని పేర్కొన్నాయి. కోప్రా, వెజిటబుల్ ఆయిల్ ధరలు పెరిగినట్టు చెప్పాయి. ''పామాయిల్, తయారీ వ్యయాలు మార్చి నుంచి పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు అధిక రెండంకెల స్థాయిలో పెరిగాయి. పెరిగిన వ్యయ భారం మొత్తాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని యాజమాన్యం నిర్ణయించింది. కొత్త ఉత్పత్తులు సహా దీర్ఘకాల వృద్ధికి పెట్టుబడులు కొనసాగించాలని నిర్ణయించింది'' అని జీసీపీఎల్ తెలిపింది. అధిక పామాయిల్, ముడి సరుకుల ధరల కారణంగా సెప్టెంబర్ క్వార్టర్ స్టాండలోన్ ఎబిట్డా వృద్ధి ఫ్లాట్‌గా ఉండొచ్చని పేర్కొంది. ఆదాయం మాత్రం సింగిల్ డిజిట్ స్థాయిలో వృద్ధిని నమోదు చేయవచ్చని అంచనా వేస్తోంది.

ముడి సరుకుల ధరల పెరుగుదల..

ఇటీవలే దిగుమతి సుంకాలు పెంచిన ఫలితంగా వెజిటబుల్ నూనెల ధరలు పెరగడం, కోప్రా ధరలు పెరగడాన్ని మారికో ప్రస్తావించింది. స్థూల మార్జిన్లు మోస్తరుగానే ఉండొచ్చని పేర్కొంది. ఆదాయ వృద్ధితో పోలిస్తే.. నిర్వహణ లాభం వృద్ధి మోస్తరుగానే ఉండొచ్చని అంచనా వేస్తున్నట్టు తెలిపింది. మరో ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ పంపిణీదారుల స్థాయిలో నిల్వలను సరిదిద్దే పనిలో ఉన్నట్టు తెలిపింది. ''తక్కువ అమ్మకాలతో లాభాలపై ప్రభావం పడింది. ఆపరేటింగ్ మార్జిన్ రెండంకెల స్థాయిలో క్షీణించొచ్చు''అని డాబర్ పేర్కొంది. మరోవైపు ప్రకటనలపై డాబర్ తన వ్యయాలను పెంచింది. పంపిణీ ఛానల్ బలోపేతానికి వీలుగా ఈ తాత్కాలిక దిద్దుబాట్లు అవసరమని, రానున్న రోజుల్లో మెరుగైన నిర్వహణ, వృద్ధికి ఈ చర్యలు వీలు కల్పిస్తాయని పేర్కొంది. మరోవైపు ప్రత్యామ్నాయ ఛానళ్ల ద్వారా ఎఫ్ఎంసీజీ అమ్మకాలు మెరుగుపడినట్టు తెలుస్తోంది. ప్రత్యామ్నాయ ఛానళ్ల ద్వారా ఆదాయం రెండంకెల స్థాయిలో పెరిగినట్టు అదానీ విల్‌మార్ ప్రకటించింది. ముఖ్యంగా ఈ-కామర్స్ ఛానళ్ల ద్వారా గడిచిన ఏడాది కాలంలో ఆదాయం నాలుగు రెట్లు వృద్ధి చెందినట్టు తెలిపింది. గత కొన్ని త్రైమాసికాలుగా సంప్రదాయ ఛానళ్లలో అధిక వృద్ధిని చూస్తున్నట్టు డాబర్ ప్రకటించింది.

ఓలాపై ఫిర్యాదుల వెల్లువ

- ఏడాదిలో 10,000లకు పైగా ఫిర్యాదులు
- కంపెనీకి నోటీసు జారీ చేసిన సీసీపీఏ



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ టూవీలర్ల తయారీలో ఉన్న ఓలాపై దేశవ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యత, అమ్మకాల తర్వాత సేవకు సంబంధించి 10,000 కంటే ఎక్కువ ఫిర్యాదులు పరిష్కరించకపోవడంతో వినియోగదారుల హక్కుల నియంత్రణ సంస్థ సెంట్రల్ కంజ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) ఓలాకు నోటీసును జారీ చేసింది. నేషనల్ కంజ్యూమర్ హెల్ప్‌లైన్‌కు (ఎన్‌సీహెచ్) ఏడాది కాలంగా ఓలా ఎలక్ట్రిక్‌పై ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిని పరిష్కరించాల్సిందిగా కంపెనీలో ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించినా వారు పెద్దగా ఆసక్తి చూపలేదని సమాచారం. దీంతో సెంట్రల్ కంజ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ క్లాస్ యాక్షన్ కోసం ఈ ఫిర్యాదులను పరిశీలించడం ప్రారంభించింది. ఏడాదిలో ఎన్‌సీహెచ్‌కు 10,000 కంటే ఎక్కువ ఫిర్యాదులు అందాయని గుర్తించింది. చీఫ్ కమిషనర్ నిధి ఖరే, కమిషనర్ అనుపమ్ మిశ్రా నేతృత్వంలోని సీసీపీఏ వినియోగదారుల ఫిర్యాదులను పరిశీలించింది. వినియోగదారుల హక్కుల ఉల్లంఘన, సేవల్లో లోపాలు, తప్పుదారి పట్టించే దావాలు, అన్యాయమైన వాణిజ్య పద్ధతులు అవలంభించడంతో సీసీపీఏ అక్టోబర్ 7న ఓలాకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ప్రతిస్పందించడానికి కంపెనీకి 15 రోజుల గడువు ఇచ్చింది. సీసీపీఏ నుండి షోకాజ్ నోటీసు అందుకున్నట్టు అక్టోబర్ 7న ఓలా ఎలక్ట్రిక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది.

తగ్గుతున్న విక్రయాలు..

భారత ఎలక్ట్రిక్ టూ వీలర్ల రంగంలో తొలి స్థానంలో కొనసాగుతున్న ఓలా ఎలక్ట్రిక్ సెప్టెంబర్‌లో 23,965 యూనిట్ల విక్రయాలను నమోదు చేసింది. యూనిట్ల పరంగా అమ్మకాలు 11 నెలల కనిష్ఠానికి చేరుకోవడం గమనార్హం. ఈ ఏడాది జూలైలో ఓలా మార్కెట్ వాటా 39 శాతం కాగా సెప్టెంబర్‌లో ఇది 27 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది మార్చిలో ఏకంగా 52,136 యూనిట్లను కంపెనీ విక్రయించింది. ఈ-టూ వీలర్స్ విక్రయాల పరంగా భారత్‌లో టాప్-2లో ఉన్న టీవీఎస్ మోటార్ కో స్థానాన్ని బజాజ్ ఆటో కైవసం చేసుకోవడం విశేషం. గత నెలలో బజాజ్ ఆటో 166 శాతం అధికంగా 18,933 యూనిట్లు విక్రయించింది. జనవరి-సెప్టెంబర్ కాలంలో ఈ కంపెనీ అమ్మకాలు దాదాపు మూడింతలై 1,19,759 యూనిట్లను సాధించింది. 21.47 శాతం మార్కెట్ వాటాను పొందింది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే కొద్ది నెలల్లోనే బజాజ్ చేతక్ తొలి స్థానానికి చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

ఇవీ ఫిర్యాదులు..

ఉచిత సేవా వ్యవధి/వారంటీ సమయంలో చార్జీల వసూలు, సేవలు ఆలస్యం కావడంతోపాటు అసంతృప్తికరం, వారంటీ ఉన్నప్పటికీ సర్వీసు తిరస్కరణ లేదా ఆలస్యం, సరిపోని సేవలు, పునరావృతం అవుతున్న లోపాలు, అస్థిర పనితీరు, అధిక చార్జీలు, ఇన్వాయిస్‌లో తేడాలు ఉంటున్నాయని ఓలాపై ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. అలాగే రీఫండ్ చేయకపోవడం, డాక్యుమెంటేషన్‌ను అందించడంలో వైఫల్యం, వృత్తిపర ప్రవర్తన, పరిష్కారం కానప్పటికీ ఫిర్యాదుల మూసివేత, బ్యాటరీ, వాహన విడి భాగాలతో బహుళ సమస్యలను వినియోగదార్లు ఎదుర్కొంటున్నారు. కాగా, నేషనల్ కంజ్యూమర్ హెల్ప్‌లైన్‌ను (ఎన్‌సీహెచ్) డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంజ్యూమర్ అఫైర్స్ పునరుద్ధరించింది. వ్యాజ్యానికి ముందు దశలో ఫిర్యాదుల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా వినియోగదారులకు ఒకే పాయింట్‌గా ఎన్‌సీహెచ్ ఉద్భవించింది. ఇది దేశంలోని వినియోగదారులందరికీ అందుబాటులో ఉంది. వినియోగదారులు 17 భాషలలో టోల్-ఫ్రీ నంబర్ 1800114000 లేదా 1915 ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. వాట్సాప్, ఎస్ఎంఎస్, మెయిల్, ఎన్‌సీహెచ్ యాప్, వెబ్ పోర్టల్, ఉమంగ్ యాప్‌ల ద్వారా బాధితులు తమ సౌలభ్యం ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు.

ఏఐపై అతిగా ఆధారపడొద్దు

బ్యాంకులకు ఆర్‌బీఐ గవర్నర్ సూచన



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలతో ప్రయోజనాలు పొందాలే తప్ప వాటిపై అతిగా ఆధారపడరాదని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. ఈ సాంకేతికతలతో ఆర్థిక సంస్థలకు కొత్త వ్యాపార అవకాశాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ వాటి వల్ల ఆర్థిక స్థిరత్వానికి రిస్కులు కూడా పొంచి ఉన్నాయని ఆర్‌బీఐ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ఏఐ వినియోగం అతిగా పెరిగే కొద్దీ సైబర్‌దాడులు, డేటా ఉల్లంఘనలు వంటి రిస్కులు కూడా పెరిగే అవకాశం ఉందని వివరించారు. అంతే గాకుండా, ఏఐ పారదర్శకంగా ఉండకపోవడం వల్ల, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను ప్రభావితం చేసే అల్గోరిథంలను ఆడిట్ చేయడం లేదా అన్వయించుకోవడం కూడా కష్టతరమవుతుందని దాస్ చెప్పారు. దీనితో మార్కెట్లలో అనూహ్య పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. డిజిటలీకరణతో మనీ ట్రాన్స్‌ఫర్ ఎంత వేగంగా క్షణాల వ్యవధిలో జరుగుతోందో అంతే వేగంగా సోషల్ మీడియా ద్వారా వదంతులు కూడా వ్యాప్తి చెందుతున్నాయని, ఇలాంటివి లిక్విడిటీపరమైన ఒత్తిళ్లకు దారి తీసే అవకాశం ఉందని దాస్ చెప్పారు. ఈ నేపథ్యంలో రిస్కులను సమర్ధంగా ఎదుర్కొనేందుకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు తగిన చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొత్త రికార్డులకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం

200 గిగావాట్ల మైలురాయికి చేరిక



న్యూఢిల్లీ: దేశంలో పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పత్తి సామర్థ్యం కొత్త రికార్డులకు చేరుకుంది. సెప్టెంబర్ చివరికి 201 గిగావాట్ల మైలురాయిని అధిగమించింది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు సామర్థ్యం పరంగా అగ్రస్థానంలో ఉన్నట్టు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ డేటా తెలియజేసింది. రాజస్థాన్ 31.5 గిగావాట్లు, గుజరాత్ 28.3 గిగావాట్లు, తమిళనాడు 23.7 గిగావాట్లు, కర్ణాటక 22.3 గిగావాట్ల సామర్థ్యాన్ని ఇప్పటి వరకు సాధించాయి. 201 గిగావాట్లలో.. సోలార్ రూపంలో 90,762 మెగావాట్లు సమకూరుతుంటే, 47,363 మెగావాట్లు పవన విద్యుత్ ద్వారా వస్తోంది. ఇక 8,180 మెగావాట్ల అణు విద్యుత్‌ను కూడా కలిపి చూస్తే దేశంలోని మొత్తం విద్యుదుత్పత్తిలో కర్బనేతర ఇంధన వనరుల రూపంలో 46.3 శాతం సమకూరుతోంది. భాగస్వాములకు సాంకేతిక సహకారం అందించే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ 50వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను సోమవారం నిర్వహించింది. ఇక ప్రపంచవ్యాప్తంగా 2024 చివరికి సోలార్ మాడ్యూళ్ల తయారీ సామర్థ్యం 1,100 గిగావాట్లకు చేరుకోనుందని అంచనా.

సిస్కా ఎల్ఈడీ లైట్స్‌పై దివాలా చర్యలు

ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు



న్యూఢిల్లీ: రుణ చెల్లింపుల్లో విఫలమైనందుకు గాను సిస్కా ఎల్ఈడీ లైట్స్‌పై దివాలా చట్టం కింద చర్యలకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశించింది. ఇందుకు సంబంధించి రూ. 7.70 కోట్ల బాకీల వసూలు కోసం రుణదాత సన్‌స్టార్ ఇండస్ట్రీస్ దాఖలు చేసిన పిటీషన్‌ను విచారణకు స్వీకరించింది. సిస్కా ఎల్ఈడీ లైట్స్ బోర్డును రద్దు చేసి దివాలా పరిష్కార ప్రొఫెషనల్‌గా దేవాశీష్ నందాను నియమించింది. సన్‌స్టార్ సరఫరా చేసిన ఉత్పత్తుల నాణ్యతపై వివాదం నెలకొందని, ఆ కంపెనీ దివాలా చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందన్న సిస్కా వాదనలను తోసిపుచ్చింది. సన్‌స్టార్‌కి సిస్కా రుణం చెల్లించాల్సి ఉందనడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్నట్లు ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ పేర్కొంది. ఈ నేపథ్యంలోనే పిటీషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు వివరించింది. వివరాల్లోకి వెడితే, ఎస్ఎస్‌కే గ్రూప్‌లో భాగంగా ఉన్న సిస్కా ఎల్ఈడీ లైట్స్‌కి ఎలక్ట్రికల్ గృహోపకరణాల సంస్థ సన్‌స్టార్ ఇండస్ట్రీస్ 60 రోజుల క్రెడిట్ వ్యవధితో ఉత్పత్తులను సరఫరా చేసేది. తొలినాళ్లలో సక్రమంగానే చెల్లింపులు జరిపినప్పటికీ 2023 మార్చి నుంచి జూలై వరకు పంపిన 25 ఇన్‌వాయిస్‌లను చెల్లించకుండా డిఫాల్ట్ కావడంతో సన్‌స్టార్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది.

అదానీ ప్రాజెక్ట్‌పై శ్రీలంక పునఃపరిశీలన!



కొలంబో: పవన విద్యుత్ ప్రాజెక్టు కోసం అదానీ గ్రూప్‌నకు గత ప్రభుత్వం మంజూరు చేసిన ఆమోదాన్ని పునఃపరిశీలిస్తామని అనురా కుమార దిసానాయకే నేతృత్వంలోని శ్రీలంక కొత్త ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రాజెక్టును సమీక్షించాలని అక్టోబర్ 7న జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్‌కి ప్రభుత్వం తెలియజేసింది. నవంబర్ 14న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల తర్వాత కొత్త కేబినెట్ ఏర్పాటయ్యాక తుది నిర్ణయం తెలియజేస్తామని కోర్టుకు విన్నవించారు. సెప్టెంబరు 21 అధ్యక్ష ఎన్నికలకు ముందు ప్రెసిడెంట్ దిసానాయకే తన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) కూటమి ప్రతిపాదిత ప్రాజెక్టును రద్దు చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్ శ్రీలంక ఇంధన రంగ సార్వభౌమత్వానికి ముప్పుగా పరిణమించిందని.. తాము విజయం సాధించిన తర్వాత ప్రాజెక్టును రద్దు చేస్తామని ఎన్‌పీపీ హామీ ఇచ్చింది. అదానీ గ్రూప్ శ్రీలంకలోని ఈశాన్య ప్రాంతాలైన మన్నార్, పూనేరిన్‌లలో 484 మెగావాట్ల పవన విద్యుత్ అభివృద్ధికి 20 సంవత్సరాల ఒప్పందంలో భాగంగా 440 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉంది. ఈ ప్రాజెక్ట్ శ్రీలంక సుప్రీంకోర్టులో ప్రాథమిక హక్కుల వ్యాజ్యాన్ని ఎదుర్కొంది. పర్యావరణ ఆందోళనలు, అదానీ గ్రీన్ ఎనర్జీకి అనుమతినిచ్చే బిడ్డింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపాన్ని పిటిషనర్లు లేవనెత్తారు. ఒక కిలోవాట్ అవర్‌కు అంగీకరించిన 0.0826 డాలర్ల టారిఫ్ శ్రీలంకకు నష్టాన్ని కలిగిస్తుందని.. ఇది 0.005 డాలర్లకు తగ్గించాలని పిటిషనర్లు వాదించారు.

రతన్ టాటాకు సరిలేరు వేరెవరూ..

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



న్యూఢిల్లీ: రతన్ టాటా ఎల్లప్పుడూ టాటా గ్రూప్ కంపెనీలలో ఉద్యోగులు వారి కుటుంబాల శ్రేయస్సు విషయంలో అత్యంత శ్రద్ధ వహించే వారని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. రతన్ అనుసరించిన విధానం వల్ల సంస్థలో అనేకమంది ఎంతో సమర్థులుగా ఎదిగారని పేర్కొన్నారు. నిజంగా ఆయనలాంటి వారు ఎవరూ లేరని అన్నారు. టాటాతో ఈ మేరకు తన అనుభవాలను ఒక పోస్ట్‌లో పంచుకున్నారు. ''టాటాను కలిసిన ఎవ్వరైనా ఆయన మానవత్వాన్ని, ఎదుటి వారిని నొప్పించకుండా చక్కగా మాట్లాడే తీరును, భారతదేశ కోసం ఆయన కలల గురించి చెబుతారు. నిజంగా ఆయన లాంటి వారు ఎవరూ లేరు'' అని అని వివరించారు. అప్పట్లో సైరస్ మిస్త్రీని తొలగించిన తర్వాత 2017లో టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ బాధ్యతలు చేపట్టారు. టాటాతో తన అనుబంధం గురించి వివరిస్తూ, ఇది సంవత్సరాలుగా వృద్ధి చెందింది. మొదట వ్యాపారంపై దృష్టి సారించి, చివరికి మరింత వ్యక్తిగత అనుబంధంగా మారింది'' అని చెప్పారు. తాము కార్ల నుంచి హోటళ్ల వరకూ అన్ని అంశాలపై చర్చించుకునేవారిమని చెప్పారు. సంభాషన ఇతర అంశాలపైకి ప్రత్యేకించి రోజువారీ జీవితం గురించి మాట్లాడుకునేటప్పుడు, తన అపార అనుభవాలను ఆయన వివరిస్తుండేవారని తెలిపారు.

భారత 'ఎ' జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ

ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీకి జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: ఈనెల 18 నుంచి 27 వరకు ఒమన్‌లో జరిగే ఎమర్జింగ్ కప్ ఆసియా టి20 టోర్నీలో పాల్గొనే భారత 'ఎ' జట్టును ప్రకటించారు. హైదరాబాద్ యువ క్రికెటర్, ముంబై ఇండియన్స్ జట్టు సభ్యుడు తిలక్ వర్మ భారత జట్టుకు సారథ్యం వహిస్తాడు. 21 ఏళ్ల తిలక్ వర్మ ఇప్పటి వరకు భారత జట్టు తరఫున నాలుగు వన్డేలు, 16 టి20 మ్యాచ్‌లు ఆడాడు. గ్రూప్ 'బి'లో ఉన్న భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 19న పాకిస్తాన్ జట్టుతో ఆడుతుంది. ఆ తర్వాత 21న యూఏఈతో, 23న ఒమన్‌తో భారత్ తలపడుతుంది. గ్రూప్ 'ఎ'లో అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, హాంకాంగ్, శ్రీలంక జట్లున్నాయి. గతంలో ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌ను వన్డే ఫార్మాట్‌లో నిర్వహించగా... తొలిసారి టి20 ఫార్మాట్‌లోకి మార్చారు. 2013లో భారత జట్టు ఏకైకసారి ఈ టోర్నీలో విజేతగా నిలిచింది.

భారత 'ఎ' జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), అభిషేక్ శర్మ (వైస్ కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్ సింగ్, నిశాంత్, రమణ్‌దీప్ సింగ్, నేహాల్ వధేరా, ఆయుశ్ బదోని, అనూజ్ రావత్, సాయికిశోర్, హృతిక్ షోకీన్, రాహుల్ చహర్, వైభవ్ అరోరా, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ ఖాన్, రసిక్ సలామ్.

డాలస్‌లో సచిన్‌కు సత్కారం

హ్యూస్టన్ (అమెరికా): భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను అమెరికాలోని క్రికెట్ అభిమానులు సత్కరించారు. అమెరికాలో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించేందుకు నేషనల్ క్రికెట్ లీగ్ (ఎన్‌సీఎల్) ఏర్పాటుకు సచిన్ తనవంతు కృషి చేశాడు. దీంతో డాలస్‌లోని కౌబాయ్స్ నేషనల్ మ్యాచ్ సందర్భంగా ఎన్‌సీఎల్ సంబంధించిన టీమ్ యజమాని తయారు చేసిన '10 జెర్సీ'ని సచిన్‌కు అందజేసి సన్మానించారు. మానుల్ని ఆకట్టుకునేందుకు నిర్వహించబోయే ఎన్‌సీఎల్‌కు సచిన్ సహనిగా ఉన్నాడు. 'క్రికెట్ నాకెంతో ఇచ్చింది. ఓ క్రికెటర్‌గా డాలస్‌కు విచ్చేసిన యువ అథ్లెట్ల అభిమానం, కురిపిస్తున్న ఆదరణ చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది' అని సచిన్ అన్నాడు. అంకితభావం, నిబద్ధత, తపనతో పాటు మనపై మనకున్న విశ్వాసం మనల్ని లక్ష్యంవైపు నడిపిస్తాయన్నాడు. అది క్రికెట్‌లో అయినా... జీవితంలో అయినా మనల్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని చెప్పాడు. ఆదివారం టెక్సాస్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలోనూ సచిన్‌తో వందల మంది అథ్లెట్లు కలిశారు.





హద్దులు లేకుండా ఆడతాం

వ్యూహాల పేరుతో ఆటగాళ్ల దూకుడును కట్టడి చేయం

- కోహ్లి ఫామ్‌పై ఆందోళన లేదు
- న్యూజిలాండ్ కఠిన ప్రత్యర్థి
- మూడు టెస్టుల్లోనూ సవాళ్లు తప్పవు
- భారత హెడ్ కోచ్ గంభీర్ వ్యాఖ్యలు

బెంగళూరు: భారత క్రికెటర్లు ఎవరైనా సరే తమ సహజ శైలిలో చెలరేగుతుంటే... జట్టు వ్యూహాల పేరుతో వారి దూకుడుకు హద్దులు పెట్టబోమని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. 'బ్యాటింగ్ కింగ్' విరాట్ కోహ్లి ఫామ్‌పై తమకెలాంటి ఆందోళనా లేదని, అతని పరుగుల దాహం ఎప్పటికీ తీరదని గంభీర్ తెలిపాడు. రేపటి నుంచి న్యూజిలాండ్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో టీమిండియాకు కఠిన సవాళ్లు తప్పవన్నాడు. ఇటీవలే ముగిసిన బంగ్లాదేశ్ సిరీస్ సహా కివీస్‌తో టెస్టులు, ఆస్ట్రేలియా పర్యటనలపై గంభీర్ సోమవారం జరిగిన మీడియా సమావేశంలో తన అభిప్రాయాలు వెల్లడించాడు. భవిష్యత్తులో జరిగే సిరీస్‌లకంటే ప్రస్తుత సిరీస్‌పైనే తమ దృష్టి ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఇంకా ఏమన్నాడంటే...

అడ్డు ఎందుకు?

భారత బ్యాటింగ్‌కు నిర్దిష్టమైన శైలి ఇదని, ఇలాగే ఆడాలనే కచ్చితమైన ప్రణాళికలేమీ లేవు. ఆటగాళ్లు దూకుడుగా ఆడితే ఆడని... చెలరేగితే చెలరేగని ఇందులో అడ్డుకట్టలెందుకు పెట్టాలి. వారి సహజశైలిని వారు కొనసాగించే స్వేచ్ఛ ఇవ్వాలి కదా! గట్టిగా చెప్పాలంటే... మేం ఒక రోజులో 400–500 పరుగులైనా చేయాలనుకుంటాం. [illegible]కుంటే రెండు రోజుల పాటు జిడ్డుగా ఆడి 'డ్రా' [illegible]తాం. ఎందుకంటే కొన్నిసార్లు 100 పరుగులకే ఆలౌ[illegible]రావొచ్చు. అప్పుడు క్రీజులో నిలబడే ఓపిక, గం[illegible]టలు తరబడి ఆడే సామర్థ్యం కూడా అవసరం. టీమిండియా [illegible] తయారుకావడమే ముఖ్యం. అప్పుడే దూకుడైన ఆటతో అభిమానులకు మజా దక్కుతుంది.

పరిస్థితులను బట్టే నిర్ణయాలు

ఈ సిరీస్‌లో ఇలా ఆడాలని, ఆ ప్రత్యర్థిని అలా ఎదుర్కోవాలనే ముందస్తు ప్రణాళికలపైనే ఆధారపడటం కుదరదు. వీలును బట్టి, అప్పటి పరిస్థితులు, పిచ్‌లో ఎదురయ్యే సవాళ్లు దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలుంటాయి. దీనికి పక్కా ప్రణాళికంటూ అమలు కాదు... అప్పటి పరిస్థితులే ప్రామాణికం. దాన్నిబట్టే ఆట తీరు మారుతుంది. ఆడే శైలి మరో దశకు చేరుకుంటుంది.

కివీస్‌తో గట్టిపోటీ

న్యూజిలాండ్ సాదాసీదా ప్రత్యర్థి కానేకాదు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా షాక్‌లు తప్పవు. సొంతగడ్డ అనే అనుకూలతలు, గత సిరీస్ గెలిచాం... ఇదీ గెలుస్తామనే ధీమా తప్పు. బంగ్లాదేశ్‌తో పోల్చితే కివీస్ పూర్తిగా భిన్నమైన ప్రత్యర్థి. ఆ జట్టు గట్టి పోటీ ఇస్తుంది. నాణ్యమైన ఆటగాళ్లు, అనుభవజ్ఞులైన ప్లేయర్లు అందుబాటులో ఉన్నారు. కాబట్టి ప్రతీ మ్యాచ్‌లోనూ మాకు సవాళ్లు తప్పవు. అయితే ప్రత్యర్థి కివీసా లేదంటే ఆసీసా అని చూడం. జట్టు గెలుపొందడమే లక్ష్యంగా బరిలోకి దిగుతాం. వచ్చే నెలలో మొదలయ్యే 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' గురించి ఇప్పుడెందుకు ఆలోచిస్తాం. ఇప్పుడు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఫైనల్ బెర్తే లక్ష్యంగా కివీస్‌ను ఓడించేపనిలో ఉంటాం



కోహ్లి ఫామ్‌లోకి వస్తాడు

కోహ్లిపై నా ఆలోచనలు సుస్పష్టం. అతనో విశ్వవిఖ్యాత క్రికెటర్. సుదీర్ఘకాలంగా గొప్పగా రాణిస్తున్న బ్యాటర్. కోహ్లి అరంగేట్రం చేసినపుడు ఎలాంటి పరుగుల దాహంతో ఉన్నాడో... ఇన్నేళ్లుగా ఆడుతున్నా ఇప్పటికి అలాంటి ఆకలితోనే ఉన్నాడు. కివీస్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో తప్పకుండా రాణిస్తాడనే ఆశిస్తున్నాను. ఇకపైనా అదే ఆటతీరును ఆస్ట్రేలియా పర్యటనలోనూ కొనసాగిస్తాడనే నమ్మకంతో ఉన్నాను. వరుసగా కొన్ని మ్యాచ్‌ల్లో... లేదంటే ఒకట్రెండు సిరీస్‌లలోనే విఫలమైనంత మాత్రాన అతని బ్యాటింగ్‌లో సత్తా లేదని కాదు. ఆటగాళ్లు కదా... ఎవరికైనా వైఫల్యాలు సహజం. అలాగే వాటిని అధిగమించడం కూడా జరుగుతుంది.

భారత్‌తో సిరీస్‌కు గ్రీన్ అవుట్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ భారత్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అతను వెన్నెముక గాయంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి శస్త్రచికిత్స అనివార్యం కావడంతో ఆరు నెలల పాటు క్రికెట్‌కు దూరం కానున్నాడు. గత నెల ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా తొలిసారిగా గ్రీన్ వెన్ను గాయానికి గురయ్యాడు. 25 ఏళ్ల సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన గ్రీన్ దిగువ వెన్నెముక వద్ద సమస్యలున్నట్లు పరీక్షల్లో తేలింది. పేస్ బౌలర్ కావడంతో వెన్ను సమస్య మరింత తీవ్రతరం కాకముందే సర్జరీ చేసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఒక్క బోర్డర్–గావస్కర్ ట్రోఫీకే కాదు... తదనంతరం జరిగే శ్రీలంక పర్యటన, చాంపియన్స్ ట్రోఫీలతో పాటు ఐపీఎల్‌కూ అతను దూరమయ్యే అవకాశాలున్నాయి. భారత్, ఆస్ట్రేలియాల మధ్య వచ్చే నెల 22న పెర్త్‌లో జరిగే తొలి టెస్టుతో ఐదు టెస్టుల సిరీస్ మొదలవుతుంది.

స్మిత్ మళ్లీ నాలుగో స్థానంలో...

వెటరన్ ఆస్ట్రేలియన్ బ్యాటర్, మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ మళ్లీ తన ఫేవరెట్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతాడని జాతీయ సెలక్టర్ జార్జ్ బెయిలీ ప్రకటించాడు. గత కొంతకాలంగా స్మిత్ ఓపెనింగ్ చేస్తున్నాడు. అతను మళ్లీ పాత స్థానంలోకి రావడంతో భారత్‌తో జరిగే పూర్తిస్థాయి టెస్టు సిరీస్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) సెలక్టర్లు కొత్త ఓపెనర్ అన్వేషణలో ఉన్నారు. ఆసీస్, భారత్ 'ఎ' జట్ల మధ్య జరిగిన సిరీస్‌ను పరిశీలించి ఉస్మాన్ ఖ్వాజాతో ఇన్నింగ్స్ ఓపెన్ చేసే బ్యాటర్ కోసం ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కామెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్, టీనేజ్ సంచలనం సామ్ కొన్‌స్టాస్, మార్కస్ హారిస్‌లలో ఒకరిని ఓపెనర్‌గా దించే అవకాశాల్ని పరిశీలిస్తున్నారు.



విజయానంతరం గుజరాత్ జట్టు

హైదరాబాద్ పరాజయం

126 పరుగుల తేడాతో గుజరాత్ ఘనవిజయం ● రాణించిన ప్రియజీత్‌సింగ్, రింకేశ్ వాఘేలా

సాక్షి, హైదరాబాద్: బ్యాటర్ల వైఫల్యం కారణంగా... రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌ను హైదరాబాద్ జట్టు పరాజయంతో ప్రారంభించింది. మాజీ చాంపియన్ గుజరాత్ జట్టుతో సోమవారం సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ముగిసిన గ్రూప్ 'బి' ఎలైట్ డివిజన్ తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 126 పరుగుల తేడాతో ఓడిపోయింది. మ్యాచ్ చివరిరోజు సోమవారం 297 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 59.1 ఓవర్లలో 170 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ అభిరత్ రెడ్డి (59 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా... ఇతర బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. గుజరాత్ బౌలర్లలో ప్రియజీత్‌సింగ్ జడేజా, రింకేశ్ వాఘేలా 3 వికెట్ల చొప్పున తీయగా... సిద్ధార్థ్ దేశాయ్, అర్జన్ నాగ్‌వాస్‌వలా 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. ఈ విజయంతో గుజరాత్‌కు 6 పాయింట్లు లభించాయి. గుజరాత్ బ్యాటర్ మనన్ హింగ్రాజియాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈనెల 18 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌తో హైదరాబాద్ తలపడుతుంది.

స్కోరు వివరాలు

గుజరాత్ తొలి ఇన్నింగ్స్: 343; **హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్:** 248; **గుజరాత్ రెండో ఇన్నింగ్స్:** 201; **హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్:** తన్మయ్ అగర్వాల్ (బి) అర్జన్ నాగ్‌వాస్‌వాలా 1; అభిరత్ రెడ్డి (సి) సిద్ధార్థ్ దేశాయ్ (బి) రింకేశ్ వాఘేలా 51; రాహుల్ సింగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్జన్ నాగ్‌వాస్‌వాలా 0; రోహిత్ రాయుడు (బి) రింకేశ్ వాఘేలా 26; హిమతేజ (సి) రిషి పటేల్ (బి) ప్రియజీత్ సింగ్ 29; రాహుల్ రాధేశ్ (సి) ఉర్విల్ పటేల్ (బి) ప్రియజీత్ సింగ్ 17; తనయ్ త్యాగరాజన్ (సి) ఉర్విల్ పటేల్ (బి) ప్రియజీత్ సింగ్ 1; సీవీ మిలింద్ (సి) ప్రియాంక్ పాంచాల్ (బి) సిద్ధార్థ్ దేశాయ్ 28; అనికేత్ రెడ్డి (సి) రిషి పటేల్ (బి) సిద్ధార్థ్ దేశాయ్ 2; రక్షణ్ రెడ్డి (సి) ప్రియాంక్ పాంచాల్ (బి) రింకేశ్ వాఘేలా 7; నిశాంత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (59.1 ఓవర్లలో ఆలౌట్) 170. వికెట్ల పతనం:** 1–12, 2–12, 3–76, 4–83, 5–127, 6–130, 7–133, 8–145, 9–170, 10–170. **బౌలింగ్:** సిద్ధార్థ్ దేశాయ్ 16.1–3–47–2, అర్జన్ నాగ్‌వాస్‌వాలా 12–4–28–2, చింతన్ గజా 9–3–16–0, ప్రియజీత్ సింగ్ జడేజా 10–1–23–3, రింకేశ్ వాఘేలా 12–2–52–3.

విక్టర్‌కు రూ. 40 లక్షలు

హాకీ ఇండియా లీగ్ వేలం కార్యక్రమం

న్యూఢిల్లీ: ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ మొదలవుతున్న హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)కు సంబంధించి పురుషుల విభాగం వేలం కార్యక్రమం సోమవారం ముగిసింది. రెండో రోజు బెల్జియం స్టార్ మిడ్‌ఫీల్డర్ విక్టర్ వెగ్‌నెజ్‌కు అత్యధికంగా రూ. 40 లక్షలు లభించాయి. విక్టర్‌ను పంజాబ్‌కు చెందిన సూర్మా హాకీ క్లబ్ కొనుగోలు చేసింది. 28 ఏళ్ల విక్టర్ బెల్జియం తరఫున ఇప్పటి వరకు 175 మ్యాచ్‌లు ఆడాడు. 2020 టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన బెల్జియం జట్టులో, 2018 ప్రపంచకప్ సాధించిన బెల్జియం జట్టులో విక్టర్ కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన థియరీ బ్రింక్‌మన్, ఆర్థర్ వాన్ డోరెన్‌లను కళింగ లాన్సర్స్ జట్టు వరుసగా రూ. 38 లక్షలకు, రూ. 32 లక్షలకు సొంతం చేసుకుంది. భారత యువ ఆటగాడు మొరాంగ్‌థిమ్ రబిచంద్రను కళింగ లాన్సర్స్ జట్టు రూ. 32 లక్షలకు కొనుగోలు చేసింది. భారత్‌కే చెందిన అంగద్‌బీర్ సింగ్‌ను కళింగ లాన్సర్స్ జట్టు రూ. 26 లక్షలకు... హైదరాబాద్ తూఫాన్స్ జట్టు రాజిందర్‌ను రూ. 23 లక్షలకు కైవసం చేసుకుంది.

నేడు మహిళా క్రీడాకారిణుల వేలం

మహిళల హాకీ ఇండియా లీగ్‌కు సంబంధించి మంగళవారం వేలం కార్యక్రమం జరుగుతుంది. మహిళల విభాగంలో నాలుగు జట్లు బరిలో ఉన్నాయి. వాస్తవానికి ఆరు జట్లు పోటీపడతాయని నిర్వాహకులు ప్రకటించినా మరో రెండు జట్లను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వచ్చే సీజన్ నుంచి మాత్రం మహిళల లీగ్‌ను ఆరు జట్లతో నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.




విక్టర్

ఇంగ్లండ్ తుది జట్టులో స్టోక్స్

నేటి నుంచి పాక్‌తో రెండో టెస్టు

ముల్తాన్: ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ రెండో టెస్టు ఆడేందుకు సిద్ధమయ్యాడు. మంగళవారం నుంచి పాకిస్తాన్‌తో ఇక్కడ జరిగే రెండో టెస్టుకు ప్రకటించిన తుది జట్టులో అతను ఉన్నాడు. తొడ కండరాల గాయం నుంచి పూర్తిగా కోలుకోవడంతో మ్యాచ్ ఆడేందుకు అందుబాటులోకి వచ్చినట్లు ఇంగ్లండ్ జట్టు వర్గాలు తెలిపాయి. నెట్స్‌లో కెప్టెన్ ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాటింగ్, బౌలింగ్ చేశాడని టీమ్ మేనేజ్‌మెంట్ తెలిపింది. ఆగస్టులో 'హండ్రెడ్' టోర్నీ ఆడిన స్టోక్స్ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. దీంతో 33 ఏళ్ల ఆల్‌రౌండర్ సొంతగడ్డపై శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌తో పాటు, పాక్‌తో తొలి టెస్టుకు గైర్హాజరయ్యాడు. అయితే తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 47 పరుగులతో ఆతిథ్య పాక్‌ను చిత్తు చేసింది. స్టోక్స్ రాకతో తుది జట్టులో రెండు మార్పులు చేశారు. పేసర్ క్రిస్ వోక్స్ స్థానంలో కెప్టెన్ స్టోక్స్, అట్కిన్సన్ స్థానంలో ఫాస్ట్ బౌలర్ మాథ్యూ పాట్స్ జట్టులోకి వచ్చారు. రెండో టెస్టులోనూ ఇంగ్లండ్ ఇద్దరు స్పిన్నర్లు షోయబ్ బషీర్, జాక్ లీచ్‌లను కొనసాగిస్తోంది.





శుభారంభంపై సింధు గురి

నేటి నుంచి డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్ (డెన్మార్క్): ఈ సీజన్‌లో ఫామ్‌లోకి వచ్చేందుకు భారత స్టార్ షట్లర్ పీవీ సింధు తహతహలాడుతోంది. గత వారం ఫిన్లాండ్‌లో జరిగిన ఆర్కిటిక్ ఓపెన్ వైఫల్యాన్ని అధిగమించి డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో శుభారంభం చేయాలనే లక్ష్యంతో సింధు సన్నద్ధమైంది. రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన సింధుకు గత ఈవెంట్‌లో అనూహ్యంగా తొలి రౌండ్లోనే కెనడా ప్లేయర్ మిచెల్లీ లీ చేతిలో ఓటమి ఎదురైంది. గతంలో మిచెల్లీపై పదిసార్లు విజయం సాధించిన భారత షట్లర్‌కు ఫిన్లాండ్‌లో మాత్రం నిరాశ ఎదురైంది. తాజా డెన్మార్క్ ఓపెన్ తొలి రౌండ్‌లో ఆమె చైనీస్ తైపీకి చెందిన పాయ్ యు పొతో తలపడుతుంది. ఈ అడ్డంకిని దాటితే సింధుకు రెండో రౌండ్లో చైనా షట్లర్ హాన్ యువె ఎదురవనుంది. మహిళల సింగిల్స్‌లో ఆమెతో పాటు మాళవిక బన్సోడ్, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడాలు కూడా ఈ టోర్నీలో శుభారంభంపై దృష్టి సారించారు. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ లక్ష్య సేన్ కూడా మెరుగైన ఆటతీరుతో ఈ సీజన్‌లో గాడిన పడేందుకు శ్రమిస్తున్నాడు. ఈ టోర్నీలో 23 ఏళ్ల లక్ష్య సేన్ తొలిరౌండ్లో లూ గ్వాంగ్ జు (చైనా)తో పోటీపడతాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే రెండో రౌండ్లో కిష్టమైన ప్రత్యర్థి ఎదురవనున్నాడు. ఇండోనేసియాకు షట్లర్ జొనాథన్ క్రిస్టీతో లక్ష్య సేన్ తలపడే అవకాశముంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జంట తొలి రౌండ్లో ఐదో సీడ్ పియర్లీ తన్–తినా మురళీధరన్ (మలేసియా) జోడీతో ఆడుతుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–సుమిత్ రెడ్డి ద్వయానికి తొలి రౌండ్లో కెవిన్‌లీ– ఎలియాన జంగ్ (కెనడా) జంట ఎదురవుతుంది. గతంలో భారత క్రీడాకారులకు డెన్మార్క్ ఓపెన్ కలిసొచ్చింది. సింగిల్స్‌లో ప్రకాశ్ పదుకొనే (1980లో), శ్రీకాంత్ (2017లో), సైనా నెహ్వాల్ (2012లో) విజేతలుగా నిలిచారు.

ఆంధ్ర జట్టు ఓటమి

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ దేశవాళీ క్రికెట్ టోర్నీ సీజన్‌ను ఆంధ్ర జట్టు ఓటమితో ప్రారంభించింది. మాజీ చాంపియన్ విదర్భ జట్టుతో సోమవారం ముగిసిన గ్రూప్ 'బి' తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 74 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 318 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 86.4 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 79/1తో చివరి రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర జట్టు ఒకదశలో ఒక వికెట్ నష్టానికి 177 పరుగులతో పటిష్టంగా కనిపించింది. అయితే ఓపెనర్ అభిషేక్ రెడ్డి (78; 5 ఫోర్లు, 1 సిక్స్), షేక్ రషీద్ (74; 7 ఫోర్లు) 12 పరుగుల వ్యవధిలో అవుటవ్వడంతో ఆంధ్ర జట్టు పతనం మొదలైంది. వీరిద్దరు పెవిలియన్ చేరుకున్నాక వచ్చిన ఇతర బ్యాటర్లెవరూ క్రీజులో కుదురుకోలేకపోయారు. కెప్టెన్ రికీ భుయ్ (26; 1 ఫోర్, 1 సిక్స్), శశికాంత్ (25; 2 ఫోర్లు, 1 సిక్స్) కాస్త పోరాడినా... కేఎస్ భరత్ (2), అశ్విన్ హెబర్ (3) నిరాశపరిచారు. విజయ్ (0), లలిత్ మోహన్ (0), సత్యనారాయణ రాజు (0) డకౌట్ అయ్యారు. చివరి వికెట్‌గా శశికాంత్ వెనుదిరిగాడు. విదర్భ జట్టు బౌలర్లు ఆదిత్య థాకరే (4/47), హర్ష్ దూబే (4/69), అక్షయ్ వాఖరే (2/71) ఆంధ్ర జట్టు పతనాన్ని శాసించారు. ఈ గెలుపుతో విదర్భ జట్టుకు ఆరు పాయింట్లు లభించాయి. ఈనెల 18 నుంచి జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో గుజరాత్ జట్టుతో ఆంధ్ర జట్టు ఆడుతుంది.




ఎడారి పట్టణం మెర్జౌగాలో ఏర్పడిన భారీ సరస్సు నీటిలో కనిపిస్తున్న భవనాలు, ఇసుక తిన్నెలు, చెట్ల ప్రతిబింబాలు

సహారాకు కొత్త అందం!

ఆఫ్రికా ఖండంలోని సహారా ఎడారిలో వర్షం కురిసింది. అదీ భారీగా. రెండు రోజులపాటు కురిసిన వానకు అక్కడి ఇసుక తిన్నెల స్వరూపమే మారిపోయింది. హఠాత్తుగా ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద సరస్సులు వెలిశాయి. ఒయాసిస్‌ల వద్ద ఉండే చెట్ల ప్రతిబింబాలు వాన నీటిలో చూపరులకు కనువిందు చేస్తున్నాయి. దశాబ్దాల కాలంలో కురిసిన అతి భారీ వర్షం ఇదేనని అక్కడి వారు సంబరపడుతున్నారు. సాధారణంగా సహారాలో ఏడాదిలో అదీ వేసవిలో కొద్దిపాటి వాన కురుస్తుంది. కానీ, మొరాకో ఆగ్నేయాన ఉన్న సహారాలో అల్ప పీడనం కారణంగా రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిశాయి. ఈ ప్రాంతంలో కొన్ని చోట్ల అతిభారీగా కూడా వానలు కురిశాయని నాసా ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. మొరాకోలో వాయవ్య నగరం ఇగ్రాచిడియాలో ఏడు సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. సెప్టెంబర్‌లో సాధారణంగా కురిసే వర్షపాతానికి ఇది ఏకంగా నాలుగు రెట్లు. అంతేకాదు, ఆ ప్రాంతంలో ఆరు నెలల్లో కురిసే వర్షపాతానికి ఇది సమానం. ఇంత తక్కువ సమయంలో ఈ స్థాయిలో వర్షాలు కురియడం 30–50 సంవత్సరాల కాలంలో ఇదే మొదటిసారని మొరాకో వాతావరణ అధికారి హౌస్సేన్ చెప్పారు. దీంతో, ఎడారి ఇసుక తిన్నెలు, అక్కడక్కడ పెరిగే మొక్కలు, ఖర్జూర చెట్లు కొత్త ప్రకృతి అందాలను సంతరించుకున్నాయి. మెర్జౌగా ఎడారి పట్టణంలో అరుదైన ఇసుక తిన్నెల్లోకి భారీగా చేరిన వరద కొత్త సరస్సులను సృష్టించింది. మొరాకోలోని అతిపెద్ద నేషనల్ పార్క్‌గా ఉన్న ఇరిఖి నేషనల్ పార్క్‌లో ఇంకిపోయిన చెరవులు మళ్లీ నిండాయి. కొన్ని చోట్ల పచ్చిక బయళ్లు అవతరించాయి. అంతగా జనం ఉండని ప్రాంతాల్లోనే ఎక్కువగా వానలు కురిశాయి. ఇక్కడ ఎలాంటి నష్టం జరగలేదు. అయితే, ఒక్కసారిగా కురిసిన భారీ వర్షాలతో పట్టణాలు, గ్రామాల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వాతావరణ విపరీత మార్పులే ఈ పర్యవసానాలకు కారణమని నిపుణులు అంటున్నారు. వాతావరణం మరింతగా వేడెక్కితే మున్ముందు ఇక్కడ మరింతగా వర్షాలకు కురిసే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దాదాపు 36 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలో విస్తరించిన ఉన్న సహారా ప్రపంచంలోనే అతి పెద్ద ఎడారి.

–నేషనల్ డెస్క్, సాక్షి

ఢిల్లీలో బాణసంచాపై పూర్తి నిషేధం

- జనవరి 1వ తేదీ వరకు అమలు
- వాయు కాలుష్యం పెరగడంతో ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చడంతో ఢిల్లీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. బాణసంచా ఉత్పత్తి, నిల్వ, విక్రయం, వినియోగంపై నిషేధం విధించింది. తక్షణం ఇది అమల్లోకి వస్తుందని ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు. ఈ శీతాకాలంలో కాలుష్యం బెడద తీవ్రమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలుంటాయని ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ కమిటీ హెచ్చరించింది. అన్ని రకాల ఫైర్ క్రాకర్స్‌లకు, ఆన్‌లైన్‌లో జరిగే విక్రయాలకు కూడా నిషేధం వర్తిస్తుందని కమిటీ స్పష్టం చేసింది. కొద్దిరోజులుగా ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చినట్లు పొల్యూషన్ కంట్రోల్ కమిటీ ప్రకటించింది.

రష్యాకు ఉత్తర కొరియా సాయం చేస్తోంది

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మండిపాటు

కీవ్: దళాలను, ఆయుధాలను అందిస్తూ రష్యా సైన్యానికి ఉత్తరకొరియా సహాయం చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని నివారించడానికి మిత్ర దేశాల నుంచి మరింత మద్దతు కావాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు. కీవ్‌కు మద్దతు విషయమై చర్చించడానికి ఉక్రెయిన్ మిత్రదేశాల సమావేశంలో బైడెన్ పాల్గొనాల్సి ఉంది. అయితే ఫ్లోరిడాలో మిల్టన్ తుఫాను నేపథ్యంలో గత వారం జరగాల్సిన బైడెన్ జర్మనీ పర్యటన వాయిదా పడింది. దీంతో జెలెన్ స్కీ మిత్రదేశాల్లో ఆకస్మిక పర్యటనలు చేశారు. ఇటీవల బెర్లిన్, లండన్, పారిస్, రోమ్ తోసహా పలు దేశాల్లో పర్యటించి సైనిక, ఆర్థిక సహాయం కోరారు. ఉక్రెయిన్‌కు ఇచ్చే మద్దతు కేవలం సైన్యానికి ఇస్తున్నట్టు కాదని కాదని.. దురాక్రమణదారు రష్యాను ఎదుర్కోవడానికి, దానిపై ఒత్తిడి పెంచడానికి తోడ్పడుతుందన్నారు. కాగా, బైడెన్ శుక్రవారం జర్మనీలో పర్యటిస్తారని ఆ దేశ అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి. మరోవైపు.. కొన్ని వారాలుగా తమ దళాలను ముందుకు నడిపిస్తున్న రష్యా.. పోక్రోవ్‌స్క్ సమీపంలో ఉన్న మరో తూర్పు ఉక్రెయిన్ గ్రామాన్ని స్వాధీనం చేసుకుంది.

నటుడు దర్శన్‌కు బెయిల్ నిరాకరణ

బెంగళూరు: కన్నడ నటుడు దర్శన్ తూగుదీప, అతడి స్నేహితురాలు పవిత్ర గౌడలకు సోమవారం బెంగళూరులోని సెషన్స్ కోర్టు బెయిల్ నిరాకరించింది. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి(33)అనే అభిమానిని జూన్‌లో దర్శన్, అతడి గ్యాంగ్ కిడ్నాప్ చేసి చంపేసినట్లు ఆరోపణలున్నాయి. రేణుకాస్వామి పవిత్ర గౌడకు అసభ్యకర సందేశాలను పంపడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.ఈ ఘటనపై పోలీసులు సెప్టెంబర్‌లో దర్శన్, పవిత్ర సహా 17 మందిపై కోర్టులో చార్జిషీటు వేశారు.

ట్రంప్ ర్యాలీ వద్ద తుపాకులతో సంచారం


డొనాల్డ్ ట్రంప్

- వ్యక్తి అరెస్ట్, విడుదల

కాలిఫోర్నియా: రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ర్యాలీ సమీపంలో మరోసారి కలకలం రేగింది. అక్రమంగా తుపాకీ, లోడెడ్ హ్యాండ్ గన్ కలిగి ఉన్న వ్యక్తిని ర్యాలీ సమీప కూడలి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కాలిఫోర్నియాలోని కోచెల్లాలో బ్లాక్ ఎస్‌యూవీని నడుపుతున్న వెమ్ మిల్లర్‌ను భద్రతా తనిఖీల కోసం చెక్‌పాయింట్ వద్ద ఆపారు. అతని వద్ద రెండు తుపాకులు, అధిక సామర్థ్యం ఉన్న మ్యాగజైన్‌ను గుర్తించారు. లోడెడ్ తుపాకీ, అధిక సామర్థ్యం కలిగిన మ్యాగజైన్‌ను కలిగి ఉన్నందుకు కేసు నమోదు చేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అనంతరం ఆయనను వ్యక్తిగత జామీనుపై విడుదల చేశారు. ట్రంప్‌కు ఎలాంటి ప్రమాదం లేదని అమెరికా సీక్రెట్ సర్వీస్ తెలిపింది. ఈ ఘటనపై తాము ఇంకా దర్యాప్తు చేస్తున్నామని ఫెడరల్ అధికారులు చెబుతున్నారు. ఈ సంఘటన ట్రంప్ చుట్టూ తీవ్రమైన భద్రతా చర్యలను, మాజీ అధ్యక్షుడు ఎదుర్కొంటున్న ప్రమాదాలను మరోసారి ఎత్తిచూపింది. అయితే ఈ అరెస్టుపై ట్రంప్ ప్రచార బృందం వెంటనే స్పందించలేదు. ఇటీవల జరిగిన రెండు హత్యాయత్నాల నేపథ్యంలో ట్రంప్ ర్యాలీల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఎవరీ వెమ్ మిల్లర్?

వెమ్ మెల్లర్ లాస్ వేగాస్‌కు చెందిన వ్యక్తి. ఆయనకో వెబ్‌సైట్ ఉంది. ఆన్‌లైన్ చాట్ షోలు నిర్వహిస్తారు. తనను తాను ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్, ఫిల్మ్ మేకర్ అని చెప్పుకొంటాడు. మిల్లర్ ట్రంప్‌పై హత్యాయత్నం చేయబోయాడని చెప్పడానికి ఏ ఆధారం లేదు. పైగా ఆయన రిపబ్లిక్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ఇస్తున్నట్టు మిల్లర్ ఆన్‌లైన్ హిస్టరీ చెబుతోంది. పోస్ట్ చేసిన కంటెంట్ అతనో మితవాద కార్యకర్తని రుజువు చేస్తోంది. జూలైలో జరిగిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో పలువురు రిపబ్లికన్లు, కన్జర్వేటివ్ కామెంటేటర్లతో కలిసి దిగిన ఫొటోలను మిల్లర్ పోస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా ట్రంప్ అనుకూల ర్యాలీ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొంటున్న ఆయన డెమొక్రాట్లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. కోవిడ్, వ్యాక్సిన్లు, 9/11, వాతావరణం గురించి మిల్లర్ అనేక రకాల కుట్ర సిద్ధాంతాలను పోస్ట్ చేశారు.

సహాయక చర్యలపై తప్పుడు ప్రచారం

ట్రంప్‌పై మండిపడ్డ కమలాహారిస్

వాషింగ్టన్: మిల్టన్, హెలెన్ హరికేన్ల సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై ట్రంప్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కమలా హారిస్ మండిపడ్డారు. నార్త్ కరోలినాలో వారం రోజుల పర్యటనలో భాగంగా రెండోరోజైన ఆదివారం ఆమె.. పలు చర్చిలకు వెళ్లి నల్లజాతీయులను కలిశారు. కోయినోనియా క్రిస్టియన్ సెంటర్‌లో ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు సహాయం చేస్తున్న వారు నిజమైన హీరోలని కొనియాడారు. కానీ ఒక కీలక వ్యక్తి సహాయం చేయకపోగా, సొంత ప్రయోజనాలకోసం తప్పుడు ప్రచారాలు వ్యాప్తి చేస్తున్నారని ట్రంప్‌ను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షోభ సమయంలో రాజకీయ నాయకులు చేయాల్సింది అది కాదని హితవు పలికారు. హెలెన్ తుఫాను అనంతరం ఫ్లోరిడాలో పర్యటించిన ట్రంప్.. రిపబ్లికన్ల సహాయాన్ని ప్రభుత్వం కావాలనే నిలిపేస్తోందని ఆరోపించారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉన్న వలసదారుల కోసం ఖర్చు చేయడంతో ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి ఇవ్వడానికి నిధులు లేకుండా పోయాయయని విమర్శించారు. ట్రంప్ వ్యాఖ్యలపై హారిస్ పైవిధంగా స్పందించారు. కమలా హారిస్ ప్రసంగానికి ముందు బైడెన్ గల్ఫ్ తీరంలోని టంపా, సెయింట్ పీట్ బీచ్ మధ్య హెలికాప్టర్‌లో హరికేన్ నష్టాన్ని సర్వే చేశారు. మిల్టన్ ఊహించినంత నష్టం చేయలేదని, చాలామంది సర్వం కోల్పోయారని, వారిని



ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విపత్తు సమయంలో సహాయక చర్యల్లో పాల్గొన్న ఫస్ట్ రెస్పాండర్లను బైడెన్ ప్రశంసించారు. ఇలాంటి సమయాల్లో డెమొక్రాట్లు, రిపబ్లికన్లుగా కాకుండా అమెరికన్లుగా పరస్పరం సహాయం చేసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులకోసం నిధులను మంజూరు చేశారు. పోలింగ్‌కు ఇంకా మూడు వారాల సమయమే ఉన్న నేపథ్యంలో వరుస తుఫానులు ఎన్నికలకు మరో కోణాన్ని జోడించాయి.

భర్త, అత్తమామ, ఆడపడుచుల దిష్టిబొమ్మలు దహనం

సాక్షి, నేషనల్ డెస్క్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి రోజు రావణుడిని దిష్టిబొమ్మను దహనం చేస్తారు. కానీ.. ఉత్తరప్రదేశ్‌లోని ఓ మహిళ మాత్రం దహనం చేయడానికి అత్తింటివారిని ఎంచుకున్నారు. దసరా రోజున భర్త, అత్తామామలు, ఆడపడుచు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. హమీర్‌పూర్ జిల్లా ముస్కారాకు చెందిన ప్రియాంకకు సంజీవ్ దీక్షిత్‌తో 14 ఏళ్ల కిందట పెళ్లయ్యింది. అతను పెళ్లికి ముందే తన సోదరి స్నేహితురాలిని ప్రేమించాడు. పెళ్లి తరువాత ప్రియాంకను వదిలి ఆమెతోనే కలిసి జీవిస్తున్నాడు. భర్త మోసాన్ని తట్టుకోలేక ప్రియాంక నిరసన తెలిపారు. అయినా లాభం లేకపోయింది. అత్త, మామ, ఆడపడుచులు.. ఎవ్వరూ ఆమెకు సాయం చేయలేదు. 14 ఏళ్లుగా అత్తింటివారితో పోరాటం చేస్తూ అలసిపోయిన ప్రియాంక.. శనివారం విజయదశమి సందర్భంగా దిష్టిబొమ్మలు దహనం చేశారు. పెళ్లై 14 ఏళ్లు గడుస్తున్నా ఇంకా తన ప్రవాసం ముగియలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 'బేటీ బచావో, బేటీ పడావో'అంటూ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, తాను చదువుకున్నా.. ఇప్పటికీ న్యాయం పొందలేకపోతున్నానని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తెలిపారు. తన భర్త, అత్తమామలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రియాంక డిమాండ్ చేశారు.

ఖాళీలు వెయ్యి.. దరఖాస్తులు 40 వేలు!

- ఆస్ట్రేలియా వర్కింగ్ హాలిడే మేకర్ వీసాకు భారతీయుల పోటీ

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇటీవల నూతనంగా ప్రకటించిన 'వర్కింగ్ హాలిడే మేకర్ వీసా ప్రోగ్రాం'కు భారతీయ విద్యార్థులు పోటెత్తారు. కేవలం వెయ్యి వీసా ఖాళీలకు గాను రెండు వారాల వ్యవధిలోనే ఏకంగా 40 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆస్ట్రేలియా ఇమిగ్రేషన్ సహాయ మంత్రి మ్యాట్ థిసిల్‌థ్వైట్ సోమవారం ఈ విషయం తెలిపారు. ఆస్ట్రేలియా సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చుకునేందుకు, వివిధ రంగాల్లో పనిచేసిన అనుభవం సంపాదించుకునేందుకు ఇదో మంచి అవకాశమని మంత్రి మ్యాట్ చెప్పారు. 'ఈ వీసాకు 18–30 ఏళ్ల మధ్య భారతీయులు అర్హులు. ఎంపికైతే ఏడాదిపాటు ఆస్ట్రేలియాలో ఉండొచ్చు, చదువుకోవచ్చు, ఏదైనా ఉద్యోగం చేసుకోవచ్చు. ఎలాంటి పరిమితులు లేవు. అక్టోబర్ ఒకటిన మొదలైన దరఖాస్తు స్వీకరణ నెలాఖరుతో ముగుస్తుంది. అభ్యర్థులను ర్యాండమ్‌గా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు వచ్చే ఏడాది జనవరి నుంచి ఆస్ట్రేలియాలో ఉండొచ్చు'అని తెలిపారు.

తైవాన్‌ను దిగ్బంధించిన డ్రాగన్

యుద్ధ నౌకలు, విమానాలతో భారీ సైనిక విన్యాసాలు

చైనాలో అంతర్భాగమని అంగీకరించాలని హెచ్చరికలు

తైపీ: డ్రాగన్ దేశం చైనా సోమవారం తైవాన్ జలసంధిలో భారీ సైనిక విన్యాసాలకు తెరతీసింది. విమాన వాహక నౌక, యుద్ధ నౌకలు, అత్యాధునిక యుద్ధ విమానాలతో తైవాన్‌ను, చుట్టుపక్కల దీవులను చుట్టుముట్టింది. కమ్యూనిస్ట్ చైనాలో అంతర్భాగమని అంగీకరించబోమంటూ తైవాన్ అధ్యక్షుడు లాయ్ చింగ్–తె ఇటీవల చేసిన ప్రకటనకు సమాధానంగానే విన్యాసాలు చేపట్టినట్లు చైనా ప్రకటించింది. నాలుగు రోజుల క్రితం జరిగిన జాతీయ ఉత్సవాల్లో అధ్యక్షుడు లాయ్ చింగ్–తె మాట్లాడుతూ.. తైవాన్ తమదేనంటూ చైనా చేస్తున్న వాదనను ఖండించారు. చైనా బెదిరింపులను, దురాక్రమణను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ వ్యవహారం నచ్చని చైనా తాజాగా భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. విమాన వాహక నౌక లియోనింగ్ నుంచి జె–15 యుద్ధ విమానం టేకాఫ్ తీసుకుంటున్న వీడియోను అధికార టీవీ ప్రసారం చేసింది. అయితే, విన్యాసాలు ఎన్ని రోజులు కొనసాగుతాయనే విషయం తెలపలేదు. నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, మిస్సైల్ బలగాలు కలిసికట్టుగా ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ) ఈస్టర్న్ థియేటర్ కమాండ్ ప్రకటించింది. తైవాన్ స్వాతంత్ర్యానికి మద్దతిచ్చే వారికి ఇదో హెచ్చరికని పేర్కొంది. దీనిపై తైవాన్ స్పందించింది. గుర్తించిన ప్రాంతాల్లో యుద్ధ నౌకలను, మొబైల్ మిస్సైళ్లను మోహరించామని, రాడార్లతో గట్టి నిఘా ఉంచామని తైవాన్ రక్షణ శాఖ తెలిపింది. 25 వరకు చైనా యుద్ధ విమానాలు, ఏడు యుద్ధ నౌకలను, మరో నాలుగు చైనా ప్రభుత్వ నౌకలను రాడార్లు గుర్తించాయని తైవాన్ పేర్కొంది. ఒక్కరోజులోనే రికార్డు స్థాయిలో చైనా 125 సైనిక విమానాలను విన్యాసాలకు పంపిందని తైవాన్ తెలిపింది. వీటిలో 90 వరకు విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు తమ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్‌లోనే కనిపించాయంది. చైనా మేలోనూ ఇదే రకంగా మిలటరీ విన్యాసాలను చేపట్టింది. 2022లో అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ సారథ్యంలోని బృందం తైవాన్ సందర్శన సమయంలో కూడా చైనా భారీ సైనిక విన్యాసాలతో తైవాన్‌ను దిగ్బంధంలో ఉంచింది.

ఇలా ఉండగా, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత చైనాలో విలీనం కాకముందు తైవాన్ జపాన్ వలసప్రాంతంగా ఉండేది. చైనా ప్రధాన భూభాగంపై మావో జెడాంగ్ నేతృత్వంలో కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పటయ్యాక 1949లో చియాంగ్ కై షేక్ నాయకత్వంలోని నేషనలిస్ట్ పార్టీ తైవాన్‌లో స్వతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ఓవర్ టేక్ చేశాడని కొట్టి చంపారు..!

ముంబై: ఓ కారును ఆటో రిక్షా దాటేసి వెళ్లింది. ఈ సందర్భంగా ఆటో, కారు యజమాని మధ్య మొదలైన గొడవ ఒకరి మృతికి దారితీసింది. ముంబైలోని మలాడ్‌లో శనివారం ఈ ఘటన జరిగింది. ఆకాశ్ అనే వ్యక్తి దసరా నాడు శనివారం కొత్త కారు కొన్నారు. తల్లిదండ్రులతో కలిసి కారులో వెళ్తుండగా మలాడ్ రైల్వే స్టేషన్ వద్ద ఓ ఆటో ఓవర్ టేక్ చేసి వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్‌తో ఆకాశ్ వాదులాటకు దిగాడు. మాటామాటా పెరిగింది. తనతోపాటు ఉన్న వారితో కలిసి ఆటో డ్రైవర్ ఆకాశ్‌పై దాడికి దిగాడు. ఆకాశ్ తీవ్ర గాయాలతో చనిపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. ఆటోవాలా సంబంధీకులు ఆకాశ్‌ను కొడుతుండగా వద్దంటూ అతడి తల్లిదండ్రులు అడ్డుపడి, మొరపెట్టు కుంటున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో డ్రైవర్, మరో ముగ్గురిపై హత్య కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.


గురుడి ఉపగ్రహం యూరోపాలో జీవం మనుగడకు అనువైన పరిస్థితులు ఉన్నాయేమోనని అన్వేషించడానికి నాసా ప్రయోగించిన క్లిప్పర్ అంతరిక్ష నౌక సోమవారం నింగిలోకి దూసుకెళ్లింది. ఐదున్నర సంవత్సరాలు ప్రయాణించి గురుగ్రహానికి సమీపానికి వెళుతుంది. యూరోపా ఉపరితలం గడ్డకట్టిన మంచుతో కప్పబడి ఉండగా.. దాని కింద మహాసముద్రం ఉందని భావిస్తున్నారు.

ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా భీకర దాడి

నలుగురు సైనికులు మృతి

- మరో 61 మందికి గాయాలు..
- ఏడుగురి పరిస్థితి విషమం

డెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్‌లోని ఆర్మీ బేస్‌పై ఆదివారం హెజ్‌బొల్లా చేపట్టిన భీకర దాడిలో నలుగురు సైనికులు చనిపోగా మరో 61 మంది గాయపడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. రెండు వారాల క్రితం లెబనాన్‌లో తాము భూతల దాడులు మొదలు పెట్టాక హెజ్‌బొల్లా జరిపిన అతిపెద్ద దాడిగా ఇజ్రాయెల్ పేర్కొంది. గురువారం బీరుట్‌పై చేపట్టిన వైమానిక దాడులకు ప్రతీకారంగానే ఆదివారం బిన్యామియా నగరంపై డ్రోన్‌లతో దాడి చేశామని హెజ్‌బొల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్ ప్రత్యేక బలగాలైన 'గొలాన్ బ్రిగేడ్'లక్ష్యంగా ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు డజన్ల కొద్దీ మిస్సైళ్లను, అదే సమయంలో పదుల సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించామని పేర్కొంది. ఇజ్రాయెల్ వద్ద అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలున్నప్పటికీ క్షిపణులు, డ్రోన్ల దాడిలో ఇంత భారీ స్థాయిలో నష్టం వాటిల్లడం చాలా అరుదైన విషయమని చెబుతున్నారు.

స్కూలుపై దాడి..20 మంది మృతి

గాజాలోని నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని స్కూలుపై ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన వైమానిక దాడిలో పలువురు చిన్నారులు సహా 20 మంది చనిపోయారు. సోమవారం ఉదయం డెయిర్ అల్–బలాహ్‌లోని అల్ అక్సా మార్టిర్స్ ఆస్పత్రి వెలుపల జరిగిన మరో దాడిలో ముగ్గురు చనిపోయారు. దాడులతో టెంట్లతో మంటలు చెలరేగి, 50 మందికి కాలిన గాయాలయ్యాయి.

లెబనాన్‌లో 21 మంది మృత్యువాత

లెబనాన్‌లో ఉత్తర ప్రాంత అయిటో నగరంలోని ఓ చిన్న అపార్టుమెంట్ భవనంపై జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడిలో 21 మంది చనిపోయారని రెడ్ క్రాస్ తెలిపింది. హెజ్‌బొల్లా బలంగా ఉన్న దక్షిణ లెబనాన్, బీరుట్ ఉత్తర శివారు ప్రాంతాలపైనే ప్రధానంగా దాడులు జరుపుతున్న ఇజ్రాయెల్ ఆర్మీ ఉత్తర భాగంపై దాడికి దిగడం ఇదే మొదటిసారి.

'ఐరాస దళాల మాటున హెజ్‌బొల్లా'

లెబనాన్‌లోని శాంతి పరిరక్షక దళాలు హెజ్‌బొల్లా మిలిటెంట్లకు మానవ రక్షణ కవచాలుగా ఉపయోగపడుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ఐరాస దళాల ముసుగులో హెజ్‌బొల్లా మిలిటెంట్ల కార్యకలాపాలు దక్షిణ లెబనాన్ ప్రాంతంలో చురుగ్గా కార్యకలాపాలు సాగిస్తున్నాయని విమర్శించారు. తమ బలగాలు హెచ్చరికలను పాటించి, ఆ ప్రాంతం నుంచి వెంటనే ఐరాస బలగాలు వైదొలగాలన్నారు.

ఉత్తర గాజాను ఖాళీ చేయించేందుకు ప్రయత్నం

ఉత్తర గాజా ప్రాంతంలో ఉన్న సుమారు 4 లక్షల మందిని అక్కడి నుంచి ఖాళీ చేసి దక్షిణం వైపు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. వీరిని ఎలాగైనా ఖాళీ చేయాలనే లక్ష్యంతోనే ఈ నెల ఒకటోతేదీ నుంచి ఈ ప్రాంతానికి ఆహార సరఫరాను సైతం నిలిపివేసింది. వెళ్లకుండా అక్కడే ఉండే వారిని మిలిటెంట్లుగా గుర్తించేందుకు ఉద్దేశించిన ప్రణాళికను మాజీ సైనిక జనరళ్లు ప్రభుత్వానికి అప్పగించినట్లు సమాచారం.

సరిహద్దు రహదారులను ధ్వంసం చేస్తున్న ఉత్తరకొరియా

సియోల్: దక్షిణ కొరియాతో ఉన్న సరిహద్దు రహదారులను పేల్చివేయడానికి ఉత్తర కొరియా సిద్ధమవుతోంది. ఉత్తర కొరియాలో రోడ్ల విధ్వంసం కోసం వివిధ కార్యకలాపాలను గమనిస్తున్నామని దక్షిణ కొరియా సైన్యం సోమవారం తెలిపింది. రోడ్లపై స్క్రీన్లు ఏర్పాటు చేసి, ఆ తెరల వెనుక పనిచేస్తూ రోడ్లను పేల్చివేసేందుకు సిద్ధమవుతున్నారని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ప్రతినిధి లీ సంగ్ జూన్ తెలిపారు.

విపత్తు తప్పదు: ఉత్తరకొరియా: ప్యాంగ్యాంగ్‌పైకి దక్షిణ కొరియా డ్రోన్లను పంపిందని ఉత్తరకొరియా ఆరోపించింది. ఈ నెల ప్రారంభంలో మూడు రోజుల్లో ప్యాంగ్యాంగ్ మీదుగా డ్రోన్లను గుర్తించామని ఉత్తర కొరియా రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. వాటిని ప్రయోగించడానికి ప్రత్యేక లాంచర్ లేదా రన్‌వే అవసరమని, సామాన్యులు ప్రయోగించడం అసాధ్యమని తేల్చి చెప్పింది. దక్షిణ కొరియా డ్రోన్లు మళ్లీ ప్యాంగ్యాంగ్ మీదుగా ఎగురుతున్నట్లు తేలితే భయంకరమైన విపత్తు తప్పదని ఉత్తరకొరియా హెచ్చరించింది.

ప్యాంగ్యాంగ్ రెచ్చగొడుతోంది: దక్షిణ కొరియా

'ప్యాంగ్యాంగ్‌పైకి డ్రోన్లను పంపింది సైన్యమా, పౌరులా'అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి దక్షిణ కొరియా ప్రతినిధి లీ నిరాకరించారు. తమ పౌరుల భద్రతకు ముప్పు కలిగిస్తే ఉత్తర కొరియాను శిక్షిస్తామని హెచ్చరించారు.


బహమనీ రాజ్యస్థాపనకు సహాయం చేసిందెవరు?

పద్మనాయక వంశానికి మూలపురుషుడైన భేతాళనాయకుడికి నలుగురు కుమారులు. వారిలో దామానాయుడు, ప్రసాదిత్యనాయుడు తండ్రి రాజ్యాన్ని పాలిస్తూ, రుద్రమదేవి సేనానులుగా కాకతీయ రాజ్యంలో ప్రముఖ స్థానం పొందారు. రుద్రమదేవి అధికారంలోకి రాగానే బంధువర్గం తిరుగుబాటు చేసింది. మరోవైపు యాదవరాజులు ఓరుగల్లుపై దండెత్తారు. ప్రసాదిత్యానాయుడు ఈ చిక్కులను తొలగించి ఆమె అధికారాన్ని నిలబెట్టడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. కాకతీయ రాజ్యస్థాపనాచార్య, రాయపితామహాంక అనే ఇతడి బిరుదులు ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. కాకతీయ సామ్రాజ్య పరిరక్షణలో భాగంగా నాయంకర వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత ఇతడిదేనని వెలుగోటి వంశావళిని బట్టి తెలుస్తోంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర



కాకతీయానంతర యుగం

కాకతీయుల అనంతరం ఓరుగల్లు ఢిల్లీ సామ్రాజ్యంలో భాగమైంది. అదే సమయంలో మధుర కూడా ఢిల్లీ సుల్తానుల వశమైంది. ఆంధ్రనగరిగా పేరొందిన ఓరుగల్లు సుల్తాన్‌పూర్‌గా మారింది. జలాలుద్దీన్ హసన్‌షా మధురకు రాజుకాగా, ఓరుగల్లు ప్రాంతం దేవగిరి వజీరయిన మాలిక్ బుర్హన్ ఉద్దీన్ పాలనలోకి వచ్చింది. ఇతడికి సహాయంగా ఓరుగల్లులో మాలిక్ మక్బూల్ వజీర్ అయ్యాడు. ప్రతాపరుద్రుడి సేనానిగా పనిచేసిన నాగయ గన్నయ మతం మార్చుకొని మాలిక్ మక్బూల్ అయ్యాడు. ఢిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్ తుగ్లక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఇందులో భాగంగా ఆంధ్రదేశంలోనూ స్వతంత్ర రాజ్య స్థాపన కోసం తిరుగుబాట్లు జరిగాయి.

ప్రతాపరుద్రుడి మరో సేనాని రేచర్ల సింగమ నాయకుడు స్వతంత్రించి దక్షిణ తెలంగాణలో పద్మనాయక రాజ్యాన్ని స్థాపించాడు. ప్రోలయ ఉత్తర తెలంగాణ, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి ముస్లింలను పారదోలి రేకపల్లి రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. దక్షిణ తీరాంధ్రలో 1325 నాటికే ప్రోలయ వేమారెడ్డి స్వతంత్రించాడు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో అరవీటి వంశానికి చెందిన సోమదేవరాజు స్వతంత్రించాడు. అనంతరం కంపిలిలో హరిహరరాయలు, బుక్కరాయలు స్వతంత్రరాజ్యాన్ని స్థాపించారు. నుస్రత్‌ఖాన్ బీదర్ సమీపంలో స్వతంత్ర రాజ్యస్థాపనకు యత్నించి విఫలమయ్యాడు. ఈ విధంగా కాకతీయ సామ్రాజ్య శిథిలాల నుంచి కంపిలి (విజయనగర), రెడ్డి, వెలమ, నాయక అనే నాలుగు స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి. ఈ రాజ్యాల స్థాపనతో ఆంధ్ర దేశంలో ముస్లింల అధికారం అంతమైంది. వీటిలో తెలంగాణతో సంబంధమున్న రాజ్యాల గురించి తెలుసుకుందాం.

ముసునూరి నాయకులు

ముసునూరు గ్రామం కృష్ణాజిల్లా ఉయ్యూరు తాలూకాలో ఉంది. నెల్లూరు జిల్లాలోనూ ఈ పేరుతో ఓ గ్రామం ఉంది. కానీ కృష్ణా జిల్లాలోని ముసునూరులో కోటశిథిలాలు ఉండటాన్ని బట్టి వీరి జన్మస్థలం ఇదే కావచ్చు. కమ్మ సామాజిక వర్గంలో ముసునూరి వారు ఉండటాన్ని బట్టి ముసునూరు నాయకులు కమ్మ కులస్థులు లేదా వారి పూర్వీకులై ఉంటారు. కాకతీయుల పతనానంతరం ముస్లింల వశమైన ఆంధ్రదేశంలో అసంతృప్తి చెలరేగింది. దీన్ని అవకాశంగా తీసుకొని ఈ వంశానికి చెందిన ప్రోలయ నాయకుడు భద్రాచలం ప్రాంతంలోని రేకపల్లి కేంద్రంగా ముస్లింలతో పోరాడాడు. ప్రోలయ నాయకుడికి అతడి పినతండ్రి కుమారుడైన కాపయనాయకుడు, వేంగి పాలకుడైన వేంగభూపాలుడు, రుద్రదేవుడు, అన్నమంత్రి సహకరించారు. ప్రోలయ ముస్లింలను పారదోలి రేకపల్లి రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు.

ప్రోలయకు సంతానం లేనందువల్ల అతడి మరణం తర్వాత కాపయనాయకుడు రాజయ్యాడు. సింగమనీడు, వేమారెడ్డిల సహకారంతో ముస్లింలపై పోరాటం కొనసాగించి 1336లో ఓరుగల్లు కోటను ఆక్రమించాడు. మాలిక్ మక్బూల్ పారిపోయాడు. ఓరుగల్లు రాజధానిగా ఉత్తర తెలంగాణను, కృష్ణానది నుంచి గోదావరి వరకు ఉన్న తీరాంధ్రను పాలించాడు. విస్తరణ కాంక్షతో రేచర్ల సింగమనేని రాజ్య భాగాలైన పిల్లలమర్రి, ఆమనగల్లు, వాడపల్లి ప్రాంతాలను ఆక్రమించి వాటి పాలకుడిగా ఎరబోతు లెంకను నియమించాడు. తీరాంధ్రను పాలించేందుకు ప్రతినిధులను నియమించాడు. కోడుకొండ్ల ప్రాంతంలో తన ప్రతినిధిగా కూన నాయకుడిని నియమించాడు. సబ్బినాడు (కరీంనగర్)కు ముప్పభూపాలుడిని రాజప్రతినిధిగా నియమించాడు. ఇతడు మడికి సింగనకు ఆశ్రయం కల్పించాడు. కాపయ నాయకుడు తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకుంటున్న సమయంలో హసన్ గంగూ(జాఫర్ ఖాన్) మహ్మద్‌బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేశాడు. అలాఉద్దీన్ బహమన్ షా అనే బిరుదుతో 1341లో గుల్బర్గా రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఈ తిరుగుబాటు సమయంలో కాపయ నాయకుడు హసన్ గంగూకు సహాయం చేశాడు. కానీ హసన్ గంగూ కొంత కాలం తర్వాత ఓరుగల్లు మీద దాడి చేశాడు. కాపయ కౌలాస్ (నిజామాబాద్) దుర్గాన్ని వదులుకున్నాడు. హసన్ గంగూ 1356-57లో మరోసారి దండెత్తాడు. కాపయ ఈసారి భువనగిరి దుర్గాన్ని కోల్పోయాడు. నాటి నుంచి కొంత కాలం బహమనీ సుల్తాన్లకు భువనగిరి తూర్పు సరిహద్దుగా మారింది. విజయనగర బుక్కరాయల సాయంతో కాపయ నాయకుడు బహమనీ సుల్తాన్‌ను అరికట్టడానికి ప్రయత్నించాడు. కానీ ఆ ప్రయత్నం సఫలం కాకపోగా కుమారుడైన వినాయక దేవుణ్ణి కోల్పోయాడు. కాపయ నాయకుడి చర్యకు ఆగ్రహించిన బహమనీ సుల్తాన్ హుమాయున్ గోల్కొండ పైకి తన సేనానిని, ఓరుగల్లుపై సఫదర్ ఖాన్‌ను దండయాత్రకు పంపాడు. కాపయ ఈసారి గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాల్ని కోల్పోయాడు. 1364-65లో బహమనీ సుల్తాన్‌తో సంధి చేసుకొని పై ప్రాంతంతో పాటు 300 ఏనుగులను, 2000 గుర్రాలను, 3 లక్షల రూపాయలను యుద్ధ నష్టపరిహారంగా చెల్లించాడు.

కాపయ నాయకుడి వరుస పరాజయాలను అదనుగా తీసుకొని తీరాంధ్ర పాలకులు స్వతంత్రం ప్రకటించుకున్నారు. ఉత్తర తీరాంధ్ర రెడ్ల ఆధీనంలోకి వెళ్లింది. తీరాంధ్ర చేజారే సమయంలోనే దక్షిణ తెలంగాణలో ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాలను పాలిస్తున్న రేచర్ల సింగమనాయకుడు విజృంభించి కృష్ణా నదివరకు రాజ్యాన్ని విస్తరింపజేశాడు. తుంగభద్ర, అంతర్వేది ప్రాంతాలను కూడా అతడు ఆక్రమించాడు. దీనికి ఆగ్రహించిన కాపయ నాయకుడు సింగమనాయకుడిని హతమార్చాడు.

సింగమనాయకుని తర్వాత రాజైన అనపోతా నాయకుడు తన తండ్రి మరణానికి కారణమైన కాపయ మీద ప్రతీకారం తీర్చుకోవడానికి ఓరుగల్లు మీద దండయాత్ర చేశాడు. 1366 (1367-68 అని మల్లంపల్లి సోమశేఖర శర్మ అభిప్రాయం)లో కాపయను సంహరించి ఓరుగల్లు, భువనగిరి తదితర దుర్గాలను స్వాధీనం చేసుకున్నాడు. ఇంతటితో ముసూనూరి వంశం అంతరించింది. ఈ చరిత్రను బట్టి 30 ఏళ్లపాటు ఉత్తర తెలంగాణ ప్రాంతాలు ముసునూరి వంశ పాలనలో ఉన్నాయని తెలుస్తోంది.

పద్మనాయకులు (1326-1482)

పద్మనాయక వంశానికి మూలం రేచర్ల రెడ్లు. రేచర్ల నామిరెడ్డి మేనల్లుడైన చెవ్విరెడ్డి (భేతాళరెడ్డి /భేతాళనాయకుడు) పద్మనాయక వంశానికి మూల పురుషుడు. బేతిరెడ్డి, చెవ్విరెడ్డి మొదలైన పేర్లు వీరిని రెడ్డి తెగకు చెందినవారని సూచిస్తుండగా, సేనా నాయకత్వాన్ని సూచించే నాయుడు బిరుదును కూడా పద్మనాయకులు ధరించడాన్ని బట్టి వీరు రెడ్లు కాకపోవచ్చని భావించారు. కానీ వీరికి రెడ్లతో దగ్గర సంబంధం ఉందని చరిత్రకారుల అభిప్రాయం. సురవరం ప్రతాపరెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చెవ్విరెడ్డి వంశీయులే వైష్ణవమతాన్ని స్వీకరించి సంస్కరణ మార్గంలో పయనించి వెలమలై రేచర్ల పద్మనాయకులయ్యారు. పిఠాపురం, బొబ్బిలి, జటప్రోలు, వెంకటగిరి సంస్థానాధిపతులు ఈ తెగకు చెందిన వారే. కాకతీయుల సామంత మాండలికుల్లో రేచర్ల పద్మనాయకులు చివరి వరకూ అత్యంత విశ్వాస పాత్రులుగా ఉన్నారు. వీరు నల్లగొండ జిల్లాలోని పిల్లలమర్రి, నాగులపాడు ప్రాంతాలను మహాసామంతులుగా పాలించారు.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం రేచర్ల పద్మనాయకులు ఢిల్లీ సుల్తాన్లను,బహమనీ సుల్తాన్లను అరికట్టి తెలంగాణను పాలించారు. వీరు తెలంగాణేతర ప్రాంతాలను జయించినా.. కొంత కాలం తర్వాత వాటిని కోల్పోయేవారు. అదే విధంగా ఇతరులు తెలంగాణ ప్రాంతాలను ఆక్రమించినా వీరు తిరిగి పొందగలిగేవారు. మిర్యాలగూడ తాలూకాలోని ఆమనగల్లు వీరి జన్మస్థలం. వీరికి ముందు ఆమనగల్లు రాజధానిగా రేచర్ల రెడ్లు, కందూరి చోడులు పరిపాలించారు. పద్మనాయక వంశానికి మూలపురుషుడైన భేతాళనాయకుడిని గణపతి దేవుడు ఆమనగంటి పాలకుడిగా నియమించాడు.

మాదిరి ప్రశ్నలు

1. కాకతీయుల కాలంలో ప్రసిద్ధ 'కంచుగంట' తయారీ కేంద్రాలు?
   1) పానగల్లు, భువనగిరి
   2) పానగల్లు, చండూరు
   3) చండూరు, నిర్మల్
   4) చండూరు, భువనగిరి
2. కాకతీయుల కాలంలో కత్తుల తయారీకి పేరొందిన ప్రాంతం?
   1) నిర్మల్ 2) చండూరు
   3) పానగల్లు 4) బోధన్
3. తెలుగులో తొలి స్వతంత్ర కవిగా, ఆదికవిగా పేరొందింది ఎవరు?
   1) నరహరి 2) పాల్కురికి సోమనాథుడు
   3) జీనవల్లభుడు 4) రుద్రదేవుడు
4. దేశీయతకు (భాషలో, ఛందస్సులో, వస్తువులో) స్వతంత్ర ప్రతిపత్తి కల్పించిన కవి?
   1) వేములవాడ భీమకవి
   2) పాల్కురికి సోమనాథుడు
   3) నన్నయ 4) ఎర్రన
5. కాకతీయులు ఎవరి కాలం నుంచి శైవమతాన్ని అవలంబించారని చరిత్రకారుల అభిప్రాయం?
   1) మొదటి ప్రోలరాజు 2) రెండో ప్రోలరాజు
   3) రెండో బేతరాజు 4) రుద్రదేవుడు
6. కాకతీయుల కాలంలో 'కాలముఖశైవ' కేంద్రంగా ప్రసిద్ధి చెందింది?
   1) జోగిపేట 2) అలంపురం
   3) హనుమకొండ 4) ఇంద్రపురి
7. కాకతీయుల కాలంలో ప్రసిద్ధ వైష్ణవ కేంద్రం?
   1) జోగిపేట 2) ఇంద్రపురి
   3) ధర్మపురి 4) అలంపురం
8. కిందివాటిలో వైష్ణవ మతానికి సంబంధించిన రచన?
   1) పండితారాధ్య చరిత్ర 2) బసవ పురాణం
   3) జినేంద్రకల్యాణాభ్యుదయం
   4) రంగనాథ రామాయణం
9. తొలిసారిగా తెలుగులో శాసనాలు వేయించిన కాకతీయ రాజెవరు?
   1) మొదటి ప్రోలరాజు 2) రెండో ప్రోలరాజు
   3) మొదటి బేతరాజు 4) రెండో బేతరాజు
10. నీతిసారం గ్రంథ రచయిత?
   1) జాయపసేనాని 2) రుద్రదేవుడు
   3) ప్రతాపరుద్రుడు 4) నరహరి కవి
11. మమ్మటుడి 'కావ్య ప్రకాశాని'కి వ్యాఖ్యానం ఏది?
   1) చిత్తానురంజనం 2) స్మృతిదర్పణం
   3) తర్కరత్నాకరం 4) నీతిసారం
12. కావ్యప్రకాశానికి వ్యాఖ్యానం రాసింది ఎవరు?
   1) బ్రహ్మశివకవి 2) మయూరకవి
   3) జాయపసేనాని 4) నరహరి
13. నరహరి కవి ఏ ప్రాంతానికి చెందినవారు?
   1) భువనగిరి 2) కొలనుపాక
   3) హనుమకొండ 4) పానగల్లు
14. స్మృతిదర్పణం, తర్కరత్నాకరం గ్రంథాలను రాసిందెవరు?
   1) జాయపసేనాని 2) నరహరి కవి
   3) మయూరకవి 4) నాగదేవకవి
15. 'నృత్తరత్నావళి' గ్రంథ రచయిత?
   1) పాల్కురికి సోమన
   2) నరహరి కవి 3) జాయపసేనాని
   4) చక్రపాణి రంగనాథుడు
16. శివశక్తి దీపిక, గిరిజాధినాయక శతకాలను రచించెవరు?
   1) జాయపసేనాని 2) పాల్కురికి సోమన
   3) చక్రపాణి రంగనాథుడు
   4) విశ్వేశ్వర దేశికుడు
17. గణపతిదేవుడి దీక్షాగురువు?
   1) కృష్ణమాచార్యులు 2) విశ్వేశ్వరదేశికుడు
   3) శరభాంకుడు 4) శివదేవయ్య
18. 'శివతత్త్వ రసాయనం' గ్రంథ రచయిత?
   1) శరభాంకుడు 2) శివదేవయ్య
   3) విశ్వేశ్వరదేశికుడు 4) కృష్ణమాచార్యులు
19. తెలంగాణకు చెందిన తొలి వైష్ణవ కవి?
   1) గంగాధర కవి 2) కృష్ణమాచార్యులు
   3) శివదేవయ్య 4) శరభాంకుడు
20. తెలుగులో తొలి వచనాలైన 'సింహగిరి వచనాల'ను రచించిందెవరు?
   1) కృష్ణమాచార్యులు 2) శివదేవయ్య
   3) శరభాంకుడు 4) గంగాధరకవి
21. 'రాజరుద్రీయం' గ్రంథ రచయిత?
   1) శివదేవయ్య 2) గంగాధర కవి
   3) కొలని రుద్రదేవుడు 4) శరభాంకుడు
22. కృష్ణమాచార్యులు ఏ ప్రాంత నివాసి?
   1) ఓరుగలు 2) జోగిపేట
   3) భువనగిరి 4) సంతవూరు
23. మహాభారతాన్ని నాటకరూపంలో రచించిన కవి?
   1) శేషాద్రి రమణ కవులు 2) గంగాధర కవి
   3) మంచన 4) శివదేవయ్య

సమాధానాలు

1) 2	2) 1	3) 2	4) 2	5) 3
6) 2	7) 3	8) 4	9) 4	10) 2
11) 1	12) 4	13) 1	14) 2	15) 3
16) 3	17) 2	18) 3	19) 2	20) 1
21) 3	22) 4	23) 2		

ఏ పాములు న్యూరో టాక్సిన్లను కలిగి ఉంటాయి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. వైద్యుడు ఒక వ్యక్తికి నిమ్మ, ఉసిరి, జామకాయలు తినాలని సలహా ఇచ్చాడు. ఆ వ్యక్తిలో ఏ వ్యాధి లక్షణాలను గుర్తించి ఉండవచ్చు?
   1) రికెట్స్ 2) రేచీకటి
   3) బెరి బెరి 4) స్కర్వీ
2. వ్యాధులకు సంబంధించి కింది వాటిలో ఏ రెండు సరైనవి?
   ఎ. బోదకాలు వ్యాధి ఉకరేరియా బ్రాంక్రాఫ్టి అనే క్రిమి వల్ల వస్తుంది
   బి. మలేరియా పరాన్న జీవికి ఒక అతిథేయి క్యూలెక్స్ దోమ
   సి. మెదడు వాపు వ్యాధి క్యూలెక్స్ దోమల వల్ల వ్యాప్తి చెందుతుంది
   డి. బోదకాలు వ్యాధి అనాఫిలస్ దోమ వల్ల కలుగుతుంది
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, డి 4) సి, డి
3. లైంగిక ద్విరూపకత అంటే?
   1) స్త్రీ, పురుష జీవులు ఒకే లక్షణాలను కలిగి ఉంటాయి
   2) స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలు ఒకే జీవిలో ఉంటాయి
   3) స్త్రీ, పురుష జీవులు బాహ్య లక్షణాల్లో వేర్వేరు లక్షణాలను కలిగి ఉంటాయి
   4) అంతర్గత వ్యవస్థలు వేరుగా ఉన్నా, బాహ్యంగా స్త్రీ, పురుష జీవులు ఒకే లక్షణాలతో ఉంటాయి
4. కిరణ జన్య సంయోగ క్రియ జరిగిందని తెలుసుకోవడానికి చేసే పరీక్ష ఏది?
   1) KOH పరీక్ష 2) గ్లిసరిన్ పరీక్ష
   3) అయోడిన్ పరీక్ష 4) లైట్ స్క్రీన్ పరీక్ష
5. పశువులు కలుషితమైన మేత తినడం వల్ల ప్రబలే వ్యాధి ఏది?
   1) ఆటలమ్మ 2) గంబోరో వ్యాధి
   3) మేడ్-కౌ వ్యాధి 4) రేబిస్ వ్యాధి
6. కలుపు మొక్కలను చేత్తో లాగే యడం, దున్నడం, కత్తిరించడం, కాల్చేయడం లాంటివి ఏ రకమైన పద్ధతి కిందకి వస్తాయి?
   1) రసాయన పద్ధతి 2) బ్రాడ్ కాస్టింగ్ పద్ధతి
   3) భౌతిక పద్ధతి
   4) జీవ క్రియా విధాన పద్ధతి
7. చర్మంలోని మెలనిన్ ఏ కిరణాల నుంచి రక్షణ ఇస్తుంది?
   1) అతినీల లోహిత కిరణాలు
   2) పరావర్తన కిరణాలు 3) ఎక్స్ కిరణాలు
   4) అన్ని రకాల కాంతి కిరణాలు
8. కనుపాప తారక చేసే క్రియను దేని క్రియతో పోల్చవచ్చు?
   1) కెమెరా కటకం 2) కెమెరా డయాఫ్రం
   3) కెమెరా ఫిల్మ్ 4) కెమెరా ఫ్లాష్
9. ఏ పాములు న్యూరో టాక్సిన్లను కలిగి ఉంటాయి?
   1) కట్ల పాము 2) రక్త పింజర
   3) పైథాన్ 4) బురద పాము
10. శ్లేష్మంలో కలిగే రసాయనాల వాసనను గ్రహించేవి?
   1) జిహ్వ గ్రాహకాలు
   2) ఘ్రాణ గ్రాహకాలు
   3) శ్రవణ గ్రాహకాలు
   4) స్పర్శ గ్రాహకాలు
11. నిల్వ చేసే ప్రక్రియలో 'క్యూరింగ్' అంటే?
   1) ఈస్ట్‌ను ఉపయోగించి ఆల్కహాల్‌ను తయారు చేయడం
   2) పాలను పెరుగుగా మార్చి నిల్వ చేయడం
   3) పాలను వేడి చేసి మీగడను వేరు చేయడం
   4) కాటేజ్ జున్నును కొన్ని పద్ధతుల ద్వారా మార్చడం
12. కిణ్వ ప్రక్రియ అనేది ఏ వాయువు లేనప్పుడు ఈస్ట్ కణాలు జరిపే ఒక రకమైన శ్వాసక్రియ?
   1) CO_2 2) H_2
   3) O_2 4) CO
13. ఏ దేశస్థులు జిగట విరేచనాలు, ఎల్లో జ్వరానికి ఎక్కువ ప్రతినిరోధకత కలిగి ఉంటారు?
   1) ఆఫ్రికన్లు 2) యూరోపియన్లు
   3) భారతీయులు 4) అమెరికన్లు
14. రిఫ్రిజరేటర్లలో ఆహార పదార్థాలను నిల్వ చేసే సరైన ఉష్ణోగ్రత?
   1) 5°C-15°C 2) 4°C-10°C
   3) 20°C-25°C 4) 0°C-10°C
15. నూనె గింజలనిచ్చే మొక్కలు, వాటి శాస్త్రీయ నామాలకు సంబంధించి కిందివాటిలో సరికాని జత ఏది?
   ఎ. సన్ ఫ్లవర్ - హీలియాంథస్ ఏన్యూనస్
   బి. ఆవాలు-సిసమమ్ ఇండికమ్
   సి. వేరుసెనగ - అరాఖిస్ హైపోజియా
   డి. పామ్ - ఇలుసిస్ గైనన్సిస్
   1) ఎ, సి 2) బి, సి
   3) బి, డి 4) ఎ, డి
16. మొక్క సాధారణ నామం, అందులో ఉండే ఔషధానికి సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
   ఎ. తులసి - కేంపర్
   బి. పెరూవియన్ - క్వినైన్
   సి. పాయిసన్ నట్ - మార్ఫిన్
   డి. డెడ్లీవైట్‌షేడ్ - బ్రూసిన్
   1) ఎ, బి 2) బి, సి
   3) సి, డి 4) ఎ, డి
17. శరీరంలో పాకకుండా, అపాయం చేయని వ్రణాలను ఏమంటారు?
   1) మాలిగ్నెంట్ గడ్డలు 2) బినైన్ గడ్డలు
   3) కార్సినోమా 4) సార్కోమా
18. ఆస్టియోసైట్ కణాలు ఏ కణజాలంలో ఉంటాయి?
   1) మృదులాస్థి 2) కండర
   3) అస్థి 4) సంయోజక
19. ప్రౌఢ మానవునిలో దంతాల సంఖ్యకు సంబంధించి సరైంది?
   1) 36 2) 38 3) 32 4) 34
20. చిన్న పిల్లల జఠర రసంలో మాత్రమే కనిపించే ఎంజైమ్?
   1) పెప్సిన్ 2) ట్రిప్సిన్
   3) ఎంటిరోకైనేజ్ 4) రెనిన్
21. నెమరువేసే జంతువుల్లో 'జాలకం' అనేది?
   1) జీర్ణాశయంలో మూడో గది
   2) జీర్ణాశయంలో రెండో గది
   3) జీర్ణాశయంలో మొదటి గది
   4) జీర్ణాశయంలో నాలుగో గది
22. కిందివాటిలో సరైన జత ఏది?
   ఎ. తుమ్మ - రెసిన్
   బి. సింకోనా - క్వినైన్
   సి. రబ్బరు చెట్టు - లేటెక్స్
   డి. వివృత బీజాలు - టానిన్
   1) ఎ, బి 2) బి, సి
   3) సి, డి 4) ఎ, డి
23. మూత్రపిండంలో నిమిషానికి ఏర్పడే మూత్ర పరిమాణం?
   1) 90 మి.లీ. 2) 75 మి.లీ.
   3) 100 మి.లీ. 4) 120 మి.లీ.
24. మంచినీటిలో ఎక్కువ భాగం వేటిలో/ఎక్కడ ఉంటుంది?
   1) నదులు 2) సముద్రాలు
   3) సరస్సులు
   4) ధ్రువ ప్రాంతాల్లో మంచు రూపంలో
25. శ్వాసక్రియలో అంత్య పదార్థాలుగా ఏర్పడేవి?
   1) O_2, CO_2 మిశ్రమం
   2) CO_2, N_2 3) CO_2, H_2O
   4) H_2O, O_2
26. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ అంటే?
   1) భూమిపై ఎక్కువ మొక్కలు ఉండటం
   2) వాతావరణంలోని CO_2 వల్ల భూమి ఉష్ణోగ్రత పెరగడం
   3) చెట్లతో కప్పిన ఇళ్లలో చల్లగా ఉండటం
   4) పర్యావరణంలో మార్పు కోసం ఆకు పచ్చని చెట్లు పెంచడం
27. మృత్తిక ఏర్పడే పద్ధతిని ఏమంటారు?
   1) ఫెదరింగ్ 2) వార్మింగ్
   3) విదరింగ్ 4) ఫిక్సింగ్
28. మానవునిలో కేంద్రకం లేని రక్త కణం?
   1) లింఫోసైట్ 2) బేసోఫిల్
   3) మోనోసైట్ 4) ఎరిత్రోసైట్
29. కిందివాటిలో ఏ విత్తనాల్లో అధిక శాతం ప్రోటీన్లు ఉంటాయి?
   1) వేరుసెనగ 2) పొద్దు తిరుగుడు
   3) సోయా చిక్కుడు 4) బఠాని
30. అప్పుడే జన్మించిన శిశువులో నిమిషానికి శ్వాసక్రియ రేటు?
   1) 32 సార్లు 2) 20 సార్లు
   3) 15 సార్లు 4) 22 సార్లు
31. కిరణజన్య సంయోగ క్రియను సూచించే సరైన రసాయన సమీకరణం?
   1) $12CO_2 + 12H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
   2) $6CO_2 + 6H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
   3) $6CO_2 + 12H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
   4) $12CO_2 + 6H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 9H_2O$
32. కాండం పెరుగుదల, ఫైటోహార్మోన్లకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   1) జిబ్బరిలిన్లు.. ఆక్సిన్ల సమక్షంలో ప్రోత్సహించవు
   2) ఆక్సిన్లు ప్రోత్సహిస్తాయి
   3) ఆబ్‌సిసిక్ ఆమ్లం ప్రోత్సహిస్తుంది
   4) ఇథైలీన్ ప్రోత్సహిస్తుంది
33. పరధీయ నాడీ వ్యవస్థలో 43 జతల నాడులుంటాయి. వీటిలో కపాల, వెన్ను నాడులకు సంబంధించి సరైంది ఏది?
   1) వెన్ను నాడులు 30 జతలు; కపాల నాడులు 13 జతలు
   2) కపాల నాడులు 12 జతలు; వెన్ను నాడులు 31 జతలు
   3) వెన్ను నాడులు 12 జతలు; కపాల నాడులు 31 జతలు
   4) కపాల నాడులు 9 జతలు; వెన్ను నాడులు 34 జతలు
34. శిశువు నీరసించి, శుష్కించి ఉంటాడు. కాళ్లు, చేతులు పుల్లల్లాగా మారతాయి. కడుపు ఉబ్బి ఉంటుంది. రోమాలు పెర గవు. అతిసార వ్యాధితో బాధపడతాడు. ఈ లక్షణాలు ఏ వ్యాధికి సంబంధించి నవి?
   1) క్యాషియోర్కర్ 2) స్కర్వీ
   3) మరాస్మస్ 4) రికెట్స్
35. స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో అండ కణం ఫలదీకరణం చెందే భాగం ఏది?
   1) గర్భాశయం 2) యోని
   3) ఫాలోపియన్ నాళం 4) స్త్రీ బీజకోశం
36. పారమీషియంలో శారీరక క్రియలను నియంత్రించేది ఏది?
   1) స్థూల కేంద్రకం 2) సూక్ష్మ కేంద్రకం
   3) ప్రవాస ప్రాక్కేంద్రకం
   4) స్థిర ప్రాక్కేంద్రకం
37. కప్ప 'స్పాన్'లలో ఉండే కణాలు ఏ రకమైనవి?
   1) శుక్ర కణాలు 2) అండ కణాలు
   3) శుక్ర మాతృ కణాలు
   4) అండ,శుక్ర కణాలు కలిసి ఉంటాయి
38. ల్యూటినైజింగ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే నిర్మాణం ఏది?
   1) పీయూష గ్రంథి మధ్య లంబిక
   2) కాలాంచిక
   3) పీయూష గ్రంథి పర లంబిక
   4) థైరాయిడ్ గ్రంథి
39. కిందివాటిలో అంకురచ్ఛదం ఉండని విత్తనం?
   1) ఆముదం 2) మొక్కజొన్న
   3) వరి 4) చిక్కుడు
40. హెచ్ఐవీ వైరస్ మానవునిలో ప్రవేశించే విధానాలకు సంబంధించి సరైంది ఏది?
   ఎ. వ్యాధిగ్రస్థుల దుస్తులు, ఆహారం పంచుకున్నప్పుడు వ్యాపిస్తుంది
   బి. వ్యాధిగ్రస్థులతో లైంగిక సంపర్కం వల్ల వ్యాప్తి చెందుతుంది
   సి. దగ్గుతున్న వ్యాధిగ్రస్థుడి తుంపరల ద్వారా వ్యాపిస్తుంది
   డి. వైరస్ సోకిన రక్తం ఎక్కించడం ద్వారా వ్యాపిస్తుంది
   1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) బి, డి
41. పరాగ రేణువు, స్త్రీ బీజ కణాల స్థితులు వరుసగా?
   1) ఏక స్థితిక, ద్వయ స్థితిక
   2) ఏక స్థితిక, ఏక స్థితిక
   3) ద్వయ స్థితిక, ఏక స్థితిక
   4) ద్వయ స్థితిక, ద్వయ స్థితిక
42. ముత్యం లభించే జీవులకు సంబంధించిన వర్గం ఏది?
   1) సీలెంటరేటా 2) ఎఖైనోడెర్మేటా
   3) మొలస్కా 4) అనెలిడా
43. తేనెపట్టులోని మైనాన్ని తిని పట్టులోని గదులను నాశనం చేసే కీటకం ఏది?
   1) వాక్స్ మాత్ 2) లక్క కీటకం
   3) నల్లి 4) ఈగ
44. బోంబెక్స్ మోరీ అనేది కిందివాటిలో ఏ జీవి శాస్త్రీయ నామం?
   1) లక్క కీటకం 2) పట్టు పురుగు
   3) తేనెటీగ 4) నల్లి
45. 'రాగులు' శాస్త్రీయ నామం ఏమిటి?
   1) ట్రిటికమ్ వల్గేర్ 2) జియా మేస్
   3) సోర్గం వల్గేర్ 4) ఎల్యూసిన్ కొరకానా
46. 'హెన్ని' అనేది ఏ రెండు జీవుల సంకరణ ఫలితం?
   1) మగ గాడిద, ఆడ గాడిద
   2) మగ గుర్రం, ఆడ గాడిద
   3) మగ గాడిద, ఆడ గుర్రం
   4) మగ గుర్రం, ఆడ గుర్రం
47. 'కేంపర్' ఏ మొక్క నుంచి లభిస్తుంది?
   1) నల్ల మందు మొక్క 2) నక్స్ వామిక్
   3) ఆసిమమ్ ఫాన్‌క్టమ్
   4) సింకోనా అఫిసినాలిస్
48. కుడి కర్ణికా-జఠరికా రంధ్రం వద్ద ఉండే కవాటం ఏది?
   1) అగ్ర ద్వయ కవాటం
   2) పుపుస కవాటం 3) మిట్రల్ కవాటం
   4) అగ్ర త్రయ కవాటం
49. కండరాల్లో జరిగే అవాయు శ్వాసక్రియ లో పైరువిక్ ఆమ్లం ఏవిధంగా మారుతుంది?
   1) గ్లూకోస్ 2) NADH
   3) లాక్టిక్ ఆమ్లం 4) ATP
50. కండర సంకోచాలకు సంబంధించిన నాడులు ఏవి?
   ఎ. జ్ఞాన నాడులు
   బి. అభివాహి నాడులు
   సి. చాలక నాడులు
   డి. అపవాహి నాడులు
   1) ఎ, బి 2) సి, డి
   3) బి, సి 4) ఎ, డి

సమాధానాలు

1) 4	2) 2	3) 3	4) 3	5) 3
6) 3	7) 1	8) 2	9) 1	10) 2
11) 4	12) 3	13) 1	14) 4	15) 3
16) 1	17) 2	18) 3	19) 3	20) 4
21) 2	22) 2	23) 4	24) 4	25) 3
26) 2	27) 3	28) 4	29) 3	30) 1
31) 3	32) 2	33) 2	34) 3	35) 3
36) 1	37) 2	38) 3	39) 4	40) 4
41) 2	42) 3	43) 1	44) 2	45) 4
46) 2	47) 3	48) 4	49) 3	50) 2

వాన చినుకులు గోళాకారంగా ఉండటానికి కారణం ?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జనరల్ సైన్స్

మాదిరి ప్రశ్నలు

1. చల్లని నీరు నింపిన గాజు గ్లాసు బయటి భాగం తడిగా ఎందుకు అవుతుంది?
   1) గాజు గ్లాసు ద్వారా నీరు విస్తాపన చెందడం
   2) వాతవరణంలో నీటి ఆవిరి గ్లాసుపై ద్రవీభవించడం వల్ల
   3) పరిసరాల ఉష్ణోగ్రతను గ్లాసు అందుకో లేకపోవడం
   4) గ్లాసు, పరిసరాల మధ్య ఉష్ణరాశి విని మయం లేకపోవడం
2. విశ్వవ్యాప్తంగా విస్తారంగా ఉన్న మూలకం ఏది?
   1) హైడ్రోజన్ 2) హీలియం
   3) ఆక్సిజన్ 4) నైట్రోజన్
3. సాయంకాల చుక్క అని ఏ గ్రహాన్ని పిలుస్తారు?
   1) బుధుడు 2) శుక్రుడు
   3) తోకచుక్క
   4) రాత్రులు మనకు కనిపించే వెలుగు చారలు
4. భారతదేశంలోని పరిశోధన ప్రయోగశాలల పితామహుడు అని ఏ శాస్త్రవేత్తకు పేరు?
   1) ఎస్.ఎస్. భట్నాగర్
   2) విక్రమ్ సారాబాయ్
   3) ప్రఫుల్ చంద్ర రే 4) రాజారామన్న
5. వంటగది నుంచి వెలువడే వ్యర్థాలు భూమిలో కుళ్లి సేంద్రియ ఎరువుగా మారే ప్రక్రియ ఒక
   1) ఉష్ణ మోచక చర్య 2) ఉష్ణ గ్రాహక చర్య
   3) ఉష్ణ రసాయన చర్య
   4) తిరోగమన రసాయన చర్య
6. కింది వాటిలో బహుళ పరావర్తన ధ్వనిపై ఆధారపడి పనిచేసే పరికరాలు ఏవి?
   1) మెగాఫోన్ 2) స్టెతస్కోప్
   3) లౌడ్ స్పీకర్ 4) పైవన్నీ
7. 'ఏకో-రేజింగ్' అని దేనిని అంటారు?
   1) శరీర అంతర్భాగాల పరిమాణాన్ని కొలవడం
   2) సమాచార తరంగాల విస్తరణ దూరం
   3) మిస్సైల్ యొక్క దూరాన్ని
   4) అతి ధ్వనులను ఉపయోగించి నీటి లోపల ఉన్న వస్తువుల మధ్య దూరాన్ని కనుగొనడం
8. వయోలిన్, పియానో నుంచి వెలువడే స్వరాల మధ్య భేదాన్ని తెలియజేసే సంగీత స్వర లక్షణం
   1) కీచుదనం 2) తీవ్రత
   3) నాణ్యత 4) ఆవర్తన కాలం
9. ఒక ప్లాస్టిక్ సీసా అడుగున త్రిభుజాకారంలో ఉన్న గుర్తులో '1' అనే అంకె ఉంది. ఇది దేనిని సూచిస్తుంది?
   1) అధిక సాంద్రత ఉన్న పాలి ఎథిలీన్
   2) అల్ప సాంద్రత ఉన్న పాలి ఎథిలీన్
   3) పాలీ ఎథిలీన్ టెరిఫ్తాలేట్ 4) పాలీ స్టైరీన్
10. ఒక వ్యక్తి చత్వారంతో బాధపడుతున్నాడు. అతడిని వైద్యుడు పరీక్షించి ఏ కటకాలు ఉన్న కంటి అద్దాలను ఉపయోగించాలని సూచిస్తాడు?
    1) తక్కువ నాభ్యాంతరం ఉన్న ద్వికుంభాకార కటకాలు
    2) ఎక్కువ నాభ్యాంతరం ఉన్న పుటాకార కటకాలు
    3) ద్వినాభ్యాంతర కటకాలు
    4) ద్విపుటాకార కటకాలు
11. కంటి శుక్లాల వల్ల కంటిలోని ఏ భాగం దెబ్బ తింటుంది?
    1) రెటీనా 2) కటకం
    3) కనుపాప 4) కార్నియా
12. రెండు అట్ట ముక్కలను అతి దగ్గరగా ఉంచి వాటి మధ్య గాలి ఊదితే అవి
    1) ఎక్కడికి కదలవు 2) దూరంగా జరుగుతాయి
    3) దగ్గరకు వస్తాయి
    4) దగ్గరికి వస్తూ, దూరంగా పోతూ కదులుతాయి
13. కింది వాటిలో ఉష్ణశక్తి తరంగాలు అని పిలిచే తరంగాలు ఏవి?
    1) రేడియో తరంగాలు
    2) అతినీల లోహిత కిరణాలు
    3) పరారుణ కిరణాలు 4) పైవన్నీ
14. ఏకవర్ణ కాంతిని ఉద్గారించే కాంతి జనకం ఏది?
    1) పాదరస దీపం 2) టంగ్‌స్టన్ హాలోజన్ దీపం
    3) సోడియం దీపం 4) చలిమంట
15. ఒక పట్టకం ద్వారా కాంతిని పంపినప్పుడు అతి తక్కువగా విచలనం చెందే రంగు ఏది?
    1) ఎరుపు 2) ఆకుపచ్చ
    3) నీలం 4) వైలెట్
16. క్రేస్కోగ్రాఫ్‌తో దేన్ని కొలుస్తారు?
    1) హృదయ స్పందన 2) నాడీ స్పందన
    3) మొక్కల పెరుగుదల 4) స్ఫటిక నిర్మాణం
17. ఎల్ఈడీ ఉద్గారించే కాంతి రంగు ఏ అంశం పై ఆధారపడి ఉంటుంది?
    1) తిరోశక్మంపై 2) ఎల్ఈడీ పురోశక్మంపై
    3) ఎల్ఈడీ ద్వారా ప్రవహించే పురో విద్యుత్‌పై
    4) ఎల్ఈడీలోని అర్ధ వాహక స్వభావంపై
18. సౌర కుటుంబంలోని గ్రహాలన్నింటిలోనూ అత్యధిక వేడి కలిగిన గ్రహం ఏది?
    1) బుధుడు 2) శుక్రుడు
    3) యురేనస్ 4) శని
19. కింది వాటిలో ఏది పరమాణువు కేంద్రకంలో ఉండదు?
    1) ఫోటాన్ 2) ప్రోటాన్
    3) న్యూట్రాన్ 4) మెసాన్
20. ఓల్టా మీటరుతో దేనిని కొలుస్తారు?
    1) బ్యాటరీ 2) ఓల్టేజీ
    3) విద్యుత్ రసాయన తుల్యాంకం
    4) విద్యుత్
21. సరళ హరాత్మక చలనంలో ఉన్న ఒక వస్తువు గరిష్ఠ త్వరణం ఎప్పుడు కలిగి ఉంటుంది?
    1) మాధ్యమిక స్థానాల వద్ద
    2) దాని మార్గంలోని అన్ని స్థానాల వద్ద
    3) అంతిమ స్థానం, మాధ్యమిక స్థానం వద్ద
    4) అంతిమ స్థానం వద్ద
22. పరమాణు కేంద్రకంలోని కేంద్రక బలాలు
    1) బలమైన ఆకర్షణ బలాలు
    2) బలమైన వికర్షణ బలాలు
    3) బలహీనమైన ఆకర్షణ, వికర్షణ బలాలు
    4) గురుత్వాకర్షణ బలాలు
23. గాలిలో ప్రయాణించే విమానంపై పనిచేసే వాయు గతిక ఉత్థాపకాన్ని విశదీకరించే సూత్రం ఏది?
    1) బెర్నోలీ సిద్ధాంతం 2) ఉత్ప్లవన సూత్రం
    3) పాజ్వేల్ సమీకరణం 4) రేనాల్డ్ సంఖ్య
24. అత్యధిక అయనీకరణ సామర్థ్యం కలిగినవి
    1) x-కిరణాలు 2) ఆల్ఫా కణాలు
    3) గామా కిరణాలు 4) బీటా కణాలు
25. రాకెట్ ప్రొపెలెంట్‌గా ఉపయోగించేది?
    1) నైట్రోజన్ 2) అమ్మోనియా
    3) ఆక్సిజన్ 4) హైడ్రాజీన్
26. సమ ఉష్ణోగ్రత ప్రక్రియలో
    ఎ) వ్యవస్థ ఉష్ణోగ్రత స్థిరంగా ఉండదు
    బి) వ్యవస్థకు, పరిసరాల మధ్య ఉష్ణ వినిమయం
    సి) వ్యవస్థ అంతర్గత శక్తి స్థిరం
    డి) పీడనం,ఘనపరిమాణం వ్యవస్థకు స్థిరం
    1) బి, సి 2) సి,డి
    3) ఎ, సి 4) ఎ, డి
27. కింది వాటిలో దేనిని ఉపయోగించుకుని ఒక వలయంలో కావల్సిన పౌనఃపున్యం ఉన్న ఏకాంతర విద్యుత్‌ను పొందవచ్చు?
    1) ట్రాన్స్‌ఫార్మర్ 2) పవర్ సప్లయ్
    3) ఆంప్లిఫయర్ 4) ఆసిలేటర్
28. గాజు పరిశ్రమల్లో ఉపయోగించే కల్లెట్ అంటే ఏమిటి?
    1) సోడియం సిలికేట్
    2) వర్ణ ద్రవ్యకాలు
    3) పగిలిన గాజు ముక్కలు
    4) చీనా మట్టి ముద్దలు
29. జీవ ప్రక్రియ జరిగే ఆవరణం?
    1) స్ట్రాటో ఆవరణం 2) ట్రోపో ఆవరణం
    3) మీసో ఆవరణం 4) అయానో ఆవరణం
30. అంతర గ్రహాలు అని ఏ గ్రహాలను అంటారు?
    1) సూర్యునికి భూమికి మధ్య ఉన్న గ్రహాలు
    2) సూర్యునికి బృహస్పతికి మధ్య ఉన్న గ్రహాలు
    3) వాయు స్థితిలోని గ్రహాలు
    4) ఉపగ్రహాలు లేని గ్రహాలు
31. వాన చినుకులు గోళాకారంగా ఉండటానికి కారణం?
    1) నీటి స్నిగ్ధత 2) నీటి తలతన్యత
    3) నీటి విసరణం 4) ద్రవాభిసరణ పీడనం
32. ఏ సిద్ధాంతంతో 'రామన్ ఫలితం'ను వివరంగా విశదీకరించవచ్చు?
    1) తరంగ సిద్ధాంతం 2) కణ సిద్ధాంతం
    3) విద్యుత్ అయస్కాంత సిద్ధాంతం
    4) క్వాంటం సిద్ధాంతం
33. MRIలో ఉపయోగించే విద్యుదయస్కాంత వికిరణం ఏది?
    1) ఎక్స్-కిరణాలు 2) మైక్రో తరంగాలు
    3) రేడియో తరంగాలు 4) పరారుణ కిరణాలు
34. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ ద్రవ్యశక్తి తుల్యతా నియమం $E = mc^2$లో E : శక్తి m : ద్రవ్యరాశి c : ?
    1) ఒక స్థిరాంకం 2) ద్రవ్యవేగం
    3) ద్రవ్యరాశి వేగం 4) కాంతి వేగం
35. పదార్థంలో ఎలక్ట్రాన్‌ల ప్రవాహాన్ని ప్రభావితం చేసేవి?
    1) ఉష్ణీయ కంపనాలు
    2) పరమాణువుల కల్మషం
    3) స్ఫటిక లోపాలు 4) పైవన్నీ
36. పైరో విద్యుత్ ఉత్పత్తి దేని వల్ల జరుగుతుంది?
    1) సంపీడనం 2) ఉష్ణోగ్రత
    3) తన్యత 4) స్నిగ్ధత
37. సముద్రపు నీటి ఘనీభవ స్థానం కింది దేని వల్ల తగ్గుతుంది?
    1) లవణీయత పెరగడం వల్ల
    2) ఉష్ణోగ్రత పెరగడం వల్ల
    3) ఆక్సిజన్ పెరగడం వల్ల
    4) నీటి సంక్షోభం పెరగడం వల్ల
38. సూపర్ నోవా అనేది ఒక
    1) నక్షత్ర మండలం
    2) నక్షత్ర విస్ఫోటనం
    3) అత్యధిక భారం ఉన్న నక్షత్రం
    4) భారీ ద్రవ్యరాశి ఉన్న నక్షత్రం
39. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌లలో శీతలీకరణ పదార్థం ఏది?
    1) భార జలం 2) తేలిక జలం
    3) ద్రవ హీలియం 4) ద్రవ సోడియం
40. డాప్లర్ ప్రభావం అనువర్తింప చేయగలిగే తరంగాలు?
    1) ధ్వని తరంగాలు 2) కాంతి తరంగాలు
    3) రేడియో తరంగాలు
    4) పై మూడు రకాల తరంగాలు
41. నీటిలో ఏర్పడిన శబ్దతరంగం ఉపరితలంలోని గాలిలోకి ప్రవేశించినప్పుడు స్థిరంగా ఉండే తరంగ అభిలక్షణం?
    1) వడి 2) తరంగ దైర్ఘ్యం
    3) పౌనఃపున్యం 4) ఏదీ కాదు
42. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సూర్యుడు ఏ ఆకారంలో కనిపిస్తాడు?
    1) వృత్తాకారం
    2) కోల ఆకారం(oval shape)
    3) స్తూపాకారం 4) వక్రాకారం
43. గాలిలోని నీటి బిందువు ఏ విధంగా పని చేస్తుంది?
    1) అపసరణ కటకం 2) అభిసరణ కటకం
    3) కటకం వలె పనిచేయదు
    4) సమతల దర్పణం వలె పనిచేస్తుంది
44. అయస్కాంత పదార్థాలన్నీ కింది వాటిలో దేనివలన ధర్మాలను పోగొట్టుకుంటుంది?
    1) నీటిలో ముంచినప్పుడు
    2) నూనెలో ముంచినప్పుడు
    3) ఇనుప ముక్క వద్దకు తెచ్చినప్పుడు
    4) బాగా వేడి చేసినప్పుడు
45. ఒక వస్తువును మరొక వస్తువుతో రుద్దినప్పుడు ఆవేశం పొందింది. ఆ వస్తువు భారంలో మార్పు కింది ఏ విధంగా ఉంటుంది?
    1) భారం మారదు
    2) స్వల్పంగా పెరగకపోవచ్చు
    3) స్వల్పంగా తగ్గుతుంది
    4) స్వల్పంగా పెరుగుతుంది లేదా తగ్గుతుంది
46. ఒక సిల్క్ గుడ్డతో గాజు కడ్డీని రుద్దిన రెండింటికి ఆవేశం కలగడానికి కారణం?
    1) ఘర్షణ వల్ల
    2) ఉపరితలాలు నునుపు కావడం వల్ల
    3) ఎలక్ట్రానుల మార్పిడి వల్ల
    4) ఎలక్ట్రానులు, ప్రోటానుల మార్పిడి వల్ల
47. x-కిరణాల అభిలక్షణం
    1) రుణావేశ కణాల ప్రవాహం
    2) ప్రోటానుల ప్రవాహం
    3) పరమాణు మూలం ఉన్న విద్యుదయస్కాంతాల వికిరణాల ప్రవాహం
    4) కేంద్రక మూలం ఉన్న విద్యుదయస్కాంత వికిరణాల ప్రవాహం
48. కంటి రెటినాలోని లోపాలను సవరించడానికి ఉపయోగించే విద్యుదయస్కాంత వికిరణం?
    1) అతినీలలోహిత కిరణాలు
    2) పరారుణ కాంతి
    3) ఎక్స్- కిరణాలు 4) లేజర్
49. మానవుని శరీరంలో ఏర్పడిన ట్యూమర్ (కణితి) పరిమాణాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే పరికరాల్లో కింది ఏ దృగ్విషయాన్ని ఉపయోగిస్తారు?
    1) వివర్తనం 2) ధృవణం
    3) వ్యతికరణం 4) విశ్లేషణం
50. కింది ఏ సంవత్సరాన్ని అంతర్జాతీయ భౌతిక శాస్త్ర సంవత్సరంగా ప్రకటించారు?
    1) 1905 2) 2005
    3) 1995 4) 2015
51. శీతల ప్రదేశాల్లో ఉష్ణోగ్రత తగ్గిపోయినప్పుడు తటాకాలు, సరస్సుల్లోని నీరు ఉపరితలంపై గడ్డకట్టి అడుగు భాగంలో నీరు ద్రవ రూపంలో ఉండటానికి కారణం?
    1) నీటికి చాలా ఎక్కువ విశిష్టోష్ణం ఉండటం
    2) మంచు ఉష్ణ వాహకత్వం విలువ తక్కువగా ఉండటం
    3) నీటి ఘనీభవన ఉష్ణం ఎక్కువ
    4) తటాకాల అడుగు భాగాన ఉష్ణోగ్రత ఎక్కువ
52. ఒక ఎత్తైన కొండ పై నుంచి ఒక వస్తువును స్వేచ్ఛగా పతనం చెందేటట్లు చేశాం. వరుస సమాన కాల వ్యవధుల్లో ప్రయాణించే దూరాల నిష్పత్తి?
    1) 2:4:6 2) 1:3:7
    3) 1:2:3 4) 0:2:6:12
53. కదులుతున్న కుట్టు మిషన్ సూదికి ఏ రకమైన చలనం ఉంటుంది?
    1) స్థానంతర చలనం 2) భ్రమణ చలనం
    3) సరళ హరాత్మక చలనం
    4) వృత్తాకార చలనం
54. ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం, ఉష్ణగతిక వ్యవస్థలో నియమం రూపాంతరం?
    1) ద్రవ్య వేగ నిత్యత్వ నియమం
    2) ఉష్ణగతిక శాస్త్ర రెండో నియమం
    3) శక్తి నిత్యత్వ నియమం
    4) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
55. శీతల యంత్రంలోని గాలి వ్యాకోచించడానికి ఏ శక్తిని వినియోగించుకుంటుంది?
    1) ద్రవ్య శక్తిని 2) బాహ్య ఉష్ణ శక్తిని
    3) తన అంతర్గత శక్తిని 4) తన ఉష్ణోగ్రతను

సమాధానాలు

1) 2	2) 1	3) 2	4) 1	5) 1
6) 4	7) 4	8) 3	9) 3	10) 3
11) 2	12) 3	13) 3	14) 3	15) 1
16) 3	17) 4	18) 2	19) 1	20) 3
21) 4	22) 1	23) 1	24) 2	25) 4
26) 3	27) 4	28) 3	29) 2	30) 2
31) 2	32) 4	33) 3	34) 4	35) 4
36) 2	37) 1	38) 2	39) 4	40) 4
41) 3	42) 2	43) 2	44) 4	45) 4
46) 3	47) 3	48) 4	49) 1	50) 2
51) 2	52) 2	53) 3	54) 3	55) 3

Who among the following is the Son?

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q.no.1-5): In these questions, the relationship between different elements is shown in the statements. Give answer

1) If only conclusion I follows.
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows.
4) If neither conclusion nor II follows.
5) If both conclusion I and II follow.

1. **Statements:**
   D ≥ M ≥ P, R > P, D ≤ B, A ≤ P
   Conclusion:
   I. A < B II. A = B
2. **Statements:**
   K > R ≥ P, Q ≤ S = T, Q <P, O<R
   Conclusion: I. O < K II. R > T
3. **Statements:**
   X = P ≥ C = Z, R = Y ≥ X
   Conclusion:
   I. Y > C II. R = Z
4. **Statements:**
   A > Y ≥ B, P = A, P ≤ C, K ≤ B
   Conclusion:
   I. C > K II. K < A
5. **Statements:**
   M ≤ L ≤ D, M ≥ N, B > D, P = N
   Conclusion:
   I. D ≥ N II. P < B

Directions (Q.no.6-12): Study the following information carefully to answer the given questions.

There are eight family members M, N, O, P, Q, R, S and T are sitting around a circular table facing the centre but not necessarily in the same order. Family members comprise of Grandfather, Grandmother, Father, Mother, Son, Daughter-in-law, Daughter and Son-in-law.

Father is second to the left of M who is second to the left of Daughter-in -law. T is third to the right of Son. T is neither Father nor Daughter-in -law. M is between O and P. Son-in-law is second to the left of Father. Grandfather is between Grandmother and Son. Mother is second to the left of O. N is neighbour of T but not the neighbour of S. R is facing S. N is not Daughter.

6. Who amongst the following sits third to the left of M?
   1) Son-in-law 2) N
   3) Q 4) Daughter
   5) S
7. Four of the following five are alike in a certain way based on the given arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
   1) O - Grandfather
   2) M - Son 3) S - Daughter
   4) N - Son-in-law
   5) R- Grandmother
8. Who among the following is the Son?
   1) M 2) O 3) P
   4) N 5) None of these
9. Which of the following is true with respect to the given seating arrangement?
   1) Father is an immediate neighbour of Mother
   2) N sits second to the right of O
   3) Daughter and Son are immediate neighbours
   4) Grandfather sits to the immediate left of Grandmother
   5) M sits second to the left of R
10. Who is T?
    1) Grandfather 2) Son-in-law
    3) Daughter 4) Mother
    5) None of these
11. Who among the following sit between Grandmother and S?
    1) R and Grandfather
    2) P and Q
    3) Grandfather and P
    4) P and R
    5) M and Daughter
12. Who among the following is Daughter?
    1) P 2) T 3) Q
    4) S 5) R

Directions (Q.no.13-18): Study the following information carefully to answer the given questions.

A well-established company located in an eight-floor building, a single flat in each floor, numbered one to eight (the ground floor is numbered 1, the floor above is numbered 2, and so on, and the top most floor is numbered 8).Eight friends M, N, O, P, Q, R, S and T are working in the company, each one being placed in each floor.Each floor of the building is named by a peculiar name such as -Altius, Haitius, Elitica, Fortius, Grandius, Citius, Zenith and Royale. Each person is working in different department- Audit, Human Resource, Corporate governance, Sales, Administration, Customer Service, Finance and Accounts, and each department is located in each floor but not necessarily in the same order given.

There are two floors between the floors of R and Q. R does not belong to Haitius and does not work on even numbered floor.

There is one floor between the floor of the person who is in Finance and the one which is named Zenith.

The person who is in Finance department belongs to Fortius and works on even numbered floor, but not on the top floor.

The person who is in Human Resource department is in Elitica and works on third floor.

R is not in Human Resource department. S is not related to either Zenith or Elitica. S does not work on a floor immediately above or immediately below the floor on which P works. P is not in Customer Service department and he never works in Royale, Haitius or Altius.

The floor of M, who is working in Corporate governance, is just above the floor of Administration and just below the floor in which Finance department is located. T, working in the Sales department, works in Grandius, is above the R's floor but not on the Top floor. There is only one floor above the floor in which Accounts department is situated. The person working in Administration is related to Citius and works on fourth floor. M does not work in Haitius or Altius. O is not in Accounts department and works neither in Fortius nor in Zenith.

13. Which of the following flats has Corporate governance department?
    1) Haitius 2) Royale 3) Altius
    4) Zenith 5) None of these
14. On which of the following floors does S works?
    1) 8[th] 2) 3[rd] 3) 6[th]
    4) 5[th] 5) None of these
15. The name of the flat in which Accounts department is located?
    1) Haitius 2) Royale 3) Altius
    4) Zenith 5) None of these
16. Who among the following works on the top most floor, i.e floor number 8?
    1) N 2) P 3) S
    4) O 5) None of these
17. Who among the following is in Customer Service department?
    1) N 2) P 3) R
    4) O 5) None of these
18. Who among the following works in Altius?
    1) N 2) P 3) R
    4) O 5) None of these

Directions(Q.no.19-23): in a certain instruction system, the different computation processes are written as follows:

(I) P % Q $ R means P is multiplied by the sum of Q and R
(II) P Δ Q © R means P is subtracted from Q and the resultant is divided by R
(III) P # Q * R means P is added to the resultant when Q is divided by R
(IV) P Π Q @ R means the product of Q and R is subtracted from P

In each of the questions below, a set of instruction sequence is given. You are required to find out the outcome which should come in place of question mark (?) in each of the given sets of sequence.

19. 20 # 25 * 5 = M
    M % 80 $ 20 = ?
    1) 1660 2) 2500 3) 2800
    4) 8250 5) 7240
20. 140 Δ 300 © 4 = Z
    160 Π Z @ 2 = ?
    1) 80 2) 140 3) 60
    4) 30 5) 70
21. 12 % 2 $ 8 = A
    A Δ 200 © 8 = ?
    1) 4 2) 2 3) 10
    4) 3 5) 7
22. 20 % 10 $ 20 = T
    T Π 150 @ 4 = ?
    1) 40 2) 100 3) 20
    4) 0 5) 10
23. 35 # 300 * 15 = M
    450 Δ 1000 © M = ?
    1) 2 # 5 * 5 2) 5 Π 3 @ 5
    3) 8% 1 $ 2 4) 4 # 24 * 4
    5) None of the above




Key with Solutions

(Q.no.1-5):

1) 3;
   B ≥ D ≥ M ≥ P ≥ A
   Hence, either I or II follows.
2) 1;
   K > R > O
   Hence, Conclusion I follows.
   R ≥ P > Q ≤ S = T
   R and T cannot be compared. Hence, Conclusion II does'nt follows.
3) 3;
   R = Y ≥ X = P ≥ C = Z
   Hence, either I or II follows.
4) 5;
   C ≥ P = A > Y ≥ B ≥ K
   Hence,C>K Conclusion I is true.
   Hence, A>K. Conclusion II is also true.
5) 5;
   P = N ≤ M ≤ L ≤ D < B
   Hence, conclusion I & II are true.

(Q.no.6-12):



6) 2; 7) 4; (In all the options second person is immediate right of the first person)

8) 3; 9) 1; 10) 2; 11) 3; 12) 3;

(Q.no.13-18):

Floor	Person	Department	Name of the flat
8	P	AUDIT	ZENITH
7	N	ACCOUNTS	HAITIUS
6	S	FINANCE	FORTIUS
5	M	CORPORATE GOVERNANCE	ROYALE
4	Q	ADMINISTRATION	CITIUS
3	O	HUMAN RESOURCE	ELITICA
2	T	SALES	GRANDIUS
1	R	CUSTOMER SERVICE	ALTIUS

13) 2; 14) 3; 15) 1;
16) 2; 17) 3; 18) 3;

19) 2;
20 + 25 ÷ 5 = 25
25 (80 + 20) = 2500

20) 1;
300 – 140 = 160; 160 ÷ 4 = 40
40 × 2 = 80; 160 – 80 = 80

21) 3;
12 (2+8) = 120
200 – 120 = 80; 80 ÷ 8 = 10

22) 4;
20 (10 + 20) = 600;
600 – 150×4 = 0

23) 4;
35 + 300 ÷ 15 = 55
1000 – 450 = 550; 550 ÷ 55 = 10
4 + 24 ÷ 4 = 10